# తప్పక చదవాల్సిన వంద కథానికలు

## గురజాడ వందో వర్ధంతి నివాళి

డా॥ వేదగిరి రాంబాబు



# గురజాడ వందవ వర్ధంతికి నివాళి

# తప్పక చదవాల్సిన కథానికలు

## డా॥ వేదగిరి రాంబాబు

**శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్**
బ్లాక్-6, ఫ్లాట్-10, హెచ్.ఐ.జి-1
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 044.
సెల్: 9391343916
e-mail:vedagiri_rambabu@gmail.com

# Tappaka Chadavalsina Vanda Kathanikalu

(In memory of Gurajada)

By **Dr.Vedagiri Rambabu**

© With the writer

| | | |
|---|---|---|
| Cover Design | : | **Bali** |
| Price | : | Rs. 250/- |
| First Edition | : | Nov. 30, 2015 |
| Published by | : | **Sri Vedagiri Communications**<br>HIG-I, Block-VI, Flat-10<br>Baghlingampally<br>Hyderabad-500 044. |
| DTP | : | **Manu Graphics**<br>Chikkadapally<br>Hyderabad-500 030<br>Cell : 93 93 83 40 50 |
| Printed at | : | **Venu Graphics**<br>Opp: Fever Hospital lane<br>Nallakunta<br>Hyderabad-500 044. |

# వందవ వర్ధంతి నివాళి



కథానికకు ఆద్యుడైన

**గురజాడ వేంకట అప్పారావు గారి**

వందవ వర్ధంతికి

ఈ వంద తప్పక చదవాల్సిన కథానికల సంకలనాన్ని

అంకితమిస్తున్నాము.

**–వేదగిరి రాంబాబు**

30–11–2015

# గుర్తుఉంచుకోవలసిన నిన్న మొన్నటి స్థితీ, గతీ...!!

డా॥ వేదగిరి రాంబాబు జగమెఉరిగిన కథానికా జీవి; కథానికోద్యమ రథసారథి. అంతకుమించి గురజాడ స్ఫూర్తి దీపధారి. ప్రయోగాత్మకంగా అనేక నూతన కార్యక్రమాల్ని నిర్వహించి, నిర్మాణాత్మక సాహిత్య సేవకు తన మనసూ, తనువూ, ధనమూ–అంకితం చేసిన అరుదైన సాహిత్య పిపాసి. రచయితగానూ లబ్ధప్రతిష్ఠుడు. శతాధిక రచనలు చేసిన అనుభవశాలి. అలాగే శతాధిక కథానికల్ని చదివిన అధ్యయనశీలీ.

ఈ సంకలనం తెలుగులోని 'చదవాల్సిన కథానికల్ని' తెలుపుతోంది. ఇవన్నీ కథానికా పరిచయాలూ, పరామర్శలూ. సూర్య దినపత్రిక సంపాదకులు చెప్పినట్లు సాహిత్య సాగర మథనం నుంచి వెలికివచ్చిన మణులు'!

కథానికా పరిచయం ఒక అసిధారావ్రతం. అటు కథానిక గురించి చెప్పాలి, ఇటు కథారచయిత గురించీ తెలియజేయాలి. అంటే– కథానికా హృదయాన్ని పట్టుకోవాలి, కథకుని హృదయస్పందనలోని 'నాడినీ పట్టుకోవాలి. ఈ రెంటి 'మేలుకలయిక'ని పాఠకునికి అందించాలి. గతంలో తక్కువ సంఖ్యలో కొంతమంది ఈ విధమైన రచనలు చేశారు. ఈ తరం రచయితల కథానికల్ని పరామర్శిస్తూ నేనూ 300పైగా వ్యాసాలు రాశాను. వాటిలో 250 పైబడి 'కథాకృతి' పేరున మూడు సంపుటాలుగా శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ ప్రచురణలుగా గ్రంథరూపంలో వచ్చాయి.

ఈ 'చదవాల్సిన కథానికలు' అన్నీ కీర్తిశేషులైన రచయితలు రాసినవి. ముఖ్యంగా కథానికా సాహిత్యంలో తొలితరం, మలితరం రచయితలు రాసినవి. ఆ విధంగా ఈ కథానికలు స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం–తెలుగు సాంఘిక జీవనాన్ని అద్దంలో కొండలా మనముందుంచుతున్నాయి. డా॥ రాంబాబు ఎన్నుకున్న కథానికల ద్వారా ఆనాటి–సంఘపరిస్థితినీ, ఆ సంఘంలో మనుగడ సాగిస్తున్న మనుషుల స్థితిగతుల్నీ మనం కళ్లముందుకు తెచ్చుకోగలుగుతాము. ఉదాహరణకి కవికొండల వెంకటరావుగారి 'జమీందారు'; శ్రీపాదవారి 'అరికాళ్లకింది మంటలు',

మల్లాదివారి 'మంత్రపుష్పం', కాళోజి 'తెలియక ప్రేమ-తెలిసి ద్వేషము', పి.వి.నరసింహారావు 'గొల్ల రామవ్వ'... వంటి ఎన్నో కథానికలు మనకు ఆనాటి దేశ కాలపరిస్థితుల నేపథ్యాన్నీ, ఆనాటి సమాజం హోరునీ, ఆనాటి మనుషుల రొదనీ-అందజేస్తాయి.

ఈ కథానికల్లోని వస్తువునీ, శిల్పాన్నీ, శైలినీ వింగడించటంలో-డా॥రాంబాబు ఉచితరీతిని తన ప్రణాళికని పాటించారు. కథానికా స్వరూపాన్నీ, స్వభావాన్నీ పఠితకు చేరవేయవలసిన సరళమైన పద్ధతిని ఎన్నుకున్నారు. ఈ పరిచయాల్లో చదివించే గుణానికి ప్రాముఖ్యం ఇచ్చారు. ఇది రచయిత విజయానికి తార్కాణం. ఎన్నుకున్న కథానికలన్నీ ఆయా రచయితలకు బాగా పేరుతెచ్చినవి కావటాన సాహిత్య పరిచయం ఉన్న వారికి కూడా వాటిని గురించి మళ్లీ పునశ్చరణం చేసుకోవటానికి ఉత్సాహం కలిగేట్లు ఉన్నాయి-ఈ పరామర్శలు. మరుగునపడిన, మనం మరిచిపోతున్న రచయితల కథానికలు కొన్ని ఈ సంపుటిద్వారా వెలికి వస్తున్నాయి.

ఈ విశ్లేషణలన్నిటా-సరళమైన శైలిలో ఒదిగి, డా॥రాంబాబు కథానికా ప్రేమ పుష్కలంగా దర్శనమిస్తోంది. ఆ చిత్తశుద్ధికే పాఠకజనామోదం అనన్యంగా లభించింది. హర్షనీయమైన, అభినందనీయమైన విషయం ఇది!

ఈ పుస్తకంలోని కథకులు-తెలుగు కథానికా సాహిత్యానికి అరుదైన కానుకల్ని అందించినవారు. ఈ తరం పాఠకులకే కాదు, చదువరులకు కూడా వారు ఆరాధనీయులు. అలాంటి మహనీయుల కథానికల్ని ఈనాటి వారికి పరిచయం చేస్తూ, ఒక సాహిత్యావసరాన్ని తీరుస్తూ-ఈ సంపుటాన్ని వెలువరిస్తున్న డా॥ రాంబాబు కృషి శ్లాఘనీయం

గురజాడవారి శతవర్ధంతి (30.11.2015) సందర్భంగా ప్రచురింపబడుతున్నది ఈ సంకలనం. గురజాడవారి స్మృతికి సముచితమైన, ఘనమైన నివాళి ఇది! ఇంతటి శ్రద్ధాసక్తుల దీపికని వెలిగిస్తున్న డా॥ వేదగిరి రాంబాబుకి హృదయపూర్వకమైన అభినందనలు!

**-విహారి**

హైదరాబాద్ సెల్: 9848025600

# సాహిత్య సాగర మథనం నుంచి
# వెలికి వచ్చిన మణులు

దేవతలు రాక్షసులు కలిసి సాగరమథనం జరిపితే అమృతం రావడానికి ముందు హాలాహలం వచ్చిందట. అదేమిటో తెలియదుకానీ డాక్టర్ వేదగిరి రాంబాబు సాహిత్య సాగరాన్ని మథిస్తే అమృతమే వచ్చింది. హాలాహలం మచ్చుకైనా కనిపించలేదు. సాహిత్య ప్రియుడైన డాక్టర్ వేదగిరి రాంబాబు గొప్పతనం అది. సాగరమంతటి తెలుగు సాహిత్యంలో కథానికలు కోకొల్లలు. తప్పక చదవాల్సిన క్యాటగిరీ కిందకే కొన్ని వేల కథానికలు వస్తాయి. ఎందరో మహానుభావులు కథానికలతో సాహిత్య సమాజాన్ని సుసంపన్నం చేశారు. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ కథానికల రూపంలో వారు చేసిన ప్రయోగాలు మరెన్నో ఉన్నాయి. సమాజంలో అట్టడుగువర్గాల నుంచి ధనిక వర్గాల వరకూ తమ తమ అవగాహన అవసరాలను బట్టి రచయితలు పాత్రలను ఎంపికచేసుకుంటారు. కొందరు రచయితలు స్వీయ అనుభవాల్ని పొదివిపట్టుకుంటే మరి కొందరు తాము చూసిన వాటికి అక్షర రూపం కల్పిస్తారు. మరికొందరు – ఇలా ఉంటే బాగుంటుంది–అనే భావనతో రచనల్ని కొనసాగిస్తారు. మరి ఇలా చూస్తే ఏ కథానికకు ఆ కథానికే గొప్పది కదా? మరి అందులో మంచివి ఎంచేదెలా? అందుకే డాక్టర్ వేదగిరి రాంబాబు మంచి కథానికలు ఇవి అని చెప్పదలచుకోలేదు. అన్నీ మంచివే కాబట్టి... వాటిలో ప్రస్తుత సమాజ అవసరాలకు కూడా తగినవి, మనసును ఇప్పటికీ తట్టిలేపేవి, చదవడం వల్ల ఎక్కడో నిక్షిప్తమైపోయిన మానవత్వాన్ని తట్టిలేపేవి... ఇలాంటి కథానికలను ఆయన ఎంచుకున్నారు.

ఈ కాలం పిల్లలకు స్కూలు పుస్తకాలతోనే సరిపోతున్నది ఇక సాహిత్యం ఏం చదువుతారూ అంటూ దీర్ఘాలు తీసేవారుచాలా మంది ఉన్నారు. కానీ వారి అంచనాలను తారుమారు చేసింది సూర్య నిరాటంకంగా ప్రచురించిన తప్పక చదవాల్సిన కథానికలు అనే కాలమ్. డాక్టర్ వేదగిరి రాంబాబు ఎంతో శ్రమకోర్చి ఏరి కూర్చిన కథానికలమాల ఎందరినో అలరించింది. మొత్తం వంద కథానికలను డాక్టర్ వేదగిరి, సూర్య పాఠకులకు పరిచయం చేశారు. ఈ వంద కథానికలు

చదివితే తెలుగు సాహిత్యంలోని అన్ని రకాల కథానికలను చదివినట్లేనని చెప్పడం అతిశయోక్తిలా కనిపిస్తుంది కానీ అక్షర సత్యం. డాక్టర్ వేదగిరి రాంబాబు, సూర్య పాఠకులకు పరిచయం చేసిన ఈ వంద కథానికలు ఎప్పుడో రాసేశారు మహానుభావులు. అయితే నేటికీ వాటి ఉనికి ఉన్నది. ఉనికి ఉండటమేకాదు, ఇప్పుడు సమాజం పోతున్న పోకడలను వారు ఆనాడే పసిగట్టారనిపిస్తుంది. అలాంటివి ఎంపికచేసి సూర్య పాఠకులకు ఇచ్చిన డాక్టర్ వేదగిరి రాంబాబుకు సూర్య సంపాదకుడిగా కృతజ్ఞతలు చెప్పడం నా బాధ్యత.

సాహిత్యమంటే ఆసక్తి లేనివారికి, అవగాహన లేనివారికి కూడా డాక్టర్ వేదగిరి రాంబాబు పరిచయం చేసిన ఈ వంద కథానికలను చదివితే ఆ రెండు కలుగుతాయి. వంద కథానికలతో ఈ శీర్షికను ఆపుతున్నామని మేం మా పాఠకులకు చెప్పలేదు. తప్పక చదవాల్సిన కథానిక 100 రాస్తూ డాక్టర్ వేదగిరి రాంబాబు అప్పగింతలు పెట్టేశారు. అది చదివిన వారికి అర్థమైంది ఈ తప్పక చదవాల్సిన కథానికలు శీర్షిక ఇక రాదు అని. అప్పటి నుంచీ మా కార్యాలయానికి ఫోన్ల ద్వారా, ఈ మెయిల్ ద్వారా ఇక ఈ శీర్షిక అయిపోయిందా' అని అడగడం ప్రారంభం అయింది.

డా॥ వేదగిరి రాంబాబు 100 ఆణిముత్యాలను మనకు అందించారంటే ఆయన ఎన్ని కథలు, కథానికలు చదివి ఉండాలి? ఆయన అన్నీ చదివారు కాబట్టే మనకు రావాల్సినవి ఎంచి అందించారు. శ్రీరాముడు వనవాసానికి వెళ్లినపుడు అక్కడ శబరి కనిపించిందట. తాను ఎంతో కాలం వేచి చూసిన రాముడు తన ఎదుట ప్రత్యక్షం కావడం, తనకు ఆకలిగా ఉందని అడగడంతో వృద్ధ శబరికి ఏం చేయాలో తోచలేదట. తను అడవి నుంచి తెచ్చుకున్న రేగుపళ్లను తీసుకుని వాటిని కొరికి చూసి వాటిలో తియ్యగా ఉన్న వాటినే రాముడి నోటికి అందించిందట. అనిర్వచనీయమైన భక్తికి ఉదాహరణగా ఈ కథను చెబుతారు. తెలుగు సాహిత్యంలో ఇప్పటివరకూ వచ్చిన కథానికలన్నీ చదివి వంద కథానికలను వాటిలో మనకు పరిచయం చేసిన డాక్టర్ వేదగిరి రాంబాబు ఉదంతమే తప్ప నాకు మరేదీ గుర్తుకు రావడంలేదు.

**–పులిపాక సత్యమూర్తి**

ఎడిటర్, సూర్య దినపత్రిక

# కృతజ్ఞతలు

**వంద** వారాలపాటు 'తప్పక చదవాల్సిన కథానికలు' శీర్షికన వందమంది రచయితల వంద కథానికల్ని పరిచయం చేయడం జరిగింది. వందేళ్ళ ఈ కథానికా ప్రస్థానంలో మనల్ని విడిచి వెళ్ళిపోయిన వాళ్ళు వందకిపైగా ఉన్నారు. వందతోనే ఈ శీర్షికని ఎందుకు ఆపివేయాలనుకుంటున్నానంటే ఈ నవంబర్ 30న ఆధునిక కథ... కథానికకి ఆద్యులైన గురజాడ వందో వర్ధంతి కావడంతో ఈ వంద కథానికల గ్రంథాన్ని వారికి నివాళిగా తేవాలని. ఇంకా వెళ్ళిపోయిన కథానికా రచయితలు, రచయితలూ ఉన్నారు. వాళ్ళని పరిచయం చేయలేకపోవడం వెనుక కారణం సమయానికి వాళ్ళ రచనలు లభ్యంకాకపోవడమే! ఎప్పటికప్పుడు నేను అడగగానే వాళ్ళ ప్రాంత రచనలను నాకందించిన పాలగిరి విశ్వప్రసాద్‌గారికి, పున్న అంజయ్యగారికి, కాలువ మల్లయ్యగారికి, ద్విభాష్యం రాజేశ్వరరావుగారికి, పంతుల జోగారావు గారికి, విహారి గారికి, ఎప్పటికప్పుడు నా కంగారుని గమనిస్తూ తన పన్లని పక్కనబెట్టి నాకు సకాలంలో స్క్రిప్టులను డి.టి.పి.చేసిచ్చిన కుడుపూడి భాస్కర్‌రావు దంపతులకు, వీటిని సమయపాలనతో 'సూర్య'కి మెయిల్ చేసిన మా కోడలు సుష్మకు, అబ్బాయి విజయచంద్రలకు కూడా నా ధన్యవాదాలు.

మరో ప్రత్యేక విషయం...

'సూర్య'లో ఈ శీర్షికని రెగ్యులర్‌గా నడపమని ప్రారంభించిన అప్పటి సంపాదకులు శ్రీరామమూర్తిగారికి, ప్రారంభించింది మొదలు తను ఈ జీవితంలోంచి వెళ్ళిపోయే రెండురోజుల ముందు వరకూ ప్రతీబుధవారం నాకు గుర్తుచేస్తూ–ఈ శీర్షికకు మధ్యలో ఒక్క వారం గ్యాప్‌కూడా రాకుండా సాగేటట్లు చేసిన హరినాథ్‌గారికి, తను సంపాదక బాధ్యతల్ని స్వీకరించినప్పటి నుంచి ఈ శీర్షిక ఇలా నిరాఘటంగా సాగిపోవడానికి గొప్ప స్ఫూర్తినిచ్చిన సత్యమూర్తిగారికి, ఈ పత్రిక యజమాని సూర్యప్రకాశరావుగారికి, వారం వారం ఈ శీర్షికని చదువుతూ నాకెంతో

ఉత్సాహాన్నందించిన సాహితీ బంధువులందరికీ నా నమస్కారాలు. ఈ శీర్షికలో ఒకవారం విశ్వనాథ సత్యనారాయణగారి 'మాక్లీ దుర్గంలో కుక్క' గురించి రాసాను. ఆ వారమే సత్యమూర్తిగారు సంపాదకులుగా బాధ్యతని స్వీకరించారు. ఆయన ఆ వారం వచ్చిన విశ్వనాథవారి కథానికా పరిచయం చదివి, ఆ కథానికని అడిగి తెప్పించుకుని మరీ చదివారు. దాంతో ఈ శీర్షిక ప్రయోజనం అర్ధమై, వందా పూర్తిచేశాను. మీకు చెప్పాలనే ఉద్దేశంతో ఎంతోమంది గొప్ప కథకుల రచనలని చదివి మీ ముందుంచే అవకాశం ఇచ్చిన, ఎందరికో నచ్చిన, మెచ్చిన ఈ శీర్షికకి నేను రుణపడి ఉన్నాను.

వీటన్నింటిని గుదిగుచ్చి ఆ మాలికని ఆధునిక యుగకర్త గురజాడ వందో వర్ధంతినాడు (30.11.2015) నివాళిగా మసర్పించుకుందాం...

**–డా॥వేదగిరి రాంబాబు**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | గురజాడ చేతుల్లో కథానికగా మారిన కథ | 15 |
| 2. | అట్లూరి పిచ్చేశ్వరరావు 'నెత్తురు కథ' | 20 |
| 3. | అడవిబాపిరాజు 'వాన' | 22 |
| 4. | అల్లం శేషగిరిరావు 'స్విచ్ఆఫ్' | 24 |
| 5. | అవసరాల రామకృష్ణారావు 'పిలుపుఎప్పుడొస్తుందో?' | 26 |
| 6. | అవసరాల సూర్యారావు కథానిక 'కొత్తపుంతలు' | 28 |
| 7. | అంబటిపూడి వేంకటరత్నం 'ప్రభువు' | 30 |
| 8. | ఆచంట శారదాదేవి 'పగడాలు' | 32 |
| 9. | ఆలూరి భుజంగరావు 'నిన్నటికి నేడు ఏమవుతుంది?' | 34 |
| 10. | ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి 'త్రివేణి సంగమం' | 36 |
| 11. | ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'తలవంచని పువ్వులు' | 38 |
| 12. | ఐ.ఎల్.ఎన్. 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్' | 40 |
| 13. | ఇల్లిందల సరస్వతీదేవి 'శలభాలు' | 42 |
| 14. | ఎస్.మునిసుందరం 'భ్రమ' | 44 |
| 15. | కప్పగంతుల సత్యనారాయణ 'సెలవు' | 46 |
| 16. | కప్పగంతుల మల్లికార్జునరావు 'శ్రీరామరక్ష' | 48 |
| 17. | కనపర్తి వరలక్ష్మమ్మ 'కుటీరలక్ష్మి' | 50 |
| 18. | కవికొండల 'జమీందారు' | 52 |
| 19. | కాళోజి 'తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము' | 54 |
| 20. | కె.లక్ష్మీ రఘురామ్ 'బంధము' | 56 |
| 21. | కె.ఆర్.కె.మోహన్ 'గుడ్‌బై టు మెర్విన్' | 58 |
| 22. | కె.వి.సుబ్బయ్య 'ఆత్మశాంతి' | 60 |
| 23. | కొనకళ్ళ వెంకటరత్నం 'సంఘర్షణ' | 62 |

24. క్రొవ్విడి లింగరాజు 'గొప్పోళ్ళ న్యాయం' 65
25. కొమ్మూరి పద్మావతీదేవి 'పొగడ దండ' 67
26. కొడవటిగంటి కుటుంబరావు 'అక్కయ్యపెళ్ళి' 70
27. గణేశ్‌పాత్రో 'చిన్నకథ' 73
28. గోపీచంద్ 'సంపెంగ పువ్వు' 75
29. ఘడియారం శ్రీరాములు 'పంకజాక్షి' 78
30. ఘండికోట బ్రహ్మాజీరావు 'దీపం కొడిగట్టింది' 79
31. చలం 'ఓ పువ్వు పూసింది' 81
32. చాసో 'ఎంపు' 83
33. చావా శివకోటి: 'కాంచన మృగం' 85
34. చింతా దీక్షితులుగారి 'సుగాలీ కుటుంబం' 87
35. ద్వివేదుల విశాలాక్షి 'తీరని కోరిక' 89
36. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'బూట్‌పాలిష్' 91
37. జంపన పెద్దిరాజు 'ఫౌల్' 93
38. జి.వి.కృష్ణారావు 'చేసుకున్నకర్మ' 95
39. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి 'గాదె' 97
40. తాపీ ధర్మారావు 'పాపభీతి' 99
41. తాతా కృష్ణమూర్తి 'ప్రైవేటు ట్యూషను-వడుగు' 102
42. తాడిగిరి పోతరాజు 'నిరవధిక నిరీక్షణ' 104
43. తిలక్ 'ఊరి చివరి ఇల్లు' 106
44. త్రిపుర 'పాము' 108
45. తురగా జానకీరాణి 'యాత్ర' 110
46. ధనికొండ హనుమంతరావు 'సౌఖ్యరాశి' 112
47. నార్ల చిరంజీవి 'కఱ్ఱ-చెప్పులు' 114
48. నెల్లూరి కేశవస్వామి 'విముక్తి' 116
49. నోరి నరసింహశాస్త్రి 'మరువిషయము' 118
50. పద్మావతి 'వాచస్పతి' మనసు చూపిన మార్గం 120

| | | |
|---|---|---|
| 51. | పంతుల కృష్ణారావు 'ఉద్యోగం కోసం' | 122 |
| 52. | పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' | 124 |
| 53. | పి.రుక్మిణీబాయి 'తలుపుముయ్యాలి' | 127 |
| 54. | పి.వి.నరసింహారావు 'గొల్ల రామవ్వ' | 129 |
| 55. | పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'నబీ' | 131 |
| 56. | పూసపాటి కృష్ణంరాజు 'రెండు బంట్లూ పోయాయి' | 133 |
| 57. | పోలవరపు కోటేశ్వరరావు 'ఏటికి నీళ్ళు తగిలాయి' | 135 |
| 58. | పోలాప్రగడ సత్యనారాయణమూర్తి 'గెలుపూ- ఓటమి' | 137 |
| 59. | బలివాడ కాంతారావు 'లోకం' | 138 |
| 60. | బందా కనకలింగేశ్వరరావు 'పందిరి కింద' | 141 |
| 61. | భానుమతి రామకృష్ణ 'అత్తగారూ- కట్టుడుపళ్ళూ' | 142 |
| 62. | బుచ్చిబాబు 'కాగితం ముక్కలు, గాజుపెంకులు' | 145 |
| 63. | బుర్రా వేంకటసుబ్రహ్మణ్యం 'పారిస్' | 147 |
| 64. | భూషణం 'ఉద్ధరింపు' | 150 |
| 65. | మల్లాది రామకృష్ణశాస్త్రి 'మంత్రపుష్పం' | 152 |
| 66. | మధురాంతకం రాజారాం 'రాతిలో తేమ' | 154 |
| 67. | మహబూబ్ మియ్యాసాహెబ్ 'మీనాక్షి' | 157 |
| 68. | మాడపాటి హనుమంతరావు 'హృదయశల్యము' | 158 |
| 69. | మాలతీ చందూర్ 'తనూ-నీరజ' | 160 |
| 70. | మాగోఖలే 'బల్లకట్టు పాపయ్య' | 162 |
| 71. | ముద్దుకృష్ణ 'పిచ్చి నమ్మకాలు' | 164 |
| 72. | మునిమాణిక్యం నరసింహారావు 'పస్టుకేస్' | 166 |
| 73. | మొక్కపాటి నరసింహశాస్త్రి 'ఆఖరుమాట' | 168 |
| 74. | యల్లాప్రగడ సీతాకుమారి 'ఈ రాధేనా?' | 170 |
| 75. | రాచమల్లు రామచంద్రారెడ్డి 'దేశంలోని దేవకన్యలు' | 172 |
| 76. | రాయసము వేంకట శివుడు 'మాణిక్యము' | 175 |
| 77. | రుద్రాభట్ల నరసింగరావు 'కాంతం-కనకం' | 177 |

78. రావిశాస్త్రి 'మోక్షం' 179
79. వట్టికొండ విశాలాక్షి 'రిక్షావాలా' 181
80. వట్టికోట ఆళ్వారుస్వామి 'పతితుని హృదయం' 183
81. వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'బండి కదిలింది' 185
82. వాకాటి పాండురంగరావు 'ప్లసిబో' 187
83. వాసిరెడ్డి సీతాదేవి 'తమసోమ జ్యోతిర్గమయ' 189
84. వి.ఎస్.రమాదేవి 'దానం' 191
85. వుప్పల లక్ష్మణరావు 'అభ్యుదయం' 193
86. విశ్వనాథ సత్యనారాయణ 'మాక్లీ దుర్గంలో కుక్క' 195
87. వేలూరి శివరామశాస్త్రి 'డిప్రెషన్‌చెంబు' 198
88. వై.సి.పి.రెడ్డి 'దొంగ బర్రె గొడ్లు' 200
89. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అరికాళ్ళకింద మంటలు' 202
90. శ్రీశ్రీ 'ఆనంద మందిరము' 204
91. శ్రీరాగి 'కేసు' 206
92. శ్రీసుభా 'ఒక కోరిక– ఒకే తీర్పు' 209
93. శారద 'స్వాతంత్ర్య స్వరూపం' 211
94. సత్యం శంకరమంచి 'వరద' 213
95. సరళాదేవి 'ఎదురుచూసిన ముహూర్తం' 215
96. సామవేదం జానకిరామశర్మ 'నటుడు' 217
97. సొరీస్ 'స్మృతి' 219
98. స్వామి చిత్రానంద 'బహు బహు బహుమతి ప్రదానము' 221
99. సి.ఎస్.నీలకంఠయ్యర్ 'భోగపుమేళములు' 223
100. హితశ్రీ 'గులాబీ పువ్వు–సిగరెట్' 225

# గురజాడ చేతుల్లో కథానికగా మారిన కథ

"గురజాడ వారి చేతుల్లో తెలుగు కథానిక యవ్వనంతో పుట్టింది" అన్నారు పాలగుమ్మి పద్మరాజుగారు.

గురజాడ చేతుల్లో కథానిక పరిపూర్ణతని సాధించింది అన్నది యదార్థము. 'దిద్దుబాటు'లో ఆ పరిపక్వత కనిపిస్తుంది. అంతేకాదు మధురాంతకం రాజారాంగారన్నట్లు "గురజాడ కథానిక లక్షణాలివని చెప్పలేదు గాని, కథానిక లక్షణాలివని తెలిసేట్టు 'దిద్దుబాటు' కథానికని రూపొందించారు."

'దిద్దుబాటు' మూడు పేజీల కథానిక. ఈ ప్రక్రియకి క్లుప్తత, స్పష్టత ప్రధానమని ఈ కథానిక చెప్పకనే చెబుతుంది. అలాగే ఏకాంశం మీద, ఏకకాలంలో ఈ కథానిక జరగడం మరో విశేషం!

వర్ణనలు, ఉపోద్ఘాతాలు లేకుండా దిద్దుబాటు 'తలుపు.... తలుపు...' అంటూ సరాసరి కథలోకొచ్చి ప్రారంభమై ఆధునిక కథ... కథానికా ద్వారాలని తెరిచింది.

ఈ కథానికలో కమలిని చిన్న నాటకమాడి వేశ్యాలోలుడైన భర్తని దిద్దుబాటు చేసుకుంటుంది. విచిత్రమేమిటంటే కమలిని పాత్ర కథానికాంతం వరకు రాదు.

సరళ గ్రాంథికంలో రాసిన ఈ కథానిక ద్వారా తమని తామే దిద్దుబాటు చేసుకొని మాట్లాడుకొనే భాషలోకి తిరగరాయడంతో కథానికలోని భాష – మనం మాట్లాడుకొనే భాష అయింది. అంతేకాదు ఈ కథానికలో భాషని గురజాడ పాత్రోచితంగా వాడారు. నౌకరు రాముడితో ఉత్తరాంధ్ర మాండలిక చెప్పించారు పాత్రోచితంగా.

అప్పటి సామాజిక సమస్యలలో వేశ్యాలోలత్వం ఒకటి. ఆ వేశ్యాలోలత్వం ఈ కథానికలోని వస్తువు.

భర్త వేశ్యాలోలుడైతే, భార్య కమిలిని కన్నీరు కారుస్తూ కూర్చోలేదు. అలాగని భర్తతో తగవుకి దిగలేదు. పుట్టింటికి పారిపోలేదు. ఆ ఇంట్లోనే ఉండి – గడపదాటకుండా భర్త చెంపలు వేసుకునేట్టు చేయగలిగింది!

ఆమెను అబలంటారా? సబలంటారా?

'చదువుకున్న స్త్రీ తన కుటుంబాన్ని తాను చక్కబెట్టుకోగలదు' అనే విషయాన్ని తెలియజెప్పడానికే గురజాడ ఈ కథానికని రాశారు.

దిద్దుబాటులో – భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందని బాధపడుతున్న గోపాల్రావ్‌తో నౌఖరు రాముడు "అలక చేస్తే చెప్పచాల్నుగాని బాబూ ఆడదయి చెప్పకుండ పుట్టినారింటికి ఎల్లారంటే చెంపలాయించి కూకోబెట్టాలిగాని, మొగోరిలాగా కతలూ కోతలూ ముప్పితే ఉడ్డోరం పుట్టదా బాబు" అంటాడు.

"ఓరి మూర్ఖుడా! భగవంతుడి సృష్టిలోకెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్యనేర్చిన స్త్రీరత్నమే. శివుడు పార్వతికి సగము దేహము పంచిఇచ్చాడు. ఇంగ్లీష్‌వాడు భార్యని బెటరాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగుడికన్నా దొడ్డది అన్నమాట బోధపడ్డాదా" అంటాడు గోపాల్రావ్.

"నాకేం బాధకాదు బాబూ"అన్న నౌకరుతో అంటాడు తిరిగి "నీ కూతురు బడికి వెళ్తున్నది కదా! విద్యవిలువ నీకే బోధపడుతుంది.

మరో రచయితయితే "నిజమేరా! అమ్మగారికి చదువు చెప్పించడం తప్పయిపోయింది అనే అర్థం వచ్చేలా ఈ సందర్భంలో గోపాల్రావ్‌తో చెప్పిస్తాడు. కానీ చదువుకున్న స్త్రీ తన కుటుంబాన్ని తాను చక్కదిద్దుకోగలదని" చెప్పాలనుకున్న గురజాడ చదువుని చులకన చేసి మాట్లాడలేదు.

'దిద్దుబాటు'లో కథ పాత్రల ద్వారా అలా నడిచి పోతుందిగాని, ఎక్కడా మధ్యలో రచయిత జొరబడడు. కానీ అంతకుముందు కథల్లో రచయిత లేక రచయిత్రి మధ్యలో అనవసరంగా జొరబడడం... ఉపోద్ఘాతాలు, వర్ణనలు ఎక్కువ. అలాంటిలోపాలు కనిపించకుండా అంతకు ముందు కథలకు భిన్నమైందిగా 'దిద్దుబాటు'ని తీర్చిదిద్దారు గురజాడ.

ప్రారంభంలో ఉపోద్ఘాతాలూ, వర్ణనలు ఉండవు. రచయిత'తలుపు... తలుపు' అంటూ సరాసరి కథలోకి వెళ్ళిపోతారు. క్లుప్తత, స్పష్టత ఆయన రచనలలో స్పష్టంగా ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. అంతకు ముందు కథకి పెట్టే పేరు 'కమలిని' అని ఉండేది. పేర్లు కాదు శీర్షిక సరాసరికాకుండా .... కథావస్తువుని దిద్దుబాటుగా మార్చి తననితాను దిద్దుబాటు చేసుకున్నారు ఏకాంశంతో ఏకకాలంలో కథనడుస్తుంది. చివరి వరకూ ముఖ్యపాత్రధారి, కథలో కనిపించడు. ఓ స్త్రీ గడపదాటి పుట్టింటికి పారిపోకుండా భర్తతో యుద్ధానికి దిగకుండా అతని తప్పు అతను తెలుసుకుని

చెంపలేసుకునేట్టు చేయడం అబల లక్షణమా? సబల లక్షణమా? గురజాడవారు 'దిద్దుబాటు'ని ఓ ప్రత్యేక శిల్పంతో చెప్పారు. కథని మాట్లాడుకునే భాషలో చెప్పడమే కాకుండా రాములు పాత్రకి పాత్రోచిత మాండలికాన్నీ రాశారు. అలా 'దిద్దుబాటు' పరిపూర్ణ ఆధునిక కథయ్యింది.

గురజాడ కథానికలు మనకి లభ్యమవుతున్నవి అయిదే! ఆ అయిదింటిలో మొదటిది దిద్దుబాటు. 1910 ఫిబ్రవరి ఆంధ్రభారతి సంచికలో ప్రచురితమైంది. ఆ తర్వాత ఏప్రిల్, మే, జూన్ సంచికలలో 'దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి?' ప్రచురితమైంది.

'ఆంధ్రభారతి' అనే మాసపత్రిక ఆవిర్భవించిందే ఆధునిక సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి! సంపాదకులు లేని పత్రిక ఆంధ్రభారతి. కేవలం రచయితల పట్టిక, పోషకుల పట్టికను మాత్రమే నెలనెలా పత్రికలో ప్రచురించేవారు. గురజాడ వేంకట అప్పారావుకూడా రచయితల పట్టికలో ఉండేవారు. అందుకే ఆయన ఆధునిక కథలతో బాటు, ఆధునిక కవిత్వం.. ముత్యాలసరాల్ని దానికే పంపేరు. అందుకని గురజాడ సాహితీ ప్రయోగాల్ని  మనకి చేర్చడంలో ప్రధానపాత్ర పోషించింది 'ఆంధ్రభారతి'.

కథానిక చిన్నప్రక్రియ కావడం వల్లనో ఏమో, మొదటినుంచి ఈ ప్రక్రియ పత్రికల మీద ఎక్కువగా ఆధారపడుతూ వచ్చింది.

'....మీ పేరేమిటి' స్థాయి కథానిక ఇంతవరకూ తెలుగులో రాలేదని ఇప్పటికీ తెలుగు విమర్శకులు చాలామంది అభిప్రాయం.

ఒక మతంలోని రెండు వర్గాల మధ్య కలహాలు, దగాకోరు బుద్ధుల్ని ఎండగట్టారు గురజాడ.  వీళ్ళ కలహాలు తీర్చడానికి కంకణం కట్టుకొంది స్త్రీయే – నాంచారమ్మ!

"ఆధునికస్త్రీ భారతదేశ చరిత్రని తిరగరాస్తుంద"ని గురజాడవారి అభిప్రాయం.

"మతాలు – సాత్వికాలు, తామసాలూ అని రెండు విధాలు. ఈ రెండు విధాలు అన్ని మతాల మనుషుల్లోనూ ఉన్నాయి" అంటూ రెండు వర్గాల వారికి అక్కడున్న ఇతర మతస్థులకు వివరిస్తుంది.

"...మతమేమిటి? మా ప్రాణాలను కూడా నిలబెట్టారు..." అన్నా డామెతో మనవాళ్ళయ్యా. ఇలా నాంచారమ్మ ఆ దురాచారకథని ఒక మలుపు తిప్పుతుంది.

ఈ కథ శరభయ్య చెప్పగానే వెంకయ్య వూరుకోకుండా "అందరు దేవుళ్ళా

ఒకటే అయినప్పుడు అందరి పీనుగుల్ని ఒకచోటే నిలిపి, అందరూ కలిసి ఒకచోటే పూజ చేయవచ్చు కదా" అంటాడు. దేవుళ్ళందరూ ఒకటే, వాళ్ళపేర్లు చెప్పుకుని కలహాలకు దిగకండి. అందరూ కలిసి ఆ ఒక్కడికే పూజచేయండి– అని ఈ కథానిక చెబుతుంది. 'దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి?' అనడంలోనే గొప్పవ్యంగ్య ముంది.

మతాల మధ్య కలహాల్ని నిరసిస్తూ, మతాన్ని మనిషి ఎలా వాడుకుంటున్నాడో రెండున్నర పేజీల్లో గురజాడవారు చెప్పిన మరో గొప్ప కథానిక 'మతము – విమతము'. దానినే "పెద్దమసీదు" అని కూడా అంటారు.

ఆ రోజుల్లో ముసలి మొగుడు పడుచు పెళ్ళాలు ఎక్కువగా ఉండేవారు. ముసలి పులి చేతుల్లో పడుచుపెళ్ళాం కష్టం చెబుతూనే– స్త్రీ నిజాయితీని, మగవాడి దుర్మార్గాన్ని మన కళ్ళముందుంచుతారు 'మెటిల్డా' కథానికలో.

ఈ కథానికలోనే ఓ పాత్రతో చెప్పిస్తారు "చెడ్డతలంపు చెప్పిరాదు. ఎక్కణ్ణించో రానక్కరలేదు. కంటికన్పడకుండా మనసులో ప్రవేశించి మనసులోనే పొంచి ఉంటుంది. చూడనట్లు మనం వూరుకొంటే, అది పైకొచ్చే ప్రయత్నాలు బాహాటంగానే చేస్తుంటుంది. అడవిలో ఒంటరిగా వున్న వాళ్ళకి స్త్రీ విషయమై చెడ్డతలపులు ఉండవు. సొగసైన స్త్రీలు పొందుకోరే వాడికి అవకాశం తటస్థించినప్పుడు చెడ్డతలపు వస్తుందా? రాదా? అన్నదే ఆలోచన. ఆ అవకాశానికి అవకాశం ఇవ్వనివాడే ప్రాజ్ఞుడు" అని చెప్పిస్తారు.

'సంస్కర్త హృదయం'లో వేశ్య సరళని ఉద్ధరించాలనుకున్న ప్రొఫెసర్ రంగనాథయ్యర్ తానే ఆ ఊబిలోకి జారిపోతాడు.

అయిదు కథానికలు నాటి సమాజంలోని కుళ్ళుని ఎత్తిచూపించడానికి ఉపకరించాయి. రుగ్మతలను తొలగించే ప్రయత్నాలివి చేసాయి. అక్షరాన్ని ఆయుధం చేసుకోవచ్చని మొదటచెప్పినవారు గురజాడ.

కథానికతో బాటు గురజాడ నవలని రాయాలనుకున్నారు. రాసుంటే మంచి నవలకూ ఆదర్శప్రాయులై ఉండేవారు. నవల రాయడానికి ముందు 'సంక్షిప్తరూపం' రాయడానికి ఉపక్రమించారు. దురదృష్టవశాత్తు నవల స్థూలరూపం పూర్తిచేయకుండా పరమపదించారు.

"ప్రతిభావిశేషాలు ఒక టంకశాల వంటివి. రచయిత సృష్టించేవి అందులో

తయారయే నాణేలు వంటివి. టంకశాల తయారుచేసిన నాణేలు చెల్లునో చెల్లవో మోగించి చూసినట్లు వీటిని విమర్శనాత్మక శక్తి ఉపాయములగునో, కాదో పరీక్షిస్తుంది" అన్నారు అప్పారావుగారు.

అంటే ఆయన సృజనాత్మకతతో బాటు విమర్శనాశక్తి ఎంత అవసరమో, ఎందుకు అవసరమో కూడా చక్కగా చెప్పారు.

సృజనాత్మక రచయిత చీకటిలోనూ తనదారి తాను తీసుకుంటే– విమర్శకుడు, అతను లేక ఆమె బ్యాటరీలైటు వేసుకుని, తానా దారిని పరిశీలించగలడు. రచయిత లేక రచయిత్రి దారిమీదే వెళ్తున్నారా? ప్రక్కనున్న ముళ్ళలోకి వెళ్తున్నాడా తెలుసుకోగలరు. వాళ్ళకి దారి చూపిస్తారు కాబట్టి సృజనాత్మక రచయితకి విమర్శకుడు మార్గదర్శకత్వం చూపాలి.

"అడుగడుగునా సామాజిక విమర్శనంతో, వాస్తవమైన ఇతివృత్తాలతో సంఘంలోనుంచి ఎంచి తీసిన పాత్రలతో చక్కని తేటైన తెలుగు నుడికారంతో, సున్నితమైన హాస్యంతో, నిశితమైన వ్యంగ్యంతో, సిద్ధాంతాలకతీతమైన శిల్పచాతుర్యంతో అలరారే గురజాడ వారి కథలు ఆంధ్ర సాహిత్యానికి అచ్చంగా ఆణిముత్యాలే" అన్నారు శ్రీదాశరథి.

'వ్యవహార భాషోద్యమం గిడుగు లక్ష్యమైతే దానికి లక్షణం చూపినవారు గురజాడ'– గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారి వ్యాఖ్య. 'ఆధునిక కథ పుట్టడం గురజాడ చేతుల్లో యవ్వనంతో పుట్టింది'– పాలగుమ్మి పద్మరాజుగారి అభిప్రాయం. 'గురజాడ చేతుల్లో యవ్వనంతో పుట్టినా, ఆ తర్వాత బాల్యానికి లోనై దాదాపు పది, పదిహేనేళ్లు తప్పటడుగులు వేసింది ఆధునిక కథ' అని కూడా అన్నారు.

"సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే పరిస్థితిని కళ్ళెదుట పెట్టి, నైతిక భావాల ఉన్నత ప్రమాణాల్ని ప్రాచుర్యానికి తేవడం కంటే సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేదీ ఉండదు" అనేది గురజాడ దృఢాభిప్రాయం.

# అట్లూరి పిచ్చేశ్వరరావు 'నెత్తురు కథ'

**ర**క్తంతో ఓ జీవితాన్ని పోలుస్తూ అద్భుతంగా చెప్పారు 'నెత్తురుకథ' కథానికలో అట్లూరి పిచ్చేశ్వరరావు గారు. ఎర్ర జెండాతో ప్రారంభమవుతుంది ఈ కథానిక. రంగేసిన గుడ్డ కాదది. నెత్తురు పులుముకున్న గుడ్డ. నీలా నాలా బ్రతికిన మనిషి నెత్తురుతో ఒకప్పుడు – నీ రక్తంలా, నా రక్తంలా ప్రేమతో పొంగి, దుఃఖంతో కరిగి, క్షోభతో కుమిలి, కోపంతో మండిన నెత్తురు. ఆ రక్తంలోనే తెల్లకణాలు ఈదినాయి. ఆ రక్తంలోనే ఎర్రకణాలు పరుగెత్తినాయి...

ఇలా కథానిక ప్రారంభమవుతుంది.

అది ఎవరో పంచి పెట్టిన రక్తం కాదు. పొలం దున్ని, కాయకష్టం చేసి పంటలు పండించి, సుఖంగా బ్రతికిన రైతులే ఆ రక్తానికి జీవం పోసింది; ఆ శరీరాన్ని పెంచింది, అంటే అప్పట్లో కష్టపడ్డ రైతులకి ఫలితం దక్కేదని, తర్వాత పరిస్థితి మారిందని అర్థమవుతుంది.

ఆ తర్వాత అంటారు రచయిత – నీలా నాలా ఆ రక్తాన్ని సొంతం చేసుకున్న శరీరం ఉయ్యాలల్లో ఊగింది. తల్లి రొమ్ము పాలని తాగింది. తండ్రి ఒడిలో గంతులు వేసింది. మాయా మర్మము, కల్లాకపటము తెలీకుండా రాత్రిళ్ళు నిద్రపోయింది. రేపటి సంగతి తెలీకుండా ఉత్సాహంతో ఊగిపోయింది, సంతోషంతో కేరింతలు కొట్టింది. ఆనందంతో ఆటలు ఆడి, పాటలు పాడింది. బళ్ళో కెళ్ళింది. పాఠం గడగడా అప్పజెప్పింది. గాంధీగారి ఫోటోని ఇంట్లో వేళాడగట్టుకొని దేవుడికన్నా ఎక్కువగా పూజించింది. రాట్నం ఒడికింది, ఖద్దరు కట్టింది.

ఈ లాఠీలు పుచ్చుకున్న వాళ్ళ రాజ్యం పోయినప్పుడు, మంచి రాజ్యం వస్తుందని ఆశపడింది. పరాయి పాలన తొలగినా కష్టాలు తొలగలేదని బాధ పడింది ఈ రక్తం. మూడురోజులు పస్తు ఉండి, ఆగస్టు 15న పండగ చేసుకుంది. తిండికోసం చీపురు పట్టింది, వీధుల్ని ఊడ్చింది. శాంతి భద్రతల పేరుతో సలసలా కాగే ఈ రక్తం జలజలా పారింది. వరండా తడిసింది. గుడ్డలు నానినాయి ఆ రక్తంలో. అది ఈ రక్తం. అలాంటిదీ రక్తం. ప్రేమతో పొంగి, దుఃఖంతో కరిగి, క్షోభతో కుమిలి,

కోపంతో కమిలిన నెత్తురు. ఆ రక్తంలోనూ, తెల్ల కణాలు ఈదినాయి. ఆ రక్తంలోనే ఎర్రకణాలు పరుగెత్తినాయి... అంటూ ఆవేశంతో, ఆవేదనతో, ఆలోచింపచేసేట్టు ప్రారంభించినట్టుగానే ముగిస్తారు రచయిత.

స్వాతంత్ర్యం అనంతరం నానాటికి దిగజారిన ప్రజల స్థితికి, ధోరణికి దర్పణం పడుతుంది ఈ 'చిన్ని' కథానిక.

నిశితమైన వ్యంగ్యం, అధిక్షేపణ... ఆర్ద్రత, కరుణలతో కదిలించివేస్తుంది. రసస్ఫూర్తిని కలిగించే కథానిక ఇది. జీవితాన్ని నెత్తురుతో ఎరుపు రంగుతో పోల్చడం ఓ ప్రత్యేకం! అందుకే నెత్తురు కథ అన్నారు ...! చిన్న వాక్యాలతో స్ఫూర్తినిచ్చే కథానిక... ఆలోచింప చేసే కథానిక!

# అడవిబాపిరాజు 'వాన'

బుచ్చిబాబులాగానే అడవిబాపిరాజుగారూ రచయిత, మంచి చిత్రకారులు కూడా! అందుకే ఆయన కథానికలు చదువుతుంటే కంటిముందు చక్కటి చిత్రం కదలాడుతుంటుంది.

వాన పడుతోంది. నీలాలు పాడే పాట చినుకుల శ్రుతిలో వాన చినుకుల శబ్దం కలిసిపోతుంది. భర్త ఆమె చాలా దీనంగా వుంది. భర్త నాగన్న ముఖం ఆమె కళ్ళలో మెరిసింది. వర్షం పడగానే నేలనుంచీ వచ్చే వాసన వాళ్ళకి సుగంధం. భూదేవిలోని రహష్యాలు, ఆవిడ కర్కశత్వం, ఆవిడలోని కరుణ వాళ్ళకి తెలిసినంతగా మరెవరికీ తెలీదు. ఆ ఉప్పరి దంపతులు నాగన్న, నీలాలు భూమిని నీటిని నమ్ముకుని బ్రతుకుతున్నవాళ్లు వాళ్ళ భూమిని స్వాధీనపరచుకోవడానికి నాగన్నని పెద్దరైతు జైల్లో పెట్టించాలని కుట్రపన్నాడు.

ఈ గొడవకి భూదేవి గజగజలాడింది కాబోలు వాన ప్రారంభమైంది. వానలో వచ్చి దొంగతనం చేశాడని వానలో నాగన్నను పట్టుకుపోయారు పోలీసులు.

ఉప్పరి సెలమయ్య పొలం ఆక్రమించుకోవడానికి ఆరోజు పెద్దరైతు వానలోనే వస్తున్నాడనే విషయం ఉప్పరులందరికీ తెలుస్తుంది. నీలాల కళ్ళలో ఎరుపు– పెద్దరైతు గుండెల్లో గుబులుతో బాటు కోపాన్ని రేపుతుంది.

మొగుడు నాగన్నను జైల్లో పెట్టించినట్లే నీలూని జైల్లో పెట్టించాలనుకుంటాడు పెద్దరైతు.

నాగన్న కథని విన్న పెద్దవకీలు వీరాస్వామి హృదయం కరిగింది.

నాగన్న పొలం కాలువగట్టున ఉంది. దాని తర్వాత పెద్దరైతు నూరెకరాలున్నాయి. అందుకని నాగన్న పొలాన్ని తన పొలంలో కలుపుకోవాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు పెద్దరైతు అన్న విషయాన్ని గ్రహించాడు. నాగన్న దంపతులు తప్పుకోలేదు.

"నీ భూమే కాదు – నీ నీలాలు నీకు దక్క"దంటాడు పెద్దరైతు నాగన్న భార్య నీలాలుతో.

కానీ పెద్దప్లీడరు పుణ్యమాని సరిగ్గా సమయానికి నాగన్న జైలునుంచి తిరిగి వచ్చేసాడు... పెద్దరైతు ఏమీ చేయలేని స్థితి. వాన తగ్గింది. ఒకటైన ఆ దంపతుల్ని చూసి భూమి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

భూమిపుత్రుల కథ.

నిర్మలమైన ప్రేమకథ.

మనుషుల మధ్యే కాదు, మనుషులు భూమి మధ్య ప్రేమకథ.

అడవిబాపిరాజుగారి అందమైన మానవ చిత్రం!

# అల్లం శేషగిరిరావు 'స్విచ్ ఆఫ్'

**ఒ**కప్పుడు ఓ హెన్రీ తరహా కథానికలు ఎక్కువగా రాసేవారు. అంటే కొసమెరుపే ప్రధానమన్నమాట. విషయానికి ప్రాధాన్యత అంతగా ఉండదు. అల్లం శేషగిరిరావుగారి 'స్విచ్ఆఫ్' కథానిక అట్లాంటిదే. కేవలం 'థ్రిల్' నిచ్చే కథానిక. ఆ తర్వాత ఇలాంటి కథానికలెన్నో వచ్చాయ్.

రామగిరి ట్రావెలర్స్ బంగ్లాలో రంగారావూ, అతని మిత్రుడూ కలిసి ఓ సూట్ని బుక్ చేసుకుంటారు. కాని ఆఖరి నిమిషంలో కారణాంతరాల వలన రంగారావు ట్రావెలర్స్ బంగ్లాకి వస్తాడు గాని, అతని మిత్రుడు రాడు.

రంగారావు ఒక్కడే నిద్ర పట్టక చలితో వణికిపోతూ ఘాట్రోడ్మీదున్న ట్రావెలర్స్ బంగ్లాలోని బెడ్మీద దొర్లుతూ ఉంటాడు. ఇంతలో ఎవరో తలుపు కొడతారు.

రంగారావు తలుపు తెరిచి చూస్తాడు. చలిగాలిలో వణికిపోతూ ఓ వ్యక్తి కనిపిస్తాడు. "నేను జర్నలిస్టుని. ఈ దగ్గర్లో వున్న కొండజాతి వాళ్లమీద పరిశోధనలు చేయడానికొచ్చాను. ఈ రాత్రికెక్కడికీ వెళ్ళలేను. ఈ రాత్రికిక్కడ ఉండి రేపు పొద్దున్న వెళ్తాను" అంటాడు అతను.

రంగారావు ముందు ఖాళీలేదన్నా, ఆ చలిలో అతనెక్కడికి వెళ్తాడన్న జాలితో తనతో రావాల్సి రాకున్న మిత్రుడి బెడ్మీద పడుకోమంటాడు.

ఆరాత్రి జర్నలిస్టు ఎన్నెన్నో విశేషాలు రంగారావుకి చెబుతాడు. రంగారావుకి ఆ జర్నలిస్టు కుమార్ మీద మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అతని విషయ పరిజ్ఞానానికి ఆశ్చర్యపోతాడు.

ఇద్దరి మధ్యా సంభాషణలో దెయ్యాలూ, భూతాలూ, చేతబడులమీద వస్తున్న కథానికలు, నవలల ప్రస్తావన వస్తుంది.

"రానీయండి సార్, అన్నిరకాల సాహిత్యాలూ రానీయండి... సాహిత్యానికి సంకెళ్ళు వేసి అధికారం ఎవరికీ ఉండకూడదు. మంచి సాహిత్యమయితే నాలుగు కాలాల పాటు నిలుస్తుంది. చెత్తయితే కొట్టుకుపోతుంది. దానికింత రాద్ధాంతం అవసరమా?" రంగారావుని ప్రశ్నిస్తాడు జర్నలిస్టు కుమార్.

"దయ్యాలున్నాయంటారా? అవి అభూతకల్పనలు కావూ?" అంటాడు రంగారావు.

"దేవుడున్నాడంటారా? అదీ అభూతకల్పనకాదూ?" అంటాడు కుమార్.

ఇద్దరూ గ్లాస్‌మీద గ్లాస్ సేవిస్తూ సాహిత్య చర్చను జరుపుతారు. "చాలా రాత్రయింది, పడుకోండి సార్. చాలాదూరం తిరిగి అలిసి పోయి ఉంటారు, రేపు ఉదయాన్నే మళ్ళీ మీరు బయలుదేరాలి" అంటాడు రంగారావు.

ఇద్దరూ పడుకోబోతూండగా బాత్‌రూంలో లైట్ వేస్తున్నట్లు గ్రహిస్తాడు రంగారావు. ఆర్పేయడానికి వెళ్ళబోతూంటే "మీరు పడుకోండి. నేను ఆర్పేస్తాను" అంటూ చేతిని పక్కమీదినుంచి ముందుకి చాస్తాడు కుమార్. అది సాగుతోంది... పాక్కుంటూ పోతోంది ఆచెయ్యి. అంత పొడుగూ వెళ్ళి అక్కడ స్విచ్‌ని ఆఫ్ చేసింది.

'అంతా చీకటి' అంటూ ముగిస్తారు రచయిత.

కొసమెరుపు కథయినా అల్లంశేషగిరిరావుగారు కాబట్టి ఘాట్‌ప్రాంతాలూ, గిరిజనుల గురించీ కొంత ప్రత్యేక సమాచారానిస్తారు ఈ కథానికలో.

# అవసరాల రామకృష్ణారావు 'పిలుపుఎప్పుడొస్తుందో?'

**అ**వసరాల రామకృష్ణారావుగారి కథానికలలో చక్కటి వ్యంగ్యం తొంగి చూస్తుంటుంది. అందుకు 'పిలుపు ఎప్పుడొస్తుందో' కూడా చక్కటి ఉదాహరణ. మధ్యతరగతి మనస్తత్వాలకి ఆధ్యాత్మికత రంగరించి తన ధోరణి వ్యంగ్యంతో మెరిపించారు. పిలుపు ఎప్పుడొస్తుందో శీర్షికలోని ఆ పిలుపు దేవుడి దగ్గర నుంచా? కడుపులో పరుగెత్తే ఎలుకల బాధ నివారించడానికా?

ఉదయం పదకొండు గంటలు దాటుతోంది. అయినా భార్య తన భోజనం సంగతి చూడకుండా పెరట్లో సుబ్బులుతో వాగ్వివాదం చేస్తుండడం భర్త అనే ముసలి ప్రాణికి కష్టంగానే ఉంటుంది... అనాథ రక్షకుని తలవడంకన్నా అతను ఆ ఇంట్లో చేయగలిగింది లేదు!

'దాహమేస్తోంది. మంచినీళ్ళే నా మొహాన కొట్టు' అంటూ అసహనంతో అతను లోపలికి వేసిన కేకకు జవాబు రాకపోయేసరికి తనే లోపలికి ఆయాసపడుతూ వెళ్ళి గొంతు తడుపుకుని వచ్చి మళ్ళీ యథాస్థానంలో కూలబడతాడు. పెరట్లో నుంచి ఆయన భార్య, నూకాలు మాటలు వినిపిస్తుంటాయి.

గతంలో విహరిస్తున్న పెద్దాయన 'గేటు తలుపులు సరిగ్గా మూసివెళ్ళు' భార్య మాటలు వినిపించడంతో ఈ లోకంలోకి వచ్చాడు. గేటు వేసి వేయకుండా లోపలికి వచ్చే అలవాటు భార్యకి లేదని అతనికి తెలుసు. నూకాలుకి సంతానం గురించి భార్య చెబుతున్న జాగ్రత్తలు ఆయనకు విసుగు తెప్పిస్తాయి. మనసు బయట పడకుండా, భాగవతంలోని పద్యాల్ని కళ్ళు మూసుకుని చదువుకుంటుంటాడు.

ఇంతలో తనో కప్పుకాఫీ, భర్తకో కప్పు తీసుకుని వచ్చి కూలబడుతుంది ఆ ఇల్లాలు. "ఏం చెయ్యను చెప్పండి నాకు బొత్తిగా నూకల్ని బియ్యం నుంచి వేరుచేయడం రాదు. ఆ నూకాలు బొత్తిగా పేచీకోరు. ఏవో మాటలు చెప్పి పని చేయించుకోవాలి" అంటుంది భర్తతో.

స్ట్రాంగ్ కాఫీ ఇవ్వడంతో ఆయనేం మాట్లాడలేకపోతాడు. దాంతో విజృంభించి భార్యామణి తన ధోరణిలో తాను నూకాలు లాంటి వాళ్ళని ఎలా సముదాయించాలో చెబుతోంది.

ఉపన్యాసాలాపి ఆ వంట సంగతి చూడు అని ఆయననడంతో బలవంతాన కప్పులాగేసుకుని లోపలికి వెళ్ళిపోవాలనుకుంటుందా ఇల్లాలు.

వెళ్తూ వెళ్తూ "కిందటి శలవులకు అమ్మాయి వచ్చినప్పుడు మనవడికి బాగుండకపోతే తీసుకెళ్ళి నరసింహస్వామి ముందు పడేసారా? లేదే! డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళారు. దారిపొడుగునా మీరు దైవాన్ని ప్రార్థించినట్లూ లేదు. ఉన్నాడోలేడో అని పలవరించడం ఆ భగవంతుడికోసం కాదు, ఆ డాక్టర్ కోసమని నాకు తెలీదా?" దెప్పి పొడిచింది.

"నీలాంటి నాస్తికురాలితో ఇంక వాదనేమిటి? ఆ పిలుపు ఎప్పుడొస్తుందోనని ఎదురు చూడడంతప్ప" అని వాపోతాడా భర్త.

ఈ నెల ఎమ్.ఒ.వచ్చేసింది కనుక పోస్ట్‌మన్ పిలుపుకోసం... అబ్బాయి పిలుపుకోసం ఎదురుచూడనక్కర్లేదు. ఇక రోజుకి రెండుసార్లు ఎక్కడ నుంచి పిలుపుకోసం ఎదురుచూస్తామో అందరికీ తెలిసిందే కదా! అందుకని భార్యమీద కోపాన్ని పక్కనబెట్టి ఆమె పిలుపుకోసం ఆ ముదుసలి భర్త ఎదురుచూస్తున్నాడంటూ ఎంతో చమత్కారంగా ముగించారు కథానికని రచయిత.

# అవసరాల సూర్యారావు 'కొత్తపుంతలు'

మహాకవి గురజాడవారి రచనలను కొన్నింటిని తమ సంపాదకత్వంలో ప్రచురణయ్యేట్టు చూశారు. నవలలు, నాటకాలు, కథానికలూ రాశారు. కొత్తపుంతలు తొక్కే ప్రయత్నంలో అవసరాల సూర్యారావుగారు 'కొత్తపుంతలు' కథానికని రాశారు.

ఆ ఊర్లో చుట్టల దుకాణాలన్నింటినీ మూసివేశారు. పొగత్రాగడానికి వ్యతిరేక ఉద్యమం ఏదో జరుగుతోందనుకున్నారంటే పొరబడ్డట్టే లెక్క! చుట్టలు చుట్టే పనివాళ్లంతా కలసికట్టుగా ఊరేగింపు చేస్తున్నారు. సభలు జరుపుకుంటున్నారు. చుట్టలు కాల్చేవాళ్ళు చాలా ఇబ్బంది పడుతున్నారు. చుట్టలు చుట్టే కార్మికులకు నాయకుడు పైడితల్లి.

పైడితల్లి ఎన్నోసార్లు కూలి ఎక్కువ ఇమ్మని షావుకారిని అడిగేవాడు. షావుకారు ఎక్కువివ్వకపోగా గుడ్లురిమేవాడు. పైగా చెయ్యి కూడా చేసుకోవడంతో కోపం వచ్చిన పైడితల్లి కూలివాళ్ళందర్నీ కూడగట్టుకుని సమ్మె ప్రారంభించాడు.

షావుకారు చుట్టలంటే చుట్టుపక్కలంతా పేరు, ఎక్కడెక్కడినుంచో వచ్చి అతని దగ్గరే చుట్టలు కొంటుంటారు. అయినా అర్థణా డబ్బులెక్కువిమ్మంటే తెగ కష్టపడిపోతున్నాడు. అంతేకాదు పైసలు పెంచడం ఇష్టంలేక బింకాన్నీ ప్రదర్శిస్తున్నాడు.

ఊరేగింపులు, సభలూ సాగిపోతూనే వున్నై. కూలిజనం గిజగిజల్లాడిపోతూనే ఉన్నారు. షావుకారు తన బింకాన్ని సడలించలేదు... ఇంతలో పైడితల్లి పుగాకు వ్యాపారాన్ని ప్రారంభిస్తున్నట్లు వార్తలు రాసాగాయి.

కూలి వాళ్ళందర్నీ తలో రెండురూపాయలూ వేసుకొమ్మని పైడితల్లి పుగాకు వ్యాపారాన్ని ప్రారంభించాడు. కూలివాళ్ళకు హెచ్చుకూలీ వచ్చినా అతనికి లాభమే! ఇన్ని నీతులూ చెప్పిన పైడితల్లి కూడా షావుకారుల్లో కలిసి పోయాడు' అనే వాక్యాన్ని రచయిత రాయడంతో ఇతనూ పేదల్ని పీడించి సొమ్ముచేసుకోవడం ప్రారంభిస్తామో ననిపిస్తుంది కథానిక చదివే పాఠకుడికి.

పైడితల్లి వ్యాపారం పెరిగి అల్యూమినియం కొట్టునీ పెట్టాడుగానీ చుట్టల వ్యాపారాన్ని మానలేదు.

ఆ ముసిలోడు 'కూలోళ్ళ గొంతులో...' అని పాడుతుంటే అతని చెయ్యి యంత్రంలా గిరగిరా తిరగసాగింది. పైడితల్లి లేబరుకి ఎక్కువిచ్చినా లాభాలెలా వస్తున్నాయా? అని చదువుకున్నవాళ్లు ఆలోచనలతో సతమతమవుతున్నారనడంతో రచయిత కథానికని ముగిస్తాడు.

చుట్ట కార్మికుల సమస్యల్ని చెప్పడంతో బాటు దానికి ఓ పరిష్కారాన్ని చూపించారు రచయిత. కార్మికుడు షావుకారెలా అయ్యాడో అందంగా చెప్పడంతో బాటు షావుకారుగా నిలిచిపోక పేదల పక్షాన్ని ఎలా వహించవచ్చో చక్కటి శిల్పంతో చెప్పారు, ఈ చిన్నకథలో ఓ పెద్ద విషయాన్ని ఆలోచింపజేసేట్టు ముగించారు.

# అంబటిపూడి వేంకటరత్నం 'ప్రభువు'

బస్సులో బయల్దేరాడు రచయిత. కిటికీలోంచి ఒకామె చేయిచాపి 'అయ్యా, ధర్మం' అంటుంది... 'కుంటివాళ్ళం బాబూ' మళ్ళీ అంటుంది. బండిలో అందరూ ఎంతోకొంత ఆమెకి దానం చేస్తుంటారు.

రచయిత కిటికీలోంచి క్రిందకు చూస్తాడు. ఆమెకు రెండు కాళ్ళూ లేవు. చంకల క్రింద చెక్కలు పెట్టుకుని కదుల్తున్న ఒంటికాలు మగమనిషి భుజాలమీద కూర్చుని, అడుక్కుంటోంది. అందుకే కిటికీల దగ్గర అడుక్కోవడానికి ఆమెకు వీలవుతోంది.

రచయితా ఓ పావలా ఆమెకిచ్చాడు. బస్సు కిటికీలోంచే వాళ్ళని గమనించసాగాడు. బస్సుకి కొంచెం దూరంలో ఉన్న ఓ చెట్టు కిందకు చేరారు వాళ్ళిద్దరూ. అతని భుజం మీదనుంచి ఆమె క్రిందికి దిగింది. అతడు ఠీవిగా చెట్టుకానుకుని కూర్చున్నాడు. ఆమెతో సరసాలాడుతున్నాడు.

ఇంతలో ఓ యువతి అక్కడికి కుండలో నీళ్ళు తెచ్చింది. బహుశా వాళ్ళిద్దరూ భార్యాభర్తలై ఉంటారు, ఆమె వాళ్ళ కుమార్తె అయివుంటుందని ఊహించాడు రచయిత. ఆ యువతి వికలాంగులైన ఆ భార్యాభర్తలకు అండగా అటు ఇటు తిరుగుతోంది.

ఇంకా టైముంది బస్ బయల్దేరడానికని చెప్పడంతో రచయిత బస్ దిగి ఆ బిచ్చగాళ్ళున్న చెట్టు వేపుకి బయల్దేరతాడు.

మీరెవరని అడుగుతాడు రచయిత.

ఒకప్పుడు బాగా బతికినవాళ్ళం. కోర్ట్ గొడవల్లో చాలా భాగం ఆస్తి కోల్పోయామని చెప్తాడు. ఆ తర్వాత వేరుశనక్కాయల వ్యాపారం చేసి ఉన్నదీ పోగొట్టుకున్నామంటాడు. ఇక విధిలేక కూలీ నాలీ చేసుకుని బ్రతికారు. ఒకరోజు గుడిసెముందు పడుకుంటే రాళ్ళలారీ వాళ్ళ కాళ్ళమీదనుంచి పోయిందట. అయినా జంకక వాళ్ళిద్దరూ బిచ్చమెత్తుకుని బ్రతుకుతున్నారు.

'మేము అడుక్కోగా వచ్చిన దాంట్లో కావలసినంత తిని, మిగతాది కావలసిన వాళ్ళకు దానం చేస్తుంటాం' అని చెబుతాడతను.

ఇంతలో బస్ హారన్ మోగడంతో ఓ రూపాయి అతనికిచ్చి వెనుతిరుగుతాడు రచయిత.

ఆస్తిపోయినా, కాళ్ళు పోయినా కూడా రచయితకి అతను 'ప్రభువు'లాగే కనిపిస్తాడు. ప్రభుత ఏమిటో అర్థమవుతుంది!

ఆత్మస్థయిర్యముంటే ఎవరైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా తాము బ్రతకడమే కాకుండా మరికొందర్ని బ్రతికించనగలరనే విషయాన్ని ఆ వికలాంగుడి పాత్రద్వారా చక్కగా చెప్పారు రచయిత.

రచయిత తాను చూస్తున్న విషయంగా చెప్పడం వల్ల రచయిత అనుకున్న భావాన్ని కలిగించాడా కుంటి బిచ్చగాడు. వస్తువుని బట్టి, శిల్పం, శైలి ఉండాలన్న విషయాన్నీ మనకు చెప్పకనే చెప్తారు రచయిత.

# ఆచంట శారదాదేవి 'పగడాలు'

**ఆ** తరువాత ఇటువంటి కథానికలు వచ్చినా తొందరపాటు తగదని, డబ్బులేనివాళ్లని తక్కువగా అంచనా వేయవద్దని ఆరోజుల్లోనే ఆచంట శారదాదేవి గొప్పగా చెప్పిన కథానిక 'పగడాలు'.

వాసంతికి పెళ్ళైన 8 ఏళ్ళ తరువాత గాని తన ఊరికి రాలేకపోతుంది. ఈ 8 ఏళ్ళలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. పాప పుట్టినప్పుడు, ఆ తర్వాత కూడా ఎన్నోసార్లు ఈ ఊరు రావాలనుకుంది, రాలేకపోయింది.

వెన్నెల రాత్రులలో పాపకి అన్నం పెట్టి మేడమీదే పక్కవేసి పడుకోబెట్టింది వాసంతి. ఆమెకీ నిద్ర పట్టింది. నిద్రలో ఒత్తిగిల్లుతున్నప్పుడు మెడలో పగడాలు పాప తల తగిలి గట్టిగా హృదయానికి ఒత్తుకుంటాయి. గుండెల్లో ఏదో బరువుగా తగిలింది. ఎన్నాళ్ళ నుంచి మోస్తోంది ఈ పగడాల బరువు అనుకుంది. పగడాలు కదిలినప్పుడల్లా హృదయంలో ఏదో తెలియని బాధ, ఏదో తీరని వ్యధ. తన ఇంటికి ఎదురుగా ఉన్న మైదానంలో గుడిసె వేసుకొని ఉన్న అవ్వ, తాత, తల్లిలేని మనవరాలు గుర్తుకొస్తారు. ఆ గుడిసె ముందే చిన్న దుకాణాన్ని పెట్టుకొని కాలం గడుపుతుంటారు. లక్షుమన్న తాత తన మనవరాలికన్నా కూడా ప్రేమగా వాసంతిని చూస్తూంటాడు. తనూ సమయం దొరికినప్పుడల్లా మనవరాలు సీతతో ఆడుకుంటుంటూంది.

ఓరోజు వాసంతి మెడలో ఉన్న పగడాల దండ కనిపించకుండా పోతుంది. ఆమె ఇంట్లోని వారందరూ తాత కొట్టు దగ్గర ఆడుకుంటూ వాసంతి పగడాల దండని అక్కడే పారేసిందనుకుంటారు.

తీవ్రమైన తిట్లతో లక్షుమన్న తాతని దండిస్తూ పోలీసులకి అప్పజెప్తామంటారు. ఇక విధిలేని తాత ఏడుస్తూ తన దాచుకొన్న కొన్ని రూపాయల్ని వాళ్ళకిచ్చేసి, 'ఇవే నా దగ్గర ఉన్నాయి, దయచేసి నన్ను విడిచిపెట్టండి' అని ఏడుస్తాడు. తాత కాళ్లని పెనవేసుకొని సీత ఏడ్చింది. సీతని చూసి వాసంతి ఏడ్చింది.

ఆ తర్వాత అమ్మ ఎప్పుడూ వాసంతిని తాత దుకాణం వైపు వెళ్ళనివ్వలేదు. ఓనాడు మేడమీది గది ఊడుస్తున్న పనిమనిషి పోల్లమ్మకి బీరువా కిందనుంచి పగడాలు ఎగిరి పడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

అమ్మ ఆమె నోరు మూయించింది. ఈ విషయం తెలిస్తే నలుగురిలోనూ చవక అవుతామని ఆమె ఆలోచన. పగడాలు దొరకగానే అమ్మ తాతని పిలిచి, అతని రూపాయలు అతనికి ఇచ్చేస్తుందనుకుంది వాసంతి. కాని అలా జరగలేదు. ఎన్నోసార్లు వాసంతి డాబా మీద నించుని ఉంటే, గుడిసె గుమ్మం దగ్గర నుంచి సీత, తాత–వాసంతి కేసి ఎంతో జాలిగా ఆప్యాయంగా, దీనంగా చూస్తుండేవాళ్ళు. వాసంతి సిగ్గుతో కుచించుకుపోయేది.

ఎన్నో రోజులు గడిచినా, ఎన్ని మార్పులు వచ్చినా, వాసంతి మాత్రం ఆ తాతని మర్చిపోలేదు. మెళ్లో ఆ పగడాలు తగిలినప్పుడల్లా తాత జ్ఞాపకం వస్తూనే ఉంటాడు. తాత రుణం తీర్చుకోవాలని ఎన్నోసార్లు తాపత్రయ పడింది కాని అమ్మకి దడిసి, ఏమీ చేయలేకపోతుంది.

ఎనిమిదేళ్ళ తర్వాత వాళ్ళ జ్ఞాపకాలు తన మనస్సులో అలాగే ఉండడంతో వాళ్ళు ఎక్కడున్నారని అమ్మని అడుగుతుంది వాసంతి.

అమ్మ ముఖం చిట్లిస్తూ, 'ఏమో ఎప్పుడో నాలుగేళ్ళ కిందటే కాటకం వచ్చి ఆ ముసలాళ్ళిద్దరూ పోయారు. వాళ్ల చుట్టం ఎవరో వచ్చి సీతని తీసుకుపోయాడు' అంటుంది నిర్లక్ష్యంగా.

గబగబా రెండుమెతుకులు తిని మళ్ళీ డాబా మీదకి వెళ్ళిపోతుంది వాసంతి. మంచం మీద కూర్చుని ముందుకి వంగి పాప ముంగుర్లని సర్దపోతుంది. మెడలో పగడాలు ముందుకు వేళ్ళాడి పాప పెదవులను తాకాయి. ఆ వెన్నెల రాత్రి ఆకాశాన ఏ మూలో ఓ చుక్క రాలిపోయింది... గుండెలమీద బరువుగా కొట్టుకున్నాయి పగడాలు.

# ఆలూరి భుజంగరావు'నిన్నటికి నేడు ఏమవుతుంది?'

**క**థానిక శీర్షికలోనే ఎంతో వైవిధ్యముంది. రేపేమిటి? అని ప్రశ్నించే బదులు నిన్నటికి, నేటికి మధ్యగల సంబంధాన్ని ప్రశ్నించారు. జీవితంలో లోతులకు వెళ్ళి ప్రశ్నించే రచయిత ఆలూరి భుజంగరావు.

1950వ సంవత్సరం కథాకాలం. కథా స్థలం – రేపల్లె.

పేదరైతులు, కూలీలు– కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో భూస్వాముల్ని, జమీందారుల్ని ఎదిరిస్తున్నారు. లక్షల యకరాల్ని పంచుకున్నారు. వీళ్ళని అదుపు చేయడానికి రేపల్లెలో మలబారు పోలీసులకు విడిది ఇచ్చారు. ప్రజలకి వాళ్ళ పేరు చెబితేనే హడలుగా ఉండేది.

ఓ కొట్లో పనిచేస్తూ రచయిత ఓ పూరింట్లో పడుకుంటుండేవాడు. ఉత్తమ పురుషలో చెప్పిన కథానిక. ఆ ఇంటి వాళ్ళ తన ఈడు పిల్లలతో కలిసిమెలిసి ఉండేవాడు రచయిత – ఆ ఇంట్లో ఒక సభ్యుడుగా. వాళ్ళింట్లోనే భోంచేసేవాడు.

ఒకరోజు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి వాతావరణమంతా భిన్నంగా ఉంది. వసారాలో ఎవరూ లేరు. మెల్లిగా తడిక నెట్టి లోపలికి చూసాడు. లోపల తల్లి,తండ్రి, కొడుకు, అల్లుడు మౌనంగా కూర్చునున్నారు. రచయితను చూసినా పలకరించలేదు. ఎప్పుడూ ఆప్యాయంగా పలకరించేవాళ్ళు అలా ఉండేసరికి రచయితకి బాధవేసింది. కనీసం లోపలకు రమ్మనైనా అన్లేదు. రచయిత బుర్ర వేడెక్కిపోయింది.

అరగంట తర్వాత కొడుకు బయటకు వచ్చి, రచయితని రోడ్డుమీదకి తీసుకువస్తాడు. "మీరు మా దగ్గరకాక మరెక్కడైనా వసతి చూసుకుంటే బాగుంటుంది" అంటాడు.

రచయిత ఆశ్చర్యానికి అవధులు లేకుండా పోతుంది. "హఠాత్తుగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? నేను తింటున్నందుకు డబ్బులు చెల్లించడం లేదనా?" అని అమాయకంగా అడుగుతాడు.

"మీరు మా ఇంటిలో ఉండడం అంత క్షేమకరం కా"దంటాడతను.

"కారణం" అడుగుతాడు రచయిత. "ఎక్కడా చెప్పనంటే చెబ్తా"నంటాడతను.

"రైల్వేస్టేషన్ దగ్గర బడ్డీ కొట్టున్న మా పెదబావ తెలుసుకదా! మలబారు పోలీసులాయనను చంపేశారు– కమ్యూనిస్టు అనే పేరుతో!"

"ఇది సాధారణ ప్రజలకు, కార్మికులకు, కర్షకులకు వచ్చిన స్వాతంత్ర్యం కాదు. దోపిడీకి ఎదురు తిరిగినవాడినే కాదు, తిరుగుతాడనుకున్నవాడినీ సర్వనాశనం చేస్తున్నారు.. పోలీసులు వచ్చి మమ్మల్నందర్నీ కాల్చి చంపినా చంపుతారు తుపాకుల్తో. ఎదురు తిరిగితే ఆత్మరక్షణకోసం చంపామంటారు. మౌనంగా మాలో మేమే కుమిలిపోతున్నాం.. ఇవాళ కాకపోయినా రేపైనా ఆ శవం మా బావదని తెలుస్తుంది. పోలీసులు మా ఇంటిమీద వచ్చి పడతారు. మా ఇంట్లో నాటు బాంబులు దొరికాయని, కమ్యూనిస్టు సాహిత్యం దొరికిందనీ ప్రకటిస్తారు. మేమందరంగానీ, మాలో కొందరుగానీ మృత్యువుకు గురవుతాం. మిగిలినవాళ్ళకు జైలుతప్పదు. ఇక్కడుంటే మాతోపాటు మీరూ చావుకో, జైలుకో సిద్ధపడాలి. మిమ్మల్ని ఆ స్థితికి తీసుకువెళ్ళడం మాకిష్టం లేదు. అందుకే మా అత్తయ్య మీకీ విషయం చెప్పమంది "అని అతననడంతో రచయిత హతాశుడవుతాడు.

"నేనూ మీతోనే ఉంటాను. అవసరం అయితే అందరం కలిసే చచ్చిపోదాం" అని రచయిత నిశ్చయంగా అనడంతో కథానిక ముగుస్తుంది.

కమ్యూనిస్టు ఉద్యమ రోజుల్ని మన కళ్ళముందుంచిన కథానిక 'నిన్నటికి నేడు ఏమవుతుంది?'

# ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి 'త్రివేణి సంగమం'

**కా**శీ వెళ్తూ ఎక్స్‌ప్రెస్‌ని ఎక్కడానికి ఇటార్సి స్టేషన్ వెయిటింగ్ రూమ్‌లో వెయిట్ చేస్తుంటాడు రచయిత (నేను అని స్వానుభవంగా రచయిత ఈ కథానికని చెప్పారు)

ఇంతలో ఓ అమ్మాయి ఓ సూట్‌కేస్ పట్టుకొని హ్యాండ్‌బ్యాగ్‌ని చేతికి లూజ్‌గా తగిలించుకొని వెయిటింగ్ రూమ్‌లోకి వస్తుంది గబగబా. సరాసరి రచయిత దగ్గరకే వచ్చి 'ఎక్స్‌క్యూజ్‌మీ, వేర్ ఆర్‌యూ గోయింగ్?' అంటుంది.

'అల్హాబాద్' అంటాడు రచయిత.

'ఐయామ్ ఆల్సో గోయింగ్ టూ అల్హాబాద్... ఊళ్ళోకి వెళ్ళి ఇప్పుడే వస్తాను. ఈ సూట్‌కేస్‌ని చూస్తూండండి కాస్త, ప్లీజ్' రిక్వెస్ట్ చేస్తూ రచయిత నుంచి జవాబు రాకముందే తన సూట్‌కేస్‌ని అతని దగ్గరగా పెట్టబోయిందల్లా చిరునవ్వుతో అతని వంక చూస్తూనే సూట్‌కేస్ తాళం తీసింది. లోపల ఏవేవో ఫిల్మ్ మ్యాగజైన్స్ కనిపించాయి. బట్టల అడుగునుంచి ఓ గాజు తీసి చేతికి వేసుకుంది. పెట్టె మూత సొరుగులోంచి రెండు ఫోటోలు కింద పడ్డాయి. ఆమె చాటుగా వాటిని పెట్టెలో కుక్కేసింది. రెండు చేతిగడియారాలు కనిపించాయి. గబాల్న తాళం వేసి ఆ పెట్టెని రచయిత దగ్గరకు తోసేసి వెళ్ళిపోయింది.

ఇక అక్కడనుంచి ఎటూ కదలలేని రచయిత తన సామానుని, ఆమె సూట్‌కేస్‌ని కూడా ఓ కంట కనిపెడుతూనే ఉంటాడు.

ఇంతలో ఓ కానిస్టేబుల్, ఓ సబ్ ఇన్స్‌పెక్టర్ వెయిటింగ్ రూమ్‌లోకి ప్రవేశించారు. ఒక్కరిద్దరిని ప్రశ్నించినవాళ్ళ కళ్ళు రచయిత దగ్గర ఆమె విడిచివెళ్ళిన సూట్‌కేస్ మీద పడ్డాయి.

'ఆ సూట్‌కేస్ తాళం తియ్యండి' అన్నాడు రచయితతో జబర్దస్తీగా సబ్ ఇన్‌స్పెక్టర్. 'అది ఎవరిదో నాకు తెలీదు' అంటాడు రచయిత.

ఆమె పెట్టె తెరిచి సిల్క్ బ్లౌజులు, హెయిర్ పిన్నులు ఒక్కొక్కటే కింద పడేయసాగారు. ఫోటోలు చూసారు. ఓ చిన్న పర్స్ కనిపించింది. దాంట్లో ఓ

వందరూపాయిల నోటు మడతలు పెట్టి కనిపించింది. ఇంకా లోపల మడతలో ఏవేవి కనిపించాయో కళ్ళు పెద్దవి చేసి రచయిత వైపు గాంఢ్రింపుగా చూశాడు. చుట్టు చేరిన అందరిని అవతలికి వెళ్ళమని కసురుకొని, పోలీస్‌కు సౌంజ్ఞను చేశాడు. అతను బయటకు తీసిన వాటన్నింటినీ పెట్టెలోపెట్టి, పెట్టెని తీసుకున్నాడు. 'ప్లీజ్ కమ్ ఎలాంగ్ విత్‌మి' సబ్ ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

'ఇది నా పెట్టె కాదు. ఎవరో అమ్మాయిది' అని చెప్పినా, అతను వినే స్థితిలో లేడు. 'మీరు నాతో పోలీస్ స్టేషన్‌కి రావాలి' అన్నాడు.

వీళ్ళతో స్టేషన్‌కి వెళ్తే తన బండి ఎక్కడ తప్పిపోతుందో అని భయం వేసింది రచయితకి. అయినా 'తను నమ్మిన సూత్రాల్ని విడిచిపెట్టకూడదు. ఒక రూపాయి కూడా లంచం ఇవ్వకూడదు' అనుకుంటాడు రచయిత. కానీ ఆమె సూట్‌కేస్‌లో కనిపించిన రెండు ఫారెన్ రిస్ట్ వాచెస్‌ని స్మగుల్ చేస్తున్నాడని రచయిత మీద నేరారోపణ చేస్తారు పోలీసులు.

రచయిత తన ప్రిన్సిపిల్స్‌కి తిలోదకాలు ఇవ్వక తప్పలేదు. ఇన్‌స్పెక్టర్, రచయిత ఓ అంగీకారానికి వచ్చారు. ఆ సూట్‌కేస్, రిస్ట్ వాచీలను ఇన్‌స్పెక్టర్‌ను తీసుకువెళ్ళనిస్తే అతను రచయిత, అలహాబాద్ బండి ఎక్కేందుకు అనుమతిస్తాడు.

ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్‌ల వంక చూస్తూ బిక్కుబిక్కుమంటూనే బండెక్కుతాడు రచయిత. బండి కదులుతుంది. దూరం అవుతున్న కొద్దీ వాళ్ళ వాలకం, పకపకలు చూస్తున్న రచయితకు అనుమానం వస్తుంది. వాళ్ళు అసలు పోలీస్ వాళ్ళేనా అని!

ఈ విషయాన్ని వాళ్లు పసిగట్టినట్లున్నారు. గబగబా మరింత దూరం వెళ్ళిపోతారు. రైలు స్పీడు అందుకొంది. నెమ్మదిగా సీట్లో కూర్చోబోయిన రచయితకి 'వేరీజ్ మై సూట్‌కేస్!' చెమటలు తుడుచుకుంటూ, రొప్పుతూ, ఆయాసపడుతూ, ఆదుర్దాగా అక్కడికి చేరి అతడిని నిలదీసింది ఆ అమ్మాయి.

జనసమర్థం ఎక్కువగా ఉన్న యాత్రాప్రదేశాలకు వెళ్ళినప్పుడు ఊహించని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడుతాయో 'త్రివేణి సంగమం'లో బాధితుడు, యువతి, పోలీసుల సంగమంతో ఎంతో చక్కగా చెప్పారు ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి.

# ఇంద్రగంటి మనుమచ్చాస్త్రి 'తలవంచని పువ్వులు'

శాస్త్రిగారి కథానిర్మాణ ఫణితి – అధ్యాయాలు అధ్యాయాలుగా, సినిమా స్క్రీన్‌ప్లేలా వుంటుంది. 'తలవంచని పువ్వులు' అని ఒక అద్భుతమైన చిన్న చారిత్రాత్మక కథ వుంది. మాలవ మహారాజుగారు ఏటా జరుపుతున్నట్టు శారదా ఉత్సవాల్ని ఈ ఏడూ వైభవంగా జరుపుతున్నారు. నగరమంతా పండుగే. ఒక దాక్షిణాత్య శిల్పి – పేరు చంద్రమౌళి – వచ్చాడు. 'హృదయాలను సైతం కరగించి అమృతమూర్తులుగా మలచగల అతనికి, సాటి మానవుల్ని పలకరించి ప్రసన్నులను చేసుకోవటం ఎట్లాగో తెలియలేదు? అతనొక అపురూపమైన బహుమతిని రాజుగారికి సమర్పించాలి. ఇదీ మొదటి అధ్యాయం. సాయంకాలం చంద్రకాంత సౌధంలో మహాసభ. అక్కడికి వచ్చి అధికారులందరినీ ప్రాధేయపడ్డాడు – మహారాజ దర్శనం చేయించమని. ఛీ... ఛా... లే ఎదురైనాయి. ఇది రెండవ అధ్యాయం. చివరికి అక్కడ అర్ధచంద్రప్రయోగమూ జరిగింది! మూడవ అధ్యాయంలో అతను తెచ్చిన ఆ అపురూపమైన బహుమతి, మహత్తర శిల్పి రూపాన్ని తయారు చేయటానికి అతను తన ప్రతి నెత్తుటి బొట్టునీ ఎలా వెచ్చించాడో ఆ వివరణ వచ్చింది. 'ఏనుగు దంతం' ఒకటి పూలదండగా మారింది. ముక్కలు చేయలేదు. అతకు లేదు. రేకు రేకునా సహజమైన ముడుతలు ముడుత ముడుతలో అచ్చమైన నొక్కుల సొగసులు. కొన్ని పూర్తిగా విడిన మల్లెలు. కొన్ని అరవిచ్చినవి. చివర ఒక బొడ్డుమల్లె కొలికిపూస!' ఈ బహుమతిని రాజుగారి కివ్వాలి. వీలు కాలేదు. అసంభవం అన్నారు భటులు. కోపం వచ్చింది. 'అమోఘమైన తన శిల్పాన్ని ఊచి పుచ్చుకుని విసిరి వేశాడు... ఆ పుష్పమాల ధ్యానముద్రలో ఉన్న బుద్ధదేవుని పాదాల ముందు పడింది!' ఇదే నాల్గవ అధ్యాయం. కథానిక ముగింపు!!

ఈ పద్ధతి కథానిర్మాణం ద్వారా – వస్తువుకి చక్కటి సరళమైన వాహికని కూర్చగలిగారు శాస్త్రిగారు. కథానిక ఎలా ముగుస్తుంది అనే ఉత్కంఠ ఆరంభం నుంచీ చదువరిలో జనిస్తుంది. ఒక వివరణ తర్వాత మరో వివరణా, ఒక సన్నివేశం తర్వాత మరో సన్నివేశం – పుటల్ని తిప్పుతూ కదలటం వలన కథానికావస్తువు నడకనీ, పరుగునీ, వేగాన్నీ సంతరించుకుని క్రమక్రమంగా గమ్యానికి చేరుతోంది. పూసల్లో దారంలా రసపుష్టి ఏర్పాటు జరిగింది. ఇదీ ఈ తరహా శిల్పం ద్వారా శాస్త్రిగారు సాధించిన 'నమూనా'.

వర్ణనా శిల్పంలోనూ శాస్త్రిగారిది ఒక ప్రత్యేకమైన విధానం. వ్యక్తుల్ని వర్ణించేటప్పుడు ఆహార్య వివరాలకి ప్రాధాన్యత నిస్తారు. 'జానకి వచ్చింది. కనకాంబరం రంగు కోయంబత్తూరు చీర కట్టుకుంది. కొత్తరకం అంచుమీద నాజూకైన జరీ మిలమిల మెరుస్తోంది. జడలోని మరువం గుప్పున పరిమళించింది. ప్రొద్దుట పూజ చేసిన గులాబీలు రెండు, జడకు మధ్యగా కనబడుతున్నాయి.... ఇలా వుంటుంది ఉత్సాహంగా వచ్చిన ఒక స్త్రీమూర్తి. 'ఒకాయన వచ్చాడు. వయసు 'చత్వారింశత్' దాటి వుంటుందని నిశ్చయం. కళ్ళకు ఖరీదైన కొత్తరకం ఫ్రేము కళ్ళజోడు, క్లోజ్డు కాలర్‌కోటు, దానిమీద సన్నని బంగారు వాచీ గొలుసు మెరుస్తూ వేలాడుతోంది. గుమ్మటం లాంటి శరీరం. కుంభం బొట్టు, తిలతండుల న్యాయం తల. చూపుల్లో సౌజన్యం కంటె అధికారం ఏలుబడి చేస్తోంది. మీసాలు లేవు...' ఇలా వుంటాడు... ఆ పురుషపుంగవుడు! ఇక, నేపథ్య చిత్రణ లేదా వాతావరణ వర్ణణ – చదువరికి దృశ్యస్ఫురణం చేస్తూ సాగుతుంది. ఒక వర్షారాత్రి ఇలా ఉంది– '... మాయవాన. తెరిపిలేకుండా దీపాలవేళ దాకా కొట్టి, అక్కడినుంచి ముసలివాడి నసుగుడిలా ముసురులోకి మారింది. చెడతాగిన భాగ్యవంతుల్లా చెట్లు జోగి జోగి ఊగుతున్నాయి. ఆకాశానికి ఆకలి గావును, ఉరుముల్తో ఏడుస్తోంది. ఊరుకోమని గాబోలు – బంగారపు కొరడాల్తో ఎవరో కొడుతున్నారు. కొట్టిన కొద్దీ ఏడుపు ఎక్కువవుతోంది...'

రచయిత చెప్పే కథనాన్ని పరిశీలిస్తే, శాస్త్రిగారి వాచిక ఫణితి అర్థమవుతుంది. చదువరిని తనతో పరిగెత్తించే వాక్య విన్యాసం. అంతకుమించిన విషయ ప్రసరణం అబ్బురపరుస్తాయి.

'ఆనాడు దేశనాయకులిద్దరిని అరస్టు చేశారని పత్రికల్లో పడ్డది. ఊరంతా హర్తాల్ చేశారు. విద్యార్థులానాటికి కాలేజీకి వెళ్ళకూడదని తీర్మానించి అసమ్మతి సూచకంగా ఊరేగింపు బయలుదేర దీశారు. జయజయ నినాదాలతో నడుస్తూ పోలీసుస్టేషను దగ్గరకి వచ్చింది ఊరేగింపు. మొనలో ఆనందం, గాంధీ టోపీతో జండాతో నిల్చుని వున్నాడు. పోలీసు అధికారివచ్చి 'డిస్పర్స్' అన్నాడు. విద్యార్థులు కదలలేదు. లాఠీలు పనిచేశాయి... ఇది ఒక్క ఉదాహరణ.

ఈ విధమైన 'నెరేషన్' కథా కథనానికి బిగువునీ, ఉత్కంఠనీ కలిగించి కథకొక 'స్పెసిఫిక్ గ్రావిటీ'ని సంతరించి పెడుతుంది.

కథానికలు చాలామంది రాస్తారు. కాని, ఒక కవి పండితుని విలక్షణ ప్రతిభా ప్రాభవం, సంప్రదాయ విజ్ఞతతో నిండిన ప్రగతిశీల భావ వైభవం– వారి కథానికల్లో మాత్రమే చూడగలం.

# ఐ.ఎల్.ఎన్. 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్'

'ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్' 1951లో రాసిన కథానిక. అవినీతి భాగోతం. అభ్యర్థులే ఒకరిపై ఒకరు ఎత్తులు వేసే నీచ కార్యం గురించి ఆనాడే వర్ణించారీ కథలో. 'తెల్లకాగితం' చిత్రమైన కథానిక. పక్కింటి సరోజ పదేపదే తన ఇంటికి వచ్చి టెలిఫోన్ వాడుకుంటూ వుంటే ఊహల్లో తేలిపోతూ వుంటాడు శ్రీనివాస్. తరుణ యవ్వనంలో ప్రేమభావనలకేం కరువు? చివరికి ఆ పిల్ల హఠాత్తుగా అక్కడికి రావటం మానేసింది. ఎదరు చూపులతో వేగిపోయాడు శ్రీనివాస్. ఓ శుభదినాన సరోజ ఫోన్ చేస్తుంది. "ఇవ్వాళే మా ఇంటికి ఫోన్ వచ్చిందండి. ఇన్నాళ్ల బట్టి మీకు శ్రమ యిచ్చినందుకు క్షమించాలి. వుంటాను" అని. అతను అరుస్తున్నా 'ఫోన్' కట్ చేసింది. కథలో మలుపు ఆ అమ్మయెవరో ఇతనికి తెలీదు! 'తెల్లవారింది' అని ఒక మంచి కథవుంది. పక్కవారిని చూసి ఈర్ష్య పడి, వారి నుంచీ ఏదో ఆశించి భంగపడి, వారిని నిందిస్తూ సంఘాన్నీ వ్యవస్థనీ దుయ్యబట్టే మనిషికథ ఇది. చివరికి అతనికి జ్ఞానోదయం కలిగింది. "లోకం, సంఘం అంతా నేనే. నేను ఎవర్ని అంటాను? ఏమని అంటాను? ఎవరికి భయపడి పారిపోతాను? అంతా నేనే! నాతో నేను సమాధానపడలేక సంఘాన్నీ, లోకాన్నీ నిందించాను. నేను ఆదర్శంగా వుంటే సంఘం, లోకం ఆదర్శంగా వుంటుంది" అని కొత్త మనిషి అవుతాడు. బ్రతుకు అర్థం తెలుసుకుంటాడు. వ్యక్తికీ, సమాజానికీ మధ్య గల సంఘర్షణని కథాత్మకంగా చక్కగా చెప్పారు.

మిథ్యా గౌరవంతో, ఒక నిరుద్యోగి తనకు వచ్చిన ఉద్యోగాలన్నీ తన అర్హతకి తగినవి కావని వద్దనుకుంటూ సోమరి అవుతాడు. చివరికి 'వర్క్ ఈజ్ వర్ షిప్' అని ఉద్యోగావశ్యకతని గుర్తెరిగి మారతాడు. కథానికపేరు 'కనిపించని దేవుడు'. (16.5.1990 ఆంధ్రప్రభ వారపత్రికలోనే వచ్చిందీ కథానిక). యువదీపావళి ప్రత్యేక సంచికలో వచ్చింది ఒక మంచి కథానిక 'అచ్చుతప్పులు'. మనవరాలికి బతుకు పుస్తకంలోకి అచ్చుతప్పు దొరలితే కలిగే అనర్థం, అన్యాయం చాలా తెలివిగా, అన్యాపదేశ్యంగా 'అక్షరాలన్నీ సజీవాలే. ప్రాణంతో కళకళలాడుతూ వుంటాయి. ఈ

అక్షరాలకు కొన్ని కట్టుబాట్లు వుంటాయి. హద్దు మీరకూడదు.. ఏ అక్షరం ఎక్కడ వుండాలో, దేని ప్రక్కన నిలబడాలో అది చాలా ముఖ్యం. దాంట్లో యేం తేడా వచ్చినా అభాసు అయిపోతుంది. 'పరువు' కాస్తా 'బరువు' అయిపోతుంది అని ఉదాహరణ చూపుతాడు. తాత్త్వికస్ఫురణనీ మనిషి నడత గురించిన లోచూపునీ కలిగిస్తాడు మనవరాలికి. ఆమె గ్రహిస్తుంది. తండ్రితో చెప్తుంది "నాన్నా... ఆయనకు ఉత్తరం రాయి రమ్మనమని. నేను వెళతాను" అని! కథ చక్కగా అర్థమవుతోంది. ఈ వాక్యమే కథానికకు ముగింపు కూడా!

# ఇల్లిందల సరస్వతీదేవి 'శలభాలు'

**వం**దేళ్ళ కథానికని పరిశీలించినప్పుడు, వందేళ్ళ సామాజిక చరిత్ర మనకి అర్థమవుతుంది. ఆయా రోజుల్లో వచ్చిన కథానికలు, ఆనాటి సమాజానికి దర్పణాలు. 1953 ఆంధ్రపత్రికలో వచ్చిన ఇల్లిందల సరస్వతి దేవి 'శలభాలు' ఆనాటి సమాజంలోని ఓ కోణాన్ని నిరసిస్తోంది.

ఆరోజుల్లో ఆడపిల్లల పెళ్లిళ్ళు అవ్వడం చాలా కష్టంగా ఉండేది. ఇక ఇద్దరు–ముగ్గురు కూతుళ్ళుంటే, ఆ తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడేవాళ్ళు. ఓ యువకుడు కనిపిస్తే చాలు, అతను తమ అల్లుడు అయితే బాగుండని విలవిలలాడే వాళ్ళు. తల్లులు అయితే మరీనూ...!

ఇది కొసమెరుపు కథానిక. ఆ మెరుపు మనం ఊహించనిదైనా, ఆలోచించాల్సింది. కథానిక పూర్తి కాగానే మనం తప్పక ఆ దిశగా ఆలోచిస్తాం. మంచి ఆలోచనలని పెంపొందించేదే మంచి కథానిక. అందుకే కథానికకి నిర్వచనం అయిన ఈ మూడు పేజీల చిన్న కథని మనం తప్పక చదవాలి.

రచయిత్రి గురజాడవారి ధోరణిని సరిగ్గా పట్టుకున్నారనిపిస్తుంది. చక్కటి మాట్లాడుకునే భాషలో సాగిపోతుంది కథానిక.

పొరిగింట్లోకి దాదాపు 27 సంవత్సరాల వయస్సున్న, తెల్లటి, పొడవాటి అబ్బాయి, అద్దెకు దిగాడని తెలియగానే మీనాక్షమ్మ ఆలోచనలు ఎటెటో వెళ్ళిపోయి. అతడిని గురించిన వివరాల్ని సేకరించడం ప్రారంభిస్తుంది. ఆ సేకరణకి భర్త తోడ్పడక తప్పని పరిస్థితి! తన భార్య ఏమి కోరినా, తన మనస్సులోని అభిప్రాయాన్ని బయటపెట్టకుండా, సహకరించడంతోనే చాలా సురక్షితంగా ఇరవై అయిదేళ్ళ నుంచి ఆమెతో కాపురం చేయగలుగుతున్నాడు ఆమె భర్త –అంటారు రచయిత్రి. రెండు చేతులు కొట్టుకోకపోవడంవల్లే శబ్దాలుకాక ఆ సంసారం సాఫీగా సాగుతోందన్నది రచయిత్రి సరస్వతీదేవిగారి అభిప్రాయం. భర్తతో బయటకి వెళ్తున్న అతను ఓ ఆబ్కారి అధికారి అని, దత్తపుత్రుడని, ధనవంతుడని, తెలుసుకుంటుంది మీనాక్షమ్మ. నాలుగు రోజుల తర్వాత నౌకరునీ వాళ్ళ దొడ్లో పూలకోసం పంపిస్తుంది. కాని అప్పటికే

దత్తుగారి అమ్మాయిలు వచ్చి కోసుకుపోయారు అని చెప్తాడు అబ్కారీ అధికారి రఘువీర్. దత్తు గారింట్లోనూ ఇతను గురించి తెలిసిపోయిందని కంగారు పడుతుంది మీనాక్షమ్మ.

మర్నాడు సాయంత్రం అల్పాహార విందుకి భర్తతో, అతనికి ఆహ్వానాన్ని పంపుతుంది. ముగ్గురు కూతుళ్ళని ముస్తాబు చేసి సిద్ధం చేస్తుంది. అతను రాగానే వరుసగా ముగ్గురు కూతుళ్ళని పరిచయం చేస్తుంది. భర్త శర్మ ఆ సమయానికి ఇంటికి రాలేకపోతాడు. అయినా ఏమాత్రం జంకుబొంకు లేకుండా, మీనాక్షమ్మ తన ముగ్గురు కూతుళ్ళతోనూ అతడికి అల్పాహార విందు చేయబోతుంది! ఆ రాత్రి దత్తు గారింట్లో భోజనం ఇంకా అరగలేదు. అల్పాహారాన్ని కొద్దిగానే పెట్టండి' అంటాడు అతను.

ఈ విషయంలోను తమకన్నా దత్తుగారి కుటుంబం ముందు ఉండడం బాధ వేస్తుంది మీనాక్షమ్మకి.

క్లబ్‌లో కూడా రఘువీర్ గురించి తమకే ఎక్కువ వివరాలు తెలిసినట్టు, దత్తు గారి పిల్లలు చెప్పడంతో ఇంకా ఎక్కువ బాధ పడుతుంది. తమకి తెలీకుండానే మీనాక్షమ్మ కుటుంబం, దత్తు కుటుంబం బద్ధ విరోధులవుతారు. ఇలా కథానికని సాగించుకుంటూ వెళ్ళిన రచయిత్రి హఠాత్తుగా కొసమెరుపతో మనల్ని ఆశ్చర్యంలో ముంచడమే కాదు, ఆలోచింపచేసేట్లు చేయగలుగుతుంది.

అది ఎలాగంటే–తెరపిగా ఉన్న ఆనాటి సాయంత్రం ఆబ్కారి అధికారి రఘువీర్ గారి నౌకరు అందరి ఇళ్ళకు ఒక ఒక బొమ్మ, చారెడు సున్నిపిండి చెక్కిలాలు పంచుతుంటాడు, కారణం ఏంటని అడిగితే 'అమ్మగారు అబ్బాయిగార్ని ఎత్తుకొచ్చారు కదండి' అంటాడు.

మంచి అల్లుడ్ని తెచ్చుకోవడం సరైన విషయమే అయినా, ఓ యువకుడు కనిపించగానే అతడిని అల్లుడిగా చేసుకోవాలనే ఆరాటం ఎంత తప్పో చక్కగా చెప్పారు రచయిత్రి ఇల్లిందల సరస్వతీదేవిగారు. దీపం చుట్టూ పరుగులు లాగా, ఒక యువకుడు కనిపిస్తే చాలు, ఆ రోజుల్లో యువతుల తల్లిదండ్రులు ఎలా శలభాలులాగా చుట్టూ తిరిగేవారో చెప్తుంది ఈ కథానిక. అలా చెప్తూనే అది తప్పని నిరసించడం ఈ కథానిక లోని మెరుపు.

# ఎస్.మునిసుందరం 'భ్రమ'

పెళ్ళై సంవత్సరాలు గడుస్తున్నా తల్లిదండ్రుల్ని చూడడానికి స్వదేశానికి తిరిగిరాని కొడుకు తిరిగి వచ్చి షాక్ ఇచ్చిన కథ, ఎస్.మునిసుందరం 'భ్రమ'.

వయస్సు వచ్చినా శివయ్య ఆరోగ్యంగానే ఉన్నా అతని భార్య పార్వతమ్మ అనారోగ్యంతో బాధపడసాగింది. ఆ అనారోగ్యానికి కారణం తెలుసు భర్తకి.

కొరివి పెడతాడనుకున్న కొడుకు సముద్రాలు దాటి వెళ్ళాడు సంపాదించడం కోసం. మూడేళ్ళ తరువాత వచ్చి పెళ్ళి చేసుకొని భార్యని తీసుకొని వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇంతవరకు కనిపించలేదు. ఇద్దరు పిల్లలు పుట్టారని ఫోన్లో చెబితే తెలుసుకున్నారు అంతే. ఈ గుక్కెడు ప్రాణం పోయేలోపు మనవడ్ని, మనవరాల్ని చూడగలనా అనేది ఆమె దిగులు.

భార్యని చూస్తుంటే అతని గుండె దడదడలాడుతుంది. శివయ్యకి తన గుండె 'బిడ్డా! బిడ్డా!' అన్నట్లుంది.

కాలం ఎవరికోసం ఆగదు కదా. పరుగెత్తుతోనే ఉంది. తల్లిదండ్రుల్లో దిగులు పెరుగుతూనే ఉంది. ఊరు మారిపోతోంది. శివయ్య పార్వతిల కుమారుడు జానకిరాముడు ఎంతో ఎత్తుకు ఎదిగిపోయాడనిపించింది వాళ్ళకు. ఊరూ వాడా అంతా ఆ ముసలి తల్లిదండ్రుల కాళ్ళకిందే ఉన్నట్లు అనిపించింది. కొడుకు కన్నా వీళ్ళిద్దరే విమానంలో ఎగిరిపోయినట్టే ఆనందపడ్డారు.

ఇది గతం! ఇక వర్తమానంలోకి వస్తే, తొమ్మిదేళ్ళ కిందట పెళ్ళి చేసుకొని విదేశాలకి వెళ్ళిన కొడుకు తమని చూడటానికి ఇంతవరకు స్వదేశానికి రాలేదన్నదే వాళ్ళ బాధ. లక్షలు పంపుతున్నాడు. ఆ డబ్బుతో కొడుకు కోరినట్టే పెద్ద ఆధునిక భవనాన్ని ఆ పల్లెటూరిలో కట్టించారు. 'నోరు-వాయి లేని ఈ సౌకర్యాల మధ్య బిక్కు బిక్కు మంటు బతుకుతున్నారు - కొడుకు వస్తాడని., మనవడ్ని, మనవరాల్ని గట్టిగా గుండెలకు హత్తుకోవాలని.

హఠాత్తుగా కొడుకు భార్యాపిల్లలతో వస్తున్నాననే సరికి ఆ ముసలి గుండెలు ఆనందంతో తబ్బిబ్బవుతాయి.

మర్నాడు అందరు వస్తారు. మనవళ్ళు, మనవరాళ్ళు, బామ్మా తాతయ్యల్ని ముట్టుకుంటే మాసిపోతామని దూరం దూరంగా ఉంటారు. రెండు సంస్కృతుల మధ్య, రెండు దేశాల మధ్య, రెండు వయస్సుల మధ్య పెనుగులాట! ఆ ఆటలో ఆశలపాశాలు పుటుక్కుమన్న మహా శబ్దం.

కథానిక ముగిసేసరికి అంతా భ్రమేనా అని కళ్ళవెంట రెండు చుక్కలు రాల్తాయి. తరాల మధ్య అంతరాన్ని ఎంతో గొప్పగా చెప్పారు రచయిత. చిత్తూరు మాండలికం రచనలో తొంగిచూస్తూ ప్రత్యేక అందాన్ని ఇస్తుంది.

# కప్పగంతుల సత్యనారాయణ 'సెలవు'

**1945**లో రాసిన కథానిక ఇది. ఆరోజుల్లో కూడా, అంటే స్వాతంత్ర్యానికి పూర్వం కూడా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వాళ్ళ జీవితాలు ఇలాగే ఒత్తిడికి లోనవుతుండేవన్నమాట. ఆ రోజుల్లో పోలీస్ దయనీయ జీవితాలకి అద్దం పట్టిన కథానిక 'సెలవు'. గుండెలను పిండే విధంగా కరుణ రస ప్రధానంగా సాగింది ఈ కథానిక.

భార్యా పిల్లలకి బావుండలేదని సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పెట్టుకున్న సెలవు, కూతురు చనిపోయి భార్య బెడ్‌కి అంకితమైన తర్వాత కానీ గ్రాంట్ కాదు. చివర్లో పోలీస్ స్టేషన్ రైటర్ 'పెద్ద దొరగారు మీ సెలవుని గ్రాంట్ చేసి నాలుగు రోజులైంది. కాగితం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గారి నుంచి రావడం ఆలస్యమైంది' అంటూ సెలవు ఆర్డర్‌ని సబిన్‌స్పెక్టర్ చేతిలో పెట్టడంతో కథానిక ముగుస్తుంది. ఈ ముగింపు ఎవరికైనా కన్నీళ్ళు తెప్పించకమానదు.

సెలవు పెట్టినప్పట్నుంచి, సెలవు గ్రాంట్ అయ్యే లోపు నడిచే ఈ కథానిక మానవతా విలువల్ని ప్రశ్నిస్తుంది. శ్రీనివాసరావు బ్రాహ్మణ కులానికి చెందినవాడు. ఆ ఊర్లో ఉన్న ఏకైక బ్రాహ్మణుడు కరణంతో కలహం రావడంతో అతడి సహాయం సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకి లభించదు. భార్యా పిల్లలకి బాగుండకపోవడంతో ఇంట్లో వంట చేసే వాళ్ళు లేక ఇంట్లో వాళ్ళు అనారోగ్యంతో బాధపడుతుంటే, శ్రీనివాసరావు ఆకలితో బాధపడసాగాడు. అతడికోసం వండిపెట్టే బ్రాహ్మణులు ఎవరైనా ఉంటే తీసుకురమ్మని ఒక కానిస్టేబుల్‌ని దగ్గర్లో ఉన్న ఊరుకి పంపిస్తాడు. ఆ ఊర్లో డాక్టర్ లేకపోవడంతో, ఇంకో కానిస్టేబుల్‌ని ఇంకో గ్రామానికి వైద్యుడికోసం పంపిస్తాడు.

వైద్యుడికోసం పంపించిన కానిస్టేబుల్ మర్నాడు వచ్చి 'సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గారి భార్యకి కాన్పు రోజులట, అంచేత కాన్పు అయ్యే దాకా డాక్టర్‌గార్ని ఏఊరు పోవడానికి వీళ్లేదని ఆపేసారంట. కాన్పు అయిపోగానే డాక్టర్ గారు ఇక్కడికి వస్తానన్నారు. ప్రస్తుతం అమ్మగారికి ఈ మందు వాడమన్నారండి' అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్‌కి మందు సీసాని ఇస్తాడు కానిస్టేబుల్.

'ఎప్పుడో కాన్పు వస్తుందని, ఇవతల చంటిపిల్ల ప్రాణంమీదకొచ్చినా డాక్టర్‌ని రానివ్వకుండా చేస్తాడా సర్కిల్ ఇన్‌స్పెక్టర్' అనబోయిన సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల ముందు అలా మాట్లాడితే ఏమవుతుందో తెలిసి తమాయించుకున్నాడు.

నిస్సహాయ స్థితిలో ఉన్న ఇనిస్పెక్టర్‌ని చూసి జాలిపడ్డ కానిస్టేబుల్, తోడుకి తన భార్యని పంపిస్తానంటాడు. బిడ్డకి సీరియస్ కాదంతో వద్దనలేకపోతాడు సబిన్‌స్పెక్టర్. సరిగ్గా ఆ సమయంలో 'స్టువర్ట్‌పురం సెటిల్‌మెంట్ నుంచి తప్పించుకున్న ఎరుకల వాళ్ళు కొందరు, ఆ స్టేషన్ ఇలాకాలో ఉన్న అడవిలో ఉన్నారని రూఢీ అయిన కబురు తెలిసి నందున వెంటనే సబ్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్‌లో ఉన్న యావత్తు సిబ్బందితో కలిసి ఆ అడవికెళ్ళి, ఆ ఎరుకల వాళ్ళని పట్టుకోవల్సిందని, నర్సారావుపేట నుంచి కొంత సిబ్బందితో తాను వచ్చి, ఆ అడవికి అవతల పక్కన కాపుదల వేస్తున్నా'నని డిప్యూటీ సూపరింటెండెంట్ ఎక్స్‌ప్రెస్ ఉత్తరువు అందుతుంది. అనారోగ్యంతో బాధపడుతున్న కూతుర్ని, భార్యని విడిచిపెట్టి, నరాల్ని కృంగదీస్తున్న తన కడుపులోని ఆకలితో బయలుదేరక తప్పలేదు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకి.

ఎరుకుల వాళ్ళమీద ఫైర్ ఓపెన్ చేస్తే కాని వాళ్ళని పట్టుకోలేకపోయాడు. ఇద్దరు ఎరుకల వాళ్ళు చచ్చిపోయారు. ఇద్దరి కాళ్ళలోంచి, ఒకరికి భుజంలోంచి తుపాకి గుళ్ళు దూసుకుపోయాయి.

"వెల్ సబిన్‌స్పెక్టర్! వెరీగుడ్! నీకు కింగ్స్ పోలీస్ మెడల్ రికమండ్ చేస్తాను" అంటాడు డిప్యూటీ సూపరింటెండెంట్. బ్రతికిన వాళ్ళని బందీ చేసి, ఇన్‌స్పెక్టర్ ఇంటికి బయలుదేరే సరికి చీకటి పడిపోయింది. ఆ చీకట్లోనే ఒళ్ళు తెలియని వేగంతో గుర్రాన్ని పరుగెత్తించి, ఇంటికి చేరిన ఇన్‌స్పెక్టర్ కుమార్తె చనిపోయిందని తెలిసి కుప్పకూలబడిపోతాడు.

సర్కిలిన్‌స్పెక్టర్ భార్య కాన్పు వల్ల వైద్యుడు సకాలంలో ఇంటికి రాలేకపోతాడు. అలాగే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం వల్ల సెలవు ఆర్డర్‌ని ఆలస్యంగా అందుకుంటాడు సబిన్‌స్పెక్టర్.

ఈ ఆలస్యాలవల్ల సబ్ ఇన్‌స్పెక్టర్ కుటుంబం నానా బాధలు పడటమే కాకుండా, కుమార్తె చనిపోతుంది.

పోలీసుల జులూంకి సంబంధించిన కథానికల్ని ఎన్నింటినో చదివాం. కానీ పోలీసులు పడే బాధలకి పరాకాష్ట ఈ కథానిక. స్వాతంత్ర్యానికి ముందే ఇంత గొప్ప కథానికని రాసిన రచయిత ఎంతగానో అభినందనీయులు.

# కప్పగంతుల మల్లికార్జునరావు 'శ్రీరామరక్ష'

**సు**మిత్ర చదువుకున్నా ఉద్యోగం చేయడం ఇష్టంలేదు. కారణం ఇల్లు, పిల్లలకి సరైన న్యాయం చేకూర్చలేనేమోనన్న భయం. భర్త, ఆమె అభిప్రాయానికి సహకరిస్తాడు.

మూడేళ్ళు ఆనందంగా గడిచిపోతాయి. ముద్దుల బిడ్డడు జన్మిస్తాడు. ముగ్గురూ ఆనందంగా మరో రెండేళ్ళు గడిపేస్తారు.

భర్త మనోహరరావు యాక్సిడెంట్‌కి గురై, తలకి దెబ్బ తగిలి, మతిస్థిమితం కోల్పోతాడు. మానసిక చికిత్సాలయంలో చేర్పిస్తారు.

ఇక తప్పనిపరిస్థితుల్లో, భర్త ఆఫీసువాళ్ళు సింపథిటిక్ గ్రౌండ్‌లో సుమిత్రకి ఉద్యోగాన్నిస్తారు.

ఆరోజు సుమిత్రకి అనుకోకుండా ఆఫీస్‌లో ఆలశ్యమవుతుంది. తమ ఆఫీస్ నుంచి ఉంటున్న కాలనీ డైరెక్ట్ బస్ తప్పిపోతుంది.

ఆర్థిక కారణాలవల్ల నగరానికి దూరంగా వున్న కాలనీలో అద్దె తక్కువని ఇల్లు తీసుకుని ఉంటోంది సుమిత్ర. బస్సు దిగిన తర్వాత కాలనీలోకి వెళ్ళడానికి కొంతదూరం నడవాల్సి ఉంటుంది.

ఆరోజు బస్సు దిగిన సుమిత్ర కాలనీలోకి నడవడం ప్రారంభిస్తుంది. హఠాత్తుగా వర్షం ప్రారంభమవుతుంది. అది బాగా పెద్దదవడంతో దారిలో వున్న పాడుబడ్డ గుడిలో తలదాచుకోవలసి ఉంది.

ఆ సమయంలో కొందరు గూండాలు ఆ పాడుబడ్డ గుడిలో తాగుతూ పేకాడుకుంటూ ఉంటారు. వాళ్ళని చూసి వణికిపోతుంది సుమిత్ర. చీకటి... వర్షం... దొంగలు... వాళ్ళు తన మానాన్ని దోచుకుంటారేమోనని భయపడుతుంటుంది. వానలో భయట చూరుకిందెందుకమ్మా... లోపలికి రమ్మని వాళ్ళు పిలిచేసరికి ఇంకా భయపడిపోతుంది.

ఇంతలో ఓ మధ్య వయస్కుడు స్కూటర్ మీద అక్కడికి వస్తాడు. అతడిని చూసిన తర్వాత ఆమెకి కొంత ధైర్యమొస్తుంది. అతడికి భర్త తెలుసనే సరికి ఇంకా ధైర్యం వస్తుంది.

ఇంతలో వర్షం తగ్గుతుంది.

దొంగలు వెళ్ళిపోతూ 'జాగ్రత్తమ్మా' అని చెప్పి మరీ వెళ్తారు.

పెద్దమనిషనుకున్న ఆ మధ్య వయస్కుడు, అదే అదనుగా ఆమె మానాన్ని దోచుకోబోతాడు. అంతవరకూ తనని రక్షిస్తాడనుకున్న పెద్దమనిషి అఘాయిత్యానికి పూనుకుంటే, కొంతదూరం వెళ్ళిన దొంగలకు అనుమానం వచ్చి, వెనక్కి వచ్చి ఆమెని రక్షిస్తారు.

"పాడుబడ్డా దేవాలయం దేవాలయమే!

ఎంత చెడ్డా మానవత్వం మిగిలున్నవాడు మనిషే!

మానవుల్లో మృగాలుండడంలో ఆశ్చర్యం ఏముంది?

మృగాలలో కూడా మానవత్వం ఉండడం శ్రీరామరక్ష!'' అంటూ మల్లికార్జునరావుగారు కథానికని ముగిస్తారు.

గొప్ప పోలికతో ఆలోచింపచేసేట్టు ముగించడమే రచయిత పనితనం. శిల్పం బాగుండడంతో కథనం సాఫీగా సాగిపోతుంది. రచయిత చెప్పదల్చుకున్న విషయం సూటిగా పాఠకుల మనసులో నాటుకుంటుంది. క్లుప్తత స్పష్టతలో రచయిత కథానికని చక్కగా చెప్పగలిగారు. అలాగే కథానిక, ముగింపుకూడా చక్కగా ఉన్నాయి. తప్పక చదవాల్సిన కథానిక 'శ్రీరామరక్ష'.

# కనపర్తి వరలక్ష్మమ్మ 'కుటీరలక్ష్మి'

**క**నపర్తి వరలక్ష్మమ్మగారు సంఘసేవికురాలు కావడంతో ఆరోజుల్లో రాట్నం వడకడం లాంటి వృత్తుల్ని ఆడవాళ్ళు ఇళ్ళలో చేపడితే బ్రతుకుతెరువు లభిస్తుందని ఆలోచించారు. మొదటితరం కథానికా రచయిత్రి.

రామలక్ష్మి కుమారుడు రంగడు హఠాత్తుగా అస్వస్థుడై తిరిగి కోలుకోవడంతో ప్రారంభమైన కథ ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్తుంది.

తండ్రి మరణించేప్పటికి రామలక్ష్మి భర్త వేంకటస్వామికి ఇరువదేండ్లు. తండ్రి వ్యాపారభారాన్ని స్వీకరించి, బాగా విస్తరింపజేస్తాడు. బట్టలకు వేరు వేరు రంగులు అద్దింపచేసి, ఇతర రాష్ట్రాలకి ఎగుమతి చేసి, బాగా సంపాదిస్తాడు. నిపుణులైన పనివాళ్ళను బొంబాయినుంచి రప్పించి, సొగసైన యంచులను, కమ్మలను వేయించి వ్యాపారము చేయసాగాడు. కలిసొచ్చే రోజు వస్తే నడిచి వచ్చే బిడ్డ పుట్టినట్లు అతనేమి చేసినా వ్యాపారంలో కలిసి రాసాగింది. వేంకటస్వామి ఐశ్వర్యంతో తులతూగసాగాడు.

ఐరోపాలో ఘోరమైన యుద్ధం ప్రారంభమవడంతో మనదేశంలో కూడా ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. దాంతో క్రమంగా అతని వ్యాపారం తిరోముఖం పట్టసాగింది. కలిసిరాని కాలంలో ఏమి చేసినా కలిసిరాదు. వేంకటస్వామికి అంతవరకూ కలసి వచ్చిన వ్యాపారం నష్టాల ఊబిలో కూరుకుపోసాగింది.

అతని యుద్ధకపుగొట్లుకి నిప్పంటుకుని భయంకరంగా మండుతున్నాయన్న వార్త అందగానే కుప్పకూలి, మరణిస్తాడు. రామలక్ష్మి షాక్‌కి గురైనా కోలుకుంటుంది. హఠాత్తుగా ఆ కుటుంబ ఆర్థికపరిస్థితి కూలిపోతుంది. రామలక్ష్మి ఆమె బిడ్డలకు గడవడం కష్టమవుతుంది. ఆదుకునే బంధువులూ వాళ్ళకెవ్వరూ ఉండరు.

రామలక్ష్మి కొంతవరకూ చదువుకుంది. ఒకరోజు కొడుకు తెచ్చిన ప్రకటన కాగితాన్ని చదివి రాట్నము వడకడం నేర్చుకోవాలనే ఉత్సాహముందని తెలియజేస్తుంది.

రెండు వారాల శిక్షణలో రాట్నం వడకడం ప్రారంభించింది. రామలక్ష్మి బాగా వడికిన నూలుని ఎక్కువ ధరకి కొనసాగారు. క్రమంగా వరలక్ష్మి పిల్లల్ని చదువుకోసం మంచి పాఠశాలల్లో వేసి, చదివించసాగింది.

సంక్రాంతి పండుగకు పిండివంటలు చేయమని, కొత్తబట్టలు కొనివ్వమని పిల్లలు కోరడంతో ఆమెకి దుఃఖం పొర్లుకొస్తుంది అంటూ పిల్లలు ఏడుస్తున్నారంటూ కుటీరలక్ష్మిగా మారిన వరలక్ష్మి కథను ముగిస్తారు రచయిత్రి.

ఈ కథానిక ద్వారా అప్పటిరోజుల్ని మన కళ్ళముందు కదిలింపజేయడంలో కృతకృత్యులయ్యారు కనపర్తి వరలక్ష్మి.

# కవికొండల 'జమీందారు'

జమీందారీలు రద్దయిన కొత్తల్లో కవికొండల వెంకటరావుగారు "ఇన్నాళ్ళూ ఆవలిగట్టున నివసించి భోగించిన దానికి, ఈ నాడొక్క ముహూర్త మీవలి గట్టున విశ్రమించడానికి ఎంత తేడా ఉంది" అని విస్తుపోతాడు ముప్పై ఏళ్ల వయసున్న మాజీ జమీందారు. నిన్నటివరకూ అతను ఆ ప్రాంతానికి అధిపతి. వేలకొద్దీ ఎకరాలకు జమీందారు. నిన్నటి వరకూ ఆ చుట్టుపక్కలందరూ అతను ఎంత చెబితే అంత.

ఇవ్వాళ ఒక్క శాసనంతో అతని జమీని లాగేశారు. ఇరవై లక్షల రూపాయలను నష్టపరిహారంగా ఇచ్చారు. "నీ ఇష్టం వచ్చిన చోటికి నీ చరాస్తితో వెళ్లిపోవచ్చు. మరి ఇందుగల సెంటు భూమి నీదికాదు. ఇక్కడుండటానికి నీకు ఇల్లు లేదు. వల్లకాదు" అని సర్కారువారు సాగనంపారు.

కాలవగట్టున, చెట్టునీడన పడుకున్న అతనికి ఒక మేనా సవారీ మోసే బోయీల మోత వినిపించింది.

ఆ మేనా సరాసరి జమీందారు కూర్చున్న చోటికి ఎదురుగా ఉన్న రేవు గమ్యస్థానంగా చేరుకుంది. రోజూ జమీందారిణి ఆ రేవులో స్నానం చేసి దేవాలయంలోని దేవతాదర్శనం చేసుకునేది.

"వద్దు. నీవు తిన్నగా సామాను వెనకాలే వెళ్లిపోవలసినది. వద్దు. మనకు మరి దేవుడు లేడు, దేవాలయమూ లేదు" అని మాజీ జమీందారు ఆజ్ఞాపించి బయలుదేరడంతో భార్య అప్పటికి అక్కడికి మేనాలో రాదనుకున్నాడు. ఎందుకనంటే ఆమె ఇప్పుడు జమీందారిణీ కాదు – సామాన్య స్త్రీ.

"అయితే జమీందారుడు, అతని జమీ సర్కారువారు తీసుకున్నారు కదా. దేవాలయమూ విడిచిపెడుతాడా? ఆనాటి నుంచి దేవాలయము గతేమిటి?" రావిచెట్టుకింద చేరిన ప్రజల గుసగుస. "సాయంకాల మెప్పటివలె జమీందారిణి ఆమె యెప్పటి హోదాతో దేవాలయమునకు రాగలదా? రాలేదా? ఆమె మేనా నెవ్వరాటంకపరచగలరు?" రహస్యంగా వాళ్ళలో వాళ్ళు అనుకోసాగారు.

మేనా వచ్చి ఆగింది.

పరిచారిక దిగి అక్కడున్న బల్లకట్టన్నను అడిగింది "బల్లకట్టన్నా! ఆ తట్టెప్పుడీ వేళకు  మగవారున్న జాడలేదు. ఎవరా కూర్చున్నది?" అడిగింది.

బల్లకట్టన్న "వారే! జమీందారుగారే, వెళ్ళిపొమ్మననా" అన్నాడు.

"వద్దులే! కూర్చోనియ్" బోయీలు పక్కకి తప్పుకున్నారు.

జమీందారిణి మేనా దిగింది.

చెరొక గట్టునా ఇద్దరూ ఎదురెదురు! దక్షిణ లేక అటుగా వచ్చి ఓ నిర్భాగ్యురాలు చటుక్కున మేనా ఎక్కి పరదాలను బిగించుకుంది. ఆమె ఎక్కడం, జమీందారిణి దిగడం మరెవ్వరూ చూడలేదు. ఎవరో ఎక్కడం గమనించిన బోయీలు మేనాని వెనక్కి తీసుకుపోయారు.

అలా మేనా వెళ్ళిపోయింది, గుడిదాకా.

సవారి గుడిదగ్గర ఆగేసరికి "ఈమె దేవుణ్ణి చూడడానికి సవారిమీదే వచ్చినదే' అంటూ ఆశ్చర్యపోయారక్కడవున్న కొందరు.

ఇంతలో జమీందారు, జమీందారిణి నడుచుకుంటూ వస్తారక్కడికి. అప్పుడు మేనాలోంచి దిగిన స్త్రీ ఎవరనే ప్రశ్న అందరిలోనూ ఉదయిస్తుంది.

ఎవ్వరినీ పట్టించుకోకుండా ఆమె "ముందు దేవుణ్ణి చూడనీయండి. నేనిలా వచ్చి దేవుణ్ణి చూడగలనని ఎప్పుడూ అనుకోలేదు" అంటూ గుడిలోని దేవుడి దగ్గరకు దారి తీస్తుంది.

ఇంతలో ఎవరో మేనాని కాల్చివేస్తారు.

దాంతో జమీందారుల ఆధిక్యం తొలగి, వాళ్ళూ మామూలు ప్రజలలాగే నడవాలని, సమానమని రచయిత చక్కగా చెప్తారు.

జమీందారిణి తనని అలంకరించిన నగల్ని కాలువలో పారేస్తుంది!

నా యవ్వనాన్ని నేను అలా విడిచిపెట్టలేనని విచారిస్తుంది కాందిశికాంగన.

కాందిశికాంగన-జమీందారు దంపతులు అలా నిరాడంబరంగా వెళ్ళడం చూసి ఆశ్చర్యం చెందుతుంది. తనూ బల్లకట్టుమీద కాలువదాటుతుంది. చింతచెట్టు కిందకి చేరుతుంది.

ఇప్పుడు చదివినా కథానిక 1950లోకి మనల్ని తీసుకువెళ్తుంది. ఒక చారిత్రక ఘట్టాన్ని కవి కొండల వేంకటరావు గారు చిన్న కథలో చక్కగా చెప్పడంలో విజయవంతమయ్యారు. వందేళ్ళ తెలుగు కథానికా చరిత్రలో ఈ కథానిక ఓ మైలురాయి, కలికితురాయి.

# కాళోజి 'తెలియక ప్రేమ, తెలిసి ద్వేషము'

**కు**ల, మత భేదాలు మనిషిని ఎంత అధోపాతాళానికి తొక్కేస్తున్నాయో చెబుతూ, వాటికతీతంగా సమాజాన్ని ఎలా నిర్మించుకోవాలో తనదైన రీతిలో 'తెలియక ప్రేమ తెలిసి ద్వేషము' కథానిక ద్వారా శక్తివంతంగా చెప్పారు కాళోజిగారు. ఈ కథానికతో బాటు మరికొన్ని కథానికల్ని కలుపుకుని 1943లో 'కాళోజికథలు' సంపుటి ఆవిష్కరణ జరిగింది.

ఒక గంధర్వగానం వినిపిస్తుండడంతో యమపురికి కొన్ని జీవాల్ని తీసుకువెళ్తున్న యమభటులతో ఒకనికి వినిపోదామనిపిస్తుంది. పాట వినాలని తనకీ వున్నా యమధర్మరాజు ఆలశ్యానికి కోపానికి వస్తాడని, దండిస్తాడని భయపడతాడు మరో భటుడు. వైతరిణి దాటితే యమపురేగా వెళ్ళగలం ఆలశ్యం కాకుండా అంటాడు మొదటి భటుడు. ఈ జీవాల్ని తీసుకువెళ్తు గంధర్వగానం వినడం ఎలాగంటాడు రెండోభటుడు. అలా ఇద్దరూ కాసేపు చర్చించుకుని ఈ జీవాల్ని వైతరిణీ తీరాన కాసేపు వదిలి, ఆ గానాన్ని విని రావాలని నిశ్చయించుకుంటారు.

వాళ్ళటు వెళ్ళగానే వైతరణీ తీరాన విడవబడ్డ జీవాలు ఒకదాని నొకటి పలుకరించుకోసాగాయి. నాది భారతదేశమంటే, నాదీ భారతదేశమంటూ! ఏ ప్రాంతం వాడివని పలకరించుకున్నప్పుడు నిజాం రాష్ట్ర తెలంగాణా మనిషినని ఒక జీవంటే మా ప్రాంతానికి చెందిన జీవివే అన్నమాటంటూ రెండో జీవంటుంది – ఇద్దరి మాతృభాష తెలుగేనని తెలుసుకుని సంతోషిస్తాయి. మరణించిన తర్వాతా యమపురికి వెళ్తూ, వైతరిణి ప్రాంతంలో ఆగినా ఈ జీవుల బుద్ధులు మారలేదని చెప్పకనే చెప్తారు రచయిత.

ఆ తర్వాత రెండు జీవులు మాట్లాడుకుంటూ మా ఊళ్లో జరిగిన కులభేద గోలలో నా తలమీద ఎవరో గొడ్డలితో కొట్టడంతో ఎక్కడున్నదీ కూడా తెలియడం లేదని ఓ జీవి వాపోతే, నేనూ అదే గోలలో ప్రాణం కోల్పోయానని రెండో జీవీ బాధపడుతుంది. ఒక జీవి అగ్ర కులానికి చెందినదైతే రెండో జీవి నిమ్నకులానికి

చెందింది. ఇద్దరూ ఒకే గోలలో భౌతిక శరీరాల్ని కోల్పోయి – ప్రపంచంలో దయ, సానుభూతి కరువైందని, అసలు మనుషులు మానవత్వాన్ని పూర్తిగా కోల్పోతున్నారని బాధపడతాయి.

ఆ తర్వాత రెండు జీవులూ మాటల్లో ఒకరు అగ్రకులానికి చెందినదైతే, రెండోది నిమ్న కులానికి చెందినదని తెలుసుకోవడంతో –రెండింటి మధ్యా తిరిగి స్ఫర్థలు మొదలవుతాయి... రెండు జీవాలు సఖ్యతమాని, కొట్టుకోవడం ప్రారంభిస్తాయి. చనిపోయి, యమపురికి పోతున్నా రెండు జీవాల మధ్యా ఆ స్ఫర్థ తగ్గలేదన్నమాట.

ఏవేవో కేకలు వినిపించడంతో యమభటులు పాట వినడాన్ని మానుకుని, వెనక్కి వచ్చారు. జీవుల మధ్యా కుల పంచాయితీ మొదలైందని తెలుసుకుని బాధపడతారు. ఆ జీవులు ఎక్కడ నుంచి వచ్చాయో, ఏ కులాలకు చెందినవో కూడా తెలుసుకుంటారు.

ఈ విషయాలు గ్రహించిన యమధర్మరాజు రెండు జీవులకూ తీవ్రమైన శిక్ష విధిస్తాడు. ఇద్దర్నీ తర్వాత కులాలే కాదు అటు ఇటు మార్చి పడేయాలని శాసిస్తాడు. అంతేకాదు, రాష్ట్రం కూడా మార్చేయమంటాడు. కారణం కులాలు మారినా కలహాలు తగ్గవు– అగ్రకులంవాళ్ళు, నిమ్నకులం వాళ్ళనీ బాధిస్తూనే ఉంటారు – రకరకాల కారణాలతో ఇతర రాష్ట్రాలకి పంపినప్పుడు ఈ దేవాలయాలూ కొందరి అధిపత్యం, మరికొందర్ని లోపలికి రానివ్వక పోవడం లాంటి బాధలు మరో రాష్ట్రానికి పంపినప్పుడు ఉండవు కదాన్నది యముడి భావన!

కుల, మత గోలల్ని ఈ కథానిక ద్వారా మనముందుంచడమే కాకుండా, పూర్తిగా ఇవి తొలగిపోక పోతే తప్ప మనుషుల్లో మానవత్వం పరిమళించదు అనే నిజాన్ని స్పష్టంగా చెప్పారు కాళోజి.

కాలం మారుతున్నా ఈ వైరుధ్యాలు తగ్గడం లేదు చెప్పడంతో బాటు తగ్గాలనే రచయిత గొంతూవినిపిస్తుంది ఈ కథానిక ద్వారా. అప్పటి సమాజానికే కాదు, ఇప్పటి సమాజానికీ అవసరం ఇట్లాంటి కథానికలు.

# కె.లక్ష్మీ రఘురామ్ 'బంధము'

**వ్యా**పారరీత్యా ఆలోచిస్తే ఆశ్రమము ఏర్పాటుచేసుకోవడం లాభదాయక మనడంతో కథానిక ప్రారంభమవుతుంది.... సన్యాసి వృత్తికి మించిన వృత్తిలేదు... ఇంటిపని, పిల్లలకి చదువు చెప్పడంతో సతమతమవుతూ రచయిత్రి చికాకు పడి ఏ ఆశ్రమానికో వెళ్ళిపోతే బాగుండుననుకున్నప్పుడల్లా భర్త ఎగతాళి చేస్తుంటాడు.

'నామీద పడతావెందుకు? నువ్వు కూడా నాలాగే హాయిగా ఫాను కింద కూర్చుని పనిచేసుకోవచ్చుగా' అని సలహా కూడా ఇస్తాడు.

"ఆ భర్తలందరూ ఇలాంటి సలహాలే ఇస్తారు– పంచభక్ష్య పరమాణ్ణాలూ విస్తరిలోకి, అలాడిన్ లాంతరుతో అమర్చేటట్లు!" రచయిత్రి దెప్పిపోటు.

పిల్లల, పెద్దల పనులన్నీ పూర్తిచేసి, వాళ్ళని స్కూళ్ళకి, ఆఫీసుకి పంపేసరికి పదకొండు! పడకకుర్చీలో వాలి రచయిత్రి ఆశ్రమం గురించి మళ్ళీ ఆలోచించసాగింది. ఈ కథానికని కె.లక్ష్మీరఘురామ్ గారు మనకు ఉత్తమ పురుషలో చెబ్తారు.

'ఇప్పుడు కాదు వెళ్ళాల్సింది. పిల్లల పరీక్షలయ్యాక ఓ పదిహేను రోజులైనా ఏ ఊటీయో వెళ్ళిపోవాలి' అక్కడికీ భర్త, పిల్లలు వస్తారు. చాకిరీ తప్పదుగా అనిపిస్తుందామెకి వెంటనే.

"అందరం కలిసి పిల్లల పరీక్షలయ్యాక మన ఊరు వెళ్ళి కొన్నాళ్ళుండొద్దాం" అంటాడు ఒకరోజు భర్త. తనకీ మనసులో అలాంటి కోరికే ఉండడంతో సరేనంది భార్య.

దారిలో రకరకాలుగా కేరింతలు కొడుతూ అందరూ తమ కారులో స్వంత ఊరు వెళ్తారు.

పుట్టింట్లో ఏ పనీ చెయ్యకుండా పూర్తి విశ్రాంతి తీసుకుంటానందామె. పిల్లల్ని మీ పనులు మీరు చేసుకోవడం నేర్చుకొమ్మంది.

మొదటిరోజు బెడ్ దగ్గరకే కాఫీ రావడంతో రాజభోగమనుభవించింది.

కానీ రెండోరోజు ఉదయాన్నే మెళకువ వచ్చింది, కోడి కూసేసరికి. కాళ్ళు, చేతులు బాగావున్న ఆమె అలా పడుకోలేకపోయింది. పైగా పెద్దవాళ్ళందరూ లేచి

పనిచేసుకుంటుంటే చిన్నది తానెలా పడుకోగలదు? తన విశ్రాంతే తనకి బాధనిపించసాగింది.

నాల్గురోజులకల్లా మనింటికి వెళ్ళి పోదామని భర్తని వేధించసాగింది.

ఇంటికి చేరి తాళము తీసి సోఫాలో కూలబడేసరికి 'అబ్బ! ఎన్నాళ్ళయింది' అనిపించిందామెకి.

'దైవమెంతటి చిత్ర బంధంతో స్త్రీని గృహానికి బంధించాడు!' అని కూడా అనిపించిందామెకి.

సగటు స్త్రీ మనస్తత్వాన్ని చాలా చక్కగా, సున్నితంగా చిత్రించారు రచయిత్రి లక్ష్మీ రఘురామ్. ఈవిధమైన బాధలోనే ఆనందాన్ని ఎలా వెదుక్కోగలరో స్త్రీలు అందంగా చెప్పారు. నా భర్త పిల్లలతో బాటు నా ఇల్లు! ఈ సత్యమే ఎన్నో కుటుంబాల్ని ఓ క్రమబద్ధంలో నడిపిస్తోందనిపిస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వమే రాసిన కథానిక ఇది. ఒకవిధంగా ఏది స్వాతంత్ర్యం? అనే ప్రశ్న వేసుకునేట్లూ చేస్తుంది.

# కె.ఆర్.కె.మోహన్ 'గుడ్‌బై టు మెర్విన్'

**తె**లుగులో విజ్ఞానశాస్త్ర వివరాలతో కథానికలు రాసిన రచయితలూ ఉన్నారు. వాళ్ళలో కె.ఆర్.కె.మోహన్‌కి ఓ ప్రత్యేకత ఉంది. ఆ విషయాన్ని 'గుడ్‌బై టు మెర్విన్' మనకు చెబుతుంది. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన రచన.

భారత్, అమెరికా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్ట్ 'ఆపరేషన్ మెర్విన్'. దీని ప్రధానోద్దేశం బుధ, శుక్ర గ్రహాలను పరిశోధించడం. బుధ, శుక్రగ్రహాలను... అంటే మెర్క్యురి, వీనస్‌లకు సంబంధించిన పరిశోధనలు లక్ష్యంగా కలది కాబట్టి ఈ పరిశోధనలకు ఆ రెండు గ్రహాల ఆంగ్ల పేర్లని కుదించి 'ఆపరేషన్ మెర్విన్' అనే పేరుని పెట్టారు. పరిశోధించే స్పేస్ స్టేషన్‌ను 'మెర్విన్' అన్నారు. భూమి నుంచి స్పేస్ షటిల్‌లో కావలసిన ఆహారపదార్థాలు, శాస్త్రీయ సామగ్రి వంటి వాటిని వెంట తీసుకుని కొత్త శాస్త్రీయ బృందాలు స్పేస్ స్టేషన్‌కి వస్తుంటాయి. పాత బృందాలు అదే షటిల్‌లో పరిశోధనలకు సంబంధించిన రికార్డులను తీసుకుని భూమికి తిరిగి వెళ్తుంటాయి. స్పేస్ స్టేషన్ మెర్విన్‌ను శుక్ర, బుధ గ్రహాల మధ్య ఏర్పరిచారు.

మెర్విన్‌లో ఇద్దరు శాస్త్రజ్ఞులున్నారు. భారతదేశంలో షార్ కేంద్రానికి చెందిన డాక్టర్ రామ్‌ప్రసాద్, అమెరికాలోని నాసా కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ విల్స్. డాక్టర్ రామ్‌ప్రసాద్‌కి హఠాత్తుగా రాడార్ స్క్రీన్‌మీద ఓ చుక్క కనిపిస్తుంది. మహావేగంతో తమ 'మెర్విన్' వేపు దూసుకొస్తున్న ఉల్క గుద్దుకుందంటే తమ మెర్విన్ నామరూపాలు లేకుండా పోతుందని ఇద్దరూ గ్రహించారు.

వాళ్ళిద్దరూ తమ మెర్విన్‌కి ఆ ఉల్క తగలకుండా తప్పించుకునేందుకు అంతరిక్షంలో చేసే సాహసాలను ఉత్కంఠం కలిగించేట్టు చెప్పారు కె.ఆర్.కె.మోహన్. ఆఖరికి అతిప్రయత్నం మీద ఆ ఉల్క మెర్విన్‌ని గుద్దుకోకుండా కాపాడుకోగలిగారు ఆ ఇద్దరూ. కానీ, ఉల్క రాసుకుంటూ పోయేప్పుడు మెర్విన్ వెనుక భాగం దెబ్బతింటుంది. మార్విన్ వెనుకభాగంలో నిల్వ ఉంచుకున్న ఆహారపదార్థాలు, నీరు

చాలా తక్కువగా మిగిలాయి. ఈ వార్తలను భమిమీదకు పంపాలంటే రేడియో ఎక్విప్‌మెంట్ నాశనమై అంతరిక్షంలోకి ఎగిరిపోయింది.

ఎలా? కంగారుపడిపోసపాగారు. మళ్ళీ వాళ్ళలో వాళ్ళే నిభాయించుకుని ఈ విపరీతాన్ని ఎదుర్కొని భూమికి ఎలా చేరాలా? అని ఆలోచించసాగారు. రకరకాల ప్రయత్నాలు చేయసాగారు. ఆఖరికి వాళ్ళూ, మనం ఊహించని విధంగా చావు తప్పి భూమికి చేరుకుంటారు.

అంతరిక్షంలోని విశేషాలను చాలా వాటిని వివరిస్తూ, జరుగుతున్నది నిజమనిపించేలా ముందుకు సాగుతుంది కథనం. పాలగుమ్మిపద్మరాజుగారన్నట్లు శిల్పం బాగోలేకపోతే కథనం కుంటుపడుతుంది. 'గుడ్‌బైటు మెర్విన్'లో కథనం బాగున్నదంటే శిల్పం బాగున్నదనేగా! సైన్స్ విషయాల్ని మనకు అర్థమయ్యే భాషలో చక్కగా చెప్పారు రచయిత. ఇప్పుడు అంతరిక్షంలో జరిగే పరిశోధనలను మరిపించేలా చెప్పిన వస్తువు. చక్కటి సైన్స్ ఫిక్షన్ ఇది. కె.ఆర్.కె.మోహన్ సామాజిక స్పృహతో మామూలు కథానికలతోబాటు చక్కటి సైన్స్ ఫిక్షన్‌ని రాసి, తెలుగు కథానికని పరిపుష్టం చేశారు.

చక్కటి పునాదుల్ని ఇలా తెలుగు కథానికకు వేసిన సాహితీ వేత్త లెందరో! వాళ్ళు వెళ్ళిపోయినా వాళ్ళ సాహిత్యం మనకి మార్గదర్శనం చేస్తూనే ఉంది. వాళ్ళందరికీ నివాళులర్పిస్తూ ఈ శీర్షికని వంద రచనల పరిచయంతోనే ముగిస్తున్నాను. అందరికీ నమస్కారాలు.

# కె.వి.సుబ్బయ్య 'ఆత్మశాంతి'

స్వాతంత్ర్యేచ్ఛతో రాసిన ఈ కథానికని అందరూ తప్పకుండా చదవాలి. దేశానికి స్వాతంత్ర్యం రావాలంటే వ్యక్తి స్వాతంత్ర్యం ముఖ్యమని, అందరికి స్వేచ్ఛా జీవిత పథం కావాలని చెప్పే తండ్రి కథ ఈ కథానిక.

అలా ప్రజాసేవకి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి, విశ్వమానవ కళ్యాణానికి, కుమారుడి జీవితం అంకితం కావాలని తన ప్రాణాలొడ్డిన తండ్రి కథ ఇది.

రచయిత, మాధవరావు మిత్రులు. ఇద్దరూ గుంటూరు కాలేజీలో చదువుకున్నారు. ఒకే రూంలో నివాసం... ఎక్కడికి వెళ్ళినా జంటగా వెళ్తుంటారు. ఆరోజు నీరసంగా ఉండి–జట్కాలో ఊరికి తిరిగి వెళ్ళాలనుకుంటారు. ఓ జట్కా ఎక్కుతారు. అతి తక్కువ బేరానికి వస్తాడు ఆ జట్కా అతను.

జట్కా అతనికి, రచయితకి మధ్యన సంభాషణ జరుగుతుంది. రచయిత రకరకాల ప్రశ్నలు అడుగుతాడు. ఆఖరుకి నీకు ఎంతమంది పిల్లలు అని అడుగుతాడు.

'ఒక్క కుమారుడు' అంటాడు జట్కా అతను.

'ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడు' అడుగుతాడు రచయిత.

'ఎక్కడున్నాడో కూడా నాకు తెలీదు' అంటాడు జట్కా అతను. మధ్య మధ్య జట్కా అతను మాధవ్‌ని చూస్తుంటాడు. మాధవ్ జట్కా అతన్ని గమనిస్తుంటాడు. ఈ విషయాల్ని రచయితా గమనిస్తుంటాడు.

అవి 1942 ఆగస్టు విప్లవదినాలు. ప్రభుత్వాన్ని పారద్రోలడానికి రహస్యోద్యమాలు నడుస్తున్నాయి. మాధవ్ ఒక రహస్యోద్యమ నాయకుడు. అతడిని పట్టి అప్పగిస్తే 50,000రూపాయలు బహుకరిస్తామని ప్రకటిస్తుంది ప్రభుత్వం. మాధవ్‌తో పాటు రచయిత అజ్ఞాతవాసం చేస్తుంటాడు. ఆ సందర్భంలో ప్రారంభమవుతుంది ఈ కథ.

ఆరాత్రి మాధవ్, రచయితలు ఉన్న గది తలుపుల్ని తడతారు పోలీసులు. వాళ్ళ మీదకి బాంబు విసిరి పారిపోతారు మిత్రులు.

అలా బయట పరుగులు తీస్తూ వెళ్తున్న మిత్రులు ఓ ఇంట్లోకి చొరబడి తలుపులు వేసుకుంటారు.

ఆశ్చర్యంగా అది పొద్దున జట్కా నడిపిన వ్యక్తిది! ముగ్గురు ఆశ్చర్యపోతారు!

ఎక్కడ కనబడితే అక్కడ మాధవ్‌ని కాల్చివేయమని ఉత్తర్వులు అందుకున్న పోలీసులు, వెతుకుతూ అతడు ఉన్న ప్రదేశానికి వస్తారు.

పోలీసులకి మిత్రులకి మధ్య యుద్ధం సాగుతుంది. ఆ పోట్లాటలో మాధవ్‌ని కాపాడి పిస్తోల్ గుండుదెబ్బకి గురవుతాడు జట్కా అతను.

చనిపోతూ – మాతృసేవని కొనసాగించమని కుమారునికి ప్రబోధిస్తూ ప్రాణాల్ని కోల్పోతాడు ఆ తండ్రి.

మాధవ్‌కి, రచయితకి, ఆ అంధకారంలో ఒక దీపశక్తి కనిపిస్తుంది. అదే అంతిమ లక్ష్యంగా భావిస్తారు.

స్వాతంత్ర్యానికి పూర్వం సాహిత్యం, సమాజం, ఆశించింది స్వాతంత్ర్య సముపార్జనే. ఆ స్వాతంత్ర్య సమరంలో ఎన్ని సమిధలు ఎలా ఆహుతి అయ్యాయో ఈ కథానిక గొప్పగా చెబుతుంది.

ఎంతమంది తమ ప్రాణాల్ని కోల్పోయి మనకి స్వాతంత్ర్యాన్ని తెచ్చారో చెబుతుంది ఈ కథానిక. నాటి చరిత్రకి ఒక సాక్ష్యం. యువతరానికి నేటికీ స్ఫూర్తి.

# కొనకళ్ళ వెంకటరత్నం 'సంఘర్షణ'

దేవుడి లాంటి డాక్టర్ క్రమంగా దెయ్యంగా మారుతున్నప్పుడు, అతనిలోని సంఘర్షణకి అక్షర రూపమే 'సంఘర్షణ' కథానిక. ఈ సంఘర్షణ పరాకాష్టకి చేరినప్పుడు తనలోకి ప్రవేశించిన దెయ్యాన్ని పారదోలి డాక్టర్ మళ్ళీ దేవుడి డాక్టర్ అవుతాడు. ఇదీ కథ.

డాక్టర్ రాజారావు హస్తవాసి మంచిదని ప్రతీతి. స్వతహాగా మితభాషి, నిగర్వి. చల్లగా మాట్లాడతాడు. కోపతాపాలు ఎరుగడు. చిన్నదైన రోగాన్ని పెద్దదిగా చిత్రించి రోగిని హడలగొట్టడు. అసలాయన్ని చూస్తేనే రోగం తిరుగుముఖం పడుతుంది. అంతేకాదు, అది ఉదారుడు కూడా! ఫీజుగా ఎంతిస్తే అంతే తీసుకుంటాడు. పేదవాళ్ళకు తన దగ్గరున్న శాంపిల్స్‌ని ఉచితంగా ఇస్తాడు. అందుకే ఆయనను అందరూ 'దేముడు డాక్టర్' అంటారు.

అలాంటి దేవుడి డాక్టర్ ఇంటికి బావమరిది వచ్చి, తన అక్కని (అంటే డాక్టర్ భార్యని) ప్రభావితం చేయటంతో క్రమక్రమంగా మార్పు రావటం ప్రారంభిస్తుంది డాక్టర్‌లో!

"మీ ఆయనకు సంపాదించటం చేతకాదు. ఆ సంగతి నేను చూసుకుంటాగా" అంటూ బావగారు చేసే వైద్యానికి పగ్గాలు తాను పట్టుకుంటాడు బావమరిది.

డాక్టర్‌గారి బావమరిది రామనాథం బావగారితో ఒక ఎక్స్‌రే క్లినిక్‌ని, డయాగ్నొస్టిక్ సెంటర్‌నీ ప్రారంభింపచేస్తాడు. దాంతో డాక్టర్ రాజారావు తనకు తెలియకుండానే తన దగ్గరకొచ్చిన రోగులందరికీ పరీక్షలు, ఎక్స్‌రేలు తీయించుకోమనటం పరిపాటి అయిపోతుంది.

దాంతో డాక్టర్‌లో సంఘర్షణ ప్రారంభమవుతుంది. – తను చేస్తున్న పని ఎంతవరకు మంచిదని! బావమరిది, భార్యల తర్కాన్ని ఎదుర్కోలేక వాళ్ళు చెప్పినట్లే చేస్తుంటాడు.

ఇంతలో బావమరిది రామనాథం పేరుతో మెడికల్ షాపు తెరుస్తాడు బినామీగా. దాంతో డాక్టర్‌కి రిప్రజంటేటివ్ లిచ్చిన శాంపిల్స్ మెడికల్‌షాపులోకి చేరుతుంటాయి.

డాక్టర్ తన దగ్గరకొచ్చిన పేషంట్లకి విపరీతంగా మందులు రాయడం ప్రారంభిస్తాడు. బావమరిది షాపునుంచి రోగులు మందులు కొనుక్కొచ్చిన తర్వాతే ఎలా వాడలో చెప్పేవాడు. ఇది మంచి అని గీట్లు గీసుకున్న డాక్టర్ మానసికంగా విలవిల్లాడిపోతుంటాడు. రోగులకవసరమైన మందుల్ని కాకుండా, మెడికల్ స్టోర్స్‌లో మిగిలిపోయిన మందుల్ని రాయాల్సి వస్తుంది. బ్యాంకు పాస్‌బుక్‌లో పెరుగుతున్న అంకెలు అతడిని నోరు విప్పనియ్యవు.

ఇలా మంచిని వదిలి చెడుతో ఐరావతంలా పెరుగుతున్న డాక్టర్ తన కుమారుడికి పాఠం చెప్పే ఉపాధ్యాయుడి కొడుకుని బలి తీసుకకోవటంతో కనువిప్పు అవుతుంది. తనని మరింత పాతాళంలోకి తొక్కుతున్న బావమరిది పాములా దగ్గరకొచ్చేసరికి 'గెటవుట్' అంటూ ముంగిస అయిపోతాడు. పాము పారిపోతుంది. భార్యని తన ప్రాక్టీసులో తలదూర్చవద్దని హెచ్చరిస్తాడు డాక్టర్. తీవ్ర సంఘర్షణకు గురైన డాక్టరు రాత్రంతా ఆలోచించి తనలోని దౌర్బల్యాన్ని ప్రక్షాళన చేసుకుంటాడు. మనిషిలోని దురాశ విశ్వరూపాన్ని చూపించిన కొనకళ్ల వెంకటరత్నం కథానికనెలా ముగిస్తారంటే – 'మర్నాడు ఉదయం కన్సల్టింగ్‌లో కూర్చున్నాడు డాక్టర్. ఆయన ముఖం ప్రసన్నంగా ఉంది. కిటికీలోంచి రాత్రంతా మంచులో తడిసిన మాలతి తెల్లగా పరిశుభ్రంగా మెరుస్తుంది. కనపడని సంకెళ్ళేవో విదిల్చుకున్నట్లయి.... ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నాడు మిష్టర్ రాజారావు మళ్ళీ డాక్టర్ రాజారావు అయ్యాడు ఆ క్షణం' అంటూ. ఇదీ శిల్ప పరిపక్వత.

పరిస్థితుల ప్రభావంతో ఏ మనిషైనా ఎలా ఎటు ఎటుపడితే అటు కొట్టుకుపోతాడో చాలా చక్కగా చెప్పారు కొనకళ్ళ. మనిషి దౌర్బల్యాన్ని ఈ కథానిక ద్వారా మనముందుంచిన ఆయన 'మనిషి తన పతనానికి కారణాలు బాహ్యంగానే వెదుక్కుని చక్కా ఊరుకుంటాడు. తనతో దాగుడుమూతలాడుతున్న దౌర్బల్యాల వంక చస్తే చూపు సారించడు' అంటూ ఓ నగ్న సత్యాన్ని మన ముందుంచుతారు.

ఆ రోజుల్లోనే కాదు, ఈ రోజుల్లో కూడా జరుగుతున్న పచ్చి నిజాలకిది దర్పణం. ఈ కథానికకి బ్యాక్‌గ్రౌండ్ వైద్యవృత్తి, అందుకు సంబంధించిన విషయాలూ! వీటన్నింటిమీదా రచయితకి క్షుణ్ణమైన అవగాహన ఉంది కాబట్టే కథ పరిపక్వమైంది. పరీక్షలు, జబ్బులు, మందులు మొదలైన విషయాల్ని చాలా కరెక్ట్‌గా చెబుతూ

కథని ముందుకి నడపించారు కొనకళ్ళ. మనిషిలో సంఘర్షణ ఉంటే తప్పకుండా చెడుని వీడి మంచివైపు మొగ్గు చూపించగలరని ఈ కథానిక చెబుతుంది.

'మొక్కజొన్న తోటలో' లాంటి జానపద గేయాల్ని, 'బంగారిమామ' పాటల్ని రాసిన కొనకళ్ళ వేంకటరత్నం అంతకేమాత్రం తక్కువకాని కథానికల్ని రాశారు. వాటిలో ఒకటి మాత్రమే ఈ 'సంఘర్షణ'.

కథానిక అంటే అంత తేలిగ్గా రాసేదికాదు.దానికెంతో పరిజ్ఞానం కావాలి. అందుకు ఎంతో పరిశోధన, పరిశీలన అవసరం. అప్పుడే రుచిఉన్న పాఠకుడికి ఎంతో ఆనందం!

# క్రొవ్విడి లింగరాజు 'గొప్పోళ్ళ న్యాయం'

**ఈ** కథానిక ఉత్తమ పురుషలో సాగుతుంది. రచయిత ఒక పాత్ర. క్రొవ్విడి లింగరాజుగారు స్వాతంత్ర్య సమరయోధుడు. కాబట్టి స్వాతంత్ర్యానికి పూర్వం ఆయన బ్రిటిష్‌వాళ్ళ దౌర్జన్యానికి లోనై జైలుశిక్షని అనుభవించాల్సి వచ్చింది. అందుకే ఆయన ఈ కథానిక కేవలం కల్పితం కాదు, కథావస్తువు చాలా వరకు నిజం. పేర్లు మాత్రం కల్పితం అని పేర్కొన్నారు. 1947కి ముందు రాసిన కథానిక. గొప్పోళ్ళ న్యాయం అనే కథానికా సంపుటి 1958లో వచ్చింది. ఆ సంపుటిలో ఈ కథానిక 'గొప్పోళ్ళ న్యాయం' చోటు చేసుకుంది.

రచయిత రాజకీయ ఖైదీగా జైలులో ఉన్నప్పుడు ఎంతోమంది మామూలు ఖైదీలు ఆయన దగ్గరకు వచ్చి, తమ గోడుని వెళ్ళబోసుకుంటూ ఉండేవారు.

ఒకరోజున చిక్కినపాటి గ్రామానికి చెందిన ఈరడు తన గొడవని రచయితకి చెప్పుకోవడం ప్రారంభిస్తాడు. ఈరడు పెద్దమున్సిపు కొలువులో ఉండేవాడు. ఆయనే ఈరడికి పెళ్ళి చేశాడు. పెళ్ళిలో ఎల్లికి రెండు కాసుల పట్టెడ చదివించాడు. పెళ్ళి చేసుకున్న ఈరడికి జీతం పెంచాడు. ఆ మారాజు చచ్చిపోయాక చిన్న మున్సిపుకి పెత్తనం వచ్చింది.

పెద్ద మున్సిపు బతికి ఉన్న రోజుల్లోనే చెల్లెలి పెళ్ళికి 20 రూపాయలు అప్పుగా తీసుకున్నాడట ఈరయ్య. ఆ తర్వాత 10 రూపాయలు చేతిలో పెట్టి ఇంక ఇయ్యలేనయ్యా అని మొరపెట్టుకుంటే సరే అన్నాడు. చిన్న మున్సిపు పెత్తనం రాగానే మూడు ఏళ్ళ నాటి పాత కాగితం బయటపెట్టి, వడ్డీకి వడ్డీ కట్టి 50 రూపాయలు పైచిలుకు బాకీ చెల్లించాలన్నాడు. కాళ్ళమీద పడి వేడుకున్నా కరుణించలేదు. కోర్టులో డిక్రీ పొందాడు. ఈరడు పెళ్ళినాడు పెద్ద మున్సిపు ఇచ్చిన పట్టెడ తాకట్టు పెట్టి 30 రూపాయలు ఇచ్చాడు. అయినా చిన్నమున్సిపు జైలులో పెట్టించాడు- అని బావురుమన్నాడు ఈరయ్య.

ఆ తరువాత ఈరయ్య భార్య ఎల్లి మీద అఘాయిత్యం చెయ్యబోయాడు చిన్న మున్సిపు. ఎదిరించిన ఈరయ్యని జైలులో పెట్టించాడు.

"నాయనగారూ! నన్ను ఈ యమలోకం నుంచి బయటపడివేసే మార్గం సెప్పరా..." అంటూ బావురుమన్నాడు.

అక్కడ్నుంచి రచయితని నెల్లూరు జైలుకి తరలిస్తున్నప్పుడు దారిలో కనిపించిన మిత్రుడికి ఈరయ్య కథ చెప్పి సాయం చేయమంటాడు రచయిత.

రాజకీయ ఖైదీగా రచయిత నానాపాట్లు పడుతూ ఆఖరికి కోయంబత్తూరు జైలుకి చేరుకుంటాడు. అక్కడ అతనికి ఈరడు కనిపిస్తాడు.

"బాబయ్య మీరు సేసిన ఉపకారం నాకు అపకారం అయ్యింది. మీ స్నేహితులు సెప్పారని నన్ను విడుదల సేసారు. నేనింటికి ఎల్లేసరికి నా భార్యమీద చిన్నమున్సిపు అఘాయిత్యం సేయబోయాడు. నేను సేతిలో ఉన్న కొడవలితో అతని సేయి నరికాను.... నా పెళ్ళాన్ని సెరసబోయిన అతను బాగున్నాడు. నా పెళ్ళాన్ని రక్షించుకోబోయిన నాకు పదేళ్ళు సిచ్ఛ ఏసారు. ఇదేం న్యాయం బాబు" అని ఏడుస్తాడు ఈరయ్య. గోప్పోళ్ళ న్యాయమా?

రచయిత జైలునుంచి బయటకు వచ్చి స్వగ్రామం చేరిన తర్వాత ఈరయ్యని వదిలి పెట్టి ఉండలేకో, పొట్ట గడవకో, మున్సిపు బాధ పడలేకో అతని భార్య ఆత్మహత్య వేసుకున్నట్టు తెలుస్తుంది.

వీరయ్య అన్నట్టు గొప్పోళ్ళ న్యాయం అంటే ఇదే కాబోసు అనిపిస్తుంది. వీరయ్య లాంటివాళ్ళకి నిజమైనన్యాయం కలిగే రోజులు ఎప్పుడొస్తాయి అనే ప్రశ్నని రచయిత మన మనస్సుల్లోకి ప్రవేశపెట్టడంతో కథానిక ముగుస్తుంది.

గొప్పోళ్ళకి పేదోళ్ళకి ఒక్కటే న్యాయం ఉండాలంటూ పేదవాళ్ళ ఆక్రందనలని వినిపిస్తుంది ఈ కథానిక. మన మనస్సుల్లో నాటుకుపోయేటట్లు గొప్పగా చెప్పారు స్వాతంత్ర్య సమరయోధులు ప్రముఖ రచయిత కీర్తిశేషులు క్రొవ్విడి లింగరాజు గారు.

# కొమ్మూరి పద్మావతీదేవి 'పొగడ దండ'

**సీ**తకి పధ్నాలుగేళ్లు. అందమైంది. అమాయకమైంది. తల్లి, తండ్రి పోవడంతో మేనత్త పున్నమ్మదగ్గరే పెరుగుతోంది.

సీత పాఠశాల నుంచి రావడం కొద్ది ఆలశ్యమైనా పున్నమ్మ కంగారుపడిపోతుంది. ఆరోజు సీత పొగడపూలు ఏరుకుని రావడంతో ఆలశ్యమవుతుంది. ఆకలనగానే పున్నమ్మ వంటిట్లోకి వెళ్ళిపోతోంది.

ఆరోజు నుంచి ప్రతీరోజూ సాయంత్రం సీత బడి నుంచి పొగడపూలను ఏరుకుని ఆలశ్యంగా రావడం ప్రారంభిస్తుంది. శంకరం గుడిదగ్గర కలసి, సీతకి పువ్వులేరిస్తుంటాడు. ఇంటిదగ్గరుండే సీత మిత్రురాలు సరోజ అతను రౌడి, అతడిచ్చే పువ్వులు తీసుకోవద్దని హెచ్చరిస్తుంది.

ఆ రాత్రి సీతకి ఆలోచనలతో నిద్రపట్టదు. మర్నాడు సాయంత్రం శంకరాన్ని చూడగానే కంగారుపడిపోతుంది. వద్దంటున్నా అతను బలవంతాన పువ్వుల పొట్లాన్ని చేతిలో పెట్టగానే కంగారుపడుతుంది. చేతిలోని పూలు కిందపడతాయి.

శంకరానికి ఇరవై ఏళ్ళే వున్నా, ఆ ఊళ్లో అందరూ అతనంటే భయపడతారు. ఎందుకోగాని సీతని మొదటిసారి చూసినప్పుడే అతను ఆకర్షితుడౌతాడు. రోజూ పొగడపూలని ఏరడానికి సాయపడుతుంటాడు.

ప్రతీ సాయంత్రం సీతని చూడనిదే అతనికి నిద్రపట్టేదికాదు, కాలం సాగేదికాదు. మిత్రురాలు సరోజ వాళ్ళిద్దరి పరిచయం గురించి ఆరాలు తీస్తూనే ఉంటుంది. సరోజ హెచ్చరించబోతుంటే అతను చాలా మంచివాడని సీత కొట్టిపారేస్తూంటుంది.

ఒకరోజున పున్నమ్మ సీతని గుడికి వెళ్దాం రమ్మన్నప్పుడు ఆమె గుండెలు ఝల్లుమంటాయి. పున్నమ్మ చూడకుండా శంకరం, సీతకి సంపంగె పూలిస్తాడు.

ఆరోజు శంకరాన్ని కలవకూడదని సీత వేరేదారి నుంచి వస్తున్నా అతడిని తప్పించుకోలేకపోతుంది. అతడిని చూడగానే చేతిలోని పుస్తకాలు కిందపడతాయి. ఏడుపువస్తుంది. 'నేను వెంకన్నతో పుస్తకాల్నేకాదు, పూలనీ పంపిస్తాను. సరేనా...

ఇంతకీ నేను నిన్న ఇచ్చిన సంపెంగ నీ జడలో ఉందికదూ?' అంటాడు. ఏడుపుకాస్తా పోయి ముసిముసిగా నవ్వుతుంది సీత.

ఒకరోజు సాయంత్రం పొగడ దండని తీసుకుంటూ వెంకన్నని "బాబుగారున్నారా?" అని అడుగుతుంది. "రెండు రోజుల నుంచి జ్వరం" అంటాడతను.

ఇంటికి వచ్చేస్తుంది సీత.

"ఈ మధ్య మా ఇంటికి రావడంకూడా మానేసావ్!" నిష్ఠూరాలాడుతుంది సరోజ.

మర్నాడు వెంకన్నని అడిగితే "జ్వరం తగ్గింది. రేపు వస్తామన్నారు" అంటాడు.

మర్నాడు సీత గుడిదగ్గరకు రాగానే జేబులోంచి పొగడదండలు తీసి సీత ఒళ్ళో పడేస్తాడు శంకరం. "సీతా! నన్ను మరచిపోవుకదూ?" బాధగా అంటాడు.

సమాధానం చెప్పకుండా అతడి చేతిని చేతిలోకి తీసుకుంటుంది.

"నీవు ఇంకెవర్నీ పెళ్ళాడకు సీతా!" అంటాడు బాధగా. ఏదో అలికిడి అవడంతో ఇద్దరూ విడిపోతారు.

పున్నమ్మ అసాధ్యురాలు. ఈ విషయాన్ని పసిగట్టినట్లుంది. హఠాత్తుగా స్వగ్రామమైన సంతమాగలూరుకి సీతని తీసుకు వెళ్ళింది.

అక్కడ పెళ్ళిచూపులు ప్రారంభిస్తారు. సీతకి బాగా డబ్బున్నవాడితో ఆమె పెళ్ళి చేసేస్తారు.

పెళ్ళయిన మూడు నెలల తర్వాత సీతని గుంటూరు తీసుకు వస్తుంది పున్నమ్మ.

రాగానే శంకరం గురించి సరోజినిని అడుగుతుంది సీత.

అప్పట్లో బడి చుట్టూ తిరిగేవాడు. ఇప్పుడు ఆ పొగడచెట్టుకిందే కూర్చుంటున్నాడు... "నా సీతకి పెళ్ళయిందా? ఇవిగో దండలంటూ పిచ్చివాడిలా తిరుగుతున్నాడు" అంటుంది సరోజ.

సీత "గుడికి వెళ్తా"నంటే "ఒక్కదానివే వద్దు. అక్కడ పిచ్చివాడు తిరుగుతున్నాడు" అంటూ సీతతో బయల్దేరుతుంది పున్నమ్మ.

పొగడచెట్టుకింద పూలేరుతున్న శంకరాన్ని చూసేసరికి సీత గుండె చెరువవుతుంది. చేతిలోని పళ్ళెం కిందపడుతుంది. శంకరం తలెత్తిచూస్తాడు.

సీతని పాదాలనుంచి పైకి చూస్తూ "నా సీతవా నువ్వు! వచ్చావా సీతా!" అంటూ చేతులు పట్టుకుంటాడు.

పున్నమ్మ అరుపులు వింటూ శంకరం సీతని ఎత్తుకుని కోనేటివైపు పరుగెత్తుతాడు.

సీత అతని చేతుల్నించి తప్పించుకుని కోనేటిలోకి దూకుతుంది.

పిచ్చిశంకరం మాత్రం ఎప్పుడూ నవ్వుతూ, ఆ పొగడచెట్టుకింద కూర్చుని, కోనేటి వంకే చూస్తుంటాడు. ఎవరు ఎన్ని రాళ్ళు మీదకి విసిరినా!–ఇంకా సీత వస్తుందనే అతని ఆశ– అంటూ కథానిక 'పొగడదండ'ని ముగిస్తారు రచయిత.

విఫలమైన ఈ ప్రేమ కథానికని చదవగానే కళ్ళు చెమరుస్తాయి. 1940 ప్రాంతంలో ప్రచురితమైంది ఈ కథానిక. వాళ్ళ ప్రేమ పెరగడం, విఫలమవడంకూడా ఒక పద్ధతిలో సాగడం–కథనం ఈ కథానికకి అందం.

# కొడవటిగంటి కుటుంబరావు 'అక్కయ్యపెళ్ళి'

కొడవటిగంటి కుటుంబరావు మధ్యతరగతి మనుష్యుల్ని విశ్లేషిస్తూ ఎన్నో మంచి కథానికల్ని రాశారు. వాటిలో 'అక్కయ్య పెళ్ళి' ఒకటి.

శ్వేతాంబరం, గుణమణి దంపతులు. వాళ్ళకు ఇద్దరు కుమార్తెలు–కళ్యాణి, సీత.

"ఆయనకేం మహారాజు! ఇంకా ఇద్దరు కూతుళ్ళున్నా – అవలీలగా సంబంధాలు తీసుకురాగలడు!" అని ఎవరన్నా స్నేహితులు తనను గురించి అనుకున్నప్పుడు శ్వేతాంబరానికి కొద్దిగా గర్వమూ, అంతకంటే ఎక్కువగా భయము కలిగేవి.... ఇలా ప్రారంభమవుతుంది కథానిక. ఎరవన్నా నా కూతుళ్ళ పెళ్ళిళ్ళకు సాయపడండ్రా అని అడిగినా – తన అసహాయస్థితిని గుర్తించే స్థితిలో లేరని కూడా శ్వేతాంబరం అనుకున్నాడు. అతని అసమర్ధతను ఎవ్వరూ గుర్తించే స్థితిలో లేరు కూడా! సాయం చేయకపోగా అతడిని నిశితంగా విమర్శించగలదు భార్య గుణమణి. అతడు ఏ సంబంధం తెచ్చినా ఆమోదించదు. పైగా నిరసిస్తుంది. వంకలు పెడుతుంది. ఆవిడకి మనోనేత్రం లేదు! 'ఒకప్పుడు ఉండేదేమో, ఇప్పుడు పువ్వేసిపోయింది' అని ఓ మిత్రుడన్న మాట తన భార్య పట్ల నిజమనిపిస్తుంది శ్వేతాంబరానికి. భార్యకి పెద్దకూతురు కళ్యాణిమీద ప్రేమ, భర్తకి చిన్న కూతురు సీతమీద ప్రేమ.

పెద్ద కూతురికి మంచి సంబంధం తేవడం లేదని గుణమణికి కోపం. "నీ కళ్ళకి నీ కూతురు రంభల్లే కనిపించగానే సరా?" అంటాడు శ్వేతాంబరం.

వెంటనే "మీ కళ్ళకి మాత్రం రంభల్లే ఎందుకు కనిపించకూడదు? కూతురు కాకపోయిందా?" అంటుంది గుణమణి. ఇలా సాగిపోతుంది వాళ్ళిద్దరి మధ్య సంభాషణ. కాసేపటికి విధిలేక అస్త్రసన్యాసం చేసి వినడం ప్రారంభిస్తాడు భర్త. ఇద్దరు ఆడపిల్లల్నీ భార్యాభర్తలిద్దరూ పంచుకున్నారు.

వీళ్ళిద్దర్నీ చూస్తుంటే భార్యాభర్తల మధ్య సంబంధం అత్యంత క్రూరమైనదిగా సీత బుద్ధికి తోచేది. తల్లిదండ్రులిద్దరూ ఎప్పుడు ఏ విషయాన్ని మాట్లాడినా వాటివెనుక ఏదో పరస్పర విద్వేషం దాగి ఉన్నట్లు అనిపించేది. తల్లిదండ్రులిద్దరూ ఒకళ్ళ మీదున్న

కోపం మరొకళ్ళు పిల్లల్ని దెప్పి పొడవడం ద్వారా తీర్చుకునేవాళ్ళు అనిపించేది. బయటికి మెత్తగా కనిపించే తన తల్లిదండ్రులది అన్యోన్య దాంపత్యమని ఎవరైనా అంటే ఆశ్చర్యమేసేది సీతకి. ఇద్దరూ చాలావరకు తప్పేనన్నది సీత అభిప్రాయం.

అక్క కళ్యాణిది ఎవర్నో ఒకరిని ఆనుకుని బ్రతికే మనస్తత్వమనేది చెల్లెలు సీత అభిప్రాయం. తనని చూసి గర్వపడే తండ్రి తీరుకామె ఎప్పుడూ సంతోషించేది కాదు. తామిద్దరిలో వాస్తవానికి తండ్రి సాయం అక్కకు ఎక్కువ కావాలని భావించేదామె. అక్క పెళ్ళికి తను అడ్డుగా వస్తున్నదన్నది తల్లి అభిప్రాయం. అందుక్కారణం లేకపోలేదు. పెళ్ళి చూపులకొచ్చిన వాళ్ళు కొందరు "మీ రెండో అమ్మాయిని చేసుకొంటాం" అనేవారు.

ఒకసారి కళ్యాణికి సంబంధం వచ్చింది. అన్నగారు చనిపోవటంతో తమ్ముడిమీద అన్నపిలల్ల భారం పడింది. "నా సంపాదన ఏ మూలకూ చాలదు కాబట్టి భార్య తరపు నుంచి ఏదైనా ఆర్థిక సహాయముంటే పెళ్ళాడతాను" అంటూ కుండ పగులకొట్టినట్లు చెప్పేశాడు కాబోయే పెండ్లికొడుకు. "సర్లే నాయనా, నీ నిర్ణయాన్ని మూడు రోజులలో తెలియచెయ్. మేము కూడా ఈలోగా ఓ నిర్ణయానికొస్తాం" అంటూ వుడ్ బి పెళ్ళికొడుకుని సాగనంపుతాడు శ్వేతాంబరం.

"ఎంత నాగరికత లేని మనిషీ, మీ సంబంధం మాకొద్దని చెప్పక – ఆలోచిస్తామంటా రేమిటి?" అని భర్తమీద విరుచుకు పడుతుంది నాగమణి. ఆవిడ గురించి చెబుతూ రచయిత చాలా బాగా చెబుతారు– తనకొక నాగరికత ఉన్నట్లు ఆవిడెప్పుడూ ఒప్పుకొనేది కాదు. అవతలివాళ్ళను బట్టి ప్రవర్తించాలన్నది ఆమె సిద్ధాంతం. భర్త ఏనాడూ భార్య సిద్ధాంతాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. భార్య ఆ సిద్ధాంతాన్ని భర్తకు వివరించనూ లేదు, అంటారు రచయిత. ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోకపోవడమే వాళ్ళ మధ్యవిభేదానికి కారణమని మనకర్థమవుతుంది, మనమెలా ఉండాలో కూడా మనకు తెలుస్తుంది.

మానసిక విశ్లేషణే కాదు, కొ.కు. చెప్పే పోలికలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం అని చెప్పటానికి కనుబొమ్మల వెంట్రుకలతో పోలుస్తారు. తనలో ఏమీ దాచుకోలేని ఆమెని స్టీమ్‌రోలర్‌తో పోలుస్తారు రచయిత.

కొంత ఆర్థిక సహకారాన్నందించమని పెళ్ళిచూపులకొచ్చిన యువకుడనటం భార్యకు నచ్చకపోతే, భర్త కొంతవరకూ అది నిజాయితీతో కూడుకున్న మాట అని భావిస్తాడు.

అమ్మాయినడిగితే కళ్యాణి "ఒకసారి కాకపోయినా నెలజీతం ఇస్తున్నట్లు నెలనెలా డబ్బునాశించే ప్రైవేటు మాష్టారికిచ్చి నన్ను పెళ్ళిచేస్తారా? నేను ఇష్టపడను" అంటుంది. "మరొకళ్ళను విమర్శించే ముందు మన గురించి తెలుసుకోవాలి" కోపంతో అంటాడు తండ్రి. "ఇలాంటి సంబంధమే సీతకొస్తే ఒప్పుకుంటారా" అంటుంది భార్య. ఆవిడ అంచనా ప్రకారం ఇది తన భర్త మీద బ్రహ్మాస్త్రం. అతడి నోరు మూయించడానికి ఉపయోగించే అస్త్రం. ఉక్కిరి బిక్కిరవుతాడు శ్వేతాంబరం తనభార్యమాటలకు.

"నాకైతే ఈ సంబంధం నచ్చింది" అంటుంది సీత. అక్కతోపాటు తల్లిదండ్రులూ నోరు తెరుస్తారు. తనకు చదువు చెప్పించినందుకు అన్నకు కృతజ్ఞతలుగా, అతను మరణించిన తరువాత అతని పిల్లలకు చదువు చెప్పించాలని సహాయమడిగిన అతనిలో వాళ్ళ వాళ్ళ మీద చూపే అపేక్షని – ఆ అపేక్ష తెలియని మనం వేళాకోళం చేయటం బాగోలే"దంటుంది చెల్లెలు సీత ఖణాఖండిగా. ఇదీ 'అక్కయ్యపెళ్ళి'. డబ్బుకన్నా ఆపేక్షలు మిన్నని ఈ కథానిక ద్వారా కుటుంబరావుగారు గొప్పగా చెప్పారు.

కథానిక ముగింపు సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తటమే కాకుండా , ఆలోచింపచేసేదన్న లక్షణానికి మచ్చుతునక ఈ కథానిక. కథానిక గురించి మనం చెప్పుకునే లక్షణాలన్నీ కుటుంబరావుగారి 'అక్కయ్యపెళ్ళి'లో కనిపిస్తాయి. పరిమాణ దృష్ట్యా ఇది చాలా చిన్నది కూడా!

"రచయిత తన స్వశక్తితో రాసుకుపోతున్నా, లక్ష్యము–లక్షణాలు తెలుసుకుంటే కథానికను ఇంకా బాగా రాయగలరు" అన్నది కొడవటిగంటి కుటుంబరావుగారి అభిప్రాయం. ఆ అభిప్రాయానికోమంచి ఉదాహరణే ఈ 'అక్కయ్య పెళ్ళి' కథానిక.

# గణేశ్‌పాత్రో 'చిన్నకథ'

ఇది గణేశ్‌పాత్రో రాసిన చిన్న కథేకాదు, చిన్నా అనే వ్యక్తి కథ కూడా!

ఒక పల్లెటూరిలో ఉండే చిన్నాకి చదువుకోవాలని ఆసక్తి! కానీ ఇంట్లో వాళ్ళు బిచ్చమెత్తు కుంటుంటారు. కానీ చిన్నా బిచ్చమెత్తకుండా పాఠశాలకి వెళ్తుంటాడు. ఇంటికి వచ్చి ఎవ్వరూ బిచ్చమెయ్యలేదంటుంటాడు.

ఒకరోజు నాన్నకు పాఠశాలలో దొరికిపోతాడు. తండ్రి వాణ్ణి చావగొట్టి మరీ 'చదవను' అనే ప్రమాణం చేయిస్తాడు. అందుకని చిన్నా పట్నం పారిపోయి వస్తాడు.

పట్నం చేరిన చిన్నాని ఓ కుటుంబం ఆదరిస్తుంది. చదువుపట్ల అతనికున్న అభిమానానికి అందరూ అచ్చెరువందుతారు. తమ కుటుంబసభ్యుడిగా ఆదరిస్తారు. అతను కాస్త దిగులు పడితే ఇంట్లో వాళ్లందరూ కంగారుపడిపోతారు, ఇంటిమీదకు గాలి మళ్ళిందేమోనని. ఇలా పాఠకుడు ఆలోచించేట్టు చాలా చక్కగా సాగుతుంది కథనం. రచయిత ఈ విషయంలో కృతకృత్యుడవుతాడు.

చిన్నాలో దిగులు రోజురోజుకీ ఎక్కువవుతుంది. ఆతనికి ఆతిథ్యమిచ్చిన ఇంట్లో రచయిత ఒక పాత్ర. ఆ రాత్రి అతడినే గమనిస్తున్న రచయితకి నోటిమాటరాదు.

అర్ధరాత్రి ఇంటి తలుపులు తీసిన చిన్నను చూసి వెళ్ళిపోతున్నాడనుకుంటాడు రచయిత. కానీ అతను ఇంటి బయట వేచివున్న తండ్రితో కలుస్తాడు. చిన్నా తలుపులు తీసి తప్పుకుంటే తండ్రి లోపలికి వచ్చి దొంగతనం చేస్తాడు. తండ్రి వెళ్ళిపోగానే తలుపులు వేసి లోపలకు వచ్చి పిల్లిలా పడుకుంటాడు చిన్నా.

అంతా చూసినా... ఇంట్లో ఎవ్వరికీ ఆ విషయం చెప్పడు రచయిత. అందరూ చిన్నాని అభిమానిస్తుంటారు. కాబట్టి ఈ విషయం తెలిస్తే వాళ్ళ గుండెలు ఎక్కడ పగలిగిపోతాయోననే భయమే వాళ్ళకి చెప్పకపోవడానికి కారణం.

ఒంటరిగా చిన్నాని తన గదిలోకి పిలిచి "ఇలా ఎందుకు చేస్తున్నావ్" అంటూ నిలదీస్తాడు.

చిన్నా తనని ఇంట్లోంచి బయటకు వెళ్ళగొట్టవద్దని కాళ్ళుపట్టుకుంటాడు. అతనంతకు ముందు చెప్పిందంతా కట్టుకథని రచయితకి అర్థమైపోతుంది.

"నాన్న దొంగ, అమ్మ సవతి తల్లి, నాకు చదువిష్టం. దొంగతనం చేతకాకపోయేసరికి నాన్న ఈ ప్లాన్ చెప్పాడు. మీ ఇంట్లో ఆశ్రయం సంపాదించి మీ నమ్మకం పొంది అవకాశం చూసి తనకు తలుపులు తీసిపెట్టమన్నాడు" అంటూ ఏడుస్తాడు.

"క్షమించమ"ని ప్రాధేయపడతాడు. ఏడుస్తున్నవాణ్ణి బలవంతాన బయటికి తీసుకువెళ్ళి తలుపులేస్తాడు రచయిత. "పారిపోయాడనుకుంటారు ఇంట్లోవాళ్ళందరూ. నీ దొంగబుద్ధులతో వాళ్ల మనసులలోని మంచి జ్ఞాపకాల్ని చెరిపివేయకు" అంటాడు చిన్నాతో రచయిత.

ఇంట్లోంచి బయట వెళ్ళిన చిన్నా ఏం చేస్తున్నాడో చూద్దామని రచయిత మేడమీద కిటికీ దగ్గరకు వెళ్తాడు.

అంతవరకూ దీపస్తంభం వెనుక దాగి వున్న తండ్రి ఇవతలికి వచ్చి చిన్నాని చితకబాదుతాడు.

"ఏరా... తలుపులు తీస్తాను రమ్మనమని చెప్పి, తీరా వస్తే ఇలా చేస్తావా?" అంటూ చేతిలోని కర్రతో చావబాదుతాడు.

రచయిత వాడిని కాపాడుదామని మేడదిగి, వీధిలోకి వెళ్తాడు.

దొంగ పారిపోతాడు. చిన్నా చిన్నబోయాడు... కాదు చనిపోయాడు అంటూ కథానికని ముగిస్తాడు రచయిత.

మంచి కథనం... శిల్పం, శైలి, బాగుండడంతో చకచకా ముందుకు సాగుతుంది కథానిక మలుపుమీద మలుపుతో. గణేశ్ పాత్రో తక్కువ కథానికలు రాసినా ఆయన మంచి కథానికలు రాశారనడానికి ఇది ఓ ఉదాహరణ.

# గోపీచంద్ 'సంపెంగ పువ్వు'

స్త్రీ తాలూకు సున్నిత మనస్తత్వానికీ నిదర్శనం గోపీచంద్ 'సంపెంగ పువ్వు'.

రైతుబిడ్డ, గృహప్రవేశం అనే చిత్రాలకి సంభాషణలు రాసినా, లక్ష్మమ్మ, ప్రియురాలు లాంటి చిత్రాలకి దర్శకత్వం వహించినా, రాష్ట్ర ప్రజాసంబంధాల శాఖ సంచాలకులుగా పనిచేసినా నాటికలు, వ్యాసాలు రాసిన గోపిచంద్ గారికి నవలా రచయితగా, కథానికా రచయితగా మంచిపేరు ఉంది. ఆలోచనను రేకెత్తించే ఈ కథానిక ఆయన మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ ఎంత సునిశితంగా రచనలు చేసేవారో చెబుతుంది.

ఆమె వస్తోందంటే ఆహ్వానించడానికి శాస్త్రి మిత్రులతో స్టేషన్‌కి వెళ్తాడు. ఆమె దిగగానే శాస్త్రి కరచాలనం చేసి, 'మీరు రారనుకున్నాను, ఆపేక్ష ఉన్న చోటే భయం వుంటుంది' అంటాడు.

ముఖ్యంగా ఈ కథని రచయిత ప్రథమ పురుషలో చెబుతాడు. నేను గొప్పవాణ్ణి అనుకుంటున్న వ్యక్తిలోని లోపాలని చూపిస్తూ, ఆఖరున అతనిలో మార్పుని తీసుకొచ్చే విధంగా కథానికని రాయడంలో ఉత్తమ పురుషలో చెప్పడం ఎంతగానో సహకరిస్తుంది. శాస్త్రి మిత్రులలో 'నేను' అని చెప్పుకునే పాత్ర ఒకటి. రచయిత తన పాత్ర అని ద్వారా అద్భుతంగా పాత్రలందరి మనస్తత్వాన్ని ప్రతిబింబించేశారు.

ఆమెతో అందరు మగవాళ్ళు ఆనందంగా మాట్లాడుతుంటే ఆలస్యంగా వచ్చిన కథని మనకి చెప్పే 'నేను' పాత్రని చూసి 'మా వాడికి' ఆడవాళ్ళని చూస్తే సిగ్గు' అంటాడు శాస్త్రి. ఆ మాటకి ఆమె చిన్నబుచ్చుకుంటుంది. బాధపడుతున్నట్లు కనిపించింది. మళ్ళీ కాసేపు కాగానే, అందరితో యధావిధిగా నవ్వుతూ మాట్లాడుతూంటుంది. 'మీకు నాకున్న అనుభవంలో పదో వంతు కూడా లేదు. కాబట్టి వయస్సు మాట ఎలా వున్నా మీఅందరికి నేను తల్లిని' అంటుంది. మిగతా వాళ్ళందరికి ఆమెలో 'నేను స్త్రీ'ని అనే భావం ఉన్నట్లు కనిపించదు. అందరితో కలిసి ఆమె హోటల్‌కి వెళ్తుంది. పక్కన ఉన్న వాళ్ళ ప్లేట్లలోంచి హల్వా లాంటివి తీసుకుంటుంది. సాయంత్రం పార్కుకి వస్తుంది. ఆడవాళ్ళతో మాట్లాడటానికి ఆమె

సిగ్గు పడేది. అందరూ మ్యూజియంలో జంతువుని చూసినట్టు, మగవాళ్ళ మధ్య ఆమెను చూసినా పట్టించుకోదు.

ఎప్పుడైనా కొంత బాధపడినట్లు అనిపించిన వెంటనే తేరుకొని, మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తుంది.

'నేను' అని మనకు కథ చెప్పే రచయితతో కలిసి సినిమాకి బయలుదేరుతుంది. వారితో 'మీ ఊరు చాలా వెనకబడి ఉంది. మనుషులు కూడా! అన్ని ప్రిమిటెవ్ లక్షణాలే. ఆడవాళ్ళ పని మరీ అన్యాయంగా ఉంది. ప్రతి భార్యా తన భర్తని ఇతర స్త్రీల నుంచి కాపాడటమే తన ధర్మంగా భావిస్తోంది. తన భర్తతో మాట్లాడే ప్రతి స్త్రీ తన భర్తని కాజేయడానికే ప్రయత్నిస్తుంది అనుకుంటుంది. మీరిక్కడ స్త్రీల క్లబ్ ఒక్కదాన్ని ఆర్గనైజ్ చేయండి' అంటుంది.

హాల్‌లో ప్రవేశించిన తర్వాత కూడా అతనితో ఏవేవో మాట్లాడసాగింది, సినిమాలోని పాత్రల గురించి, సంఘటనల గురించి, రచయితల గురించి. 'ఇక నేనిక్కడ ఉండలేను. ఈ వాతావరణంలో ఒక్క క్షణమైన బ్రతకలేను' అంటూ మర్నాడు ఉదయం వెళ్ళిపోయింది బొంబాయి. ఆ తర్వాత మిత్రులందరు ఆమెని, ఆమె ప్రత్యేక వ్యక్తిత్వాన్ని తలచుకున్నారు. ఆమె గురించి శాస్త్రి తక్కువ అంచనా వేసి మాట్లాడితే కోపంతో అతని మీద దాడి చేస్తాడు, కథ చెబుతున్న రచయిత.

ఈ విషయం శాస్త్రి ఉత్తరం ద్వారా అబద్ధాలేమీ కలపకుండా, నిజాయితీతో, క్లుప్తంగా ఆమెకు తెలియజేశాడు.

రచయితకి ఆమె నుంచి ఓ ఉత్తరం వస్తుంది. అది చదివిన రచయిత (నేను) హతాశుడవుతాడు. దాంట్లో, ఆమె ఏమి రాసిందంటే –

'మీరు చూపిన షివెల్రీ విషయంలో నాకు ఒక్క అనుమానం ఉంది. ఆడవాళ్ళని రక్షించవలసిన బాధ్యత పురుషుల మీద ఉందనే అభిప్రాయమే ఈ షివెల్రీకి కారణం అనుకుంటాను. ఈ అభిప్రాయానికి, స్త్రీ పురుషుడి ఆస్తీ అనే అభిప్రాయానికి చాలా దగ్గర సంబంధం ఉంది. నా ఆస్తీ అనుకున్నప్పుడు, ఆ ఆస్తీ తనను తాను కాపాడుకోలేని స్థితిలో ఉందనుకున్నప్పుడే కదా రక్షించవలసిన అవసరం కలిగేది. నేను ఒక్కరోజు మీతో తిరిగినంత మాత్రాన నన్ను కాపాడవలసిన బాధ్యత మీ మీద ఉందనుకోవడం అన్యాయం' అంటూ మనస్సు విప్పి రాస్తుంది. ఆఖరులో రచయిత ఆ పాత్ర ద్వారానే తన పాత్రని ప్రశ్నిస్తాడు. సినిమాలో సంపెంగ పువ్వు చేతికిస్తే సినిమా అయ్యేదాకా

వాసన చూస్తూ కూర్చుంటారా? వాసన చూడటానికేనా సంపెంగ పువ్వు విచ్చేది..? పువ్వులన్నీ ఎందుకు పుట్టినాయి? వాసన చూడటానికేనా...? సెలయేరు ఎందుకు ప్రవహిస్తోంది, గానం చేయడానికేనా? అని ప్రశ్నలు వేస్తూ చివరలో మరో ముక్క అంటుంది. నా భర్త కామేశ్వరుడు శాస్త్రి ఉత్తరం చూసి గుక్కలు పట్టి నవ్వాడు. మీ ఉత్తరం చూసినప్పు మీ మీద అతనికి చాలా ప్రేమ కుదిరింది' అని.

ఈ ఉత్తరాన్ని చూసిన నా పరిస్థితి ఏమిటో మీకు అర్థమయ్యే ఉంటుంది. ఖాయలా పడ్డాను అంటాడు. ఇలా, స్త్రీపట్ల సాధారణంగా సామాన్య పురుషులకుండే అభిప్రాయాల్నీ, స్త్రీతో వారు ప్రవర్తించే తీరునీ–పూసల్లో దారంలా చూపుతూ రాసిన చాలామంచి కథ–ఈ 'సంపెంగ పువ్వు'. కథలో ఆమె–వివాహిత అని ముగింపులో బహిర్గతం చేయటం–రచయిత శిల్ప ప్రజ్ఞ! 'నేను' అని కథని చెబుతున్న రచయిత.

# ఘడియారం శ్రీరాములు 'పంకజాక్షి'

**మొ**దట్లో కథానికల్లో వస్తువు-వ్యక్తిగత కోణం నుంచే చెప్పారు. క్రమంగా సమిష్ఠి కోణం నుంచి చెప్పడం ప్రారంభమైంది. సమాజకోణం నుంచి చెప్పినప్పుడే సాహిత్య ప్రయోజనం సమృద్ధి అవుతుంది. ఆ విషయం ఎంత ఎక్కువమందికి సంబంధించిందైతే దానికంత లాభం ఎక్కువ! 'అంత ఎక్కువమంది'కి చేరుతుంది. అంత ఎక్కువకాలం ఉంటుంది.

ఘడియారం శ్రీరాములు గారు రాసిన 'పంకజాక్షి' 1927 ఆగస్టు 'భారత కథానిధి' పత్రిక నుంచి పునర్ముద్రించినట్లు 'రాయలసీమ తొలితరం కథలు'లో ప్రకటించారు డా॥తవ్వా వెంకటయ్య.

కృష్ణారావు సర్కారోద్యోగి. కమల ఆయన ధర్మపత్ని. పంకజాక్షి వాళ్ళ ఏకైక కుమార్తె. ఒకరోజు అనుకోకుండా వచ్చిన మిత్రుడ్ని తన కుమారుడు మధుసూదనానికి మీ అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తే బాగుంటుందని కోరతాడు. కృష్ణారావు దంపతులందుకు వప్పుకోవడంతో మధుసూదన్, పంకజాక్షిల పెళ్ళవుతుంది.

ఒకరోజు వ్యాహ్యాళికి వెళ్ళిన మధుసూదనుడు హస్తాభరణాన్ని పోగొట్టుకోవడంతో మనోవ్యాధి పాలవుతాడు. ఆ హస్తాభరణాన్ని ఏ వేశ్యకిచ్చాడోనని అత్తవారింట్లో అనుమానిస్తారన్నది అతని భయం.

ఆ మానసిక వేదనతోనే అతను కృంగి, కృశించి, మరణించాడు.

చేసేదిలేక బాధపడుతున్న కృష్ణారావుకి ఓ ఆలోచన వస్తుంది. భార్య, కుమార్తెలతో పంచుకుంటాడు.

అక్కడనుంచి వితంతోద్ధరణకు పూనుకొంటాడు. వితంతు శరణాలయాన్ని స్థాపించి, వితంతువులకు చేతనైనంత మేలు చేయడం ప్రారంభిస్తాడు. మనకి చెడు జరిగితే కృంగిపోకూడదు. ఆ అనుభవంతో ఆ చెడు జరిగిన వాళ్లకు మేలు చేయాలని, ఆలోచించాలని చెప్తుంది ఈ కథానిక. దాదాపు 90 ఏళ్ళక్రితం ఇలాంటి అభ్యుదయ భావాల్తో రచనలు సాగించడం గొప్ప విషయం కదూ!

# ఘండికోట బ్రహ్మాజీరావు 'దీపం కొడిగట్టింది'

**వా**ళ్ళిద్దరూ పదేళ్ళలోపు పిల్లలు. మార్కెట్‌లోనూ, అక్కడా అక్కడా అడుక్కుంటూ, వచ్చేవాటితో జీవనాన్ని సాగిస్తున్నారు. వాళ్ళకి ఇంట్లో ఒక గుడ్డి అమ్మమ్మ మాత్రమే ఉంది.

సంతలోకి వెళ్ళి అక్కడ ఒకళ్ళు తంబూర వాయిస్తుంటే, మరొకరు నృత్యం చేసి కూరగాయల వర్తకుల్ని ఆకర్షింపసాగారు.

చంద్రమ్మ కూరగాయల దుకాణం ముందు ఎంతగా వీళ్ళు చప్పుడు చేసినా ఆమె దానం చేయదు. కారణం, ఆమెకు బోణి కాకపోవడమే!

బోణి అయ్యింది, కానీ ఆమె దానం ఏమీ చేయలేదు. పక్క దుకాణం నీలమ్మ "నేను సెప్పనేదా రామలచ్చనలు ఈళ్ళే" అంది. నీలమ్మ రెండు వంకాయలు, రెండు ముల్లంగి పెద్దవాడి జోలెలో వేసింది. చంద్రమ్మ నాలుగురకాల కూరగాయల్ని ఆ జోలెలో వేసింది. ఇద్దరూ మీ ఇద్దరికి కొత్త గుడ్డలు కుట్టిస్తామన్నారు. పిల్లలిద్దరు సంతోషపడ్డారు కానీ పెద్దవాడు, "నీలమ్మ తల్లీ నాకు స్కూల్ డ్రెస్ కుట్టించు, బడికి పోతా" అన్నాడు.

నీలమ్మకు, చంద్రమ్మకి కూడా ఆశ్చర్యం వేసింది.

"సదువుకోటానికి డ్రెస్ వేస్కెల్తే సరిపోదురా, నెలనెలా యాభయ్యో, వందో కట్టాలి" అంటూ ఇద్దరూ పెద్దవాడ్ని నిరుత్సాహపరిచారు.

సంతనుంచి బయలుదేరిన వాళ్ళు ఓ బేకరి దగ్గర ఆగుతారు. అతను వాళ్ళకి రెండు బన్‌లు ఇస్తాడు. మరో ఇంటిముందు ఆగారు. ఆ ఇంటి ఆవరణలో కాన్వెంట్ బట్టలు వేసుకున్న ఇద్దరు పిల్లలు ఆడుతున్నారు. వాళ్ళు కుక్కని విడిచిపెట్టారు. అది అరుస్తూ మీద పడబోతుంటే ఒక గెంతు గెంతుతారు ఇద్దరూ. కంకరరోడ్డు మీద పడతారు. కాళ్ళు చేతులు బిగుసుకుపోతాయి. అంతవరకు అడుక్కున్న బియ్యం, కూరగాయలు నేలపాలవుతాయి. పెద్దవాడు వాటిని ఏరుకుని తమ్ముడితో బయలుదేరతాడు.

ఊరు చివర కొండమీద ఉన్న ఓ చిన్నపాకకి చేరతారు. వాళ్ళ ముసలి, గుడ్డి అమ్మమ్మ అక్కడే ఉంటుంది. పొద్దున్నే ఆమెకి గంజి కాచి ఇచ్చి, వీళ్ళు అడుక్కోడానికి బయలుదేరతారు. మధ్యాహ్నం ఎండ చల్లపడుతుంటే వచ్చి ఏదో వండి, ముసలిదానికి ఇంత పెట్టి, వాళ్ళు తింటారు.

కానీ ఆరోజు వాళ్ళు ఇంటికి జేరేసరికి చీకటి పడిపోయింది. వర్షం పడుతూ ఆ పాకలో కాలవలై ప్రవహిస్తోంది. పొయ్యిలో పెట్టే కట్టెలన్నీ తడిసిపోయాయి. దొరికిన బియ్యం, పెసరపప్పు నిండా మట్టి. బేకరీ అతను ఇచ్చిన రెండు బన్నులు పాడవలేదు. మరొక అమ్మ ఇచ్చిన జామకాయ బాగుంది.

పెద్దవాడు ఒక బన్‌ని అవ్వకిచ్చాడు. రెండో బన్‌ని తమ్ముడికిచ్చాడు. మిగిలిన జామకాయని నములుతూ మూలనున్న పెట్టెమీద కూర్చుని, చంద్రమ్మ – నీలమ్మ పెట్టే బట్టల గురించి, చదువు గురించి ఆలోచించసాగాడు.

"పెద్దోడా! బుడ్డి ఎలిగించావా" అని రోజూ అడిగినట్లే అడిగింది గుడ్డి అవ్వ–

పెద్దవాడు జవాబు చెప్పలేదు.

చిన్నవాడు నిద్రలో ఉన్నాడు.

"సీకట్లో తినకురా పెద్దోడా" అవ్వ మళ్ళీ అంది.

"దీపం కొడిగట్టిందవ్వా" అని పెద్దాడు పదేళ్ళకే వేదాంతాన్ని జీర్ణించుకుని చెప్పడంతో కథానిక ముగుస్తుంది.

రోజూ మన కంటిముందు ఇలాంటి అనాథపిల్లలు ఎందరో కనిపిస్తూంటారు. వాళ్ళ గురించి పట్టించుకోము, మన గోలలో. మహా అయితే "పాపం పసివాళ్ళు" అని లిప్‌సింపతీ చూపిస్తాం. అటువంటి వాళ్ళకి కావల్సింది జాలి కాదు, కొద్దిగానైనా సాయం అనే విషయాన్ని మనకి చెబుతుంది 'దీపం కొడిగట్టింది' అనే ఘండికోట బ్రహ్మాజీరావుగారి కథానిక.

# చలం 'ఓ పువ్వు పూసింది'

**చ**లం శైలి అద్భుతం. వాక్య నిర్మాణంలో ఆయనకాయనే సాటి. ఈ విషయం కొత్తగా చెప్పుకోనక్కర్లేదు. కానీ 'ఓ పువ్వు పూసింది' గురించి మాట్లాడుకునేటప్పుడు మళ్ళీ మళ్ళీ అయినా చెప్పుకోక తప్పదు.

'అర్ధరాత్రి అడవిలో పువ్వు పూసింది...' అంటూ ప్రారంభిస్తారు కథానికని రచయిత.

పువ్వు... అంటే సున్నితమైన స్త్రీ. స్త్రీ సున్నితమైనదనే విషయం 'పువ్వు'తో పోల్చి, చెప్పకనే చెబ్తారు. ఆకులు, తొడిమలూ ఆ పువ్వుల్ని దగ్గరకు తీసుకుని భయం లేదని హూయించాయి.

'నీ దగ్గరకు నన్నెవరు తెచ్చారు' అని పిల్ల పువ్వడిగితే 'నేనే తెచ్చుకున్నానంటుంది' పూలతీగె.

భయమేస్తోందని పిల్ల పువ్వంటే – నేనున్నాగా భయంలేదంటుంది పూలతీగ.

వెన్నెల్లో తల్లి, పిల్లలకెంతో అందంగా కనిపిస్తుంది. 'ఎవరివమ్మా నువ్వు కావలించుకుని అల్లుకున్నావ్' అని తల్లితీగ నడుగుతుంది పువ్వు.

"మీ నాన్న" నంటుంది తీగ.

చుట్టూ ఏర్పడ్డ మంచు, పువ్వును కడుగుతోంది. రేకుల్లో చిన్న చిన్న నొక్కుల్ని అందంగా దిద్దారు– చుట్టూ మూగినవారు. మంచు ముత్యాలహారాలు వేశారు. కోయిల అరుపులు.... వాతావరణాన్ని చక్కటి కవిత్వ ధోరణిలో చెబుతారు చలం.

కాంతి అలలమల్లే ప్రపంచం మీద విరుచుకు పడుతోంది. లోకం రూపమే మారింది. సగం చందమామ నవ్వుతో ఆకాశంలోపలికి, కరిగిపోయాడు. పక్షులన్నీ రెక్కలు చాచి ఎగురుతున్నాయి. మృగాలు వళ్ళు విరుచుకు కదులుతున్నాయి... ఇక్కడే రచయిత తను చెప్పదలచుకున్న దానికి బీజం వేశారు.

అమృతంతో తానంతా నిండిపోవడంతో నవయవ్వనంతో పులకించిపోయింది పువ్వు.

తన నుంచి పరిమళం!

సంగీతాలతో, నృత్యాలతో– సూలుతూ, తూగుతూ, చుట్టూ మధుపాలు సేవించి వెంబడిరాగా, పూలని లెఖ్ఖకింద తలెత్తి చూడకుండా గుర్వంగా, యవ్వనంతో మదించి, ఒంటినిండా పుష్పరజం చల్లుకుని పోతున్నాడు మధుపం.

ఎండలో రజంలోంచి నల్లగా మెరిసే అతని దేహం, క్రూరమైన తొండం, రక్తం వలె ఎర్రనైన కళ్ళు, గాలిని శూలాలవలె గుచ్చే మీసాలు చూసి వణికింది పువ్వు.

సరాసరి ఆమె దగ్గరకే వచ్చాడతను.

"మధుపం' ఆమె తన స్వంతమయినట్లు, అంధకారమైనట్లు - సంకోచం లేకుండా విహరించే రాజ్యసీమైనట్లు, కరకు గోళ్ళతో, మృదుపత్రాలు ఏమవుతున్నాయో అనే దృష్టి లేకుండా వాలాడు పువ్వుమీద. నిర్భయంగా, ఏమీ తన అనుజ్ఞ లేకుండా, క్రూరంగా గోళ్ళతో చీల్చి, తలదూర్చి తనెన్నడూ తనలో వున్నదని తెలీని తన గర్భకుహాంతరాన్ని తొండంతో ఛేదించి తాగుతున్నాడు మధువంతా.... కాని అప్రయత్నంగా రేకలతో అతన్ని కప్పి దాచుకుంది" అంటూ 'ఓ పువ్వు పూసింది' కథానికలో చలం నర్మగర్భంగా చెబుతారు సృష్టి రహస్యాన్ని.

తర్వాత పువ్వు ఎంత ఆక్రోశించినా, వినిపించుకోకుండా ఎక్కడికో ఎగిరిపోతాడు మధుపం.

నక్షత్రపు మిణుకు మిణుకులోంచి జారిన కాంతిరేఖ పువ్వు దగ్గరకు వచ్చి రమ్మంటుంది.

"నా పాపాయి" అంటుంది పువ్వు.

"నీ ప్రాణం దానికిచ్చేసిరా...."

లోకమంతా పెద్దవెలుగు. అన్ని రూపాల్ని, భిన్నత్వాల్ని మనసులో కరిగించుకుంటూ మెత్తని వెలుగు... నవ్వుతో తన వార్ధక్యం, నిరర్థకత్వం, ఎండుతనం అంతాపోయి బాల్యం, యవ్వనం, బలం, సంతోషం, మాతృత్వం, ప్రేమ'- అన్నీ అతని ముందు అర్పించి మొక్కింది. అతని చేయి పట్టుకుని ఆనందంలోకి ఒక్క దూకు దూకింది.

అంటూ ముగిస్తారు చలం కథానికని.

1949లో వచ్చిన ఈ కథానికలో కవిత్వం కనిపిస్తుంది. స్త్రీత్వం కనిపిస్తుంది. దానిని పురుషుడు ఎలా నలిపేస్తున్నాడో అర్థమవుతుంది. స్త్రీ చేతిలో పురుషుడెలా నలిగిపోతున్నాడో అసభ్యతకు తావీయకుండా ఓ పువ్వు, మధుపంల ద్వారా సింబాలిక్‌గా గొప్పగా చెప్పారు రచయిత చలం. తెలుగు రచయితలలో ఆయన ప్రత్యేక స్థానాన్నెందుకు సంపాదించుకోగలిగారో 'ఓ పువ్వు పూసింది' కథానిక చెబుతుంది.

# చాసో 'ఎంపు'

ఎర్రి, దాని కుష్ఠురోగపు తండ్రి, సత్రము అవతల ఉన్న వరండాలో ఉంటుంటారు. అదే ప్రాంతంలో అడుక్కుతినే కుంటివాడికి ఎర్రి అంటే ప్రాణం. ఈ అడుక్కుతినేవాళ్ల మధ్య చాగంటి సోమయాజులు (చాసో) గారు రూపొందించిన అద్భుతమైన కథానిక 'ఎంపు'.

వాళ్ళు మిగతావాళ్లకి లాగానే ప్రేమించుకుంటారు, ద్వేషించుకుంటారు, కూటికోసం రకరకాల పాట్లు పడుతూ ఉంటారు. పెద్దవాళ్ళ మధ్యే కాదు, అడుక్కుతినేవాళ్ళ మధ్య మానవ సంబంధాల కన్నా, ఆర్థిక సంబంధాలు ఎక్కువగా ఉంటాయి. అందుకని తన కూతురు కుంటివాడిని పెళ్ళిచేసుకోవడంకన్నా, గుడ్డివాడిని పెళ్ళిచేసుకోవడమే మేలు అని భావిస్తాడు కుష్ఠు తండ్రి. కుష్ఠు రోగంతో శరీర భాగాలు తెగిపోతున్న మనిషిని బ్రతికించేదీ, ముందుకు నడిపేదీ డబ్బు అన్నది అతని ధీమా.

ముష్ఠివాళ్ళు, ముష్ఠివాళ్ళకు సహాయం చేయరు. ముసలి ముష్ఠిది బియ్యం అడిగితే ఇష్టపడని కుంటోడు... ఎర్రిని పెళ్ళాడమని వెంటపడతాడు, కలిసి ఉందాం, కలిసే వండుకుని తిందాం అని అంటాడు కుంటోడు. కుంటోడి సహాయంతో ఎర్రిపెట్టిన చేపల పులుసుకి నిద్రలేచిన ఆమె తండ్రి, ముసలోడు ఎర్రిపక్కన ఉన్న కుంటోడిని చూసి, ఆడు ఎవడు అంటాడు. 'కలిసి వండుకుంటున్నాం' అంటుంది ఎర్రి. ముసలాడు, కుంటోడ మధ్య కులపరమైన ఆధిపత్యాన్ని చూపించుకుంటూ–నీ కులంకన్నా, నా కులం గొప్ప అని పోట్లాడుకుంటారు. కుంటోడికి కోపం వచ్చి 'నాతో వచ్చెయ్' అంటాడు ఎర్రిని.

'రోగిష్టివాడైన తండ్రిని వదిలేసి నేనెలా వస్తాను' అంటుంది ఎర్రి. కుంటోడు తిననని ముసుగుతన్ని పడుకుంటాడు. ఎర్రి ఎంత బ్రతిమిలాడినా లేవడు.

ఇంతలో ఎర్రి తండ్రి ఓ అడుక్కుతినే గుడ్డోడిని తీసుకొస్తాడు, 'ఇక నుంచి మనం ముగ్గురం కలిసి వండుకుంటాం' అంటాడు కూతురితో.

గుడ్డోడు ఎర్రిని కుశలప్రశ్నలు వేస్తాడు. తండ్రి ఎర్రిని కాస్త అవతలకు తీసుకెళ్ళి, 'సూసినావా గుడ్డోడిని' అంటాడు. ఎర్రికి అతను అంతకు ముందే తెలుసు–నల్లగా రాయిలాంటి వళ్లు. నుదురు నిండా మెరిసిపోతూ నామం! పేలిన పత్తికాయల్లాగా కిందికి జారిపోతున్న గుడ్లు–చూడటానికి భయమేస్తూ ఉంటాడు.

'నీకు సొట్టోడిమీద ఉన్నాది కదూ?' అంటాడు వెక్కిరింపుగా తండ్రి.

'నాకు ఎవడిమీదా నేదు' అంటుంది ఎర్రి. 'అలా అన్నావు బాగుంది' అంటూ ఎర్రి తండ్రి 'కుంటోడికీ, గుడ్డోడికీ తేడా సెప్పు'.

'సొట్టోడు నక్కలా ఉన్నాడు', గుడ్డోడు భయమేస్తున్నాడు' అంటుంది ఎర్రి.

'నాను భయమేస్తున్నాను, నేనూ కుష్ఠురోగిని, నన్నెలాగా చూస్తున్నావు' అని కూతురిని ప్రశ్నిస్తాడు.

'నువ్వు తండ్రివి' అంటుంది.

'నాను తండ్రినని ఇష్టపడ్డావా, గుడ్డోడ్ని మొగుడని ఇష్టపడు' అంటాడు తండ్రి.

తిరుగుబాటు చేయడానికి సత్తువలేదు ఎర్రిలో, కనిపెంచిన తల్లిదండ్రులకి పిల్లల మీద అధికారం ఉంటుందన్నది ఎర్రి అభిప్రాయం.

'గుడ్డోడు మారాజు, కళ్ళు లేని కబోది. ఆడి జన్మకి అదొక్కటే చానా. ఆడ్ని సూస్తే జాలిపుడతాది. ఏ యమ్మయినా మనసు కరిగి ఇన్ని గింజలేస్తాది. అదంతా ఎందుకూ ఆడు పాటగోడు. ఆడి ముందర గుడ్డ పరిసి నువ్వు వెళ్లిపో, పైసలు రాల్తాయి. సొట్టోడు ఏ గుమ్మం ఎక్కినా–మొహమ్మీద భడీమని తలుపేసుకుంటారు', అన్న చిదంబర రహస్యాన్ని చెబుతూ తండ్రి, మరో మాటా అంటాడు. 'ఆడు గుడ్డోడు కాబట్టి నీ సెప్పుసేతల్లో ఉంటాడు, నువ్వు ఎక్కడికెళ్లినా గుడ్డోడు కాబట్టి సూడరాడు. నీకు మనసైంది. ఇష్టమొచ్చినట్టు తిరుగు, తఖర నేదు.. ఏమంటావ్' అడుగుతాడు.

అతని మాటలకి లొంగిపోతుంది ఎర్రి. గుడ్డోడు మొలగుడ్డల చాటున దాచుకున్న డబ్బు మూటని తీసి ఎర్రికిస్తాడు. 'నీకేవి కావల్సివస్తే అవి కొనుక్కో' అంటాడు.

ఇది ఎర్రి కథానిక.

కుష్ఠు తండ్రి దూరదృష్టిని, కూతురు జీవితం బాగుండాలనే ఆశనీ గొప్పగా చెప్పాడు రచయిత.

సందర్భాన్ని బట్టి ఆయన చేసిన వర్ణనలు అద్భుతం. అలాగే మాండలికాన్ని పాత్రోచితంగా వాడారు. రచయిత చెప్పే మాటల్ని అందరూ మాట్లాడుకొనే వ్యావహారికంలో రాశారు. రచయిత జీవితానుభవం ప్రతి అక్షరంలోనూ కనిపిస్తుంది. కథానిక అంటే చిన్న కథ అన్న విషయం ఈ ఐదుపేజీల కథానిక మనకు చెబుతుంది. అలాగే, ముష్టోళ్ల జీవితాల గురించి చెబుతూ వాళ్ళ ప్రేమల్నీ చెప్పారు. ఎర్రిది, కుంటోడిదీ స్త్రీ పురుషుల మధ్య ప్రేమ అయితే; ఎర్రిది, వాళ్ళ తండ్రిదీ తండ్రీకూతుళ్ల ప్రేమ. ఈ రెండు ప్రేమల్ని విడమర్చి చాలా చక్కగా చెప్పారు 'చాసో' గారు.

# చావా శివకోటి 'కాంచన మృగం'

పార్వతి ఉద్యోగిని. ఆఫీస్ వదిలారు. వాన. బస్‌స్టాప్‌లో నిలబడి వుంది. చీకటి పడింది. వర్షం ఎక్కువైంది. బాగా తడిసి పోయింది. స్టాప్‌లో ఒక కుంటతనున్నాడు. ఆమెనే చూస్తున్నాడు. సిగ్గూ భయమూ కలిగాయి. చిన్నతనం గుర్తుకొచ్చింది. తన అందం స్పృహకలిగింది. "నిన్ను చూస్తే మాకే ముద్దెట్టుకోవాలనిపిస్తుందే" అని సహోద్యోగిని నాగ అనే మాటలు గుర్తుకొచ్చాయి. 'సంస్కార యుతమైన నడక, మంచి ఛాయ, చెదరని నవ్వు, విశాలమైన కళ్లు, అందాన్ని ఇనుమడింప చేసే ముక్కు…' నిజానికి ప్రతి కదలికా ఎదుటివారి ఊహలకి రెక్కల్నిస్తాయి. అందుకే సాధ్యమైనంత వొద్దికగా ఉంటుంది. జల్లు పెరిగింది. ఊహల్లోనే, భయమూ సాగుతోంది.

ఎట్టకేకలకు బస్ వచ్చింది. ఇల్లు చేరింది. కూతుర్ని చూడగానే, తల్లి 'వచ్చావా? పైగా వర్షం. నీ కోసమే చూస్తున్నాను' అంది –తలమీదనున్న బండను క్రిందకు గిరాటేసి తేలికగా ఊపిరిపీల్చుకున్నట్టుగ. "నేనేమన్నా పసిదాన్నా? తోవ తెలీదా? మారిపోతానటే?" అని నవ్వి 'అమ్మా–నేను పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని. నే చేస్తున్న ఉద్యోగం పోలీస్ కమీషనర్ ఆఫీస్. వయస్సిప్పుడు ఇరవైమూడు దాటి ఇరవైనాలుగొచ్చింది. ఒక్క చదువేకాదు. ఇంత ఇంగితాన్ని కూడా మీ పెంపకాన నేర్చుకున్నాను'. అంటుంది పార్వతి. మాటలు సాగుతాయి. తల్లి తన భయాన్నీ, ఆందోళననీ, లోకరీతినీ చెప్తుందిలా. 'ఆగు. చదువు సంస్కారాన్నివ్వడంలేదు. చదువునే ఇస్తున్నది. పైగా ఆ చదువు అహంకారాన్నిస్తున్నది. అది మనిషిని ఎంతగానైనా చెడుపుతుంది. అదీగాక, ముందు నువ్వు ఆడపిల్లవి. వయస్సు, అందం వున్న దానివి. ఈ సమాజాన నువ్వు ముఖ్యమంత్రిగా వున్నా, ఆడపిల్లను అనే దాన్ని మరచిపోకు. కుక్కలు చింపిన విస్తరవుతది బ్రతుకు! ఆనక ఏమనుకొని ఏం లాభం?' "ఏంటమ్మా! ఆడపిల్ల మనిషి కాదా? నవ్వు మరీనూ?" అంటుంది పార్వతి. ఆ తర్వాత కొద్ది సేపటికి – వర్షంలో బాగా తడిసిపోయి తండ్రి వస్తాడు. పార్వతిని చూసి, "నువ్వు వచ్చావుగదా! వాన, చీకటి. వచ్చావో రాలేదో అని భయ పడుతూ వచ్చా" అన్నాడు. వారి మనోగతాలకి ఎంతో కొంత అర్థమున్నట్లే అనిపిస్తుంది పార్వతికి.

కథానిక వాస్తవానికి అద్దంపట్టాలంటారు. ఇంత వరకూ జరిగిందదే. అయితే, గొప్పకథల్లో జీవిత వాస్తవికతతో పాటు, జీవిత విశ్లేషణ వుండాలి. జీవిత స్థితిమీదా, గతిమీదా, లోకం పోకడమీదా రచయిత కథానికా గతమైన వ్యాఖ్యానమూ వుండాలి. చదువరులకందించే దృక్పథానికి అప్పుడే ప్రయోజనం. శివకోటి కూడా గొప్ప రచయిత. కనుకనే ఈ కథానికకు ఇలా ఒక సమంజమైన, అర్థవంతమైన ముగింపు వ్యాఖ్యానాన్ని ఇచ్చారు. చూడండి.

"మనిషి సత్యాన్ని తెలుసుకోవడానికి గొప్ప భావుకుడు కానక్కరలేదు. గొప్ప తెలివిమంతుడూనూ కానక్కరలేదు. కొద్దిపాటి అంతర్మథనం, పరిశీలనా చాలు. మగవాడంటే ఆడాళ్లపైన, సంతానం పైన, సేవకులపైన, ధనధాన్యాలపైన, సమాజంపైన మాయజలతారును కమ్మేవాడు. ఓ కాంచన మృగం!"

– ఇదీ 'కాంచనమృగం' కథానిక. ఈ కథానికని గొప్ప దానిని చేస్తున్న అంశాల్ని పరామర్శచేస్తే, ముందుగా స్ఫురించేది కథలోని లోకసహజమైన ఇతివృత్తం. ఆడపిల్లని గురించి తల్లిదండ్రుల శ్రద్ధ, భయం, ఆందోళన. ఇవన్నీ కల్పిస్తున్న కారణాలు – జీవితంలో, సమాజంలో జరుగుతున్న అవాంఛనీయ ఘటనలు. వ్యవస్థాగతమైన సంభవాలకి, వ్యక్తులు మూల్యం చెల్లించి రావటం – ఎన్నో సామాజిక దురాగతాల్లో చూస్తూనే వున్నాం కదా. రెండవ గుణనైశిత్యం – పాత్రపోషణ. ముగ్గురే పాత్రలు. వారు ముగ్గురూ ఎంత మాట్లాడాలో అంతే మాట్లాడతారు. ఎలా ప్రవర్తించాలో అలాగే ప్రవర్తిస్తారు. ఇదీ విశేషం. మూడవ విశిష్టత – కథానికలోని క్లుప్తత. ఏకాంశవ్యగ్రత. ఒక్కటే పాయింట్. మగవాడు 'కాంచనమృగం' వంటివాడు. దాన్ని సంభావ్యతతో ఆవిష్కరించటానికి వస్తు పరిధిలోపలే – రచయిత తన రచనా ప్రతిభని చూపారు. నాలుగవ అంశం – శిల్పం, శైలీ. కథానిక ఎక్కడ మొదలెట్టాలో అక్కడ మొదలెట్టి, సన్నివేశ పరికల్పనతో, సంఘటనసృష్టితో కథనానికి పుష్టిని కూర్చారు. భాషాశైలీ కథానుసరణంగా, చిన్న చిన్న వాక్యాలతో అద్భుతంగా సాగాయి. కొన్ని చోట్ల రెండు మూడు పదాల వాక్యాలు, కథానికా నడకకి ఊపునీ, లయనీ, తూగునీ కూర్చాయి. ఇదీ కథానిక మెరుపు.

# చింతా దీక్షితులు 'సుగాలీ కుటుంబం'

**ఆ**ధునిక తెలుగు కథానికను వస్తుపరంగా గొప్ప మలుపు తెచ్చినవారు చింతాదీక్షితులు. సంచార జీవనం సాగిస్తున్న కొండజాతివాళ్ళ జీవితాల్ని వస్తువుగా చేసుకుని మొట్టమొదటగా కథానికలు రాసింది చింతా దీక్షితులే! దాసరిపాట, చెంచురాణి, సుగాలీ కుటుంబం లాంటి వైవిధ్య కథానికల సృష్టికర్త.

అడవి మీద ఆధారపడి బ్రతికే పేదకుటుంబం 'సుగాలీ కుటుంబం' గురించి రాసిన గొప్ప కథానిక. మానవతా ధోరణికి మచ్చుతునక. మునిస్వామి ఆప్రాంత అడవుల సంరక్షణాధికారిగా కొత్తగా బదిలీమీద వచ్చాడు. ముక్కుకు సూటిగా పోయే వ్యక్తి.

ఒకరోజు అడవి కాపరులు కొందరు నల్లమద్ది కొమ్మని కొట్టి పట్టుకుపోతుండగా పట్టుకున్నామని ఓ వ్యక్తిని మునిస్వామి దగ్గరకు తీసుకొచ్చారు. మునిస్వామి నిర్దాక్షిణ్యంగా అతడిని మేజిస్ట్రేట్ ముందుకు తీసుకువెళ్ళేసరికి రెండు సంవత్సరాల శిక్ష పడింది అతనికి. ఇలా నిర్దాక్షిణ్యంగా పనిచేస్తున్న ఆయన కీర్తి చంద్రికలు అచిరకాలంలోనే నలువేపులా వ్యాపించాయి.

మునిస్వామి అధికారంలో వున్న ఓ అడవికి సమీపంలో ఓ సుగాలీ కుటుంబం కాపురముంటోంది. సుగాలీలు అడవిజాతికి చెందినవాళ్ళే! వీళ్ళకి అడవులు కొండలే నివాసస్థలాలు. ఈ సుగాలీ కుటుంబం కూలిపనులున్నరోజులలో కూలి చేసుకునేవాళ్ళు. కాటకంరావడం, కూలిపనులు పోవడం ఒక్కసారే జరిగింది. కట్టెలు కొట్టుకుని జీవిద్దామంటే అడవి స్వాధీనంలో లేదు. అడవిజాతి వాళ్ళని, అడవిని అనుభవించ వద్దనడం, పిల్లలను తల్లిపాలు తాగరాదనడమే' అంటారు రచయిత దీక్షితులు.

ఆ సుగాలీ కుటుంబయజమాని పేరు రూపల్ నాయక్. భార్య చంద్రి. పిల్లలు ఏడుగురు. తొలికోడి కూయడంతోనే రూపల్ నాయక్, చంద్రికొండలమీద అడవులలోకి వెళ్తుండేవారు. అక్కడ దేవదారు కూర, పింకికాయలు, పాలపళ్ళు, వెలగపళ్ళు, ఏవి దొరికితే వాటిని తీసుకుని మధ్యాహ్నం కల్లా ఇంటికి చేరుకునే వారు. అప్పుడు కొర్రన్నమో, జొన్నసంకటో, జొన్నరొట్టో చేసి పిల్లలకి పెట్టి తాము తినేవారు. ఇలా కష్టపడే జీవించేవారేగాని 'దేహి' అని చేయిజాపి అడుగరు, ఎవరైనా ఇస్తే వద్దనరు.

క్షామం వచ్చింది. ఇలాంటి స్థితిలో కొందరు యాచకులవుతారు. ఇంకొందరు దారులు కొట్టి జీవించడం ప్రారంభిస్తారు. ఆ దశలో, ఈ పళ్ళని అక్కడక్కడ పోగుచేసుకుని, వాటినెండబెట్టి, దంచి గింజలను పారవేసి ఆ పొట్టుతో రొట్టెలను కొట్టుకొని తినేది రూపల్ నాయక్ కుటుంబం. కొంతకాలం ఇట్లా గడిచింది. ఈతపళ్ళు కూడా కొన్నాళ్ళకు కరువయ్యాయి. చింతగింజల్ని ఏరుకువచ్చి, నీళ్ళలో నానవేసి ఎండబెట్టి, తిరుగలిలో విసిరి, ఆ పిండితో రొట్టెలు చేసుకుని తినేవారు. కొంతకాలానికి చింతగింజలూ కరువయ్యాయి.

ఒకరోజు సుగాలీ కుటుంబం చింతచిగురు, చింతపండూ బూడిదలో కలిపితే తయారైన పదార్థాన్ని ఆత్రంగా తింటున్నారు. అడవిలో వచ్చిచింతపండు తీస్తున్న రూపల్ నాయకుణ్ణి అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. అడవికి నష్టం కలిగిస్తున్నాడంటూ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. నాలుగు సంవత్సరాలు శిక్ష పడింది. ఆ తర్వాత సుగాలీ కుటుంబం చెల్లాచెదురైంది.

నాల్గు సంవత్సరాలు గడిచిన తర్వాత తిరిగి అక్కడకు వచ్చిన రూపల్ నాయక్‌కి తన కుటుంబ సభ్యులందరూ చెల్లాచెదరయ్యారని అర్థమవుతుంది.

విషజ్వరము మునిస్వామి ఇంట ప్రవేశించి, చూస్తుండగానే భార్యాపిల్లలు చనిపోతారు. 'నా' అనే వాళ్ళు లేని అతను ధనాన్నే చుట్టంగా చూసుకోవడం మొదలుపెట్టాడు. అక్రమార్జనకి అలవాటుపడిన అతడి గురించి తెలిసిన పై అధికారులకు ఉద్యోగం నుంచి తొలగిస్తారు. స్వగ్రామం వెళ్ళిన అతనికి బంధుమిత్రుల ఆప్యాయత కరువవుతుంది.

మునిస్వామి, రూపల్‌నాయక్ – ఇద్దరూ రెండు రకాల కరువులకు గురయ్యారు.

అడవుల మీద, సుగాలీల మీద రచయితకి పరిపూర్ణ అవగాహన ఉండడంతో కథానిక చాలా ఆర్ద్రతతో సాగుతుంది. రచయిత మధ్య మధ్య సుగాలీలు పాడుకునే పాటల్నీ కలపడంతో దృశ్యం మన కంటిముందు మెదుల్తుంది. చదువుతుంటే, వస్తువు వైవిధ్యంతో కూడుకున్నది, మంచి శిల్పం, విషయానికి విలువ పెంచింది. దాంతో ఇది ఓ గొప్ప కథానికైంది.

వాస్తవాల్ని పోగుచేస్తే మంచి కథానిక కావచ్చు. కానీ, కల్పనకూడా తోడైతేనే గొప్ప కథానికవుతుందంటారు బుచ్చిబాబు. ఆ విషయాన్ని నిజం చేస్తుంది ఈ కథానిక.

# ద్వివేదుల విశాలాక్షి 'తీరని కోరిక'

**తీ**రని కోరిక ఎవరిది? ఎందుకు? చాలా హృద్యంగా చెప్పేరు ద్వివేదుల విశాలాక్షిగారు. ఈవిడ చాలా మంచి నవలలేకాక, కథానికలూ రాసారు.

రావ్ బహదూర్ రంగరాజుగారు హఠాత్తుగా చనిపోయారు. ఊళ్ళోవున్న అందరూ ఆయనను చూడడానికి వస్తుంటారు. అందరి యోగక్షేమాలు తెలుసుకుంటూ, అవసరమైన వాళ్ళకు సాయం చేస్తూ తిరగడం ఆయనకు అలవాటు. అందుకే ఆయనంటే అందరికీ అభిమానం. ఆ గ్రామంలోని వాళ్ళందరూ ఆయన సాయాన్ని ఎప్పుడోకప్పుడు పొందినవారే!

ఆ ఊళ్ళో స్థిరపడడానికి కొత్తగా వచ్చిన పొట్టిపంతులుకి రంగరాజుగారెవరో తెలీదు. తన దగ్గరకు ఏ సహాయానికీ రాకపోవడం రంగరాజుగారికి బాధకలిగిస్తుంది.

ఆయన గతంలోకి వెళ్తే– ఆనాటి దేశభక్తులందరిలాగే జైల్లో కొంతకాలం గడిపారు. స్వాతంత్ర్యం వచ్చిందన్న తృప్తితో బయటకు వచ్చిన రాజుగారికి బైట కథ; కంచే చేసుమేస్తున్నట్లనిపించింది. జమీందారీలు పోవాలనీ, ఈనాములు రద్దుచేయాలనీ నినాదాలు రంగరాజుగారి మనసుని కష్టపెట్టాయి. తమ జీవితకాలం తను గ్రామంలోని ప్రజలందరికీ అండగా నిలవాలనుకున్నారు. వాళ్ళ బాధలే తమ బాధలుగా భావించి సాయంచేయాలనుకున్నారు. అలాగే నిలిచారు...

ఆరోజు అందరితో బాటు పొట్టి పంతులు, రంగరాజుగారి అంతిమ దర్శనానికి వచ్చేరు...

చిత్రమేమిటంటే ఓరోజు రాజుగారు ఓ కొత్త ముఖాన్ని ఊళ్ళో చూసి అతను తమ దర్శనానికి వస్తాడని ఎదురు చూస్తారు. అతనాగ్రామంలో నివాసమేర్పరచుకుని నెలలు గడుస్తున్నా, రాజుగారి దర్శనానికి రాలేదు. ఈ సాయం కావాలంటూ చేయిజాపి అడగలేదు. అది ఆయనకు దిగులుగా మారింది. అతను సాయంపొందిన వాళ్ళలో లేకపోయినా రాజుగారు మరణించిన తర్వాత చూడడానికి వచ్చినవాళ్ళలో ఉన్నారు.

రాజుగారి అంతిమయాత్రకు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి.

అంతకుముందురోజు రాజుగారు వరండాలో పచార్లు చేస్తుంటే వీరాయి వచ్చాడు.

"మరే... మరేనండి... పొట్టి పంతులుగారూ... అనతనంటుంటే 'హమ్మయ్య... ఇంతకాలానికి వచ్చాడన్న మాట' అనుకున్నారు రాజుగారు. కాస్త పైకి అనడంతో ఆ మాట వీరాయికీ వినిపించింది. ఆ గ్రామంలో వున్న వాళ్ళందరూ తన దగ్గరకు ఎప్పుడో ఒకప్పుడైనా వచ్చి లబ్ధిపొందాలన్నది ఆయనలోపలున్న కోరిక!

"కింది హాల్లో కూర్చోబెట్టు, వస్తున్నా" అన్నారు రాజుగారు.

"అది కాదు బాబూ... ఆయనకు లాటరీలో లచ్చరూపాయలు వచ్చాయంట. ఊరంతా ఆ కబురే గనంగా సెప్పుకుంటున్నారు"అన్నాడు వీరాయి.

"అతడు రాడు... ఇంక అతను రాడు" మెల్లిగా తనలో తనే గొణుకున్నారు రాజుగారు.

"ఎందుకు రాడు బాబూ! తమరు పిలుస్తున్నారంటే రెక్కలు కట్టుకొచ్చి వాల్తాడు" అన్నాడు వీరాయి.

ఆ మాటలు వినిపించుకోకుండా "ఇంకరాడు. అతను రాడు" ఆ మాటలు నిరాశగా, నెమ్మదిగా వచ్చాయి రాజాగారినోటినుంచి. సోఫాలో కూలబడిపోయిన ఆయన తల ఒక ప్రక్కకి వాలిపోవడంతో భయం వేసిన వీరాయి ఇంట్లో వాళ్ళందర్నీ కేకలతో, ఏడుస్తూ పిలిచాడు.

"రాజుగారు పోయేముందు ఏం మాట్లాడారు? ఎలా ప్రాణం పోయింది?" అంటూ అందరూ వీరాయినడగసాగారు.

వీరాయి జరిగింది జరిగినట్టు చెప్పలేడు. పొట్టిపంతులుకి లాటరీలో లక్ష రూపాయలు వచ్చాయని చెప్పగానే గుండాగి చనిపోయారంటే అందరూ ఆయనను అపార్థం చేసుకుంటారు! కానీ వాస్తవానికి ఆయన ఇక పొట్టిపంతులు సాయంకోసం తన దగ్గరకు రాడనుకున్న బాధతో ప్రాణాలు విడిచారు. అందరూ తమ దగ్గరకు సాయం రావాలని, సాయం పొందాలని ఆయన ఆశ, కోరిక. కానీ తన కోరికను తీర్చుకోలేని రోజులూ వస్తున్నాయని ఆయన అలమటించారు. ఆ బాధతో ప్రాణం కోల్పోయారు. ఆయనతోబాటు ఆయన తీరని కోరిక బూడిదైంది. ఆ కార్యక్రమాన్ని బాధతో చూడడానికి వచ్చినవాళ్ళలో పొట్టిపంతులూ వున్నాడు!

ఎంత గొప్ప మానవతావిలువల్ని చెప్పే కథానిక! చెప్పడంలో కూడా ప్రత్యేక శిల్పముంది. ఈ కథానికలో జీవముంది.

# దేవులపల్లి కృష్ణశాస్త్రి 'బూట్‌పాలిష్'

ఒకానొక కాలం కవులందరూ కూడా కథానికలు రాయడానికి ఉద్యమించారంటే ఈ ప్రక్రియ ప్రజలకెంత సన్నిహితమైందో వేరుగా చెప్పనక్కర్లేదు.

ఏ ప్రక్రియనైనా తనలో ఇముడ్చుకోగల గొప్ప సాహిత్యప్రక్రియ 'కథానిక'.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కవిత్వధోరణిలో చెప్పిన ఓ ఆంగ్లపద్య సారాంశంతో ఈ కథానికని ప్రారంభిస్తారు. పాలకులూ! భగవంతుడూ!! వంగిన నడుముని ఎలా సరిచేస్తారు? క్రుంగిన భుజాన్ని ఎలా నిలబెడతారు? ఎవరు నేర్పుతారో వాళ్ల వెలుగుకోసం పైకి చూడటమన్నది ఆ కవిత సారాంశం.

దీనికి, నారయ్య కథకీ సంబంధముందన్నమాట.

నారయ్య ముసలిఎద్దు లాంటివాడు. అతని నడుము వంగడం బరువు మోత వల్ల కాదు. కాళ్ళీడవడం నీరసం వల్లా కాదు. ముసలి ఎద్దుకి, గొడ్డు గోవుకి చుట్టాలులేరు. నారయ్యకి పెళ్ళాం పిల్లలుండడం వింతగా ఉందికదూ అంటూ ప్రశ్నిస్తారు రచయిత.

"నీ వయస్సెంత?" అని ఎవరైనా అడిగితే "నాకేం తెలుస్తుం"దనే రకం నారయ్య. అజ్ఞాత జనానికి చావుపుట్టుకలుండవు.

మనకి కోట్లమంది జనం లేరు. వాళ్ళుండీ మనకు లేరన్నమాట! వాళ్ళు లేనప్పుడు మనకి భగవంతుడు కూడా లేనట్టేగా!!

రాళ్లు కొట్టి దార్లు వేసే వాళ్ళలోనూ, కటిక నేలను దున్నేవాళ్ళలోనూ ఉండు–ఈ చీకటి గుడితలుపులు వేసుకుని కూర్చోకు అంటాడు కవి. అంతేకాదు లోకం బహిష్కరించిన వాళ్ళ మధ్య, పతితుల మధ్య కూడా ఉంటాడంటాడు. ఇలా అసలు దేవుడెక్కడుంటాడో చెబుతూ నారయ్య కథని నడిపించారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

ఓరోజు రచయిత నారయ్య ముందు, తన పాత చెప్పులజోళ్ళని వేసి కుట్టుమంటాడు రచయిత! నారయ్య వాటిని కాక ప్రక్కనే వున్న మరో జోడునందుకుంటాడు. దానికి రిపేరు కావాలనుకోలేదు రచయిత. నారయ్య దాన్నిలాగి చూసి, అదివరకు లేని చిగుళ్ళని తీసి 'ఈ చెప్పులో....' అంటాడు.

రచయితకసహ్యం వేసి 'ఆ జోళ్ళక్కడ పెట్టి అవతలికి పో... నాకు ఏ జోడూ రిపేరు చేయొద్దు' అనేలోపు అసలు చెప్పుల జతను తీశాడు తలెత్తకుండానే.

పర్మిషన్ తీసుకోకుండానే ఒక దాని తర్వాత మరొకటి – రెండు జతల్ని మరమ్మతు చేశాడు. నిగనిగ మెరిసేలా పాలిష్ చేశాడు. తల దించుకునే నారయ్య వాటిని రచయిత ముందుకు తోశాడు. బహుశా అతను తలెత్తుకుని చూడడం ఎరగడేమో! నారయ్యకి కళ్ళూ ఉన్నాయ్.. నవ్వనూగలడు!

"నీవడిగింది ఇస్తే నేను కొత్త చెప్పులే కొనుక్కుందును" అంటాడు రచయిత.

"కొత్తయీ కొనండయ్య మారాజులు.. తర్వాత అయీ బాగు చేత్తా...." అంటాడు నారయ్య.

"మా అబ్బాయిని స్కూల్‌కి పంపాలి." "వాడి చదువుకి, రోజూ మీ అందరి తిండికి సరిపడా సంపాదించగలవా?" అని రచయిత ప్రశ్నిస్తే "వస్తే తింటాం, లేకపోతే పడుకుంటాం..." అంటాడు.

"నారయ్యా ఈ పని నీకు బాధగా లేదా?" అంటే చిన్న నవ్వు నవ్వి, అంతా వాడిదయే అన్నట్లు పైకి చూస్తాడు. అలాంటప్పుడే అతను పైకి చూసేది!

చెప్పులకు పాలిష్ చేసేవాళ్ళలో ఆలీ ఉంటాడు. వాడు బజార్లో కనబడతాడు. సినిమా పోస్టర్లు చూస్తుంటాడు... రైలుస్టేషన్లో నారాయణున్నాడు. వీడు కంపార్ట్‌మెంట్లోకి జొరబడి పాలిష్ చేస్తుంటాడు.... నారయ్య కొడుకు మాత్రం చెప్పులు కుట్టడు. పాలిష్ చేయడు. చదువుకుంటున్నాడు. పాత చెప్పు వంటి నారయ్య గుడిసెకి ఎప్పటికైనా వాడే మాసికలు వేయాలి.

ఎంత గొప్పగా చెప్పారు కృష్ణశాస్త్రి చెప్పులు కుట్టే నారాయ్య గుడిసెకు మాసికలు వేయాలంటే నారయ్య కొడుకు చదువుకోవాలని. కొత్త శిల్పంతో కవిత్వంలా ఆవిష్కరించిన కథానిక 'బూట్‌పాలిష్'. సమాజంలోని అన్ని వర్గాల వాళ్ళే కాదు, అన్ని సాహిత్య ప్రక్రియలలో నిష్ణాతులూ రాయడం కథానికకి మంచి పరిణామం!

# జంపన పెద్దిరాజు 'ఫౌల్'

**ఆ**టలో 'ఫౌల్ని' పట్టుకుంటాం. జీవితంలో ఎన్నో ఫౌల్స్ చేస్తుంటాం. వాటిని పట్టించుకోమనే విషయాన్ని టెన్నిస్‌తార ద్వారా చూపించారు జంపన పెద్దిరాజు.

మిస్‌టానియా టెన్నిస్‌ని చూడడానికి యూనివర్శిటీలో వందలు, వేలు ఎగబడ్డారు...!

అదొక తీర్థం... అదొక సంత...!

ఫైనల్లోకి దూసుకొచ్చిన టానియా చేతిని గుళ్ళో గంటలా, పూజారి తీర్థంలా ముట్టుకు వెళ్తున్నారు. ఎదురు వరుసలో వున్న ఆఫీసర్ల అందమైన ఆడముఖాలు టానియానభినందించాయి. ఖరీదైన మూడుకోట్లు వాళ్ళింటికి రాత్రికి డిన్నరుకి పిలిచాయి. ఆ రాత్రి హోటల్‌కి రెండింటికీ తప్పనిసరై టానియా వెళ్ళింది.

మొదటి డిన్నర్‌లో పూర్తిగా భోజనం చేసింది. రెండో డిన్నర్‌లో బలవంతం మీద పులావ్, రెండు యాపిల్స్, ఫ్రూట్ సలాడ్ తీసుకుంది.

ఆరాత్రి తిన్నవి అరగక – కొండచిలువ కదుల్తున్నట్టు వికారం.... వాంతి వెళ్ళేట్టుంది. నిద్ర పట్టడం లేదు.. బయటికి వచ్చింది.

టానియా దృష్టిని కోర్ట్‌కి కొంచెం దూరంలో వున్న మూడు ఆకారాలు ఆకర్షించాయి.

చిరిగిన గుడ్డలు... నూనెలేని జుట్టు... వాళ్ళ జీవితాలకు అద్దం పడుతున్నాయ్. మనుషులు నిద్రపోతున్నవేళ మట్టి మోస్తున్న జీవాలు! వాళ్ళలో ఒకరు రక్తపు వాంతి చేసుకున్నారు. అందరూ నిద్రపోతున్న వేళ... వాళ్ళలా మట్టితట్టల్ని ఎందుకు మోస్తున్నారో అర్థం కాలేదు టానియాకి.

వాళ్ళకి సాయం చేయాలని ఓ తట్టని ఒకామె తలకెత్తబోయింది. లేపలేక పోయింది.... తను చూస్తుండగానే తమకి తాముగా తట్టలెత్తుకుని కష్టాల్లా వెళ్తున్న వాళ్ళనలా చూస్తుండిపోయింది టానియా.

రక్తం కక్కిన తిరుపతి పడిపోయింది. టెన్నిస్ రాకెట్ ఖరీదు కూడా లేని తిరుపతి దగ్గరకు పరుగెత్తింది టానియా.

తన గదికి తిరిగి వచ్చేసింది టానియా....

మర్నాడు ఆలశ్యంగా లేచిన టానియాకి "రాత్రి ఎవరో పనిమనిషి గుండెజబ్బుతో చనిపోయింది. దిక్కులేని ఆమె పిల్లకు ఏదైనా సాయం చేద్దామని వస్తే ఇవాళ ఫైనల్ కదాని రేపు రమ్మన్నాను" అన్న మాటలు గది బయట నుంచి వినిపించాయి....

అన్యమనస్కంగా ఆటకు వచ్చిన టానియా కొడుతున్న షాట్స్ ఎక్కువగా ఫౌల్స్!

టానియా దృష్టి రాత్రి తిరుపతి చనిపోయిన చోటుమీద పడింది.... అక్కడ కార్పెట్‌పై జనం! ఆడడానికి కాదు చూడడానికి!!

టానియాకి జనం మీద కోపం వచ్చింది. ఆ కోపాన్ని బాల్‌మీద చూపింది. రెండు సెట్లలో నెగ్గింది....చిరుతపులిలా విజృంభించిన టానియా తర్వాతి రెండు సెట్లూ కూడా నెగ్గింది.

సిక్స్‌త్ గేమ్‌లో సర్వీసు చేయగానే మళ్ళా 'ఫౌల్' అన్నాడు ఎంపైర్.

టానియాకి ఆటమానేసి ఎక్కడన్నా ఒంటరిగా కూర్చోవాలనిపించింది. "అంపైర్! నేను కొట్టిన బాల్ కాదు– ఈ లోకం ఫౌల్.. ఈజనం ఫౌల్... వీళ్ళ తెలివి ఫౌల్... వీళ్ళంతా ఫౌల్...!" అని అరవాలనిపించింది.

టానియా నుదిటిమీద టెన్నిస్ బాల్ గట్టిగా ముద్దు పెట్టుకుంది. కొంచెం పక్కకి వాలింది. ఆమెని లోపలికి పట్టుకెళ్ళారు.

తన కోసం ఇంతగా హంగామా చేస్తున్న జనం, తట్టమోయలేక మరణించిన తిరుపతిని పట్టించుకోరేం? అర్థం కావడం లేదు టానియాకి. ఆర్థిక అంతరాల్ని, గ్లామర్ –గ్లామర్‌లేమి మధ్య గాప్‌ని చాలా గొప్పగా చూపించారు జంపన పెద్దిరాజు 'ఫౌల్' కథానికలో.

# జి.వి.కృష్ణారావు 'చేసుకున్నకర్మ' కథానిక

**రా**ఘవుల్ని వెంకయ్య ఇంట్లో పనిచేయడానికి కుదురుస్తాడు తండ్రి పదిహేనేళ్ల క్రితం. ఆ తర్వాత ప్రతీ ఏడాదికొకసారి వచ్చి కొడుకు జీతం తీసుకువెళ్తంటాడు పుల్లయ్య. మళ్ళీ రెండు సంవత్సరాలైనా అటువైపు రాడు.

రాఘవులుకి ఐదుఏళ్ళు నిండకముందే వెంకయ్య దొడ్లో పడేశాడు పుల్లయ్య. పిల్లలుకల పేదవాడికి ఇంతకంటే దారేముంది. ఇన్నేళ్ళ నుంచి రాఘవుల మంచిచెడ్డల్ని ఆ ఆసామే చూస్తున్నాడు. వెంకయ్యకి వాడంటే మక్కువ ఏర్పడింది. పుల్లయ్యకి ఆసామి వెంకయ్య మీద నమ్మకం ఏర్పడింది. రాఘవులకి వెంకయ్య మీద ప్రేమ ఏర్పడింది. పుల్లయ్య ప్రతి జవాయి పున్నమికి వచ్చి జీతం తీసుకుని వెళ్తుండేవాడు.

ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులమీద రాఘవులకి ప్రేమ లేదంటే ఆశ్చర్యం ఏముంది? తల్లి కాబట్టి లక్ష్మమ్మ సంవత్సరానికి ఒకసారి రాఘవుల్ని చూసి రమ్మని పుల్లయ్యని బలవంతాన నెట్టేది.

ఆ ఇంట్లో అందరు తన కొడుకుని ప్రేమించే వాళ్ళే. అలాంటి జీతగాడ్ని ఆ ఆసామి ఎలా పోగొట్టుకుంటాడు? – పుల్లయ్య ఆశ పడ్డాడు.

రాఘవులు తండ్రిని చూసినా పట్టించుకోడు. తన పనిలో తను మునిగిపోయి ఉంటాడు.

"మీ నాన్న వచ్చాడు", ఆసామి అంటే "నాతో మాటాడేదేముంది న్యాయం తెలిసిన దొర మీతోనే మాటాడమనండి" అంటాడు. "ఈ ఏడు వాడికి పెళ్ళి చేయాలని ఉంది.. నాలుగురాళ్ళు సంపాదిస్తేగా పెళ్ళయ్యేది" నసుగుతాడు పుల్లయ్య.

వాడి మనస్సు పసిగట్టిన వెంకయ్య "జీతం పెంచకపోతే, నా దగ్గర పన్లో ఉంచనంటావ్.... ఈ పదేళ్ళ నుంచి ఇచ్చిన జీతం ఇచ్చిపో, రేపే వరటాలికి పెళ్ళి ఎలా కాదో చూద్దాం" అంటాడు దొర వెంకయ్య.

"మా ఊరు షావుకారు రెండుజతల గుడ్డలు ఇచ్చి 75 రూపాయలు ఇస్తానంటున్నాడండి" అంటాడు పుల్లయ్య. "ఒక్కసారే 25 పెంచుతారట్రా ఎవరైనా?" అంటుంది దొర భార్య లక్షువమ్మ.

"ఐతే నీ కొడుకుని అక్కడే జీతానికి పన్లో పెట్టు" అంటాడు వెంకయ్య.

రాఘవుల్ని తండ్రి తీసుకువెళ్తాడేమో అని, కన్నీళ్ళ పర్యంతం అవుతుంది లక్షువమ్మ.

తండ్రితో రాఘవుల్ని వెళ్ళమంటాడు వెంకయ్య. అక్కడి మమతల్ని మర్చిపోలేక తండ్రితో రానంటాడు రాఘవులు. 'రోగం వచ్చినా, నొప్పి వచ్చినా చూసేది మీరు. నా తండ్రి నా బాగు కోరేవాడైతే ప్రతి ఏడు నా జీతాన్ని తీసుకెళ్తున్నాడుగా, ఇప్పుడు ఆ సొమ్ము ఎంతుందో చూపించమనండి" అంటూ తండ్రిని నిలదీస్తాడు కొడుకు రాఘవులు.

తర్వాత బాకీల వత్తిడితో పొలాన్ని అమ్మేస్తాడు వెంకయ్య. ఎడ్లని అమ్మేయాలనుకుంటాడు.

పచ్చగడ్డి తెచ్చిన రాఘవులకి ఎడ్లు లేకపోతే గుండె గుబేలుమంటుంది. ఎడ్లని అమ్మేశానంటాడు వెంకయ్య.

రాఘవులు దిగులుతో అన్నం లేకుండా పడుకుంటాడు.

రాత్రంతా మదనపడ్డ రాఘవులు పొద్దున్నే మూటాముల్లెతో అక్కడ్నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధం అవుతాడు.

'ఆవులన్నీ ఒకసారి 'అంబా' అని అరిచాయి. అయినా రాఘవుల కాళ్ళకు బంధాలు వేయలేకపోయాయి' అంటూ ముగిస్తారు కథానికని రచయిత.

గొప్ప కథానిక.

తండ్రి ఆ ఇంటినుంచి రమ్మన్నా రాని రాఘవులు, యజమాని ఎడ్లు అమ్మేశాడన్న వార్త తెలీగానే ఆ ఇంటిని వదిలేయాలనుకుంటాడు. రచయిత సింబాలిక్‌గా చెప్పదల్చుకున్న విషయం చెప్పాడు. రచయిత నేరుగా విషయం చెప్పకుండా ఇలా సింబాలిక్‌గా చెప్పడమే ఈ కథానిక శిల్ప ప్రత్యేకత. చదవడం, ప్రారంభించినప్పట్నుంచి చకచకా చదివింపజేసే శైలి మరో ప్రత్యేక విషయం.

వస్తువు ఎంత వాస్తవం అయినా శిల్పం లేకపోతే కథనం కుంటుపడుతుంది. శిల్ప ప్రాధాన్యతతో యథార్థాన్ని జి.వి.కృష్ణారావుగారు "చేసుకున్న కర్మ" కథానికని గొప్పగా చెప్పారు.

# తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి 'గాదె'

శివశంకరశాస్త్రిగారు తన బాల్యంలోకి తొంగిచూస్తూ చమత్కారంగా చెప్పిన కథానిక 'గాదె'. పాఠకులను బాల్యంలోకి లాక్కు వెళ్తుంది.

సాధారణంగా చిన్నపిల్లల ఆలోచనలు ఎలా ఉంటాయో రచయిత చెప్పడంతో ప్రారంభమవుతుంది కథానిక. పాఠశాలంటే భయంతో పగలనేది లేకుండా ఎప్పుడూ రాత్రే ఉండాలనుకోవడం, ఆడపిల్లలా పుట్టినా బాగుండేదని మగపిల్లలు ఏడ్వడం మామూలు ఆ రోజుల్లో. ఆడపిల్లలని బడికి పంపేవారు కాదు... ఇలా రకరకాల ఆలోచనల్తో కొట్టుమిట్టాడుతుంటాడు ఆ కుర్రవాడు. ఉత్తమ శ్రేణిలో కథనం ఉంటుంది. ఒక పాత్ర ద్వారా కథానికను చెప్పాలనుకున్నప్పుడు ఈ పద్ధతే మంచిది. వస్తువును బట్టి ఎలా చెప్పాలో రచయిత నిర్ధారించుకుంటాడు.

ఆ రోజుల్లో బడిపంతుళ్లు చండశాసనుల్లా ఉండేవారు. పిల్లల్ని దారిలోకి తీసుకురావడానికి బెత్తాన్ని బాగా నమ్మేవారు. ఏ చిన్నపొరపాటైనా, బడికి వెళ్లడం ఆలస్యమైనా బెత్తం విరిగేలా కొట్టేవారు. దాంతో బడికి వెళ్ళాలంటే పిల్లలకి భయం. ఒకవేళ బడికి రాకపోతే ఇంటికి వెళ్ళి మరీ పాఠశాలకు లాక్కెళ్లేవారు ఉపాధ్యాయులు. నాటి పాఠశాలల తీరు, పంతుళ్ల పద్ధతి చెబుతూ– ఇది మారాలనే సూచనా మనకు కలిగేలా చెప్పడంలో కృతకృత్యులయ్యారు రచయిత.

ఆ రోజు భోజనం అయిన తర్వాత బడికి వెళ్ళబుద్ధికాదు ఆ కుర్రాడికి. పిల్లల మనస్తత్వాన్ని చాలా చక్కగా చెప్పారు రచయిత.

పంతులుగారు నిన్ను పాఠశాలకు తీసుకురమ్మాన్నారని ముందు ఇద్దరు పిల్లలు వస్తారు.

ఎవరికీ కనిపించకుండా ఇంట్లోనే ఉండాలంటే ఎలా?

గాదె కన్పించింది. పంటలు వచ్చిన తర్వాత ధాన్యాన్ని గాదెల్లోనూ, పుర్రుల్లోనూ నిల్వ ఉంచుకుంటారు పల్లెల్లో.

ధాన్యం మీద కూర్చుంటుంటే గుచ్చుకుంటుంటుంది. దువ్వ లేస్తుంటుంది. ఎంత ఆపుకున్నా ఆగని తుమ్ము వస్తుంది. వదిన గాదెలో ఎవరున్నారో గమనిస్తుంది.

ఇంతలో 'మురారీ ఎక్కడున్నాడు?' అంటూ పంతులుగారు వచ్చి వదినను అడుగుతారు.

ఆమె గాదె వంక చూపిస్తుంది.

అంతే.

పంతులుగారు అతనిని బరబరా పాఠశాలకు లాక్కుని వెళ్ళి, తాటలు తేలేటట్టు బెత్తంతో కొడతారు.

ఇంటికి వచ్చిన తర్వాత అతడు పంతులుగారు కొట్టిన దెబ్బల వాతల్ని అప్పుడే ఊరినుంచి వచ్చిన అమ్మమ్మకి చూపిస్తాడు.

ఆవిడకి బాధవేస్తుంది. అందుకే పిల్లలు ఇక్కడ బడికి వెళ్ళడానికి భయపడతారంటూ పంతులుగారి మీద దండయాత్ర చేస్తుంది అమ్మమ్మ.

ఇక మీ పాఠశాలకు మావాడిని పంపను. గట్టిగా కేకలు వేస్తూ మురారిని ఇంటికి తీసుకొచ్చేస్తుంది.

ఆ తర్వాత పట్నంలో అక్కగారుంటే అక్కడి పాఠశాలలో చేర్పించడంతో కుర్రవాడికి విముక్తి కలిగింది అంటూ కథానికను ముగిస్తూ... ఎక్కడైనా గాదె కన్పిస్తే చాలు నాకు వెంటనే ఈ సంఘటన గుర్తుకొస్తుందంటారు ఈ రచయిత.

ఉపాధ్యాయులు క్రమశిక్షణలో ఉంచాలి. కానీ పద్ధతి ఇది కాదు. పిల్లలకి బడంటే భయమంటే ఎలా చదువుకుంటారు. విషయాన్ని శివశంకరశాస్త్రిగారు చాలా చక్కగా, పిల్లలూ చదువుకుని అర్థం చేసుకోగల చిన్న మాటలతో రాశారు. విషయాన్ని బట్టే శిల్పం, భాష కూడా మారాలని ఆ మహారచయిత మనకు చెబుతారు.

# తాపీ ధర్మారావు 'పాపభీతి'

ఏదైనా పాపం చేయడం తేలికే. కానీ ఆ పాపం తాలూకు భయం మాత్రం వెంటాడుతూ, ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. అది మానసిక దౌర్భల్యం అయినా, ఒక విధంగా శిక్షే!

మనం సినిమాల్లో చూస్తూనే ఉంటాం. ఒక వ్యక్తి తప్పు చేయడం లేకపోతే అత్యాశతోనో అతని భార్యనో, లేక అదే పోలికలున్న వ్యక్తినో స్వలాభం కోసం ప్రవేశపెట్టి కంగారు పెట్టేస్తాడు. కథానాయకుడు ఎంత కంగారుపడ్డా ఆఖరికి అసలు విషయం తెలుసుకుంటాడు. తన భార్య మంచిదే కాని దుర్మార్గుడైన మిత్రుడు కథానాయకుడి భార్యని పోలిన వ్యక్తితో ఇలా కంగారుపెట్టించాడన్న విషయం కథానాయకుడికి అర్థమవుతుంది. తన భార్య, ఈమె, చిన్నప్పుడే విడిపోయిన కవలలు అని అర్థమవుతుంది.

ఒక విధంగా ఇలాంటి వినూత్న ఆలోచనలకు తాపీధర్మారావుగారి 'పాపభీతి' తనకి తెలీకుండానే మూలమైనదేమో అన్న అనుమానం మనకి రావచ్చు. కానీ ధర్మారావు ముగింపుని మరీ నాటకీయంగా ముగించకుండా, వాస్తవంగా ముగించారు.

లక్ష్మీకాంతం, భాస్కరం సహాధ్యాయులు, ఆత్మీయ మిత్రులు ఇద్దరు కలిసి ఓ జాయింట్ వ్యాపారాన్ని ప్రారంభించారు. లక్ష్మీకాంతం ఏమో సత్యవాది. భాస్కరం ఏమో, ఏ ఎండకి ఆ గొడుగు పడతాడు. లక్ష్మీకాంతం తన ఆప్తమిత్రుడు కావడంతో భాస్కరంతో తన వ్యాపారాన్నంతటిని విడిచిపెడతాడు. కానీ దుర్మార్గుడైన భాస్కరం వ్యాపారంలో లాభాలు వస్తున్నా, నష్టాలు చూపిస్తూ, ఆ నష్టాల కింద అతని ఇంటిని కాజేస్తాడు.

లక్ష్మీకాంతం ఓ జమీందారు కూతుర్ని ప్రేమిస్తాడు. ఇద్దరు పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. పెద్దలు ఒప్పుకుంటారు. హఠాత్తుగా అతడు దరిద్రుడు కావడంతో జమీందారు చులకనగా చూస్తాడు. ప్రియురాలి ప్రేమ మాయమైపోతుంది. ప్రియురాలు కమల కూడా అలా ప్రవర్తించేసరికి లక్ష్మీకాంతం మనస్సు తీవ్రంగా బాధపడుతుంది. కమలని పెళ్ళాడే యోగం తనకు లేదని తెలుసుకున్నా, మర్చిపోలేక

ఆత్మహత్య చేసుకుంటాడు. వార్తాపత్రికల్లోనూ ఆ వార్త ప్రచురితమవుతుంది.

ఒకరోజు హఠాత్తుగా ఓ ఉత్తరాన్ని తీసుకొచ్చి ఇస్తాడు, లక్ష్మీకాంతం గ్రామం నుంచి ఒక అతను,

దాంట్లో ఏముంటుందంటే – 'భాస్కరం ఈ నెల 19వ తారీఖు ఉదయం 10గంటలకు, మిమ్మల్ని మీ ఇంటివద్ద కలుసుకుంటాను. నా ఇంటి విషయంలో మాట్లాడవలసి ఉంది. మరచిపోవద్దు. ఇట్లు – లక్ష్మీకాంతం' అని ఉంటుంది.

భాస్కరం ఆ ఉత్తరాన్ని నాలుగైదు సార్లు చదువుకుంటాడు. అతడి ఇల్లుని దొంగ లెక్కలతో కాజేసానని, అతడి ప్రియురాలు కమలని తాను పెళ్ళి చేసుకున్నాడని తెలిసి, దెయ్యంలా వెంటపడుతున్నాడేమో అనుకుంటాడు. ఎందుకంటే ఆరోజు 17.13వ తేదినే అతను ఆత్మహత్య చేసుకున్నట్టు పత్రికలో వార్త వచ్చింది.

అతడు వచ్చేలోపే విమానం మీద దూరంగా వెళ్ళిపోవాలనుకుంటాడు.

ఆ రోజు ఆదివారం 18వతేది. మర్నాడు 19వ తేది, లక్ష్మీకాంతం వస్తానన్న రోజు. అతను అన్న మాటని ఖచితంగా పాటించే వ్యక్తి. ఏ సమయానికి వస్తానంటే ఆ సమయానికే వస్తాడు. అందుకే ముందురోజే అతడు పారిపోవాలనుకుంటాడు.

లక్ష్మీకాంతం వస్తే తను ఎక్కడికి వెళ్ళింది చెప్పవద్దని అందరిని హెచ్చరిస్తాడు. ఇంతలో ఓ నౌకరు 'మీ దర్శనం కోసం ఎవరో వేచి ఉన్నారు' అని ఓ విజిటింగ్ కార్డు ఇస్తాడు. అది లక్ష్మీకాంతం కార్డు. భాస్కరానికి చెమటలు పడతాయి. "చచ్చిపోయిన మనుషుల బుద్ధులు కూడా మారుతాయి కాబోలు! ఇంత అన్యాయమా? రేపు వస్తానని ఇవాళే రావడమా?" దొంగచాటుగా కిటికిలోంచి బయటకు చూస్తాడు. గేటు దగ్గర ఓ వ్యక్తి కనిపిస్తాడు వెనక్కు తిరిగి.

"ఔను లక్ష్మీకాంతం లాగానే ఉన్నాడు" భయంతో గబగబ అడుగులు వెయ్యబోయి మేడ మెట్లు మీద నుంచి జారి కింద పడతాడు భాస్కరం.

మేనేజర్ ఆగంతకుడు దగ్గరికి వెళ్ళి "మీరెవరు?" అని అడుగుతాడు.

"నా పేరు లక్ష్మీకాంతం భాస్కరంతో జాయింట్ వ్యాపారం చేసి చనిపోయిన లక్ష్మీకాంతం, నేను అన్నదమ్ముల బిడ్డలం. అన్నదమ్ముల మధ్య ఇల్లు భాగాలు కాలేదు. కాబట్టి మా అన్నకి దీంట్లో సగం వాటానే ఉంది. ఇల్లంతా తీసుకోవడానికి భాస్కరానికి హక్కు లేదని చెప్పడానికి వచ్చాను" అంటాడు.

"అయితే రేపు వస్తానని ఇవాళే వచ్చారెందుకు?" మేనేజర్ అడిగాడు.

లక్ష్మీకాంతం "ఇవాళ ఆదివారం భాస్కరం గారు ఇంటి దగ్గరు ఉంటారని, సావకాశంగా మాట్లాడొచ్చని" అని అంటాడు.

'మీ ఇద్దరి దస్తూరి పోలిక కూడా కలిసిందే' మేనేజర్ అనుమానం. 'ఇద్దరం తాత పోలికే! ఒడ్డు పొడుగులోనే కాదు, ఆఖరికి రాత కోతల్లో కూడా, చిరునవ్వు నవ్వి అంటాడు లక్ష్మీకాంతం సోదరుడు.

"భాస్కరం గారిని, ఆసుపత్రికి తీసుకువెళ్తున్నాం మీరు అక్కడికి రండి", మేనేజర్ మాటలతో లక్ష్మీకాంతం సోదరుడు భాస్కరాన్ని అనుసరిస్తాడు.

సినిమాల్లోలా ఏవేవో కల్పించి దుర్మార్గుడిలో పాపభీతిని కలిగించినట్టు కాకుండా, యదార్థ సంఘటనల్లోనే 'పాపం చేసిన వాడు పారిపోలేడు' అన్న నిజాన్ని ఎంతో చక్కగా, అర్థవంతంగా ఈ కథానిక ద్వారా చెప్పారు తాపీధర్మారావుగారు. ఆయన లోకాన్ని కాచి, వడపోసిన వాడు కావడమే అందుకు కారణం. మొదట గ్రాంథిక వాదిగా ఉన్నా గిడుగు వేంకటరామ్మూర్తిగారి శిష్యరికం పుణ్యమా అని వ్యావహారిక భాషావాదం వైపు మక్కువ చూపించారు. అందుకే, అందరికి అర్థమయ్యే మాట్లాడుకునే భాషలో ఈ కథానిక సాగుతుంది.

# తాతా కృష్ణమూర్తి 'ప్రైవేటు ట్యూషను-వడుగు'

**"గొ**ట్టికాయలాడకుండా మావాణ్ణి ఖాయిదా చేస్తే యెంత చదువైనా వస్తుంది"

"నా దగ్గర గొట్టికాయలు గిట్టికాయలు పనికిరావండి. పుస్తకం అంటుకుపోవాలి. అలా చదివిస్తానండి"

అనే 'కన్యాశుల్కం'లోని సంభాషణలని ముందుంచి కథానిక ప్రారంభ మవుతుంది. అంటే ఈ మాటల స్ఫూర్తితో కథానికని రాశారన్న విషయం మనకి అర్థమవుతుంది. 'కన్యాశుల్కం' నాటక ప్రభావం సమాజం మీదెంతుందో చెప్పకనే చెబుతుంది ఈ కథానిక.

'నేను' అంటూ రచయిత ఈ కథానికని చెబుతాడు.

ప్రయివేట్‌గా చెప్పించి రచయితను నాలుగో తరగతిలో పాఠశాలలో జేరుస్తాడతని బావ. ఆ ఏడు మార్కులు సరిగ్గారావు.

ఫస్ట్‌ఫారానికి వచ్చిన తర్వాత అతనికి కొత్త ట్యూటర్ని కుదురుస్తాడు బావ. కొత్త ట్యూటర్ పేరు పార్వతీశర్మ. మేనమామైన హెడ్‌మాష్టారి బలవంతం మీద అతను ట్యూటర్‌గా కుదురుతాడు. రచయితని కొట్టకుండా మచ్చిక చేసుకుంటూ పాఠాలు చెప్పడం ప్రారంభిస్తాడు.

ఆరోజు లొట్టిపిట్ట గురించి రచయితని కాంపోజిషన్ రాయమంటాడు పార్వతీశర్మ.

వంకరటింకర మెడ ఉండే ఆ జంతువు గురించి ఏవేవో రాస్తాడు రచయిత విద్యార్థి.

"పోనీ గుఱ్ఱం గురించి రాయ"మంటూ పార్వతీశర్మ "నీకు బాగా తెలిసిన గుఱ్ఱం గురించి రాయగలవా?" అని అడుగుతాడు. రాయడం ప్రారంభిస్తాడు రచయిత.

"చూడూ! కాంపోజిషన్ రాయమంటే మీ పుస్తకంలోని గుఱ్ఱం పాఠం అప్పజెప్పమని కాదు. స్వంతంగా ఆలోచించి రాయాలి" అని హెచ్చరిస్తాడు పార్వతీశర్మ.

రచయిత విద్యార్థి గుఱ్ఱం గురించి ఏమోమో రాస్తాడు.

"శభాష్! చాలా బాగా రాశావ్! ఇలాగే రాసేవంటే పరీక్షలలో ఖచ్చితంగా సున్నా వస్తుంది" అంటాడు పార్వతీశర్మ తన శిష్యునితో.

పరీక్షలలో విద్యార్థులు తమ సొంత భావాల్ని ప్రకటించకూడదనీ, ఒరిజినాలిటీని పూర్తిగా చంపుకోవాలనీ, పుస్తకాలలో చదువుకున్న ముక్కల్నే చిలుక పలుకులు'లా అప్పజెప్పాలనీ... ధర్మసూత్రాలు బోధిస్తాడు శిష్యుడికి.

ఆ సంవత్సరంలో శిష్యుడికి వడుగు చేస్తామంటారు పెద్దలు.

మంచి వైభవంగా వడుగు జరుగుతుంది. పార్వతీశర్మ శిష్యుడి వడుగుకు వెళ్ళడు.

శాస్త్రోక్తంగా వడుగు చేయడంతో గుండు చేయిస్తారు. భిక్షాటన చేయమంటారు.

ఉన్నది ఉన్నట్లుగా విషయాల్ని గ్రహించమన్న గురువుగారి బోధనలలో అంతే అర్థమైంది శిష్యుడికి. ఇంతకన్నా ఆడపిల్లగా పుడితే, అలంకరించి, పెళ్ళిచేసి పంపేవాళ్ళు కదా! ఆడపిల్లగా ఎందుకు పుట్టలేదు? అని బాధపడతాడా శిష్యుడు.

చదివిన దానితో మానసిక వికాసం చెంది ఇంకా విశాలంగా ఆలోచించాలని తెలీకుండా కేవలం ఉన్నదాన్ని ఉన్నట్లే స్వీకరిస్తే ఎంత మానసిక వైకల్యం కలుగుతుందో గొప్పగా చెప్పారు రచయిత. నేటి విద్యావిధానం విద్యార్థుల హృదయ వైశాల్యాన్ని పెంచకుండా, చెప్పినదాన్ని చెప్పినట్లే అర్థం చేసుకుని జీవితంలో ఎంతమూర్ఖులుగా మార్చుతున్నదో మనకి చక్కగా చెప్పారు రచయిత. విద్య లాభాన్ని కలిగిస్తోందా? నష్టాన్ని కలిగిస్తోందా? ఆలోచించమన్న భావనని కలిగిస్తుంది ఈ కథానిక. గురజాడ మనలో ప్రత్యేకదృష్టిని ఎలా కలిగించారో కూడా చెబుతుంది.

# తాడిగిరి పోతరాజు 'నిరవధిక నిరీక్షణ'

**రా**జన్న పోస్ట్‌మాన్. ఆ గ్రామంలోని వాళ్ళకి ఉత్తరాలు, టెలిగ్రాములు అందించడమే కాకుండా చదువుకోని వాళ్ళకి, చదివివినిపిస్తాడు. కొమరమ్మకి ఆరోజు వచ్చిన టెలిగ్రామ్‌ని చదివి అర్థం చెప్పాలనుకుంటాడు కానీ, కొడుకు బుచ్చిరాముడు చనిపోయాడని వచ్చిన టెలిగ్రామ్ అని చెప్పలేకపోయాడు. నీ కొడుకు బావున్నానని రాశాడని చెప్తాడు. ఆమె పేలాలు పెట్టబోతే దుఃఖాన్ని ఆపుకోలేక ఇవతలికి వచ్చేస్తాడు.

బుచ్చిరాములు భార్య, కొడుకు, తల్లితో కలిసి వస్తారు రాజన్న ఇంటికి. ఉత్తరంలో బుచ్చిరాముడు ఏం రాశాడో తెలుసుకోవాలని. యుద్ధంలో చిక్కిన తమని మన దేశానికి అప్పచెప్పడానికి పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకరించిందని రాశాడని చెప్తాడు. అది విన్న కొమరమ్మ, ఆమె కోడలు మనవడు ఆనందిస్తారు.

బాధతో ఆలోచిస్తున్న రాజన్న మనస్సులో గతం అంతా కదులుతుంది. పాకిస్తాన్ సరిహద్దులో పోరాటానికి వెళ్తూ బుచ్చిరాములు చెప్పిన మాటలు అన్ని గుర్తుకొస్తాయి. 'నేను ఉన్నాగా బుచ్చన్న' అంటూ తను ఇచ్చిన మాటా గుర్తుకొస్తుంది.

"రాజన్న పెళ్ళి చేసుకొని నేను చాలా పెద్ద పొరపాటు చేశాను జీవితంలో. యుద్ధంలో నాకేదైనా కీడు మూడితే దాని గతి ఏం కావాలి" అన్న అతని ఆఖరు మాటలు చెవిలో మారుమ్రోగుతాయి. అతడి కనుకొలకల నుంచి జాలువారిన కన్నీటి చుక్కలు చెవుల్లో ఇంకిపోసాగాయి.

కాలం ఎవరికోసం ఆగకుండా ముందుకు పరిగెడుతూ ఉంటుంది. బుచ్చిరాములు కొడుకు సురేష్ గడ్డం పెంచుకొని రోజూ రాత్రులు 12 దాకా ఇల్లు చేరకుండా మీటింగ్‌లని తిరుగుతుంటాడు. అతడిని అదుపులో పెట్టాలని ప్రయత్నించిన రాజన్న ఖంగు తింటాడు.

"ఎనకటిలా ఎడ్డికాలం, గుడ్డి కాలం కాదు, జమానా మారిపోయింది. డబ్బున్నోళ్ళు కులం పట్టింపులు లేకుండా కలిసిపోతారు. దోసుకునేకాడా కానా పేదవాళ్ళు మాత్రం గట్లా కలిసిపోరు" అని ఆవేశంతో అంటున్న సురేష్‌తో "వారీ... సురేషు తండ్రిలేని పిల్లగానివనే సోయ నీకు లేదు... చటుక్కున నోరుజారి నిజం చెప్పేస్తాడు రాజన్న. దాన్ని పట్టుకొని "మా నాన్న సచ్చిపోయాడా? సెప్పు" అంటూ

సురేష్ బలవంతం చేస్తుంటే గుండెనొప్పి వచ్చిందని మూల్గుతూ పడిపోతాడు రాజన్న. సురేష్ అతడి గుండెలమీద రాస్తాడు. ఇక చాల్లేమన్నట్టు చెప్పి సైకిల్ మీద బయలుదేరతాడు రాజన్న–"టపాల్ తేవాలి" అంటూ.

మలుపు తిరిగి సిమెంట్‌రోడ్ ఎక్కబోయేసరికి బస్సు దూసుకొస్తున్నట్టు కనిపించింది. ముందుచక్రం మెలితిరిగి సైకిల్‌మీదనుంచి కిందపడ్డ రాజన్న తల సిమెంట్‌రోడ్డుకు కొట్టుకుని చనిపోతాడు. శవాన్ని చూడటానికి వచ్చిన వాళ్ళల్లో సురేష్, కొమరమ్మ, సురేష్ తల్లి కూడా ఉంటారు. అందరు తలో విధంగా అతడి మంచితనాన్ని గుర్తు చేసుకుంటూ బాధపడ్డారు."ఓ అన్నా, నాకున్న దిక్కంతా నువ్వే అనుకుంటున్నా. సెల్లె, సెల్లె అని నన్ను నోరారా పిలుస్తుంటివిరా అన్నా, నీ రుణం నేనెటూ తీర్చుకోవాలన్నా"అని శవం తల వద్ద కూర్చుని బిగ్గరగా ఏడ్చింది సురేష్ తల్లి.

"నీ కొడుకు వత్తాడు, నువ్వు రంది పెట్టుకోవద్దని, ధైర్నం సెబితివి కొడకా... కొడుకు రాక ముందే నువ్వు వెళ్ళిపోయినావా" గుండెలు బాదుకుంటూ ఏడుస్తుంది కొమరమ్మ.

శవాన్ని ఇంటికి తీసుకొస్తారు. శవం తలకింద దిండు పెడదామని దిండు కోసం ఇంట్లోకి వచ్చిన సురేష్‌కి కొన్ని ఉత్తరాలు, టెలిగ్రాములు కనిపిస్తాయి. వాటి ద్వారా విషయం తెలిసిపోతుంది– తన తండ్రి యుద్ధంలో చనిపోయాడని, అతను తల్లికి రాసినట్లే రాజన్న ఉత్తరాలు రాసి తామందర్ని దుఃఖం పాలు కాకుండా కాపాడాడని!

సురేష్‌కి రాజన్న గొప్పతనం అర్థమైంది. ఒళ్ళు జలదరించింది అని ముగిస్తూ రచయిత ఒంటరి తీతువు కూస్తోంది పొదల నుంచి అంటారు. తన కొడుకు పోయాడని బాధ ఒకామెకి, తన భర్త పోయాడనే దిగులు ఒకామెకి, తండ్రి లేడనే ఒంటరితనం మరొకరికి, కలగకుండా ఉండడం కోసం ఆ ఒంటరి జీవి పడిన వేదన ఎంతో గొప్పది. తాను వేదన పడ్డాడే కానీ ఇతరుల్ని వేదన బాధపడకుండా కాపాడడానికి ప్రయత్నించాడు. ఎంత గొప్ప పాత్ర –పోస్ట్‌మాన్ రాజన్నది! మానవత్వానికి మకుటాయమానమైనది. అబద్ధాలు చెప్పి కొందరి దుఃఖాన్ని బాపడానికి ప్రయత్నించినవాళ్లు ఉన్నారని చెబుతుంది ఈ 'నిరవధిక నిరీక్షణ' తాడిగిరి పోతురాజుగారి కథానిక.

# తిలక్ 'ఊరి చివరి ఇల్లు'

మనచుట్టూ వున్న పాత్రల ప్రత్యేకతల్ని చెప్పడానికి తోడ్పడే సంఘటనని బలంగా చెప్పడానికి–ప్రకృతి వర్ణన ఎలా తోడ్పడుతుందో చక్కగా, చిక్కగా చెప్పిన కథానిక తిలక్‌గారి 'ఊరి చివరి ఇల్లు'.

శీర్షిక కూడా కథానికకి ముఖ్యం అన్న విషయాన్ని 'ఊరి చివరి ఇల్లు' చెప్పకనే చెబుతుంది. మానవ సంబంధాల్ని ఆర్థిక సంబంధాలు ఎలా అధిగమిస్తున్నాయో ఈ కథానిక చెబుతుంది. వర్షంలో ఊరి చివరి ఇల్లు ఒంటరిగా, నిస్సహాయంగా వున్న స్త్రీలా ఉంటుంది. సాయంత్రం నాలుగు గంటలకే మబ్బులతో చీకటిపడిపోయినట్లున్న వాతావరణం–ఊరి చివరి ఇంట్లో వున్న ఇరవైరెండేళ్ల స్త్రీ జీవితం ఎలా పెందలాడే పొద్దు గూకిందో మనకి ప్రతీకగా చెబుతుంది. వర్షం ఆమె మనసుని చిందరవందర చేయడానికన్నట్లు కురుస్తుంటుంది. ఆ ఇంట్లో యువతితోబాటు ఓ ముసలి స్త్రీ వున్నట్లు కథానికా ప్రారంభంలోనే మనకర్థమవుతుంది. ఆమె యువతిపట్ల చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ మనకనుమానాన్ని తెప్పిస్తుంది.

ఇద్దరి ఆలోచనలు, సంభాషణ మనకి కొంతవరకూ వాళ్ళ గతాన్ని చెబుతూ వర్తమానంలోకి పాఠకుల్ని తీసుకొస్తుంది. జీవితమనే గోతిలో తన్నుకుంటున్న ఆమె–వర్షంలో చీకటిపడ్డాక గోతులు పడ్డ వీధుల్లో వెళ్తున్న అతన్ని చూసి జాలిపడి ఇంట్లోకి రమ్మనిపిలుస్తుంది. ఆతిథ్యమిస్తుంది. ఇద్దరూ మానసికంగా కూడా దగ్గరవుతారు. ముసలావిడ ఇద్దరి మధ్యా పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని, అతని దగ్గరున్న డబ్బుని కూడా గమనిస్తుంటుంది.

ఊరిచివరి ఇంట్లో వున్న యువతికి అతడితో తన మిత్రుడు విజయుడు కనిపిస్తాడు. అతనూ ఆమెపట్ల ఆకర్షితుడవుతాడు. ఆమె గురించి తెలిసినా ఆమెను పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకుంటాడు. ఇద్దరూ ఒకరి గురించి మరొకరు తెలుసుకోవడానికి ఆత్మీయ సంభాషణ జరుపుతారు.

"నువ్వు అమాయకురాలివి. ఇక నిన్నెప్పుడూ ఏడవనివ్వను. ఏడుపు నీబతుకులోకి రానివ్వను"అంటాడతను. "ఇంక నాకు భయంలేదు, హాయిగా నిద్రపోతాను" అంటుందామె–రమ. అతనేవో కబుర్లు చెబుతుంటే ఆమె నిద్రపోతుంది.

అవకాశంకోసం ఎదురుచూస్తున్న ముసలామె "నీలో జాలి పెంచడానికి భలాని భలాని మాటలు చెప్పుంటుంది. మాకు పెళ్ళేమిటి వెర్రోడా?" అనేసరికి కోపం

వచ్చిన అతను తన పర్స్‌ని మంచంమీదకి విసిరేసి తన బాగ్‌నందుకుని ఆ వర్షంలో వెళ్ళిపోతాడు.

నిద్రలేచిన తర్వాత విషయం తెలుసుకున్న రమ బాధపడుతుంది. "ఆ వెర్రిబాగులవాడు నిన్ను ప్రేమించానని, నిన్ను పెళ్ళిచేసుకుంటానని అన్నాడు. మరి నాగతేంకానే పిల్లా? నువ్వు తప్ప నాకెవరున్నారు? వాణ్ణి తగులుకుని చిన్నగా తప్పుకోవాలనుకుంటావా? నీ ఆటలు నేను సాగనిస్తానటే పిల్ల" అంటూ తన లౌక్యాన్ని వెళ్ళబోస్తుంది ముసలామె.

రమకి కాళ్ళకింద నేల బద్ధలైనట్టనిపిస్తుంది. "మగవాళ్ళ మాటలు నమ్మి చెడిపోకు పిల్లా" అంటూ సలహా ఇవ్వడంతో కోపం వచ్చిన రమ "నా కొడుకునీ నువ్వే చంపావ్" అంటూ ముసలిదాని తలమీద గట్టిగా కొట్టి, అతడిని రైలు స్టేషన్‌లోనైనా కలుసుకోవాలని ఆ వర్షంలోనే బయలుదేరుతుంది. పర్సులోని నోట్లని ముట్టుకోకుండా కేవలం అతడి ఫొటోని మాత్రం తీసుకుంటుంది రమ.

బురదనీళ్ళలో పడుతూ లేస్తూ వెళ్తుంది స్టేషన్‌కి... మనసంతా చిందరవందర! ఒళ్ళంతా బురదబురద– ముఖమ్మీద కూడా!

"బాబుగారూ..."అంటూ అన్ని కంపార్ట్‌మెంట్‌లను వెదుకుతూ అతడిని గుర్తించి "బాబుగారూ! ఇదిగో పర్స్..."అంటూ కదిలిన రైలులోని అతని మీదికి పర్స్‌ని విసిరేస్తుంది.

చీరమడతలో కాలు చిక్కడంతో పడిపోతుంది. జనం కంగారుగా ఆమెవేపు వెళ్ళడం, వెళ్తున్న రైల్‌లోంచి చూసిన అతనికీ అంతకన్నా కంగారుని కలిగిస్తుంది–తన పర్స్‌లోని డబ్బంతా అలాగేవుంది. తనఫోటోమాత్రం లేకపోవడంతో షాక్ తింటాడు!

ఏకకాలంలో సాగిపోయిన ఈ కథానికలో తిలక్‌గారు మానవతావిలువలకు పెద్దపీట వేస్తారు. డబ్బుకన్నా మానవతా విలువలు గొప్పవని చెప్పే గొప్ప కథానిక. తన పర్స్‌నిండా డబ్బు పెట్టుకుని మిత్రుడికి సాయమందించాలని వస్తాడు. అప్పటికే అతను ఈ లోకాన్ని విడిచివెళ్ళిపోతాడు. ఆ తర్వాత తనభిమానించిన రమ ఆ డబ్బుకోసమే తనని వంచించిందనుకుని వచ్చేస్తాడు. ఆ పర్స్‌ని అతికష్టంమీద అతనికి చేర్చి, ఆమె ప్రాణాలు పోగొట్టుకోవడంతో కథానిక ముగుస్తుంది. డబ్బుకోసం మనుషులు ఎలాంటెలాంటి వ్యూహాల్ని వలలుగా వేస్తారోకూడా ఈ కథానిక మనముందుంచుతుంది.

# త్రిపుర 'పాము'

రోజుకో పేరుతో బెనారస్‌లో తిరుగుతూ–నమ్మినవాళ్ళని మోసం చేస్తూ–తన అలవాటుని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న వ్యక్తి శేషాచలపతి.

పాము కుబుసం విప్పినట్లు ఇవాళ్టి పాత్రని విడిచిపెట్టి, మందులో స్నానం చేసి సమాదుల్ని విడిచిపెట్టి మరో కొత్త పేరుతో ప్రజల మధ్యకొస్తుంటాడు.

కేవలం నమ్మించి, వాళ్ళని మోసం చేసే మనమధ్య మనుషులు గుర్తుకొస్తారు ఈ కథానిక చదువుతుంటే! కుబుసాన్ని విడిచినట్లు తమ నిన్నటి రూపాన్ని కడిగేసి కొత్త రూపంలో ప్రత్యక్షమయ్యే పాములు లాంటి వాళ్ళే కాదు వీళ్ళు–అంతకన్నా భయంకరంగా కాటు వేయగలరు. విషాన్ని చిందించగలరు. మనిషిలోని అసలు మనిషిని ఈ కథానికలో త్రిపురం ఎంతో గొప్పగా చూపించారు.

అద్దంలో చూసి తలదువ్వుకుంటూ "ఇవాళ నీ పేరు అలఖ్‌నిరంజన్.." అని శేషాచలపతిరావు అనడంతో 'పాము' అసలు రూపం మొదట్లోనే మెరిసేట్టు చూపిస్తారు రచయిత.

బస్‌లో జేమ్స్‌ని, అతని భార్య క్వీన్ ఎలియట్‌ని తనకు తానుగా పరిచయం చేసుకుంటాడు అలఖ్.

బెనారస్‌లో ముగ్గురూ దశాశ్వమేధఘాట్ దగ్గర దిగుతారు.

ఘాట్‌ని గంగని, బోట్లని చూసి ఆనందపడిపోతారు జేమ్స్, క్వీనీ.

"బెనారస్‌లో దొంగలు ఎక్కువ. మీ దగ్గర వేలెట్ ఉంచడం మంచిది కాదు" అంటూ వాళ్ళ పర్స్‌ని జాగ్రత్త చేస్తానంటూ దానిని తన పేంట్ జేబులో పెట్టుకుంటాడు.

ఇంతలో తోపిడి ప్రారంభమవుతుంది. ఆ తోపిడిలో తప్పిపోయినట్టు విడిపోయిన అలఖ్ తన పేంట్ జేబులోంచి జేమ్స్ పర్స్ తీసి, డబ్బుని జేబులో ఉంచుకుని, పర్స్‌ని విసిరేసి ప్రక్కనే వున్న బార్‌లోకి జొరబడతాడు.

సాయంకాలం ఏడు గంటలకు ఇంకా కొంచెం మత్తు వుండగానే మెల్లగా తూలుకుంటూ హాస్టల్‌చేరుకున్నాడు అఖిల్. అద్దంలో తనని తాను చూసుకుంటూ "ఎలా వుంది అలఖ్ నిరంజనం ఈ దినం" అని, "రేపు నీపేరు సాల్వడార్ డాలీ. ఏం

చేస్తావో..." అద్దంలోని శేషాచలపతి విషపు నవ్వు ఒకటి మధురంగా నవ్వాడు అంటూ కథానికని ముగిస్తారు రచయిత.

అద్దంలో శేషాచలపతి తనని తాను కొత్త వ్యక్తిగా పరిచయం చేసుకోవడంతో కథానిక మొదలవుతుంది. రేపు నీ పేరు సాల్వడార్ డాలి. ఏం చేస్తావో అంటూ ముగించడం కథకి ముందు, కథని, తర్వాతి కథని కూడా మనకి చెబుతుంది. ఇక్కడ మోసాలు ఎక్కువంటూనే మోసం చేసేవాళ్ళు బెనారస్‌లో ఎలా ఉన్నారో చాలా కళాత్మకంగా చెబుతారు రచయిత. మనుషుల మధ్య తిరిగే పాముల్ని, ఏరి చూపిస్తారు.

త్రిపుర కథానికలు కాస్త తికమక పెడుతున్నట్లనిపించినా చెప్పదల్చుకున్న విషయాల్ని చాలా గొప్పగా, కళాత్మకంగా చూపిస్తారు.

మనం మామూలుగా చూసే పరిస్థితులు, మనుషుల వెనుక వింతగాథల్ని అంతకన్నా వింతగా కథానికలుగా మలచగల ప్రతిభాశాలి త్రిపుర. మామూలు కథానికలకు ఈయన కథానికలు ఎంతో భిన్నంగా ఉంటాయి. కొత్త విషయాల్ని చెబుతాయి.

# తురగా జానకీరాణి 'యాత్ర'

వెంకటరావు ఒక మధ్యతరగతి జీవి. అత్తెసరు సంసారం....

హఠాత్తుగా ఆ కుటుంబానికి మంచి రోజులు వస్తాయి–

వెంకటరావుకి జీతం కొత్త స్కేలు వస్తుంది. మూడులక్షలకు పైనే జీతం బకాయిలు వస్తాయని తెలుస్తుంది. భార్యకి ఆనందంగా చెప్పకుంటాడు.

బొటాబొటి సంపాదనతో భార్య ఇద్దరు కొడుకులు, కుమార్తెని పోషించాడు. రిటైర్‌మెంట్ తర్వాత తన బతుకేమిటనే భయం ఉండేది.

ముందు అమ్మాయిని ఆదుకోవాలంటుంది వెంకట్రావు భార్య. సరే! యాభైవేలిస్తానంటాడు. భార్యకు నగలు కొనాలనుకుంటాడు. పిల్లల చదువులకు సాయం చేయమంటాడు పెద్దకొడుకు– ఒకడు ఇంజనీరింగ్‌లో, రెండోవాడు మెడిసిన్‌లో చేరబోతున్నాడు. రెండవ కుమారుడు ఫ్లాట్ కొనివ్వమంటాడు.

"వాళ్లకి సాయం చేయండి. పెద్ద సంపాదనపరులై రుణం తీర్చుకుంటారు లెండి" అంటుంది భార్య.

విషయం తెలిసిన ఒక్కొక్కళ్ళు తండ్రిని గొంతెమ్మ కోరికలతో ఇబ్బంది పెడతారు.

బకాయి సొమ్ము వచ్చింది. వెంకటరావు ఆలోచనలు మారిపోయాయి. రెండులక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసి, మిగతా సొమ్ముతో అంతవరకూ తను కొనుక్కోలేకపోయిన ఫ్రిజ్, ఫోమ్‌బెడ్, సోఫాలు – ఆధునిక సామగ్రితో ఇంటినంతటినీ నింపి వేస్తాడు. వాటిని చూసిన పిల్లలు ఆశ్చర్యపోతారు గాని నోరు విప్పరు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత భార్యతో "పిల్లల్ని కన్నాము, పెంచాము. చేతనైనంత చదువు చెప్పించాం. స్వతంత్రంగా బతికేట్టు చేశాము. ఇంక ఏమి చేయాలి చెప్పు" అంటాడు. తన ఫ్యూచర్‌ప్లాన్ భార్యకి చెబుతాడు.

పిల్లలు వెళ్ళిపోయిన తర్వాత రైలు సర్క్యులర్ టికెట్లు భార్యకి చూపించాడు, యాత్రలకి వెళ్ళాలని.

క్షణాల్లో ఆ వార్త చుట్టుపక్కల వాళ్ళకి వ్యాపించింది. ఓ మిత్రుడు వచ్చాడు వెంకటరావుని పలకరించడానికి.

వెంకటరావుకి చెమటలు పోయసాగాయి హఠాత్తుగా. మిత్రుడు, వెంకటరావుకి మంచినీళ్ళు తాగించమన్నాడు  భార్యతో. ఫాన్ స్పీడ్ పెంచి వైద్యుణ్ణి  పిలుచుకు రావడానికి పరుగెత్తాడు  మిత్రుడు.

ఈశ్వరి వంక చిరునవ్వుతో చూస్తున్నాడు వెంకట్రావు. అది చెరగని చిరునవ్వనీ, మూతబడని కళ్ళని, వైద్యుడు వచ్చేవరకు తెలీలేదు ఆ ఇల్లాలికి –అంటూ కథానికని ముగిస్తారు తురగా జానకీరాణి.

ఆర్ద్రతతో కళ్ళవెంట నీళ్ళు వస్తాయి పాఠకుడికి.

మధ్యతరగతి జీవుల కన్నీటిగాథ. సంసార బాధ్యతల్ని పూర్తి చేసుకుని వెళ్ళే యాత్ర ఒకటైతే జీవితాన్ని ముగించుకుని వెళ్ళిపోయే యాత్ర మరొకటి!

'యాత్ర'కి భార్యని బయల్దేరదీసిన భర్త చెప్పకుండానే అంతిమయాత్రకి సిద్ధమవుతాడు. ఇలాంటి ఎన్నో గొప్ప కథానికలు రాసిన తురగా జానకీరాణి గారు కూడా అంతిమయాత్రకు చేరుకోవడం సాహిత్య లోకానికి తీరిన లోటు.

# ధనికొండ హనుమంతరావు 'సౌఖ్యరాశి'

**సాం**బయ్య ప్రెస్‌లో ఒక కంపోజిటర్. అతను అనుకోకుండా పక్క మేడ మీద కనిపించిన ఓ యువతిని చూసి మోహిస్తాడు. ఆమె ఇతడిపట్ల ఉత్సాహాన్ని చూపిస్తుంది. దాంతో మేడ దిగి మిత్రుడు భూషయ్యని ఆ పక్క మేడలో ఎవరున్నారు అని అడుగుతాడు.

భూషయ్య 'ఆమె ఒక వేశ్య' అంటాడు. ఆమెకి సాహుకారు చలమయ్య కొడుకు నెల తిరిగే సరికి 600 ఇస్తాడు. నీ కంపోజిటర్ మొహానికి నువ్వు ఏమి ఇవ్వగలవు అని కూడా ఎద్దేవా చేస్తాడు. తన స్థాయి ఆలోచించకుండా ఆమెనే మనస్సు నిండా నింపుకుంటాడు సాంబయ్య.

మర్నాడు సాయంత్రం మళ్లీ మేడ ఎక్కుతాడు. ఆమె రమ్మన్నట్టు సౌజ్ఞ చేస్తుంది. కిందకి వెళ్ళి మళ్ళీ మేడ మీదకు వెళ్ళే సమయం కన్నా ఆమెను వెంటనే కలవాలని, రిస్క్ తీసుకుని, ఈ మేడ మీద నుంచి ఆ మేడ మీదకి దూకుతాడు. రేపు రాత్రికి రమ్మంటుంది. తలుపు మీద మూడుసార్లు కొడితే, మా దాసి లోపలికి తీసుకువస్తుంది అని కూడా చెప్తుంది. తలూపి సాంబయ్య సరే అంటాడు.

ఇదే విషయాన్ని భూషయ్యకి చెప్తాడు. భూషయ్య నవ్వుతూ ఇక సుఖవ్యాధుల పుట్టవవుతావు అంటాడు.

దాంతో సాంబయ్య ఆమె దగ్గరకు వెళ్ళే ప్రయత్నాన్ని విరమించుకుంటాడు.

మర్నాడు ఆమె అతన్ని నిన్న ఎందుకు రాలేదని అడుగుతుంది. నిర్మోహమాటంగా తన మిత్రుడు భూషయ్య చెప్పిన విషయాన్ని ఆమెతో చెప్పేస్తాడు.

ఆమె నిర్లక్ష్యంగా నవ్వి 'ఇదా నీ అనుమానం. భూషయ్య పెట్టిన కబుర్లకి నేను మాట్లాడలేదని అతని కోపం. మంచి స్నేహితున్నే సంపాదించావు అంటుంది. దాంతో సాంబయ్య బుర్ర గిర్రున తిరుగుతుంది. ఎలాంటి వాళ్ళు ప్రపంచంలో ఉన్నారో అని అనిపిస్తుంది.

"నా దగ్గర డబ్బులు లేవు" అంటాడు సాంబయ్య. 'నేను అడిగానా' అంటుంది ఆమె.

ఇద్దరు ఆనందించిన తర్వాత "నువ్వు జీతానికి ఆఫీసులో పనిచేయడంలా. అలాగే మీ నుంచి పొందిన ఆనందానికి ప్రతిఫలంగా ఈ డబ్బు తీసుకో అని నిర్లక్ష్యంగా కరెన్సీ నోట్లనీ మోత మోగని పూటా రూపాయిలని ఇచ్చే మేనేజర్ జ్ఞాపకం వచ్చాడు.

ఒక్కసారిగా నరకంలోంచి స్వర్గంలోకి పడ్డట్టు అయింది. మేరు పర్వతాన్ని ఎదురుగా పెట్టుకొని విచారించడం దేనికి. ఈ సౌఖ్యరాశి కోసం త్యాగం ఎందుకు చేయకూడదు అని అనుకోవడంతో కథానిక ముగుస్తుంది.

ధనికొండ హనుమంతరావు గారి కథానికల్లో శృంగార రసం ఎక్కువగానే కనిపిస్తుంది. అది మితిమీరలేదు. కొన్ని కొత్త కోణాల్ని మన ముందుంచుతుంది. ఆయనకి ఒక ప్రెస్ ఉండేది. రచయితల్ని ప్రోత్సహించే గుణం ఉండేది. మంచి కథానికల్ని రాసే అలవాటు ఉండేది.

# నార్ల చిరంజీవి 'కఱ్ఱ-చెప్పులు'

**వి**ప్లవాత్మకమైన భావాలతో కవిత్వం, కథానికల్ని రాసిన రచయిత నార్ల చిరంజీవి. గ్రామ వాతావరణంలోని పెద్ద మనుషుల చిన్నబుద్ధుల్ని చక్కగా 'కఱ్ఱ-చెప్పులు' కథానిక ద్వారా మన ముందుంచారు.

గంగాన్న బజార్లో వెళ్తుంటే చూడకపోయినా ఇళ్లలో ఉన్నవాళ్ళూ తేలికగా గుర్తుపట్టకలరు- అతని కిర్రుచెప్పులమోత, పొన్నుకఱ్ఱ పోట్లతో! కానీ ఆ రోజు చేతిలో కఱ్ఱ, కాళ్ళకి చెప్పులు లేకుండా పోతున్నాడు. తలపాగా లేదు. ముసుగు కప్పుకున్నాడు. దారిలో ఎవరు గుర్తించి పలకరించినా జవాబివ్వకుండా అలా మౌనంగా ముందుకు వెళ్ళిపోతున్నాడు. అతడలా ఎందుకున్నాడో ఎవరికీ అర్థం కాలేదు.

సరాసరి గంగరావిచెట్టు దగ్గరున్న పొలాల దగ్గరకు వెళ్ళి నిల్చున్న అతని మదిలో గతమంతా మెదలసాగింది-

షావుకారు రంగయ్య పాతికేళ్ళనాడు చనిపోయాడు. విధవరాలు రావమ్మ తన పొలాలను బాగా చూడగలడని గంగన్నని పిలిపిస్తుంది. గంగన్న ఆమెకి తలలో నాల్కలా తోడ్పడుతుంటాడు. రావమ్మకి తలకొరివి పెట్టడానికి ఓ కుఱ్ఱవాణ్ణి దత్తత తీసుకోవడం మంచిదని బంధువులు పదే పదే చెప్పడంతో బాటు రాజయ్య పేరునీ సూచిస్తారు.

పదమూడేళ్ళ రాజయ్యని పరిశీలించి, అతడిని దత్తత చేసుకోవచ్చని రావమ్మతో చెబ్తాడు గంగన్న. అలా రాజయ్యని రావమ్మ దత్తత తీసుకోవడంలోనూ తోడ్పడతాడు గంగన్న. రాజయ్య లంకంత ఇంటికి, బోలెడు ఆస్థిపాస్థికి యజమానయ్యాడు. రాజయ్యకి కాస్త చదువు చెప్పిస్తే బాగుంటుందని రావమ్మకు గంగన్నే సలహా ఇచ్చాడు.

నాలుగేళ్ళపాటు రాజయ్య బస్తీలో చదివేసరికి ఎంతో మారిపోయాడు. గంగన్న ఓ జీతగాడని స్పష్టంగా తెలుసుకున్నాడు. అంతవరకు గంగన్న దగ్గరే ఉండేవి ఇనప్పెట్టె తాళాలు. తానందిపుచ్చుకున్నాడు రాజయ్య.

గంగరావిచెట్టు దగ్గర పొలం కొనడానికి గంగన్న దగ్గర ఏడువేలే ఉన్నాయి. మరో రెండు వేలు కావాలి. రాజయ్య సాయం చేస్తాడని గంగన్న అతనికీ విషయం చెబుతాడు. రాజయ్య విని ఊరుకున్నాడు. డబేకబ తీఏరేపి సొలాపికప తప సూనేమీదూ నాచిం,ఏరేంటాడేజ

తన పొలం తాలూకు కాగితాల్ని తీసుకుని, వయసు మళ్ళుతున్న గంగన్న రాజయ్య దగ్గర పని మానేయాలను కుంటాడు.

గంగన్న కోరికమీద బేరం చేసినా, కాగితాలు అంతా తన పేరే రాయించుకున్న రాజయ్యని తన కర్ర, చెప్పుల్ని కూడా విడిచి పొమ్మంటాడు.

అలా వాటిని అక్కడే వదిలేసి నెమ్మదిగా ఆ పొలం దగ్గరకు చేరిన గంగన్న కళ్ళు చెమ్మగిల్లుతాయి.

'ఇన్నాళ్ళనుంచీ కంటికి పాపల్లే కనిపెట్టుకుని చూసుకున్నందుకు ఇదా ఫలితం!' అనిపిస్తుంది గంగన్నకి.

ఆరాత్రి గంగన్న గంగరావి చెట్ల పొలం చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణం చేసాడో ఎవరికీ తెలీదు. తన పొలం ఎక్కడికో, ఏ పాతాళానికో దిగిపోతోంది. అనిపించి, దానిని పట్టుకుందామని అతనికి బుద్ధి పుట్టింది. వెర్రికేకలు వేశాడు. చేత్తో దిగిపోతున్న పొలాన్ని పట్టుకుందామని ప్రయత్నించాడు. దుక్కి గడ్డలు పట్టుకున్నాడు, పిసికాడు.

'తెల్లారి పొలంలో ఒక ఎత్తయిన మట్టిదిబ్బను వాటేసుకుని, నెత్తురుకక్కి పడున్న గంగన్నను చూసి ఊరివాళ్ళు కన్నీళ్ళు తుడుచుకున్నారు' అంటూ కథానికని ముగిస్తారు రచయిత.

మనిషి మానవత్వానికి ఎలా దూరమై, డబ్బే ప్రపంచమనుకుంటున్నాడో చెబ్తూ పల్లెల్లో మారుతున్న పరిస్థితుల్ని–కళ్ళవెంట నీరు వచ్చేలా, మనసు కరిగేలా మంచి శిల్పంతో చెప్పారు రచయిత నార్ల చిరంజీవి.

# నెల్లూరి కేశవస్వామి 'విముక్తి'

హైద్రాబాద్ సంస్కృతిని ప్రతిబింబింపజేసే కథానికలెన్నింటినో రాశారు నెల్లూరి కేశవస్వామి. ఇక్కడే పుట్టి, ఇక్కడే జీవించిన వాడు కాబట్టి ఇక్కడి జీవితాన్ని క్షుణ్ణంగా తెలుసుకోగలిగాడు. తన కథానికల ద్వారా హైద్రాబాద్ జీవితాల్లోని అవాంఛనీయ సంఘటనల్ని ఖండించాడు. వాంఛనీయ ధోరణుల్ని ప్రోత్సహించాడు.

నవాబుల ఇళ్ళల్లో దాసీలను ఆటవస్తువులుగా వాడుకునే ఆచారం ఉంది. పూర్వం నుంచీ వున్న ఆ ధోరణి అవాంఛనీయమని, దాసీలకు శరీరమే కాదు, మనసూ వుంటుందని, దానిని గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత నవాబులకూ ఉండాలని చెప్పే కథానిక 'విముక్తి'. దాసీలను ఎలా చూడకూడదో చెబుతూనే ఎలా చూడాలో కూడా చాలా చక్కగా చెప్పారు నెల్లూరి కేశవస్వామి ఈ కథానికలో.

రాత్రి పదిగంటల ప్రాంతంలో తన గది తలుపు తట్టినట్లు వినిపించడంతో తలుపు తెరిచి షిరీని చూసిన సుల్తాన్ ఉలిక్కిపడతాడు.

ఆమెనింత రాత్రి తన దగ్గరకు ఎవరు పంపారో అర్థమైంది. ఆ కోపాన్నంతటినీ ఆమె మీదే కేంద్రీకరించి "ఛీ.. పో..." అంటూ ఛీత్కరిస్తాడు. తన తల్లే పగలల్లా సేవచేస్తున్న దాసీని ఇలా కొడుక్కి రాత్రి సేవచేయమని పంపడం బాధేస్తుంది, కానీ సరాసరి ఆమెతో ఆ మాటనలేకపోతాడు! ఈ పాడు ఆచారాన్ని ఈ ఇంటినుంచి ఎలా తరిమిగొట్టాలా అని తెగ ఆలోచిస్తాడు. ఇంతకుముందు తానిలాంటి కథలెన్నో విన్నాడు. కొన్ని కళ్ళారా చూశాడు. బొద్దుగా అందంగా, చలాకీగా ఉండే జుగ్నూని చిన్నన్నయ్య పెళ్ళి చేసుకోకుండా బాహాటంగా చిదిమివేయడం అందరికీ తెలుసు. బానిస అలాంటి పనులన్నీ కిమ్మనకుండా చేయాలని ఇంటిల్లిపాదీ భావించడం సుల్తాన్ మనసుని కలిచివేస్తుంది. ఈలోపే తల్లి మరో బానిస షిరీని తన సేవలకి పంపించినా ఏమి చేయలేని స్థితి! దుస్థితి!!

జుగ్నూని పెళ్ళిచేసుకుంటావనుకున్నా అని అన్నతో అన్న వారం తిరక్కుండానే జుగ్నూ మాయమైంది. చిన్నన్నయ్య పెళ్ళి చేసుకున్నాడు. ఆరునెలల తర్వాత పీల్చి

పిప్పిచేసినట్లున్న జుగ్నూ కనిపించేసరికి బాధపడిపోతాడు సుల్తాన్. "జుగ్నూ బాభీ" అంటూ ఆమెని సంబోధిస్తాడు.

"వొద్దు నవాబ్... వద్దు... నన్నలా పిలవొద్దు. ఎవరైనా వింటే నా చర్మం వలిచేస్తారు..." అంటూ వణికిపోతుంది.

అప్పటినుంచే ఆమెని గమనించసాగాడు సుల్తాన్. ఆమెలో పూర్వపు హుషారుగాని, కళగాని తిరిగి రాలేదు. .. ఇది తెలిసీ తెలిసీ తను షిరీలోని ఆనందాన్ని తుంచి వేయగలడా? తనని తానే ప్రశ్నించుకుంటాడు సుల్తాన్.

తన పూర్వీకులలా తను దిగజారకూడదు. ఈ ఇంటి పైశాచిక అరాచకాలకి మరో స్త్రీ దగ్ధమైపోకూడదు... అందుకు ఒక్కటే మార్గం– తానీ ఉచ్చులోంచి విడివడి పారిపోవాలి.. అని కూడా నిశ్చయించుకుంటాడు సుల్తాన్. వెంటనే ఆలీగఢ్‌లోని తన ప్రొఫెసర్‌కి వెంటనే తనకి ఉద్యోగం కావాలని రాస్తాడు. ఆయన రమ్మంటాడు.

ఉద్యోగం కోసం వెళ్తున్నట్టు కాకుండా విహారయాత్రకు వెళ్తున్నానని ఇంట్లో వాళ్ళకి చెప్పి వెంట షీరీని తీసుకువెళ్తానంటాడు.

"బానిసని తీసుకుని విహారయాత్రకు వెళ్ళడమేమి"టని అందరూ నోళ్ళు నొక్కుకుంటారు. "పెళ్ళయిన తర్వాత భార్యని తీసుకు వెళ్ళమంటారు. భార్యతో మరో ప్రదేశానికి వెళ్తా, బానిసని ఇప్పుడు నా వెంట పంపండి" అంటూ షిరీని తీసుకుని బయల్దేరతాడు సుల్తాన్.

ఉద్యోగంలో చేరిన తర్వాత ఆమెని పెళ్ళిచేసుకున్నానని అతను ఇంటికి ఉత్తరం రాయడంతో కథానిక ముగుస్తుంది.

కేవలం ఓ దురాచారాన్ని ఖండించడమే కాకుండా ఈ చిన్నికథలో దానికి పరిష్కారాన్ని గొప్పగా చూపించారు నెల్లూరి కేశవస్వామి.

ఆలోచింపచేసే ముగింపుతో చెప్పిన ఈ కథానిక అభివృద్ధి పథంలో పయనింపజేసేది... సులభశైలిలో చకచకా చదివింపజేస్తుంది.

# నోరి నరసింహశాస్త్రి 'మరువిషయము'

**చా**రిత్రకాంశాల్ని వస్తువులుగా తీసుకుని నోరి నరసింహశాస్త్రిగారు ఎన్నో రచనలని చేశారు. అంగరాజు, విదేహరాజుల మధ్య మరుభూమి కోసం జరిగే యుద్ధము ఈ 'మరువిషయము'. మరుభూమంటే ఎడారి. ఎడారి కోసం యుద్ధం. ఎన్నో జంతువుల, మనుషుల ప్రాణ నష్టం! ఇద్దరి రాజుల మధ్యద్వేషం– ఆ ద్వేషానికి కారణం మంత్రులు, సామంతులు!

చరిత్రకి సంబంధించిన విషయాల్ని తీసుకుని కథానికగా మలచడానికి ప్రత్యేక శిల్పం కావాలి. చారిత్రాత్మక విషయాల్ని మాట్లాడుకునే భాషలో చెప్పడానికి భాషమీద పట్టుకావాలి. ఈ రెండు విషయాలలోనూ నోరి నరసింహశాస్త్రిగారు ఉద్దండులు. అందుకు చక్కటి ఉదాహరణే ఈ 'మరువిషయము'.

ఇద్దరు శ్రేష్ఠి సోదరుల భూవివాదంతో కథానిక ప్రారంభమవుతుంది. మనుషులు వెళ్ళడానికి కూడా కష్టమైన ఎడారి భూమి కోసం ఆ సోదరుల వివాదం.

"మీకు కావలసినంత ధనము, భూములున్నాయి. మీరు ఏకోదరులు. ఈ వివాదాన్ని వదిలి ఏదో విధంగా మీలో మీరే సరిచేసుకోరాదా?" అని వాళ్ళకు చెప్పాలని అంగరాజుకి ఎన్నోసార్లనిపించింది. కానీ తను ధర్మప్రభువు! తనకి ధర్మమని తోచిన పక్షాన జయపత్రమివ్వడం తన విధని వాళ్ళ వాదోపవాదాలు వినసాగాడు.

ఇంతలో అంగరాజుకి – తమ దేశానికి, విదేహరాజ్యానికి మధ్యనుండే మరుభూమి విషయంలోని వివాదం, వాళ్ళ సైనికులు మరుభూమిలోకి చొచ్చుకొస్తున్నారనే విషయం ఆశనిపాతమవుతుంది. వాళ్ళని వెళ్ళగొట్టడానికి 'మరుభూమి'నుంచి తనూ యుద్ధానికి తయారవుతాడు.

ఎడారిలో ఏనుగులు, గుర్రాలు చనిపోతాయి. మనుషులూ చనిపోతుంటారు.

పగలు యుద్ధం భయంకరంగా జరుగుతుంటుంది. రాత్రిళ్ళు రేపటికి సిద్ధమవుతుంటారు.

ఆ రాత్రి అంగరాజు మరుప్రాంతంలో వున్న విశ్వామిత్రుడి వంశానికి చెందిన విశ్వామిత్ర మహర్షిని కలుసుకోవడానికి ఆయన ఆశ్రమానికి వెళ్తాడు. తమ వివాదస్థలాలని చూపించవచ్చని శ్రేష్టి సోదరులూ, రాజుతో అక్కడికి వెళ్ళినవాళ్ళూ

ఆశ్రమానికి వెళ్తారు. సరిగ్గా అదే సమయానికి విదేహరాజూ అక్కడి వస్తాడు. రెండు ప్రక్కలకి చెందిన మీమాంస విద్వాంసులు అక్కడికి వచ్చారు.

దూరంగా ఇద్దరు పిల్లలు, ఆశ్రమానికి చెందినవాళ్ళు 'ఈ పాతగుడ్డ లాంటి కాగితం నాదంటే నాద'ని పోట్లాడుకుంటున్నారు

వాళ్ళని విశ్వామిత్రుడు దగ్గరకు పిలుస్తాడు.

బాలురు తెచ్చిన పత్రంలో - విదేహరాజు, అంగరాజు సూర్యచంద్రులు, దిక్కులు, కాలము, సమస్త దేవతలు - ధర్మువు సాక్షిగా రాసుకున్న సంధి పత్రంలో అక్కడ ప్రతిష్ఠించిన మహానంది చూపులతో రెండుదేశాల సరిహద్దుల్ని నిర్దేశిస్తోంది. దీనికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఇది మరు విషయమవుతుంద'ని శాపవచనాన్ని పలికిన మునుల పేర్లూ ఉన్నాయి.

అది విన్న రాజులిద్దరూ అదిరిపడి ఒక్కసారిగా ఒకళ్ళనొకళ్ళు గౌరవించుకున్నారు పశ్చాత్తాపంతో.

"మరి మీ శాస్త్రాల సరిహద్దులో...' అని విశ్వామిత్రుడు ప్రశ్నించగానే "చిత్తము... చిత్తము..' అంటూ ఇద్దరూ పక్కకి జరిగారు మీమాంస విద్వాంసులూ.

శ్రేష్ఠి సోదరులకూ జ్ఞానోదయమవుతుంది.

"ఈ పత్రాన్ని ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే భద్రపరచండి"అని విశ్వామిత్రుడడగగానే ఒక పిల్లవాడు దాన్ని నందినోటిలో పెడితే, రెండోవాడు దానికి వజ్రలేపనము చేశాడు.

అదే పని నంది చెవులకీ చేయగానే నీళ్ళు రెండుచెవులనుంచీ వస్తూ, రెండు ప్రక్కలా మరుభూమిని సేద్యభూమిగా మార్చసాగాయి.

ఇదీ కథానిక. మనుషుల మధ్య బంధాలు, భూసంబంధాల కన్నా ఎక్కువని చాలా చక్కగా చెప్పారు రచయిత నోరినరసింహశాస్త్రిగారు.

# పద్మావతి 'వాచస్పతి' మనసు చూపిన మార్గం

సరస్వతీదేవి లెక్చరర్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యింది. అప్పట్లో కట్టుకుంటున్న ఇల్లు పూర్తికాకపోవడం, పిల్లలు చదువుకుంటూ ఉండడం, భర్త చనిపోవడంతో ప్రమోషన్లువచ్చినా ఇతర ఊళ్ళకి వెళ్ళాల్సిరావడంతో, వాటిని వదులుకుంది. నెమ్మదిగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోగలిగింది. ఆడపిల్లల ఇద్దరి చదువులు, పెళ్ళిల్లు అయిపోయేసరికి రిటైర్‌మెంట్ దగ్గరకొస్తూంటుంది.

ఈ లోపల ఆవిడకి రాజమ్మ అనే దిక్కులేని, పేదస్త్రీతో పరిచయం అవుతుంది. ఆమెకు ఏదైనా ఉపాధి చూపించాలనుకుంటుంది. కాని, చూపించలేకపోతుంది. దాంతో, 'నీకు అభ్యంతరం లేకపోతే, నాతోనే, నాకు సాయం చేస్తూ ఉండమంటుంది.

రాజమ్మ, సరస్వతిని అంటిపెట్టుకునే ఉండి, కాలేజీలో అలసిపోయి వస్తున్న ఆమెని, ఇంటి దగ్గర అలసిపోనీకుండా, తోబుట్టువులా ఇంటి పనులన్నీ చేస్తూ, సహాయకారిగా ఉంటుంది.

రిటైర్ అయిపోయిన సరస్వతిని పిల్లలు తమ ఇంటికి వచ్చి ఉండమంటారు. తమకి సాయం చేస్తుందన్నా వాళ్ళ స్వార్ధధోరణిని సరస్వతి పసిగడుతుంది. ఆమెకు మనసులో తను వెళ్ళిపోతే రాజమ్మగతి ఏమిటన్న ఆలోచనా లేకపోలేదు.

హఠాత్తుగా 'నేను వేరే ఉద్యోగంలో చేరుతున్నాను. పిల్లల ఇంటికి వెళ్ళడం లేదు', అని తన నిర్ణయాన్ని రాజమ్మకి చెబుతుంది సరస్వతి.

ఆశ్చర్యపోతుంది రాజమ్మ.

పిల్లలు తనకోసం కాక తన దగ్గరున్న డబ్బుకోసం ఆశ పడుతున్నారన్న అన్న ఆలోచన సరస్వతి మనసుని మెలిపెడుతుంది. తనకి ఇంకా ఓపిక ఉంది. ఆ ఓపికతో మరికొంతమంది అనాథపిల్లలకు అండగా ఉంటూ, శేషజీవితాన్ని గడపాలని నిశ్చయించుకుంటుంది. అంతేకాదు, 'నువ్వు నాతో వచ్చి ఆ దురదృష్టవంతులైన పిల్లలకి నీ ప్రేమని పంచిపెట్టరాదు' అని అంటుంది రాజమ్మతో.

'మీరు నాకు గురువు. మీ దారే నా దారి' స్థిర కంఠంతో అంటుంది రాజమ్మ.

మర్నాటినుంచి ఇద్దరు కొత్త ఉద్యోగంలో చేరతారు. కథానిక ముగుస్తుంది.

మానవత్వం, అమానుషత్వం – రెండింటి చుట్టూనే కథానిక తిరుగుతుంది. అమానుషులు  వయస్సు వచ్చిన ఒంటరి తల్లికి సాయం చేయాలని ఆలోచించకుండా, ఆమె దగ్గర్నుంచి ఇంకా ఏదో రాబట్టుకోవాలని, ఆలోచించే పిల్లలు, వాళ్ళభర్తలు, మానవత్వానికి ప్రతిరూపాలు, సరస్వతి, రాజమ్మలు.

జీవితంలో నాణానికి బొమ్మాబొరుసుల్లాగా మానవత్వం, అమానుషత్వం కూడా ఉంటాయనీ– కానీ మనం మానవత్వాన్ని పెంపొందించుకుని, పదిమందికి సాయపడాలనే గొప్ప విషయాన్ని చెబుతుందీ కథానిక. రచయిత్రిలో శిల్పచాతుర్యం ఉంది. అందుకే క్లుప్తతతో పాటు, స్పష్టత కనిపిస్తుంది ఈ కథానికలో. చదవడం ప్రారంభిస్తే, మనం మాట్లాడుకునే భాషతో చకచకా చదివింపచేస్తుంది. చక్కటి దృశ్యాల్ని మన ముందు ఉంచుతుంది.

# పంతుల కృష్ణారావు 'ఉద్యోగం కోసం'

**'ఉ**ద్యోగం కోసం' అనే కథానికను పంతుల కృష్ణారావుగారు 1952 మార్చి 15 చిత్రగుప్త పక్షపత్రికలో రాశారు. ఈ కథానికతో మనకు అర్థమయ్యేదేమంటే... ఆ రోజులకే ఉద్యోగం దొరకడం కష్టం, కట్నం లేకుండా ఆడపిల్లకు పెళ్ళి చేయడం కష్టం అని!

గోపాలం నిరుద్యోగి. ఉద్యోగాల కోసం తెగ తిరుగుతూ ఉంటాడు. అతని తండ్రీ ఆరాటపడుతూ ఉంటాడు కొడుక్కి ఉద్యోగం రావాలీ అని. కొడుకు ఉదరపోషణ కోసం ఉద్యోగం రావాలనుకుంటే, తండ్రి కొడుక్కి ఉద్యోగం వస్తే కట్నం వస్తుందని ఆశపడుతూ ఉంటాడు.

ఒక బ్యాంకులో గోపాలానికి ఉద్యోగం ఇస్తానంటాడు ఆ బాంక్ సెక్రటరీ. కానీ అందుకో షరతు పెడతాడు 'అతని కూతుర్ని పెళ్ళి చేసుకోవాలి'అని. ఉద్యోగం కోసం తిరిగి తిరిగి విసిగిపోయిన గోపాలం ఆ పిల్ల తనకన్నా పెద్దదిగా కనిపిస్తున్నా పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంటాడు. సెక్రటరీగారి ఆజ్ఞమేరకు ఆమె కూతుర్ని గోపాలం పెళ్ళి చేసుకోవడం, నెలకు వందరూపాయల బ్యాంకు ఉద్యోగం ఆర్డరు అందుకోవడం జరిగిపోతుంది.

సామాను తెచ్చుకోవడానికి ఇంటికి వెళ్తాడు గోపాలం. అతణ్ణి చూడగానే తల్లిదండ్రులు అనందపడతారు. పదివేలకు తక్కువ కట్నం రాదన్నది తండ్రి ఆనందానికి కారణం. గోపాలం ఓ బాంబు పేలుస్తాడు 'తనకు పెళ్ళయిందని'. తల్లిదండ్రుల్దిరూ హతాశులవుతారు.

"ఉద్యోగం కోసం మా బ్యాంకు సెక్రటరీ కూతుర్ని రిజస్టర్ మేరేజ్ చేసుకున్నాను... మనవాళ్ళే!" అని గోపాలం అనడంతో కథానిక ముగుస్తుంది.

మాట్లాడుకునే భాషతో కథానిక చకచకా ముందుకు నడుస్తుంది. ఒక్క ఊపులో మనల్ని చదివింప చేస్తుంది. ముందు జరగబోయే విషయాలు తెలిసినా కథానిక ఉత్సాహాన్ని వీడనివ్వదు. ఆ రోజుల్లోనే ఉద్యోగాల కోసం ఇలాటి వలపన్నేవారు ఉన్నారన్నమాట. అలాగే పిల్లల మనోభావాల్ని పట్టించుకోకుండా దొరికిన వాళ్ళకిచ్చి

పెళ్ళి చేసేసేవారన్నమాట తల్లిదండ్రులు. కట్నంతో కొందరు ఆడపిల్లల తల్లిదండ్రులు అల్లుణ్ణి ఆకర్షించాలనుకుంటే, మరికొందరు తమకున్న అధికారాన్ని గాలంగా వేసి అల్లుళ్ళని పట్టుకోవాలని ప్రయత్నించేవారన్నమాట. ఇలా ఆడపిల్ల పెళ్ళికి ఎదిగిందంటే ఎలా వదిలించుకోవాలన్న ఆలోచన తల్లిదండ్రుల్లో ఎదిగేదన్న విషయం బాధించక తప్పదు. అప్పటి పరిస్థితులకీ, ఇప్పటి పరిస్థితులకీ ఇంకా పోలిక ఉన్నట్లు కనిపిస్తుంది. మారుతున్న కాలంతో మనుషుల ఆలోచనా ధోరణులూ మారాలి అని చెప్పకనే చెప్పుతోంది ఈ కథానిక.

ఆడపిల్ల అనగానే అక్కడ పిల్ల అనే ధోరణి మారాలి. ఎక్కడున్నా మన పిల్లే అనే ధోరణి పెరగాలి తల్లిదండ్రుల్లో. అలాగే కొడుకు అనగానే సొమ్ము చేసుకోవాలనే ధోరణీ మారాలి.

# పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన'

పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన'కు 23దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ పోటీలో బహుమతి వచ్చేప్పటికి, ఆయన వయసు 36 సంవత్సరాలే. అప్పుడాయన భీమవరం కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తర్వాత మకాముని చెన్నైకి మార్చి ఎన్నో చలనచిత్రాలకు రచనా సహకారాన్నందించారు. అనువాదాలూ ఎన్నో చేశారు. 'రక్తకన్నీరు' నాటకాన్ని తెలుగులోకి అనువదించిన వారూ ఆయనే! రేడియో నాటకానికి జాతీయ బహుమతి పొందారు. మిగతా ఎంత సాహిత్య కృషి చేసినా ఆయనకు, తెలుగుకథానికకు కూడా గాలివాన మంచి పేరుని తెచ్చింది.

గాలివాన కథానికలో రావు మనస్థత్త్వమూ, ముష్టెత్తుకునే మనిషి మనస్తత్త్వమూ చాలా సునిశితంగా ధ్వనిస్తాయి. రావు ఒక సూత్రబద్ధంగా నడిచే వ్యక్తి. గాలివానలో ఆ బాహ్యసూత్రాలన్నీ పటాపంచలయ్యాయి. అప్పుడతనిలో మానవత్వం స్ఫుటంగా కనిపిస్తుంది. అంతవరకు తానసహ్యించుకున్న ముష్టామెకి దగ్గరవుతాడు.

ఈ కథానికలో శిల్పము, సంఘటన, భావము పోటీ పడతాయి. సమన్వయంతో చివరిదాకా నడుస్తాయి. ప్రకృతి వికృత రూపంతో మానవకృత్రిమ ధోరణిని దెబ్బతీసి మానవత్వానికి పట్టం కడతారు ఈ కథానికలో. వాతావరణం, మనస్తత్వాల బంధాన్ని గొప్పగా చెప్పారు.

'వాతావరణం భయపెడుతోంది..' అంటూ ప్రారంభిస్తారు 'గాలివాన' కథానికని.

రావుగారికి కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. అవి 'గాలివాన'లో ఎలా క్రమంగా కొట్టుకుపోతాయో కథానిక ప్రారంభం నుంచి చాలా వ్యంగ్యంగా, చెబుతారు.

'ఆస్తికసమాజంవారు' ఏర్పాటుచేసిన సభలో పాల్గోడానికి ఆరోజు రైల్లో బయల్దేరతారు రావుగారు.

గాలి నిరంతరంగా కిటికీ అద్దాలమీద మొత్తుతోంది.

ఉన్నట్టుండి మూడుగంటలకే చీకటి పడినట్లు మారిపోయింది వాతావరణం.

గాలి పిచ్చిగా అరుస్తోంది. జల్లు ప్రారంభమై గాలివానగా మారింది. వానజోరు

హెచ్చింది. గాలి హోరులో రైలు మోత మరుగున పడిపోయింది. గాలి, వాన- ఒక్కుమ్మడిగా రైలు పెట్టెమీద దాడి చేయసాగాయి.

రైలుపెట్టె తలుపు తెరిచేసరికి వానతో బాటు సగం చిరిగిన తడిబట్టలతో ఓ ముష్టిది లోపలికి వచ్చి, రైలు తలుపేసింది. తడిగుడ్డల్ని పిండుతుంటూనే ఓ మూల నిల్చుంది.

పేదవాళ్ళంటే రావుకి జాలే. కానీ బిచ్చమెత్తుకోవడం ఆయన సిద్ధాంతానికి విరుద్ధం. ఆమె తనవైపు వస్తుంటే 'ఫో...' అంటూ కసిరాడు.

గాలి జోరు పెరిగింది. రావు దిగాల్సిన స్టేషన్ దగ్గరకొచ్చేస్తోంది. ఆమెకి, ఆ పెట్టెలో ఉన్న వారందరు ఎంతో కొంతిస్తారు, రావు తప్ప!

రైలాగింది. పెట్టె తలుపు తీసేసరికి గాలి వాన రావ్‌ని, ఆయన గొడుగునీ కూడా ఎగురగొట్టబోయింది. అంత గాలివానలో నడవడమే కష్టంగా వున్న ఆయనకి సామాను బండిలోంచి దింపి సాయం చేస్తానంటుంది ముష్టిది. ఆయన అభ్యంతరం చెప్పకపోవడంతో ఆమె సామాన్లని వెయిటింగ్ రూమ్‌కి చేరుస్తుంది. అక్కడికి చేరుకున్న రావు ఆమెకి కొంత డబ్బివ్వాలనుకుంటాడు. కానీ ఆమె వెళ్ళిపోతుంది.

విసిరేస్తున్న గాలిలో నిలబడడమూ కష్టమౌతుంటుంది. బేటరిలైట్ సాయంతో బాగ్‌లో నుంచి పొడిగుడ్డలు తీసి మార్చుకుంటాడు.

స్టేషన్ మాస్టారు, పోర్టర్ మాత్రమే అక్కడ కనిపిస్తారు. "ఊళ్ళోకి వెళ్ళడం ఎలా?" అని వాళ్ళనడుగుతాడు.

"ఇప్పుడు లాభంలేదు. ప్రతీ అడుగుకీ చెట్లు, ఎలక్ట్రిక్ స్తంభాలు, టెలిఫోన్ స్తంభాలూ పడిపోయాయి. గాలివాన ఇంకా బాగా పెరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఈ రాత్రికి వెయిటింగ్ రూమ్‌లో ఉండటమే మంచిది" అని వాళ్ళు వెళ్ళిపోతారు.

గాలివాన ఉదృతంగా ఉంది. వెయిటింగ్ రూమ్ తడిసిపోతోంది. ఇంతలో ఏదో నీడ కదులుతున్నట్లని పిస్తుంది. ఒంటరిగా వున్న రావు బాటరీలైట్ వేసి చూస్తే ముష్టిది.

గాలి పిచ్చి బలంతో మూసిన తలుపుల్ని కొడుతోంది.

రావు తన బాగ్‌లోంచి పొడి లుంగీని తీసి ఆమె మీదకు విసిరేశాడు. ఆమె దాన్ని చుట్టుకుని తడిచీర తీసేసింది. ఆమె అంటే రావుకి చిరాకు కలగడం లేదు.

ఆ గాలివానలో తోడు దొరికినందుకు ధైర్యంగా అనిపించింది. తనబాగ్‌లోని బిస్కెట్లు తను కొన్ని తిని, ఆమెకి కొన్నిచ్చాడు.

ఇంతలో గాలివానకు తలుపు విరిగిపడింది. భయంతో ముష్టిదాన్ని గట్టిగా పట్టుకున్నాడు రావు. ఆమె భయంలేదన్నట్లు తన ఒడిలోకి లాక్కుని మరో మూలకి వెళ్ళింది. ఆమె తప్ప తనకు దిక్కులేదన్నట్లు పట్టుకున్న రావు ఏదో కానిపని చేసినట్టు వెంటనే వదిలేసాడు. ఆమె మాత్రం అతడినింకా దగ్గరకు లాక్కుంది, గాలివాన తగలకుండా, అతి సహజంగా, ఏ మాత్రం సంకోచం లేకుండా!

ఆ సమయంలో రావుకి గుర్తున్నదల్లా ఆమె వెచ్చటి స్పర్శే! ఆమెకు ఊపిరి సలపనంత బలంగా హత్తుకున్నాడు, మగతగా!

ఆయనకి తెలివి వచ్చేసరికి గాలివాన తగ్గిందిగాని, ఆమె కనిపించలేదు. జేబులో పర్సు లేదు.

బయటకు వచ్చాడు. తెలతెలవారుతోంది.

టిక్కెట్ కలెక్టర్ ఆఫీస్ కూలిపోయి వుంది.

శిథిలాల కింద ఓ ఆకారం కదలకుండా ఉంది. ఆ ముష్టామే! ఒక చేతిలో నోట్లు చిల్లరకనిపించాయి. బాహుశా వీటిని టికెట్ కలెక్టర్ టేబుల్ లోంచి తీసుకునుంటుందా ముష్టామె అనిపించింది. రెండో చేతిలో తన పర్సుని గమనించాడు. ఆ నోట్లు, చిల్లర తీసుకుని టెకెట్ కలెక్టర్ టేబుల్‌లో వేసాడు. రెండో చేతిలోని తన పర్స్‌ని తీసుకోవాలనిపించలేదు. కాకపోతే దాంట్లో వున్న తన కార్డ్‌ని తీసివేసాడు.

గాలివాన తగ్గింది. తెలతెలవారుతోంది... అనడం తిరిగి ఎవరి వేషాల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారనీ ధ్వనిస్తుంది. ఎంతో సహజంగా చెప్తారు.

ఇలాంటి గొప్ప కథానికలెన్నింటినో రాసి, తెలుగుకథానికా గౌరవాన్ని ఇనుమడింపచేసిన ఆయన శతజయంతి ప్రారంభమైంది.

# పి.రుక్మిణీబాయి 'తలుపుముయ్యాలి'

ఇది 1929 నాటికి ఒక ప్రయోగాత్మక రచన అనే చెప్పాలి. 'తలుపు ముయ్యాలి' అనే పదాన్ని పదే పదే వాడుతూ, రచయిత్రి ఈ కథానికని కొత్త శిల్పంతో చెప్పగలిగారు.

పెద్ద గాలివర్షం ప్రారంభమైంది. చలి వణికిస్తోంది. వసారాలో కూర్చున్న తాత మనవడ్ని 'వెంటనే తలుపు ముయ్యాలి' అంటాడు. ఆటల్లో మునిగి ఉన్న ఆ కుర్రాడు, తాత మాట వినిపించుకోడు. ఈసారి తాత గట్టిగా పిలుస్తూ మనవడ్ని మందలిస్తాడు. అయినా మనవడు వినిపించుకోడు. అప్పుడు తాత 'తలుపు ముయ్యాలి లేకపోతే జల్లు లోపలికి వస్తుందని, నీకు ఎన్నిసార్లు చెప్పాలి' అని అంటాడు.

మనవడు 'తాతయ్యా! నేనేదో ఆటలో ఉండి నీ మాట వినిపించుకోలేదు. ఇదిగో తలుపులు మూస్తున్నాను', తలుపు మూసి తాత దగ్గరకు వస్తాడు. ఇది కథానికా ప్రారంభం.

ఇక తాత అక్కడ్నుంచి ఇంకా ఏమేమి మూసేయాలో కూడా మనవడికి చెప్పడం ప్రారంభిస్తాడు. రచయిత్రి సింబలైజ్ చేసి చెప్తోందన్నమాట. ఇతర వ్యాపకాల్లో మునిగిన వాళ్ళు మంచి మాటల్ని వినిపించుకోరు. కానీ అనుభవంతో పెద్దలు చెప్పిన మాటల్ని వినిపించుకుని ఆచరణలో పెట్టాలన్నది రచయిత్రి అభిలాష.

'ఇవి చిన్న మాటల్లా కనిపించవచ్చు కానీ, జీవితంలోని గొప్ప సూత్రాల్ని చెప్తాయి', అంటాడు తాత. ఈ సూత్రాలు ఇంకా గొప్ప జీవితాన్ని గడపడానికి తోడ్పడతాయి అని తాత అభిప్రాయం.

'ఇంకా ఏవేవి తలుపులు మూయాలి తాతయ్యా?' అడుగుతాడు మనవడు. తాత చెప్పడం ప్రారంభిస్తాడు. 'చెడ్డ మాటలు నీ చెవిలోకి దూరకుండా చెవుల తలుపుల్ని జాగ్రత్తగా మూసి ఉంచాలి. లేకపోతే నువ్వు సుఖపడవు. ఎప్పుడైనా పొరబాటున చెవి ద్వారాల్ని బార్లా తెరిచి ఉంచావా, ఆ చెడు మాటలు నీ చెవిలోకి దూరి, నిన్ను విడిచిపోవు' అంటాడు.

ఆ తర్వాత కళ్ళ ద్వారాల్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని మనవడికి చెప్తాడు.

మంచి పుస్తకాల్ని చదవడానికి కళ్ల తలుపుల్ని తెరిచి ఉంచాలని, చెడు పుస్తకాల్ని, చూడకుండా, చదకుండా, కళ్ళ తలుపుల్ని మూసిఉంచాలని, లేకపోతే వివేకం చెడి పాడైపోతారంటారు. వీధులలో పెట్టే వింత వస్తువుల మీదకి నీ దృష్టిని పోనీకుండా కళ్ళ తలుపుల్ని మూసిఉంచాలి అని కూడా తాత చెప్తాడు.

నోటి తలుపుల్ని మూసివుంచడం చాలా ముఖ్యం. ఎందుకంటే చెడు మాటల్ని ఉచ్చరిస్తే అందరూ నీచుడంటారు. చక్కగా మాట్లాడే శక్తి అలవడే వరకు అవసరమైనప్పుడల్లా నోటి తలుపుల్ని మూయడం అవసరం.

మనవడు తాత మాటల్ని జాగ్రత్తగా వింటూంటాడు. నువ్వు ఇంకా శ్రద్ధగా కాపాడుకోవలసిన ద్వారం మరోటి ఉంది. అది నీ మనోద్వారం. ఎప్పుడూ నీ హృదయాన్ని తట్టి లేపుతుంది. దురాశ, దుర్గుణాలు నీ మనస్సులోకి ప్రవేశించకుండా ఈ ద్వారం కాపాడుతూంటుంది. 'ఈ తలుపుల్ని సరిగ్గా మూయకపోతే మిగతా తలుపులన్నీ కూడా బార్లా తెరుచుకుని, నీ జీవితాన్ని దెబ్బతీస్తాయి' అని ఆఖరికి చెప్తాడు తాతయ్య.

'నిజమే తాతయ్యా! నువ్వు చెప్పినట్లే అన్ని తలుపుల్ని మూస్తూ జాగ్రత్తగా నన్ను నేను కాపాడుకుంటాను. తుఫాను నా జీవితంలోకి రాకుండా కాపాడుకుంటాను' మనవడు అనడంతో కథానిక ముగుస్తుంది.

దీనిని చిన్నపిల్లల కథ అనుకోవడం పొరపాటు. పెద్దవాళ్ళ కథానికే! 1929 సెప్టెంబర్ గృహలక్ష్మి మాసపత్రికలో ప్రచురితమైంది. కొడుకు ఎంత పెద్దవాడైనా తండ్రికి చిన్నవాడే కదా! తాతైతే మరీను! అందుకని పెద్దవాళ్ళు చెప్పే మంచి విషయాల్ని ఇంటిల్లిపాదీ వినాలి, ఆచరించాలి. అప్పట్నుంచైనా వాళ్ళకి మంచి జీవితం లభిస్తుంది అనేది సారాంశం. ఈ కథానికని చెప్పడంలో అప్పట్లో కొత్త ప్రయోగాన్నే అనుసరించారు రచయిత్రి.

# పి.వి.నరసింహారావు 'గొల్ల రామవ్వ'

**కొం**దరు రచయితలు ఒకటి లేక రెండు కథానికలు రాసినా, అవి కథానికా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయ్. అలాంటి వాళ్ళలో మన మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు ఒకరు. ఆయన రాసిన కథానిక 'రామవ్వ' ఒక్కటే! ఒక్కటే అయితేనేం-దానికాలం 1949 అయినా కాలాతీతంగా మానవ జీవితమున్నంతకాలం మనగలదు!

ఆరోజు రాత్రి ఆ ప్రాంతంలో.. అంటే ఆ ఊళ్ళో అదొక విచిత్ర ప్రళయం.. అదొక క్షణిక మృత్యుతాండవం... అదొక అస్థిరోత్పాతం...

గొల్లరామమ్మ తన గుడిసెలో కూర్చుని ఉంది. ఆమె కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి. ఆమె ఒళ్ళో ఓ పదిహేనేళ్ళ బాలిక మల్లమ్మ- మనవరాలు తలదాచుకుని ఉంది.. ఓ యువకుడు హఠాత్తుగా ఆ పాకలోకి జొరబడతాడు. 'చప్పుడు చేయకు. నేను రజాకారునీకాను, పోలీసునీ కాను. మిమ్మల్నేమీ అనను. లొల్లి చేయకండి...' అంటాడు.

మనవరాలి మానభంగం జరిగిపోతుందని భావించిన ఆమె-ఏమీ జరక్కపోయేసరికి అవాక్కయిపోతుంది. చిన్న స్పర్శలో అతని పరిస్థితిని గ్రహించిన అవ్వ అతడికి గుచ్చుకున్న జిట్టరేగుడు ... ఒక్కోదాన్నీ తీసి, పరిచర్య చేస్తుంది. అతనికి 'తలె' ఇచ్చి తిరిగి ప్రాణాల్ని తెచ్చిన అవ్వ అతని వద్దవున్న రివాల్వర్ని చూసి హడలిపోతుంది.

"ఈ రాత్రి దీంతో ఇద్దరు పోలీసుల్ని హతమార్చాను" అంటాడతను.

అవ్వ భయపడుతుంది.

"భయపడకు. వాళ్ళు ఈ గ్రామంవాళ్ళు నల్గురు నిర్దోషుల్ని కాల్చి చంపినవాళ్ళు" అంటాడు.

"ఇంకిద్దరు మిగిలిన్రు కొడకా... సగం పనేచేశావ్" అంటుంది మా ఇద్దర్నీ చంపమన్నట్లు!

"నైజాం రాజుతోటి పోరాడుతున్నాం..." అంటూ ఆ యువకుడు రాజకీయ సిద్ధాంత బోధనని ప్రారంభించే సరికి నిలదీస్తుంది అవ్వ" యాడున్నాదిరా నీ కొట్లాట?... కొట్లాడితే ఏమైద్దిరా?" అంటూ..

కాసేపు ఇద్దరి మధ్యా వాగ్వివాదమవుతుంది. ఆఖరికి ఆ యువకుణ్ణి విశ్రాంతి తీసుకొమ్మంటుంది అవ్వ.

వాతావరణాన్ని చాలా చక్కగా మనముందుంచుతారు రచయిత. భయంతో ఆ గ్రామంలోని జీవ లక్షణాలన్నీ ఎలా మూకుమ్మడిగా లుప్తప్రాయమయ్యాయో చెబ్తూ మృత్యుసమయపు అంతిమ సంచలనమైనా అక్కడ లేదంటారు.

రామమ్మ, మల్లమ్మ కావలి కాస్తుంటే ఆ యువకుడు నిద్రపోతుంటాడు.. చీమకూడా చిటుక్కుమనడం లేదు. గతరాత్రి భయంకర సంఘటనకు కారణమైన ఆ యువుకుడొక్కడే నిద్రిస్తున్నాడు. తక్కిన గ్రామమంతా శ్వాస బిగబట్టి బిక్కుబిక్కుమంటోంది.

అకస్మాత్తుగా బజారులో మోటారుట్రక్కు చప్పుడైంది. ఎటు విన్నా బూట్లచప్పుళ్ళు. తిట్లు.. దెబ్బల చప్పుళ్ళు.. అరుపులు... ఆక్రోశాలు..

యువకుడు దిగ్గున లేచి కూర్చున్నాడు.

ముసలమ్మలో నిశ్చలత్వం, గాంభీర్యం ప్రవేశించాయి. యువకుడు బయటకు వెళ్ళకుండా ఆపింది.

యువకుణ్ణి గొల్లవేషంలోకి మార్చింది. మూల మంచం మీద మనవరాలితో పడుకోమని తలుపుతీస్తుంది. తలుపు తీయగానే పోలీసువాళ్ళు లోపలికి తోసుకువచ్చి ఇల్లంతా వెదకడం ప్రారంభిస్తారు.

వీడెవడని యువకుణ్ణిచూసి అడిగితే నా మనవరాలు పెనిమిటి అని బొంకుతుంది.

పోలీసులు వెళ్ళిపోతారు.

"అవ్వా! నువ్వు భరతమాతవే!" అంటాడు యువకుడు.

"తోడ్త్! కొంటెపోరాడా! నాకే పేర్లెడుతున్నవ్! నా పేరు గొల్లరామి. గంతే... ఇగనువ్వెల్లు... మల్లిని అత్తోరింటికి తోలుకపోత.. పొద్దెక్కుతాంది.. ఊఁ ఎల్లు"అంటుంది అవ్వ..

'రామవ్వ' నాటి చరిత్రకి, నేటి సాక్ష్యం!

తెలంగాణా మాండలికం కథాగమనాన్ని ఎక్కడా అడ్డదు. పైగా, బలాన్నిస్తుంది. మానవత్వం ముందు అల్లర్లు, అఘాయిత్యాలు తలవంచక తప్పదన్న నిజాన్ని నిబ్బరంగా చెప్పారు పి.వి.నరసింహారావుగారు ఈ కథానికలో.

# పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'నబీ'

**ఒ**కానొక సమయంలో సీనియర్ రచయితలు చాలామంది ఇక కథానికలు రాయమని భీష్మించుకున్నారు. బూతు కథానికలమధ్య మా కథానికలు అక్కర్లేదన్నది వాళ్ళ వాదన. కొత్త రచయితలతో బాటు అనుభవమున్న పాత రచయితలూ రాయాలి. అందుకని అప్పట్లో కథానికా సదస్సుల్ని విస్తృతంగా చేస్తున్న శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్ 'మేము డైరెక్ట్ కథానికా సంపుటాల్ని ప్రచురిస్తాము. మాకు కొత్త కథానికల్ని రాసి పంపండి, గౌరవ పారితోషికాన్ని మేము పంపుతాము' అంటూ రచయిత(త్రు)లను కోరడంతో స్పందించి రచయిత(త్రు)ల 116 డైరెక్ట్ కథానికల్ని కొత్తకథ, సరికొత్త కథ, వినూత్నకథ అనే మూడు సంకలనాల్ని తేవడం జరిగింది. కొత్త కథానికలు రాయడం మానుకున్న మంచి రచయితలు చాలాకాలం తర్వాత రాసిన 29 కథానికల సంకలనం. దాంట్లో మొదటి కథానిక పురాణం సుబ్రహ్మణ్యశర్మగారి 'నబీ'. వారి బాణీలోనే వచ్చిన కథానిక.

ఆ ప్రాంతంలో ఆకాశహర్మ్యాలు లేస్తున్నాయి. అక్కడ పనిచేసే కూలీల సౌకర్యార్థం ఓ చిన్న పందిరి వేసుకుని, చిన్నదుకాణాన్ని ప్రారంభించాడు నబీభయ్యా. ఆ భవన నిర్మాణ కార్యక్రమంలో నబీ కూడా 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అన్నట్టు ఉడుతా భక్తిగా సేవలందించసాగాడంటారు రచయిత! ఈ కథానికలో చక్కటి పోలికలతో నాటి సామాజిక తీరుతెన్నుల మీద రచయిత విసిరే విమర్శనాస్త్రాలు గొప్ప ఆకర్షణ.

అక్కడ పెద్ద పెద్ద భవనాలతో బాటు పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి వెలుస్తుంది. నబీ చిన్నగా ప్రారంభించిన ఆ కొట్టు చిన్నదిగానే ఉంది. అతనికి పోటీగా ఓ ఇడ్లీల దుకాణం వెలిసింది. రకరకాల తినే పదార్థాల్ని తయారు చేస్తుండడంతో అందరూ అతని దుకాణానికే రాసాగారు. కాబోయే శ్రీమంతుడు, శ్రీమంతుడిబూటు నాకుతాడన్నట్లు ఇతను ఆసుపత్రిలోని వైద్యులకు, పెద్ద ఉద్యోగస్థులకు ఇడ్లీలు చేసి

పంపిస్తూ– వాళ్ళాదరణకు పాత్రుడవుతాడు. నబీ దుకాణం దూరం దూరంగా జరగాల్సి వస్తుంటుంది. ఓ రోజు ముఖ్యమంత్రిగారు ఆ పెద్దాసుపత్రిలోని ఓ పెద్దరోగిని చూడడానికి వస్తున్నారంటూ చుట్టుపక్కల ప్రదేశాలన్నింటినీ శుభ్రపరచడంలో పోలీసుల సాయంతో నబీ దుకాణాన్ని లేపేస్తారు. 'బీదవాళ్ళ చేత బీదవాళ్ళ కన్ను పొడవడమంటే ఇదే' అంటూ ముగిస్తారు రచయిత.

చిన్న కథానికయినా ఎంతో శక్తివంతంగా చెప్పిన కథానిక. ప్రత్యేకశైలి, శిల్పాలు దీని సొత్తు. పురాణం సుబ్రహ్మణ్యశర్మగారి కథానికా రచనా వైభవానికి ఇదో మచ్చుతునక.

# పూసపాటి కృష్ణంరాజు ‘రెండు బంట్లు పోయాయి’

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ‘వడ్లగింజలు’ తర్వాత, చదరంగం నేపథ్యంతో వచ్చిన మంచి కథానిక ‘రెండుబంట్లు పోయాయి’. ఈ పేరు వినగానే మనకు పూసపాటి కృష్ణంరాజు గారు చటుక్కున గుర్తుకొస్తారు.

కథానికా ప్రారంభం తాతయ్య, సీతాపతి చదరంగం ఆటని రసకందాయంలో ఆడుతూంటే సుభద్రం, శంకరం పెళ్ళిపిలుపులకు వస్తారు.

“మా పెత్తండ్రి కూతురు లక్ష్మీదేవిని రాజా కలిదిండి నీలాద్రిరాజు మామగారి సుపుత్రుడు వరహాల రాజుకిచ్చి వివాహం జరుపుతున్నారు. మీరందరూ తప్పక దయచేయాలని కోరుతున్నాను” అంటూ అక్కడున్న అందర్నీ ఆహ్వానిస్తాడు సుభద్రం.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత “సుభద్రం పక్కన వచ్చినతను సుభద్రం మేనత్త కొడుకు చంద్రం కదూ? ఆ అమ్మాయిని ఇతనికే ఇచ్చి చేస్తారని అనుకున్నాం” అంటాడు నరసరాజు.

“నాకేమో శంకరం లక్షణంగానే కనిపించాడు... ఏమో?” అంటాడు సీతాపతి, తాతగారి గుర్రం మీద ఏనుగుని పగబెడుతూ.

ఇలా కథనాన్నంతటినీ చదరంగపు పాత్రల నడకతో, ఎత్తులకు పైఎత్తులతో నడపడం ఈ కథానికలోని గొప్ప శిల్పం.

పెళ్ళి రేపనగా ఆ మధ్యాహ్నం ఎండ చల్లబడ్డ తర్వాత సవారీబళ్ళు వేసుకుని అంతా ప్రయాణానికి సిద్ధమవుతారు.

విడిదికి చేరిన తర్వాత రచయిత తాతగారు, పెళ్ళికుమార్తె తాతగారైన పెదరాజుగారి సరసన కూర్చొని చదరంగం ఎత్తువేసారు...!

మగపెళ్ళివారు వచ్చారు. కానీ అనుకున్నంత ఎక్కువమంది రాలేదు.

భోజనాలయ్యాయి. నిద్రలు...

తెల్లవారుఝామున లేచి అందరూ సిద్ధమయ్యారు.

పెళ్ళికుమార్తె తాతగారు హుక్కా పీలుస్తూ– తాతగారినీ, చదరంగపు బల్లనీ ఆహ్వానించారు. ఎత్తులు... పై ఎత్తులు...!

పెళ్ళి పీటల మీద కూర్చుని పెళ్ళికుమారుడు హోమం చేస్తున్నాడు...

పెళ్ళికూతురు చుట్టూ తెరవేసి పట్టుకున్నారు. ఆమె సిగ్గుతో తలవంచుకుని కూర్చుంది. ముహూర్తం సమీపిస్తోంది.

పెళ్ళికొడుకు మేనమామగారైన సూరపరాజుగారు మీసాలు దువ్వుకుంటూ వచ్చి పెళ్ళికొడుకు చెవిలో ఏదో ఊదాడు.

హఠాత్తుగా పెళ్ళికొడుకు చెవినుంచి ఊడిపడ్డ సూరపరాజుగారు "ఆపండి సిద్ధాంతిగారూ..." అంటూ అరిచాడు.

"అనుకున్నట్టు నగదు ముందు చెల్లించాల్సిందే. ఇచ్చుకోలేకపోతే చెప్పండి. వెళ్ళిపోతాం" అన్నాడు పెళ్ళికొడుకు.

చదరంగపు ఎత్తులు వేస్తున్న తాతగారు 'అవ్వ' అని నోరు నొక్కుకున్నారు.

పెళ్ళికుమార్తె తండ్రి, పెళ్ళికుమారుడి మేనమామ సూరపరాజు గారి చేతులు పట్టుకున్నాడు. పట్టించుకోకుండా పెళ్ళికొడుకు పీటలు దిగిపోయాడు.

పిల్లతండ్రి ఎంతగా ప్రాధేయపడ్డా సూరపరాజు బృందంలో చలనం రాలేదు. పెళ్ళికుమార్తె పినతండ్రిగారు, మేనమామగారు కలిసి సూరపరాజుని ఒక్క తోపు తోసి పెళ్ళికొడుకుని మళ్ళీ పీటలమీద కూర్చోబెట్టారు.

ఇంతలో పెళ్ళికుమార్తె చుట్టూ వున్న తెర ఎగిరిపడింది. అంతవరకూ తలవంచుకుని కూర్చున్న పెళ్ళికూతురు ధైర్యంగా పీటలు దిగి, చరచరా లోపలికి వెళ్ళిపోయింది.

"ముహూర్తం దాటిపోతోంది..." సిద్ధాంతిగారన్నారు.

"నోగిట్లో సిన్నమ్మగారు పెల్లికుమారుణ్ణి సేసుకోవడానికి ఒప్పుకోవడం నేదని, అమ్మగారు సెప్పి రమ్మన్నారు పంతులుగోరూ! ఈ ముహూర్తానానికి సిన్నమ్మగార్ని శంకరం బాబుకిచ్చి కళ్యాణం సెయ్యండి" లోపలనుంచీ వచ్చిన దాసీ చిట్టెమ్మ జబర్దస్తీగా అంటుంది.

"అదేమిటి! ఈ ఎత్తు మరీ పసందుగా ఉందే!" తాతగారు చదరంగం బల్లకు అతుక్కుపోయి చూస్తుండిపోతారు.

శంకరం నేత పంచె కట్టుకుని, పెళ్ళికుమార్తె చేయి పట్టుకుని స్వయంగా తీసుకొచ్చి పెళ్ళిపీటల మీద కూర్చున్నాడు. పెళ్ళికుమార్తె చుట్టూ ఎవ్వరూ తెరపట్టలేదు. పెళ్ళి జరిగిపోయింది. భోజనాలయ్యాయి. అందరూ ఇళ్ళకి తిరుగుముఖం పట్టారు.

'వస్తున్నప్పుడు బలగంలో రెండు బంట్లు ఎక్కడో జారిపోయాయని తాతగారు దారిపొడుగునా నొచ్చుకుంటూనే ఉన్నారు'అనే వాక్యంతో కథానికని ముగిస్తారు పూసపాటి కృష్ణంరాజుగారు.

# పోలవరపు కోటేశ్వరరావు 'ఏటికి నీళ్ళు తగిలాయి'

రాజయ్యకు కృష్ణానదంటే ఇష్టం. నది వంకే చూస్తూ ఎన్ని గంటలు గడపమన్నా అతనికి ఆనందం! దూరంగా కనిపించే శ్రీకాకుళం, ఆపైన కనిపించే స్వామివారి గాలిగోపురం చూడడమన్నా కూడా ఎంతో ఇష్టం!

"ఎప్పుడు చూసినా అట్లా ఆ నదివంక సూత్తావు. అక్కడ నీకేమి కనిపిత్తుంది" రమణమ్మ భర్తనడుగుతుంది.

రాజయ్య భార్యవేపు కూడా చూడకుండా "సెప్పినా నీకు తెలవదులే..." అంటాడు.

"నువ్వలాగే సూత్తా నుంచో పనీపాటా చేయొద్దు..." కోపంగా అంటుంది భార్య.

–ఇలాంటి సంభాషణలు వాళ్ళ మధ్య నిత్యం జరుగుతూనే ఉంటాయి.

సూరీడు కిరణాల వంక చూశాడు. అవి కృష్ణమ్మ పాదాల మీద వాలి భక్తితో కొలుస్తున్నట్లున్నాయి.

మనవడిని ఇంటి దగ్గిరే వదిలి రాజయ్య బయల్దేరాడు.

"ఎక్కడికి పొద్దున్నే బయల్దేరావ్?" రమణమ్మ అడిగింది.

"ఏటికాడికి..."

"అక్కడికెందుకు?"

"పనుంది"

"ఆ పని ఉంటూనే ఉంటుంది. నీళ్ళంటే పడిసత్తావ్..."

రాజయ్య మాట్లాడడు.

"నువ్వెళ్ళకపోతే ఆ వచ్చే ఏరు ఆగిపోదులే... ఇల్లు కప్పే సంగతి సూడుముందు" వెనుక నుంచి గట్టిగా అరుస్తుంది రమణమ్మ... రాజయ్య వినిపించుకోడు...

నురుగులు కక్కుతూ నది నడిచిపోతోంది

రాజయ్య మనసు పొంగిపోయింది... ఆలోచనలు పరుగులు తీశాయి.

రాజయ్య పాదాల దగ్గరకు నీళ్ళు వస్తున్నాయి... దగ్గరలో చేపపిల్లలు కేరింతలు కొడుతున్నాయి.

తాను చాకిరీ చేస్తున్నట్లు కిష్టమ్మా కష్టపడుతోంది.... కమతం చేస్తోందేమో! బాధపడతాడు రాజయ్య.

రెండు చేతులూ కలిపి కృష్ణమ్మకి నమస్కరించాడు.

“మీ తాతను చూడరా... నీ మీదకన్నా ఆ నీళ్ళమీదే ప్రేమెక్కువ!” మనవణ్ణి చూస్తూ అంటుంది రమణమ్మ.

ఆ పసివాడు రెండు చేతులూ టపటపా కొడుతూ బోసినవ్వు నవ్వుతాడు–అంటూ ‘ఏటికి నీళ్ళు తగిలాయి’ అని ముగిస్తారు పోలవరపు కోటేశ్వరరావు.

సత్యం శంకరమంచి అమరావతి కథల్లా పోలవరపు కోటేశ్వరరావు ‘కాకుళయ్య కథలు’ గొప్పగా రాశారు. చిన్న చిన్న అందమైన వాక్యాలు... మెదడుకి పెద్ద మేత! చక్కటి చిక్కటి తెలుగు వాతావరణం, కథనం...సాగిపోతుంది కథానిక.

# పోలాప్రగడ సత్యనారాయణమూర్తి 'గెలుపూ-ఓటమి'

'కొత్తకథానిక'లో ప్రచురించిన డైరెక్ట్ కథానికలను, ఆ తర్వాత 'కొత్తకథ'నుంచి అంటూ ఎన్నో పత్రికలు మళ్ళీ ప్రచురించాయి. ఇది ఓ ప్రత్యేక ధోరణిగా కథానికా సాహిత్యంలో చెప్పుకోవచ్చు. పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారి 'గెలుపూ-ఓటమి' వాటిలో ఒకటి.

శేషాద్రి అనే ఆయన 'దయానిధి' అనే పేరుతో పత్రికలకు కథానికలు రాస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. క్రమక్రమంగా రచనలు చేయడాన్ని తగ్గించుకుని శిష్యుల్ని తయారుచేయడంలో నిమగ్నమైపోయాడు. రాంబాబు అతని ప్రియశిష్యుడు.

శిష్యుణ్ణి చూడకుండా, అతనితో చర్చలు గడపకుండా ఒక్కరోజు గడపాలన్నా గురువుగారికి ఇబ్బంది. గురువుని ఒక్కరోజు కలవకపోయినా శిష్యుడికీ ఇబ్బందే! అలాంటిది ఓ పదిహేనురోజులు శిష్యుడు కనిపించడు. గురువు గిలగిల కొట్టుకుంటాడు.

శిష్యుడేమయ్యాడో తెలుసుకోవడానికి ఆరోజు శిష్యుడింటికి బయల్దేరతాడు గురువు. అతనికి మెట్లమీదే ఎదురవుతాడు శిష్యుడు.

"ఎక్కడికి వెళ్ళిపోయావు ఇన్నాళ్ళూ?" గురువు అడుగుతాడు. "కొంత అర్జంటు పనుంటేను..." నసుగుతాడు శిష్యుడు.

"నేనూ అర్జంటుగా నీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను..." అంటూ గురువు అసలు విషయం చెబుతాడు. ఇప్పుడు మా అమ్మాయి డెలివరీకి అర్జెంటుగా డబ్బవసరముంది. అలాగని యువరచయిత(త్రు)లతో పోటీగా కథానికల పోటీకి రాయలేను. అందుకని ఓ కథానికని పోటీకి  పంపాను- నీ పేరుతో! బహుమతి డబ్బు నాకు, పేరు నీకు!

శిష్యుడు ఏదో చెప్పాలనుకుంటాడు గాని చెప్పలేడు.

ఫలితాలు వస్తాయి.

మొదటి బముమతి గురువుగారి కొస్తుంది. అదిరిపడతాడు.

"సారీ గురువుగారూ, మీ పేరుతో ఓ కథానికని పోటీకి రాసి పంపాను. ఆరోజు, మిమ్మల్ని కలుసుకున్నప్పుడు ఈ విషయం చెప్పాలనుకున్నాను గాని, చెప్పలేకపోయాను...." అంటూ శిష్యుడు వినమ్రత ప్రకటించడంతో కథానిక ముగుస్తుంది. చక్కటి కొసమెరుపు కథానిక. ఓ రకమైన రచయితల విపరీత ధోరణిని తనదైన హాస్యధోరణిలో మనముందుంచారు పోలాప్రగడ సత్యనారాయణమూర్తి.

# బలివాడ కాంతారావు 'లోకం'

ఇప్పుడు ఆడపిల్లలకి విద్య నేర్పించడం పరిపాటి అయింది కాని, బలివాడ కాంతారావు 'లోకం' రాసేనాటికి ఆడపిల్లలకి చదువు చెప్పించాలనే అభిలాష తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఉన్నట్టు లేదు.

నీలకంఠం ఓ గుమాస్తా. నిజాయితీ గల గుమాస్తా. చావు అంటే భయం లేనివాడు. ఆఖరికి చచ్చిపోతున్నాననే భయం పుట్టినవాడు. తన సామర్థ్యాన్ని పెంచుకోవడం బదులు లోకాన్ని దుయ్యపట్టేవాడు. ఇలాంటి నీలకంఠం జీవితానికి అద్దం పట్టిన కథానిక 'లోకం'.

మొదటి కూతురు పుట్టినప్పుడు ఇంటికి లక్ష్మీకళ వచ్చిందనుకున్నాడు. ఆ కూతురి పెళ్ళి ఘనంగా చెయ్యాలని ఓ ఆఫీసర్ అల్లుడు కావాలని ఆశించాడు. భార్య 'దాని రాత ఎలా ఉందో, అప్పుడే ఎందుకనుకోవాలి' అన్నమాటకి చిరాకుపడ్డాడు. ఒక కూతురు, కొడుకు అయితే చాలు అనుకున్నాడు!" రెండో సంతానం కూతురే!! ముచ్చటగా మూడో సంతానం కొడుకు అవుతాడని ఆశించాడు. కాని మూడో సంతానం కూడా కూతురే!! ఆమెకు ముచ్చటగా మంచి పేరు పెట్టుకున్న నీలకంఠం ఈ సన్యాసి ఎక్కడ పుట్టిందని చిరాకు పడేవాడు. చివరకు ఆమెకి సన్యాసమ్మ అనే పేరే నిలిచిపోయింది.

పెద్ద పిల్లలిద్దరు అతను చెప్పినట్లే వినేవాళ్ళు. ఇద్దరికి చదువు లేదు. వాళ్ళకి అక్షరమే కాదు, లోకమూ తెలీదు. ఇద్దరిని పెద్ద పెద్ద ఆఫీసర్లకి ఇచ్చి పెళ్ళి చేయాలనుకున్నాడు.

మూడో పిల్ల సన్యాసమ్మ ఫస్ట్ ఫారంతో చదువు ఆపేయమంటే, ఏడ్చి ఏడ్చి థర్డ్ ఫారం వరకు కొనసాగించకలిగింది. ఆ తరువాత చదువు ఆపేయమంటే ఏడ్చి ఏడ్చి దొంగతనంగా ఇంట్లోంచి డబ్బు ఎత్తుకెళ్ళి ఫీజు కట్టింది. తల్లిదండ్రులు సహకరించకపోయినా తన మనోస్థైర్యంతో చదువులో ముందడుగు వేసింది. లోకం మాట్లాడినా మగవాళ్ళతో సంబంధాలు కట్టినా, ఆ విషయం తండ్రి దాకా వచ్చినా పట్టించుకోలేదు. తన మీద తనకు నమ్మకం ఉందని, నమ్మమని కోరుతుంది.

అలా తండ్రి సన్యాసమ్మను చీత్కరిస్తున్నా ఆమె లోకాన్ని అర్థం చేసుకొని, ముందుచూపుతో వెళ్తుంటే, అక్కలిద్దరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు చదువు సంధ్యలు లేక ఇంట్లోనే ఉండిపోతారు. నీలకంఠం ఒకవిధంగా లోకానికి భయపడి తిరోగమనాన్ని సాగిస్తు ఉంటాడు. చదువుతో ముందుకెళ్తున్న మూడో కూతురంటే కోపం రోజు – రోజుకీ పెరుగుతూంటుంది. భార్య చనిపోవడంతో ఆర్థికంగా ఇంటిని సరిగా నడపలేక అప్పుల పాలవుతాడు. భార్య లేకపోవడం మానసికంగా కృంగతీస్తుంటుంది. రోజురోజుకి చిక్కిపోతుంటాడు.

ఆఫీసర్ సంబంధం అటుంచి, ఆఖరుకి రాజీపడి పెళ్ళి చేసిన పెద్దకూతురు, అతి త్వరలోనే విధవగా ఇంటికి వస్తుంది. ఆమెని, రెండోకూతుర్ని చూస్తూ, ఇంత మంచి పిల్లలకి సరైన న్యాయం చెయ్యలేకపోయానని కుమిలిపోతుంటాడు. మూడోపిల్లమీద కోపం పెరుగుతూంటుంది.

క్రమక్రమంగా దిగులు ఎక్కువైపోతూంటుంది. అస్సలు వివాహమే రెండో పిల్లకి చెయ్యలేనితనం, పెద్దామెకు విధవా వివాహం ఎలా చెయ్యగలనని మనస్సులోనే కుమిలిపోతూంటాడు. మూడో కూతురిలో వస్తున్న మార్పు, తనని పట్టించుకోకపోవడంతో మానసికంగా మరింత ఇబ్బంది పడుతుంటాడు. రోజురోజుకీ బెంగతో కృశించిపోతుంటాడు. అంతవరకు నిజాయితీగా ఉన్న తనకి ఈలోకం మెచ్చి ఏ కిరీటం పెట్టిందని – కోపంతో లంచాలు తీసుకోవాలనుకుంటాడు. ఉద్యోగంలో తనకు పైన ఉన్నవాళ్ళే పెద్ద మొత్తాలకి కక్కుర్తి పడుతుంటే, బేడకి, పావలాకి తనేందుకు కక్కుర్తి పడాలని – లంచాలకి దూరంగా ఉన్నాడు. పేపర్లలో ప్రజాశ్రేయస్సు అని రాస్తూన్న దానికి అర్థం ఏమిటో తనకి తెలియడం లేదు. సంస్కృతి, సాంప్రదాయాలన్నా, నమ్మకం సన్నగిల్లింది.

'చాలేద్దువు ఈ చదువు' అంటుంది రెండో అక్క. సన్యాసమ్మ నెమ్మదిగా 'నాకు తెలుసు చదువుకుంటే ఆడదాని శీలం చెడుతుందని, నీ రకం వాళ్ళ ఉద్దేశం! అమాయకురాలిగా కనబడని ఆడదాన్ని గౌరవించలేనివాళ్ళు, ఆత్మ వంచన చేసుకుంటున్నారు. అందుకు ఏమైన అంటారు' అక్కమాటని కొట్టేస్తుంది. కోపంతో అక్కలు, తండ్రి నానా మాటలు అన్నా పట్టించుకోకుండా సన్యాసమ్మ అక్కడ్నుంచి వెళ్ళిపోతుంది. నీలకంఠంకి కూతుళ్ళ సమస్యతో పాటు చావు భయం పట్టుకుంటుంది. తను చనిపోతే పెద్దకూతుళ్ళిద్దరు రోడ్డు మీద అడుక్కుంటారని, చిన్నకూతురు ఎవరితోనో లేచిపోతుందనే భయాలు ఎక్కువైపోతాయి. క్రమక్రమంగా ఈ దిగుళ్ళతో నీలకంఠం

మంచం ఎక్కుతాడు. అప్పుడు పెద్ద కూతుళ్ళిద్దరూ బెంబేలు పడుతుంటే, మూడో కూతురు ధైర్యంగా నిలుస్తుంది. తాను ఇంక చదువుని మానేసి, ట్యూషన్స్ చెప్పి, కుటుంబాన్ని పోషిస్తాను అని తండ్రితో ధైర్యంగా చెబుతుంది. అంతవరకు నిరాశలో మునిగి తేలుతున్న నీలకంఠానికి లేచి కూర్చోవాలనిపిస్తుంది.

'ఇద్దరి జీతం ఏం చేసుకుంటాం నాన్న? చిన్న అక్క పెళ్ళి చేద్దాం, ముందుకొచ్చే మొగాడుంటే పెద్ద అక్క పెళ్ళి కూడా చేద్దాం, మనకేం? మన డబ్బే ఒకరు తినే పరిస్థితి వస్తుంది' అని ధైర్యం చెబుతుంది చిన్నకూతురు. అంతవరకు కొడుకు లేడని బాధపడ్డ నీలకంఠంకి మూడో కూతురే కొడుకు కన్నా హెచ్చైన రత్నం అనిపిస్తుంది. తను భయంతో తన మెదడులో వేసుకున్న ఉరిని ఈ కూతురే తప్పించిందని భావిస్తాడు!

అప్పుడు అతనికి అర్థం అవుతుంది, జీవితంలో ఎంత పెద్ద తప్పు చేసాడో, పెద్ద కూతుళ్ళని చదివించకుండా!!

ఈ కథానిక ద్వారా స్త్రీ విద్య అవసరమని, గురజాడ చెప్పినట్లు, చదువుకున్న స్త్రీ జాతిరత్నమని చెప్పడంతో పాటు కొడుకులు లేరని ఆడపిల్లలే పుట్టారని దుఃఖించకూడదని తల్లిదండ్రులకి హితవు చెబుతారు రచయిత. లోకం అనగానే మంచి చెడు ఉంటుందని. మంచిని పసిగట్టి ముందుకు వెళ్ళడమే గొప్పతనం అని చెబుతారు రచయిత. అలాగే రాత్రి వెంట పగలు ఉంటుందని, కష్టాలు వచ్చాయని కృంగి పోవద్దు అని, తర్వాత సుఖాలు వస్తాయనే ధైర్యాన్ని కూడా చెబుతారు రచయిత. లోకులు కాకులు, అందరి కేకలకి భయపడవద్దు, ఆత్మస్థైర్యంతో ముందుకి నడు.... ఇలా ఎన్నో విషయాలు కథానిక చదువుతున్నంత సేపు, కొత్త కొత్త ఆలోచనలు పుడుతుంటాయి. కథానికని ముగించిన తర్వాత మరింతగా ఆలోచించకుండా ఉండలేం. లోకమంటే ఏమిటో చిన్న కథ ద్వారా విజయవంతంగా చెప్పగలిగారు.

1927లో శ్రీకాకుళంలో జన్మించిన బలివాడ కాంతారావుగారు 'లోకం' లాంటి గొప్ప కథానికలు ఎన్నో రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుని అందుకున్నారు. శిల్పపరంగా కథానికని చక్కగా చదివేట్లు చెబితే అది మంచి కథానిక అని, వస్తువు కూడా మనస్సుని కదిలించేలాగా ఉంటే గొప్ప కథానిక అని భావించాలి. బలివాడ కాంతారావుగారు ఎన్నో గొప్ప కథానికల్ని రాసి, రంజింప చేయడమే కాదు, మన ఆలోచనా ధోరణిని విస్తృతం చేశారు.

# బందా కనకలింగేశ్వరరావు 'పందిరి కింద'

**1933** జూన్ గృహలక్ష్మి మాస పత్రికలో ఈ కథానిక ప్రచురితమైంది.

ఆ రోజుల్లో పెద్ద పెద్ద కుటుంబాలు ఒక పందిరి కింద ఎలా కళకళలాడేవో, క్రమంగా ఆ కళ ఎలా విహీనమై, చెట్టుకొకరు, పుట్టకొకరుగా విడిపోయి గతంలోకి తొంగి చూసుకుంటూ ఆ గొప్ప రోజుల్ని తల్చుకుంటూ ఉంటారో చెప్పడం ఈ కథానికాంశం.

తల్లి, పెద్దక్క ఆధ్వర్యంలో మిగిలిన పిల్లలు ముఖ్యంగా వేసవి కాలంలో పందిరి కింద ఎలా ఆనందంగా గడిపేవారో చెప్పటంతో ప్రారంభమవుతుంది ఈ కథానిక.

ఆ రోజుల్లో  పెద్ద పెద్ద కుటుంబాలుండేవి. తల్లి మూలాధారమైతే ఆ తర్వాతి ముఖ్య పాత్ర పెద్దక్క. ఆడవాళ్ళే పనిమంతులు కాబట్టి ఆడపిల్లలంటే అదో ఇష్టం. ఎంతమందున్నా అందరూ వాకిట్లోని చలువపందిరి కింద చేరేవారు. భక్తిపాటలు, గ్రంథాలు ఒకళ్ళు చదువుతుంటే మిగిలినవాళ్ళు వింటుండేవారు.  మగపిల్లలు గోల చేస్తుండేవారు.

తల్లి పాత్ర తల్లిదే, అప్ప పాత్ర అప్పదే... పందిరి కింద రోజులన్నీ పచ్చగానే నడిచాయి. ఎంతో కాలంపట్టలేదు. ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. పెళ్ళిళ్ళయిపోయి, ఉద్యోగాలు వచ్చి ఆ అందమైన రోజుల్ని తలచుకోవటం తప్ప, గడిపే అవకాశం పూర్తిగా పోయింది అని మనకి అందిస్తారు రచయిత. మనుషుల మధ్య బంధాలు ఎలా తెగిపోతున్నాయో గుర్తిస్తాం. చిన్ననాటి రోజులే నేటి రోజులకంటె గొప్ప అనుకోవడానికి కారణం ఆ అమాయకత, అన్యోన్యం. ఇవి కొరవరవడి పోతున్న ఈ రోజుల్లో వాటి కోసం వెంపర్లాట ఎండమావులని వెతుకుతున్నట్లే!

ఇలాంటి విషయాలకోసమే మనం గతంలోకి చూస్తుంటాం. ఎంత పెరిగినా నేటికన్నా గతం తీయనైనది, గొప్పది. అందుకే ఇప్పటికీ బాల్యంలోకి పరుగెత్తించే రచనలు ఇంకా విస్తారంగా వస్తూనే ఉన్నాయి.

బాల్యం తలచుకుంటే చాలు, అది ఎవరికైనా బలమిస్తుంది.

నాటి రోజులకీ, నాటి సంస్కృతికి దర్పణం పటడుతుంది. "పందిరి కింద" మారుతున్న సంస్కృతిని, ఆలోచనా ధోరణుల్ని మనముందుంచుతాయి కథానికలు. ❀

# భానుమతి రామకృష్ణ 'అత్తగారూ- కట్టుడుపళ్ళూ'

**మ**నకి ఉన్న అతి తక్కువ హాస్య రచయిత, రచయిత్రుల్లో భానుమతి రామకృష్ణగారు ఒక్కరు. ఆమెది చాలా సున్నితమైన హాస్యం. 'అత్తగారితో' అనుభవాలుగా ఎన్నో హాస్యకథానికల్ని చెప్పారు. అవి చదువుతుంటే సీరియస్‌గా కనిపించే భానుమతి గారిలో ఇంతటి హాస్యం ఉందా అనిపిస్తుంది. ఉదాహరణకి 'అత్తగారూ – కట్టుడుపళ్ళూ' కథానికను తీసుకుందాం.

ఆరోజు అత్తగారి 76వ జన్మదినం. భోజనానికి ఎదురుగా వడ్డించిన పదార్థాలన్నింటిని చూసి ఆవిడ నోరు ఊరుతుంది. చేగోడిలని చూస్తూ, గారెముక్కల్నే కొరకలేని దాన్ని గడ్డపారలు లాంటి చేగోడిల్ని ఎట్లా నమలగలను అని వంటవాడిమీద చికాకు పడుతూ, ఓ చిన్న గారెముక్కను తుంచి నోట్లో వేసుకొని కాసేపు చప్పరించి, చిగుళ్ళతో నొక్కడానికి ప్రయత్నించి, ఇవి తినడం నా వల్ల కాదే అంటూ మింగేసారు.

ఇంతలో అత్తగారి బాల్యస్నేహితురాలు, అఖిలాండమ్మ 'నాకు పలుగులు లాంటి పళ్ళు ఉన్నాయి' అంటూ వస్తుంది. ఆవిడ పళ్ళు అన్ని కట్టుడుపళ్ళే అని తెలిసి తను అలాంటి పళ్ళు కట్టించుకోవాలనుకుంటుంది. పది పళ్ళు పెట్టడానికి పదిరూపాయిలు అన్న స్నేహితురాలి మాట విని మనకాలంలో అయితే మరో మూడు రూపాయలు ఇస్తే సవర బంగారం వచ్చేది అంటూ ఆశ్చర్యపోతారు అత్తగారు.

నా బాధ చూడలేక నా బిడ్డ పళ్ళని కట్టించాడు అంటుంది అఖిలాండమ్మ. అన్నీ తింటున్న ఆవిడని చూసేసరికి అత్తగారికి తాను పళ్ళు కట్టించుకోవాలనే కోరిక తీవ్రమవుతుంది.

పళ్ళు కట్టించుకున్న కొత్తల్లో అత్తగారు ఆ మాట మర్చిపోయి నోట్లో ఏం పెట్టుకున్నా గుటుక్కున మింగేసేవారు.

ఒక్కరోజు బావిలోంచి నీళ్ళు తోడుతున్న అత్తగారు ఆయాసంతో నోరు తెరిచేసరికి కట్టుడుపళ్ళు బావిలో పడిపోయాయి.

'ఉన్న నాలుగు పళ్ళు పీకేసి తుమ్మితే ఊడే పళ్ళు పెట్టాడు ఆ దగాకోరు' అంటూ డాక్టర్‌ను తిట్టిపోయసాగింది అత్తగారు.

‘బావిలో దిగేవాళ్ళని పిలిచి, పళ్ళు వెతికించి తీసుకురండి’ సలహా ఇస్తుంది పనిమనిషి.

అత్తగారికి ప్రాణం లేచొచ్చింది. బావిలోకి దిగి తీసేవాళ్ళని తీసుకురమ్మంటుంది పనిమనిషితో. మధ్యాహ్నం పనిమనిషి ముగ్గురు రౌడీల్లాంటి వాళ్ళని తీసుకొస్తుంది.

వీళ్ళల్లో పనిమనిషి మొగుడెవరో, అని కోడల్ని అడుగుతుంది. ‘వాడి గొడవ మనకెందుకు. మనకు కావలసింది బావిలోకి దిగి పళ్ళు తీసేవాడు’ అంటుంది కోడలు.

హిందీలో మాట్లాడుతున్న వాళ్ళని ఉత్తరదేశం వాళ్ళని చెబుతుంది పనిమనిషి.

ఇంతలో దబ్‌మని శబ్దం వినిపిస్తుంది. వాళ్ళు ముగ్గురు బావిలోకి దూకుతారు. వెతికినా పళ్ళు కనిపించలేదు. యాభైరూపాయలు ఇవ్వమన్నారు. గుండెలు బాదుకుంటూనే వాళ్ళకి ఆ డబ్బులు ఇవ్వక తప్పలేదు అత్తగారికి. మర్నాడు పేపరులో ఎవరో హిందుస్థాను వాళ్ళు కొన్ని ప్రాంతాలలో 2 పెద్ద పెద్ద దొంగతనాలు చేశారని తెలిసింది. ఇంతలో పనిమనిషి పరుగెత్తుకుంటూ వచ్చి, అమ్మ బావిలోకి దిగి పూడిక తీసిన హిందీవాళ్ళని పోలీసోల్లు పట్టుకువెళ్ళారంట అంటుంది. అత్తగారు గుండెలు బాదుకుంటుంది. గెడ్డాలు పెంచుకున్న వాళ్ళని ఇంటికి రానీయకూడదంటుంది.

ఇంకా పేపర్లో ‘ఊళ్లో గెడ్డం పెంచుకుని తిరుగుతున్న వాళ్ళని, హిందీలో మాట్లాడేవాళ్ళని పోలీసులు పట్టుకు వెళ్తున్నారు’ అంటూ కూడా రాశారు.

వంటవాడు శబరిమలై వెళ్ళాలని నెల రోజులుగా గెడ్డం పెంచుతున్నాడు. అతడిని ‘తక్షణం ఆ గడ్డం తీసేయి’ అంటుంది అత్తగారు. పనివాడు గెడ్డం పెంచాడు. అత్తగారిలో కంగారు పెరిగిపోయింది. ఇంతలో డ్రైవర్ సింగ్ ఆమె కంటపడ్డాడు. అతడికి గెడ్డం ఉంది. అత్తగారికి వాళ్ళంతా పరమ శత్రువుల్లా కనిపించసాగారు. తెల్లవారుఝామున వస్తామన్నా వంటవాడు, పనివాడు తెల్లవారి తొమ్మిదవుతున్నా రాలేదు. ఇంతలో గుర్ఖావాడు పరుగెత్తుకు వచ్చి, వంటవాడ్ని, పనివాడ్ని ఇద్దరు పోలీసులు పట్టుకు వచ్చారు.

వాళ్ళని లోపలికి రానివ్వద్దు. నేనే గేటుదాకా వస్తానని వెళ్ళి అత్తగారు ‘వాళ్ళిద్దరు నాకు తెలీదంటుంది. మా ఇంట్లో పనిచేయలే’దంటుంది.

“అయిదే వీళ్ళు మీ ఇంటి పనివాళ్లు కాదన్నమాట, దొంగరాస్కెల్స్’ ఇంతలో డ్రైవర్ సింగ్ పరుగెత్తుకుంటూ వచ్చి పోలీసులకు అడ్డం పడతాడు.

'ఇతనెవరు' అడుగుతారు పోలీసులు.

'ఈ గెడ్డపతను మా డ్రైవర్‌కాదు' ఖరాఖండిగా చెప్తుంది అత్తగారు. ఇంతలో అత్తగారి పుత్రుడు బయటకు వచ్చి వాళ్ళని పోలీసుల నుంచి విడిపిస్తాడు.

ఇంతలో పనిమనిషి పరుగెత్తుకుంటూ వచ్చి అత్తగార్ని బావిలోంచి తీసిన పూడిక దగ్గరకు తీసుకెళ్తుంది.

అత్తగారి కళ్ళు తళుక్కున మెరిశాయి. బావిలోంచి తీసిపోసిన పూడికమన్నులో అత్తగారి కట్టుడుపళ్ళు కనిపించగానే!

'గుడ్డలు ఉతికిన నీళ్ళు, ఆ మన్ను మీదపోసాను అమ్మగారు. ఆ బురదలో తళుక్కుమన్నాయి మీ పళ్ళు' అంది అమాయకంగా పనిమనిషి.

'పోనీలే నీ వల్లే బావిలో పడ్డాయి. నీ వల్లే దొరికాయి' అంటుంది ఆనందంగా అత్తగారు.

ఇంతలో వంటవాడు, పనివాడు, డ్రైవర్ వచ్చి అత్తగారికి ఎదురుగా నిల్చుని, 'ఎవరమ్మా మీరు పళ్ళేమిటి, దొరకడమేమిటి, అస్సలు మా పెద్దమ్మగారికి పళ్ళు లేవే' అంటూ నిలదీస్తారు దెబ్బకు దెబ్బ కొడుతూ!

అత్తగారి కథలకి మన తెలుగు సాహిత్యంలోనే ఒక ప్రత్యేకత ఉంది.

# బుచ్చిబాబు 'కాగితం ముక్కలు, గాజుపెంకులు'

**త**మ ఇంటికి వచ్చి వెళ్తున్న మిత్రుడు నర్సింహాన్ని రైలు ఎక్కించడానికి స్టేషన్‌కి వస్తాడు చంద్రం, కథానిక అక్కడ మొదలవుతుంది.

తమ ఇంటికి వచ్చిన నర్సింహం మొదట్లో భార్యని 'అరుణగారు' అనే పిలుస్తాడు. కాని రైల్వేస్టేషన్‌లో ఆమె ప్రసక్తి వచ్చినప్పుడు 'అరుణ' అని ఏకవచనంతో పిలవడం ఇబ్బంది కలిగిస్తుంది చంద్రానికి. అతని దగ్గర నుంచి తీసుకున్న హంటర్‌తో ఇంటికి బైలుదేరతాడు చంద్రం, మిత్రుడుకి సెండ్ ఆఫ్ ఇచ్చాక. రచయిత చెప్పకపోయినా ఆ 'హంటర్‌తో నర్సింహం స్వభావం చంద్రలో ప్రవేశిస్తుంది.

ఇంటికి చేరుకొని తలుపు తడతాడు. తలుపు తీసిన నౌకరు టపా తెస్తానని బయటకు వెళ్ళిపోతాడు. భార్యని పిలుస్తాడు. ఆమె పలకను కూడా పలకదు.

హంటర్ చేత్తో పట్టుకుని భార్య ఉన్న గది తలుపుని బలంగా నెడతాడు.

ఆమె అద్దంబల్ల ముందు మడతమంచం ముందర కూర్చోని ఏదో ఉత్తరాన్ని చదువుతూ ఉంటుంది.

భర్తని చూడగానే అరుణ చటుక్కున్న ఆ ఉత్తరాన్ని గుప్పిట్లో దాచేసుకుంటుంది.

చంద్రంలో అనుమానం రెట్టింపు అవుతుంది.

బలవంతాన ఆమె నుంచి ఉత్తరాన్ని లాక్కోవాలనుకుంటాడు. ఆమె ఉత్తరాన్ని అతను అందుకోకుండా ఆపే ప్రయత్నం చేస్తూంటుంది.

"ఆ ఉత్తరం ఏమిటో నాకు తెలుసు" అంటూ గర్జిస్తాడు చంద్రం.

"తెలిస్తే ఇంకెందుకు, వెళ్ళండి"

"చూడకుండా వెళ్ళను."

"అయితే నేనే వెళ్తాను"

"అది ఉత్తరం అవునా?" చంద్రం కోపం రెట్టింపు అవుతుంది.

"అవును" అంటుంది అరుణ.

"ఎవరు రాశారు?"

"అది తెలుసుకున్న వాళ్ళు, ఇదీ తెలుసుకోండి"

కోపంతో చిర్రెత్తుకొస్తుంది చంద్రానికి.

చటుక్కున నరసింహం మాటలు గుర్తుకొస్తాయి.

'వాడే ఈ ఉత్తరం రాసుంటాడు' భార్యపైకి ఎగబడి లాక్కోవాలని ప్రయత్నిస్తూ అడుగుతాడు.

"ఇది ప్రేమలేఖేనా?"

"అవును"

"చూడనీ..."

"చూడనివ్వను, మీకు వచ్చిన ఉత్తరాలన్నీ నన్ను చూడనిస్తున్నారా.."

"వేళాకోళమా?"

"నిజంగానే"

"ఇస్తావా? ఇవ్వవా?" బలవంతాన ఆమె మీద పడి ఆ ఆకుపచ్చ రంగు కాగితాన్ని లాక్కుంటాడు.

ఆశ్చర్యం!!

'తను వివాహం అయిన మరుసటి సంవత్సరం అరుణకి రాసిన ఉత్తరం'

"దానికి ఇంత దాపరికం దేనికి?" అతనికి అర్థంకాదు.

ఆ ఉత్తరం అరుణకి ఆనందాన్ని ఇస్తోంది. ఎన్నేళ్ళ క్రితమో ఆమె పొందిన ఆనందాన్ని, మళ్ళీ ఇప్పుడు చదువుకుని పొందుతోంది. ఆ ఉత్తరం రాసిన చంద్రం వేరు, ఈ చంద్రం వేరు. ఆ చంద్రం ప్రియుడు. యవ్వనంలో స్వప్నాల్ని అల్లే మాంత్రికుడు. ఇప్పటి చంద్రం– భర్త. ఉద్యోగం, హోదా, డబ్బు, నౌకర్లు, స్నేహితులు, మర్యాదలు ఉన్నాయి. భార్య వంట వండి పెడుతోంది. దాచి పెట్టుకున్న ఆ ఉత్తరం చదవడంతో గతించిన కలల్ని ఆమె తిరిగి ఊహల్లో సృష్టించుకుని ఆనందాన్ని పొందుతోంది.

ఇప్పుడు ఏ లోటు లేదు... కానీ ఏదో లోపించింది. ఆ లోపించింది, ఆ ఉత్తరంలో ఉంది.

చంద్రంకి విషయం అర్థమైంది. హంటర్‌తో తనని తాను కొట్టుకున్నాడు. శరీరానికి నొప్పి తెలుసు, బాధా తెలుసు. కానీ హృదయానికి తెలిసేది గాయం. అద్దాన్ని అతుకుపెడుతుంది హృదయం. హంటర్‌ని లేఖ మీద పడేస్తున్నప్పుడు ఒక్క కన్నీటి బిందువు అక్కడ పడి తడుస్తుంది. ఒక్కటే బిందువు ఉంది. పగిలిన వాటిని అతుకపెట్టే జిగురు లాంటిది. అది కాస్తా ఇప్పుడు పడిపోయింది– అంటూ ముగిస్తారు కథానికని బుచ్చిబాబు.

అతన్లో మారిన మనిషిని, భార్య కోరుకునే పాత మనిషిని, ఎంతో సున్నితంగా మన ముందుంచుతారు, ఇద్దరి మధ్యా భేదం తెలిసేటట్లు!!

# బుర్రా వేంకటసుబ్రహ్మణ్యం 'పారిస్'

అతి తక్కువే రాసినా ఎంతో గొప్ప కథానికలు రాసిన వాళ్ళలో బుర్రా వేంకటసుబ్రహ్మణ్యం  ఒకరు. ఈయన రాసిన జేబురుమాలు, పారిస్ లాంటి కథానికలు, తెలుగు కథానికా సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఈయన ఎన్నో దేశాలు తిరిగారు. ఎంతో చదువుకున్నారు. ఆ విషయాలు ఈయన కథానికలు చెప్పకనే చెప్తాయి.

'పారిస్' కథానికలో వాతావరణం, పాత్రలు కూడా పారిస్‌కు చెందినవే– రచయిత పాత్ర తప్ప.

వచ్చిన మూడోరోజు పొద్దుట్నుంచి, సాయంత్రం వరకు గదిలోనే స్నేహితులతో గడపడం ఇష్టంలేక రోజంతా ఎక్కడో గడుపుదామని నిశ్చయించుకొని ఉదయం 10గంటలకే వెళ్తూ, తిరిగి రాత్రి 10 గం.ల వరకు రానని హోటల్ యజమానితో చెప్తాడు రచయిత. అంతకు ముందు పారిస్ వచ్చినప్పుడు అతను అదే హోటల్‌లో దిగుతాడు. యజమాని తీరు నచ్చడంతో మళ్ళీ అక్కడే దిగుతాడు. ఇక ముందు అక్కడే దిగాలనుకుంటాడు.

సాయంత్రం మూడుగంటల దాకా లూవ్రే చిత్రశాలలో తిరుగుతాడు. ట్యూలరీస్ వనంలో తిరుగుతాడు. అయినా సమయం గడవదు. అస్సలు పారిస్ నేను ఎందుకు వచ్చాను? అని తనను తానే  ప్రశ్నించుకొని, మర్నాడు ఉదయం లండన్ వెళ్ళిపోవాలనుకున్నాడు. రాత్రి 10 దాకా రానని అన్నవాడు, సాయంత్రం 5 కూడా కాకముందే హోటల్‌కు వచ్చేస్తాడు. హోటల్ యజమాని అతని భార్య, కంగారుగా, 'పైకి వెళ్ళొద్దు! మాతో టీ తాగండి!' అంటారు. ముఖం కూడా కిందే కడుక్కోమంటారు. వాళ్ళ ప్రవర్తన అర్థం కాదు రచయితకి.

ఆఖరికి బుద్ధి తక్కువైందంటూ యజమాని అస్సలు విషయాన్ని చెప్పేస్తాడు రచయితకి. మధ్యాహ్నం ఓ ఫ్రెంచ్ కుర్రాడు ఓ అమ్మాయితో వచ్చి గది కావాలని అన్నాడని. గది ఖాళీ లేకపోవడంతో  సాయంత్రం దాకా రచయిత రాడనుకుని ఆ గదిలో ఉండమన్నానని చెప్తాడు. రచయితకి కోపం వచ్చినా ఏమీ అనలేకపోతాడు. ముఖం కడుక్కొని టీ తాగుతుండగా వాళ్ళిద్దరు కిందకి దిగి వస్తారు.

'వీళ్ళిద్దరే ఇంతవరకు మీ గదిలో ఉంది' అంటాడు హోటల్ యజమాని. ఫిలిప్‌కి, అతనితో ఉన్న అమ్మాయి రెనీ బెర్నేకి కోపం వస్తుంది, తమ గురించి యజమాని అందరికీ చెప్పేస్తున్నాడని. మాటల్లో రెనీ ఇంగ్లీష్, జెర్మన్ భాషల్లో బాగా చదువుకున్నదని తెలుస్తుంది. అలాగే రచయిత లూవ్రేలో చూసిన 'చదువరి' చిత్రపటాన్ని జ్ఞాపకం చేయగానే అది చాలా గొప్పదంటుంది రెనీ.

తమ గురించి హోటల్ యజమాని రచయితకి చెప్పేశాడని బాధపడుతున్న వాళ్లని క్షమించమంటాడు రచయిత.

'మీరేం చేశారు మిమ్మల్ని క్షమించమనడానికి?' అంటుంది రెనీ. 'మిమ్మల్ని మళ్ళా నేను ఎప్పుడు చూడడం' అడుగుతాడు రచయిత. 'మీలాగే నేను ఇంగ్లీష్, జర్మన్‌లో ఎక్కువ పుస్తకాలు చదివేవాడ్ని. ఇద్దరం కలసి ఆ విషయాలు మాట్లాడుకోవాలి' అనికూడా అంటాడు రచయిత.

'ఈ హోటల్‌లో మాత్రం వద్దు. మరెక్కడైనా కలుసుకుందాం' అంటుంది రెనీ. మర్నాడు ముగ్గురు కలిసి ఏదైనా సినిమాకి వెళ్దాం అనుకుంటారు. సినిమాహాల్‌లో రెనీ మగవాళ్ళిద్దరి మధ్యా కూర్చుంటుంది, పారిస్‌లోని పద్ధతిని బట్టి. ఫిలిప్‌కి ఇంగ్లీష్ రాదు, ఫ్రెంచ్ తప్ప. రెనీ, రచయిత ఇంగ్లీష్‌లో మాట్లాడుకుంటారు. ఫిలిప్‌కి కోపం వస్తుంది. రెనీకి ఆనందం వేస్తుంది. అలా దగ్గరైన రెనీ, ఫిలిప్‌ని పక్కనపెట్టి, రచయితకి దగ్గరవుతుంటుంది.

మర్నాడు లండన్ వెళ్ళిపోతానన్న రచయితతో "ఇవాళ మమ్మల్ని టీకి, సినిమాకి పిల్చావు,. రేపు మా ఆతిథ్యం స్వీకరించాలి" అని ఫ్రెంచ్‌లో ఫిలిప్ అంటే, రెనీ ఇంగ్లీష్‌లోకి అనువదిస్తుంది.

మర్నాడు సాయంత్రం నాల్గుగంటలకు ప్లేస్ డి లా మ్యాడలైన్ దగ్గర కలుసుకుంటారు. గాంధీ స్వీయచరిత్రని, రవీంద్రుడి గీతాంజలి పుస్తకాల్ని తీసుకొని వెళ్ళి రెనీకి బహుతిగా ఇస్తాడు రచయిత. దాంతో ఆమె మరింత దగ్గరవుతుంది.

ఫిలిప్ పత్రికను కొనడానికి అటు వెళ్ళగానే రెనీ చటుక్కున "నువ్వు లేకపోతే నేను ఉండలేను. నువ్వు వెళ్ళకు. రేపు మధ్యాహ్నం ఒంటిగంటకు మాల్ మెయి సాన్ రాజ్ భవన్ దగ్గర కలుసుకుందాం. రా" అంటుంది.

మర్నాడు 'అక్కడకు వెళ్ళకూడదు లండన్ వెళ్ళిపోవాలి' అనుకుంటాడు రచయిత. కాని మోసం చేయలేక కొద్దిగా ఆలస్యంగా ఆమె చెప్పిన చోటకు వెళ్తాడు. అతడిని చూడగానే రెనీ ఏడుస్తుంది 'నన్ను ఇంకా అర్థం చేసుకోలేదా' అంటూ.

"నిన్ను బోధ పరుచుకోలేక కాదు. నాకిదంతా నచ్చడం లేదు' అంటాడు రచయిత.

'నీకు నాకు స్నేహం ఉండచ్చు. మరే సంబంధం ఉండడానికి వీల్లేదు' అని కూడా అంటాడు. తింటున్నంతసేపు రెనీ అతి సరదాగా ఏవేవో మాట్లాడసాగింది. 'మరో మూడు రోజులు తప్పకుండా పారిస్‌లో ఉంటానని మాట ఇవ్వు' అంటుంది రెనీ. అతను తప్పక 'సరే' అంటాడు.

రెనీ తనని ప్రేమిస్తోందని అర్థమైపోతుంది రచయితకి. కానీ అతనికి ఆమె అంటే ప్రేమ లేదనీ అర్థమవుతుంది రచయితకి. చెప్పకుండా మర్నాడు వెళ్ళిపోవాలనుకుంటాడు. ఆ అర్ధరాత్రి గదికి వచ్చి తలుపు కొడుతుంది రెనీ.

"ఈ రాత్రంతా ఉండిపోమంటే నీతోనే ఉండిపోదామని వచ్చాను" అంటుంది... ఆ మాట ఎలా అంటావు రెనీ...ఈ గదిలోనే ఫిలిప్‌తో నాలుగు గంటలు స్వేచ్ఛగా నువ్వు కాలం గడిపి నాల్గు రోజులు కూడా కాలేదు" అంటూ ఆమెని బయటకు తీసుకొస్తాడు రచయిత.

స్టేషన్ దాకా వస్తాను అంటే వద్దని ఆమె వెళ్ళిపోతుంది.

హోటల్‌కు వచ్చి మర్నాడు ఉదయమే లండన్‌కి వెళ్ళిపోతున్నానని ఇవ్వాల్సిన డబ్బంతా ఇచ్చేస్తాడు రచయిత. పారిస్‌లో రైలెక్కేప్పుడు రెనీ ఆఖరి నిమిషాన తన మోసాన్ని కనిపెట్టి స్టేషన్‌కి వచ్చేస్తుందేమో అని కంగారు పడతాడు... ఆలోచిస్తూంటే అతనికి దుఃఖం ఆగదు....

లండన్ నుంచి ఇండియా వచ్చేసినా రెనీ రూపం రచయిత మనస్సులో మసిబారదు. ఇండియాలో స్త్రీకి ఎటు పక్కకు చూసినా సిగ్గు దొంతరలే, మేలి ముసుగులే, ఘోషాలే. ఇప్పుడు రచయితకి తన లోకం ఇది, రెనీ లోకం ఇది కాదని అనిపిస్తుంది. రెనీ తనని క్షమించదని బాధేస్తుంది. అతడు రెనీ గురించి ఆలోచిస్తూ ఇప్పుడు ఫిలిప్‌ని పెళ్లి చేసుకుని ఉంటుందని, పిల్లలకు తల్లై ఉంటుందని అనుకుంటాడు.

'జీవించే ప్రతిజీవికి రెండు పరస్పర వ్యతిరేక మనో గుణాలుంటాయి. ఒక మనోగుణానికి జీవిత పరిస్థితులతో మైత్రి, రెండో గుణానికి జీవిత పరిస్థితులతో వైరం ఉంటాయి. రెండూ ముఖ్యమైనవే' అంటూ ముగిస్తారు 'పారిస్' కథానికని బుర్రా వేంకటసుబ్రహ్మణ్యం.

# భూషణం 'ఉద్ధరింపు'

పేదలనుద్ధరించడానికి ప్రభుత్వం పెట్టే పథకాలెలా ఉంటాయో చాలా వ్యంగ్యంగా చెప్పారు 'ఉద్ధరింపు'లో భూషణం.

ఇప్పపువ్వుకి ఏరి కూడబెట్టి, అమ్ముకుని భుక్తి గడుపుకుంటుంటారు ఆ ప్రాంతంలో కొందరు. అలాంటి వాళ్ళలో సంగమ్మ ఒకతె.

ఇప్పపప్పుకి ధర వచ్చినతర్వాత తనదగ్గరున్నది అమ్మి ఓ చీర కొనుక్కోవాలని ఆశపడుతుంటుంది.

ఇంతలో సంగమ్మ అమ్మ చెంచమ్మకి సుస్తి చేస్తుంది.

డాక్టర్ని పిలుస్తే రెండు మాత్రలిచ్చి ''ఇంజక్షన్ ఇవ్వాలి పదిరూపాయలి"మ్మంటాడు.

కొండల మధ్యనున్న ఆ ఊళ్ళో ప్రతీ మంగళవారం సంత జరుగుతుంటుంది. సంత దగ్గర కార్పొరేషన్ గొడౌన్ కట్టించింది. కార్పొరేషన్ ద్వారా గిరిజనులకు కావలసిన నిత్యావసర వస్తువులు సరఫరా చేసి వాళ్ళమ్మే అడవి దినుసులను షావుకార్లు అన్యాయమైన ధరకు కొనుక్కుపోకుండా, తాము న్యాయమైన ధరకి కొని వాళ్ళకి రక్షణ కల్పించాలని ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

ఆ విషయం అక్కడివాళ్ళకు తెలవడానికి ఓ పెద్ద ఆఫీసరుగారు కారులో వచ్చి, ఉపన్యసించి మరీ వెళ్ళాడు.

తరతరాలుగా అక్కడి కొండజాతి ప్రజలు షావుకార్ల దోపిడీకి ఎలా గురవుతున్నారో ప్రభుత్వానికి తెలుసు. కాబట్టే ప్రత్యేకంగా కార్పొరేషన్ని ఏర్పరచిందని చెప్పాడు.

అలా ఉపయోగకరంగా ఏర్పరచనున్న కార్పొరేషన్ మీద ఎందుకో సంగమ్మకి నమ్మకం కుదరలేదు. షావుకారుకే తన దగ్గరున్న ఇప్పపువ్వునమ్మాలని నిశ్చయించుకుంది.

దాంతో షావుకారు కార్పొరేషన్ వాళ్ళ కంటపడకుండా సంగమ్మ ఇంటికి వచ్చాడు.

ఆమె దగ్గరున్న ఇప్పపువ్వుని చూసి పదకొండు రూపాయలిస్తానన్నాడు. తల్లికి ఇంజెక్షనివ్వడానికి డబ్బు సరిపోతుంది కదా, తను చీరనెప్పుడైనా కొనుక్కోవచ్చుననుకుంటుంది.

షావుకారు పదకొండు రూపాయలు లెక్కగట్టుకునివ్వబోతున్నాడు. కార్పొరేషన్ వాళ్ళొచ్చి షావుకార్ని రెండు లెంపకాయలు పీకుతారు.

అతను పారిపోతాడు.

ఇక చేసేదిలేక సంగమ్మ ఇప్పపువ్వుని తీసుకుని కార్పొరేషన్ గొడౌన్‌కి వెళ్తుంది.

నడుస్తున్న సంగమ్మ వెనుక భాగాన్ని ఆబగా చూస్తూ గొడౌన్ చేరతాడు కార్పొరేషన్ ఉద్యోగి.

అక్కడున్నవాళ్లు ఆ పువ్వుని తూచి ''మూడు రూపాయలరవై పైసలొస్తా"యంటారు.

సంగమ్మకి తల తిరుగుతుంది.

ఎంత బ్రతిమాలినా "అంతే"నంటారు.

ఇక విధిలేక ఆడబ్బుని తీసుకువెళ్ళి డాక్టర్ చేతిలో పోసి "మీదే దయ" అంటుంది.

డాక్టర్ డిస్టిల్డ్ వాటర్‌ని ముసలమ్మకి ఇంజెక్ట్‌చేసి, తన దయ చూపించి మరీ చక్కాపోతాడు.

కార్పొరేషన్‌వారు సంగమ్మనెలా ఉద్ధరించారో, డాక్టర్ చెంచమ్మనెలా ఉద్ధరించాడో చెబుతుందీ కథానిక.

వెనుకబడిన వాళ్ళకోసం ఏర్పడ్డ కార్పొరేషన్ ఎలా పనిచేస్తోందో ఒక ప్రక్క చెబుతూనే మరో ప్రక్క డాక్టర్లులాంటివాళ్ళు ఆ పేదల్ని ఎలా దోపిడీ చేస్తున్నారో కూడా చెబుతుంది ఈ కథానిక. దోపిడీకి గురయ్యేవాళ్ళ అమాయకత్వమే ఇందుకు కారణమని మనకి అర్థమవుతుంది.

# మల్లాది రామకృష్ణశాస్త్రి 'మంత్రపుష్పం'

**చి**ట్టి ఏ తల్లికడుపున పుట్టిందో ఎక్కడ పుట్టిందో ఎవరికీ తెలియదు. పదేళ్ల వయస్సులో బొద్దుగా గున్నలా ఉన్న ఆమె సిన్మాహాల్లో ఆడవాళ్ల గేటు దగ్గర... అక్కడ విన్న పాటల్ని, ఆటల్నీ కునుకుపాటు పడుతున్న జట్కా బండివాళ్ల ముందు ఆడేది. వాళ్ళు విసిరిన చిల్లరిని పరికిణీ రొండిన దోపుకునేది. ఎవరి చెవి సందునుంచో బీడీని లాక్కుని కమ్మగా దమ్ముకొట్టి ఎక్కడ నిద్రొస్తే అక్కడే పడుకునేది. చెట్టుమీద వాలే గువ్వపిట్టంత గోముగా చెట్టుకింద ఈ పక్షి పెరిగింది.

చిట్టి ఎవరు పిలిచినా పలికేది. అందర్నీ కవ్వించి మాట్లాడేది. చిట్టి బూతులు మాట్లాడేస్తున్నా ఎవరికీ వినడానికి ఎబ్బెట్టుగా ఉండేది కాదు. చిట్టిది అర్థంకాని అందం. తన చెయ్యి పట్టుకున్న కుర్రవాడి చెంపను చెళ్లుమనిపించింది. ఆ విషయాన్ని ఊళ్లో అందరికీ తనకు తానుగా కూడా చెప్పింది, అతని పేరు మాత్రం చెప్పకుండా. అతను కోరుకుంది కూడా ఆ తర్వాత ఇచ్చింది.

ఆ రోజుల్లో యుద్ధం ఉన్నన్నాళ్లూ పటాలాలు దిగుమతి అవుతుండేవి. వీలుచిక్కినప్పుడల్లా వాళ్ళు ఊళ్లమీద పడి ఆడవాళ్ళమీద అఘాయిత్యాలు చేస్తుండేవాళ్ళు. సరిగ్గా ఆ సమయంలోనే మాయమయ్యింది. జవానులను దేశంకోసం బతకమంది. "యుద్ధంలో నెగ్గి సీమ చల్లబడితే ఏ చిన్నదానినో ఏలుకోవాల్సిన వాడివి నీకు ఈ బుద్ధేమిటి?"అని నిలదీసింది. "నాకు రూకలొద్దు, కోకలొద్దు, నన్నేలుకో, నీ మనసంతా తీర్చుకో" అంది.

అలా ఊరును కాపాడిన చిట్టికి యుద్ధం ఉన్నన్నాళ్లూ ఎక్కడెక్కడి నుంచో రకరకాల పార్సిళ్లు బట్వాడా అవుతుండేవి. వాటిని ఆమె ఊళ్లోవాళ్లకే పంచేసేది.

చిట్టి చేసిన సేవ ఆనోటా ఆనోటా ప్రభుత్వానికీ చేరింది. మిలటరీ అధికార్లూ సేవల్ని మెచ్చుకున్నారు. సేవా పథకాన్ని బహూకరించారు. దాన్ని అందుకున్న చిట్టి ఆ సభలో ఉన్న అధికారి పెళ్లాం ఒళ్లో విసిరేసి "పిల్లది అలా బోసిగా ఉందేం? –చెరిపి చేయించి పెట్టండి" అని ఇంచక్కా వెళ్లిపోయింది.

అలాంటి చిట్టి ఏ జబ్బో వచ్చి మరణించడంతో మిగతావాళ్ళల్లో వచ్చిన సంచలనమే మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి 'మంత్రపుష్పం'.

చిట్టి ఓ స్వేచ్ఛా విహంగం. చిట్టి దేశభక్తురాలు. చిట్టికి తన శరీరంకన్నా ఊరు మిన్న. ఊరుకోసం, జవానులకోసం తన జీవితాన్నే ఫణంగా పెట్టిన ధీరులు. ఈ పాత్రను అద్భుతంగా మంత్రపుష్పం ద్వారా మనముందుంచారు రచయిత. ఊళ్ళల్లోని పరిస్థితులు, మనస్తత్వాలు, యుద్ధకాలంలోని జవాన్ల స్థితిగతులు, ఊళ్లో ఇబ్బందులు–ఇలాంటివెన్నింటినో నాలుగు పేజీల చిన్నకథ ద్వారా మనముందుంచడంలో కృతకృత్యులయ్యారు రచయిత. క్లుప్తత, స్పష్టత కథానికా లక్షణాలు. ఆ లక్షణాలకి చక్కటి అమరిక 'మంత్రపుష్పం'.

అంతేకాదు మంత్రపుష్పానికి బలమిచ్చింది తేనెలూరే చక్కటి తెలుగుభాష.

మల్లాది వారి శైలి, తెలుగు నుడికారం! తెలుగు కథారచయితల్లో మరొకరు అనుకరించలేని శైలీ శిల్పాల కథానికా ఘనాపాఠీ–మల్లాదివారు!

# మధురాంతకం రాజారాం 'రాతిలో తేమ'

**మ**ధురాంతకం రాజారాంగారు పల్లె వాతావరణాన్ని ప్రతిబింబింపజేస్తూ, మానవత్వ పరిమళాల్ని వెదజల్లే కథానికలు రాయడంలో దిట్ట. కథానిక లక్ష్య, లక్షణాల మీద పట్టున్న రచయిత కాబట్టే ఏకబిగిన కథానికని చదివింపచేయగల శిల్పమాయన సొత్తు. చిత్తూరు ప్రాంత యాసతో గూడిన భాషతో గుబాళింప జేస్తాయి ఆయన కథానికలు. వీటన్నింటికన్నా ఆలోచింపజేసే ముగింపులతో పాఠకుల మేథకు పదును పెడతాయాయన కథానికలు.

ఆయన భావ, భాషా శిల్పాలకు మచ్చుతునక 'రాతిలో తేమ'. 1993లో ఈ కథానిక ప్రచురితమైంది.

రామాపురం రైలుస్టేషన్ దిగగానే కనిపించే ప్రకృతి–రెండు పర్లాంగుల దూరంలో ఓ కొండ–ఆ కొండమీద శిథిలమైన కోట–ఆ కోటకి వారసులైన పల్లెగాళ్ళు–కోట నీడ పడే ప్రాంతంలో గ్రామం ఏర్పడడం–కథానికకు నాంది ఇలా పలుకుతారు.

దేవుడి ముంగిట చెత్త ఊడ్చి, నీళ్ళు చల్లి, పనిమనిషి ముగ్గువేసి వెళ్ళిన పదినిమిషాలకు మాటల సవ్వడిగాని, అడుగుల సవ్వడిగాని లేకుండా నిశ్శబ్దంగా–కదిలే నీడల్లా–ముసలి ముతకా, ఆడా మగా, పిల్లా జెల్లగా దాదాపు డెబ్బైమంది బడుగుజీవులు వీధిలో నిల్చుండిపోయారు.

వాళ్ళలా ఒణికిపోతూ అక్కడ నిల్చోడానికి కారణమేమిటంటే వాళ్ళ పందులు ఊరిపెద్ద పొలంలోబడి నాశనం చేశాయి. తమకి తెలీకుండా జరిగిన ఈ పనికి క్షమాపణలు చెప్పుకుని, రెడ్డేరికి ఇంకా కోపం తగ్గకపోతే ఆ ప్రాంతం నుంచి వెళ్ళిపోతామని మనవిచేసుకోవడానికి వచ్చారు.

జరిగిన దానికి రెడ్డేరి అనుయాయులందరూ కారాలు మిరియాలు నూరుతున్నారు. అటుగా పోతున్నవాళ్ళు అసలేం జరిగిందో తెలుసుకోవాలని తెగ ఉబలాటపడిపోతూంటారు. వ్యవహారమంతా ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలని ఉబలాటపడేవాళ్ళూ అక్కడ లేకపోలేదు. తమ పందులు చేసిన పనికి ప్రతిఫలంగా గుడిసెల్ని పోగొట్టుకుని నిరాశ్రయులైనవాళ్ళప్పుడక్కడి కెందుకొచ్చారో

రెడ్డేరు తెలుసుకుంటే బాగుండుననుకునేవారూ ఉన్నారు. అలాంటి వారిలో రెడ్డేరు భార్య రెడ్డెసాని ఒకరంటూ కథకి నేపథ్యాన్ని సిద్ధంచేస్తారు 'రాతిలో తేమ' కథానికలో మధురాంతకం రాజారాంగారు.

సరైన పోలికలతో ఓ పట్టుగా అంతవరకూ సాగుతుంది కథ. అక్కడ నుంచి అసలు కథ ప్రారంభమవుతుంది.

వాళ్ళదీన పరిస్థితిని తిలకించిన రెడ్డిసానికి మనసు కరుగుతుంది. ఈ పరిస్థితి ఇలా కొనసాగడానికి వీల్లేదు, రెడ్డేరుతో అంటే భర్తతో మాట్లాడడానికి పైకి వెళ్ళబోయిన రెడ్డిసాని కాళ్ళు ఠక్కునాగిపోతాయి.

అలాంటి ఇళ్ళలో భార్యాభర్తల మధ్య శారీరక సంబంధాలేగాని, మానసిక బంధాలకి తావుండదు. అందుకు భిన్నంగా ఆలోచించే రెడ్డిసాని భర్త అరాచక ప్రవర్తనకి అడ్డుతగులుతుంటుంది. దాంతో ఇద్దరి మధ్యా దూరం పెరుగుతుంది. భర్త వ్యవహారాలతో తలదూర్చగూడదనుకుంటుంది రెడ్డిసాని. దాంతో పైకి వెళ్ళి భర్తతో మాట్లాడి కొన్ని నెలలైంది.

కానీ ఆరోజు, ఆ నిర్భాగ్యులకోసం భర్తతో మాట్లాడక తప్పదని–ఆగిందల్లా మెట్లు పైకెక్కడం ప్రారంభిస్తుంది రెడ్డిసాని.

సమయాన్నిబట్టి నేటి సామాజిక రాజకీయ పరిస్థితుల మీద చురకలు వేస్తారు రచయిత. అంతేకాదు, భర్తతో మాట్లాడేప్పుడూ ఆమెతో సున్నితంగా గాంధీగారి ప్రస్తావన చేయిస్తాడు.

'ఒక ముసలాయనుండేవాడు–కొల్లాయి కట్టుకుని, దుప్పటి కప్పుకుని, కళ్ళద్దాలతో, బోసినోటితో, నాల్గు పరకల పిలకతో గాలి తగిలితే కొట్టుకుపోయేటట్లుండేవాడు. ఇప్పుడు లేడు. పోయినాడు. తనంతటి తానుగా పోలా. కాల్చిచంపేసినారు. అతనివల్ల స్వరాజ్యం వచ్చిందంటే ఇప్పుడు నమ్మేవాళ్ళెవరు? ఈ నలభై ఏళ్ళలోనూ జనం తెలివిమీరిపోయారు. చాలామంది బుద్ధిమంతులిప్పుడాయన్ని సర్కస్‌లో బఫూన్‌లాగానూ, పేకాటలో జోకర్‌లాగానూ, తోలుబొమ్మలాటలో జుట్టుపోలిగాడులాగానూ చూస్తున్నారు. నిజమే! ఆయన చేసిన ద్రోహాలు అన్నీ ఇన్నీ కావు. అన్నింటికన్నా ముఖ్యమైనది కత్తులు, తుపాకులూ వద్దని, సత్యాగ్రహమనే ఆయుధాన్నిచ్చి వెళ్ళాడు. ఆ ఆయుధాన్ని పట్టుకునే జోగలోళ్ళు మనింటి దేవిడీముందు ఠికాణావేశారు!'

భార్యమాటలు విన్న రెడ్డేరు "ఈ సమస్యని నీ పద్ధతిలో నువ్వు పరిష్కరించు"అంటాడు భార్య రెడ్డిసానితో.

వెంటనే ఆవిడ తమ పరివారాన్ని పిలిచి–వాళ్ళందరికీ సరిపడా వంటచేయించి, కడుపు నిండా భోజనం పెడుతుంది.

కడుపు నిండా తిండి పడగానే ఆ నిర్భాగ్యులు నిద్రలోకి జారిపోతారు.

ఆశ్చర్యమేస్తుంది రెడ్డేరికి–తెల్లారితే వీళ్ళకి తిండి దొరుకుతుందా? లేదానేది కూడా అనుమానమే! కట్టుకోవడానికి మారుబట్టాలేదు. అయినా ఇట్లా నిద్రపట్టిందంటే ఎంత నిశ్చింత వీళ్ళకి!

రెడ్డిసాని ఒకపూట తిండేగా పెట్టింది... నేనామాత్రం చేయనా? రెడ్డేరిలో కొత్త ఆలోచన మొలకెత్తుతుంది.

"మిట్టచేనులో వీళ్ళను ఇళ్ళు కట్టుకోమను...దూలాలకు గాను మన తోపులోనే ఇంటికొక తాటిచెట్టు కొట్టుకోమను... కావల్సివస్తే వెదురుబొంగుల్ని కూడా నరుక్కోమను... నీటి సదుపాయాన్ని కూడా కలిగిద్దాములే... రెడ్డేరు మాటలు అందర్నీ అయోమయంలో ముంచేసాయనడంతో కథానిక ముగుస్తుంది.

అలా 'రాతిలోంచి తేమ'ని పుట్టించి చూపించారు తమ కథానిక ద్వారా మధురాంతకం రాజారాంగారు. అందుకే అయ్యారాయన మధుర కథానికా రచయిత.

# మహబూబ్ మియ్యాసాహెబ్ 'మీనాక్షి'

మీనాక్షికి నెలలు నిండాయి. సరిగ్గా అప్పుడు ఆహ్వానించాడు లెండి రాఘవేంద్రుడు. మధుసూదనుడు విధిలేక నిండుగర్భిణి భార్యతో రైలులో బయల్దేరాడు మామగారింటికి.

వేసవికాలం. ఎండ తీక్షణంగా ఉండడంతో మీనాక్షి దాహంతో బాధపడసాగింది. ఇంటి దగ్గరనుంచి నీళ్ళు తేలేదు. తర్వాతి స్టేషన్‌లో బండి ఆగగానే అన్నీ మరిచి భార్యకి నీళ్ళు తేవడానికి పరుగెడుతాడు. నీళ్ళు సంపాదించి కంపార్ట్‌మెంట్ దగ్గరకు రాబోయేసరికి బండి బయల్దేరుతుంది.

స్టేషన్ మాష్టారికి విషయాలన్నీ వివరించి చెబుతాడు మధుసూదనుడు. ఆయన తర్వాతి స్టేషన్ మాష్టారికి ఈ విషయలన్నీ చెప్పి, వెంటనే ఆమెకి మంచి నీళ్ళు తాగించి నిద్రింపి అవసరమైన సపర్యలు చేయమంటాడు.

స్టేషన్ మాస్టారు భార్య సేవలో మీనాక్షి సుఖప్రసవమవుతుంది. రాత్రికి మరో బండి పట్టుకుని అక్కడికి చేరిన మధుసూదనుడు వాళ్ళకి కృతజ్ఞతలు చెప్పుకుంటాడు.

మర్నాడు వచ్చిన మామ రాఘవేంద్రుడు తన కూతురికి సకాలంలో ఆత్మీయులులా నిల్చి పురుడు పోసినా, వేరే కులము వాళ్ళని తిట్టిపోసారు. మీనాక్షి మధుసూదనుడు కూడా ఎంతగానో బాధపడ్డారు. రాఘవేంద్రుడు అంత గోల చేసింది భార్యని తృప్తి పరచాలని. ఆశ్చర్యకరంగా భార్య గోలచేయలేదని.

కులం వాళ్ళని వెలివేసింది. మధుసూదనుడు పట్టించుకోలేదు. అంటూ కథానికని ముగిస్తాడు రచయిత.

1927లో ప్రచురితమైన ఈ కథానికని ఓ ముస్లిమ్ రచయిత రాసారు. రాయలసీమ తొలితరం కథలు (తవ్వా వెంకటయ్య) నుండి దీనిని సేకరించడం జరిగింది. ఆధునిక తెలుగు కథానికా సాహిత్యంలో మొదటినుంచి కుల, మతాల పట్టింపులు లేవు అనే విషయాన్ని ఎచ్.మహబూబ్ మియ్యా సాహెబ్ లాంటివారు అప్పుడే చెప్పారు, రాయలసీమ నుంచి.

# మాడపాటి హనుమంతరావు 'హృదయశల్యము'

**సం**ఘ సంస్కరణోద్యమం ప్రతిఫలనాలు తెలుగు కథానికా సాహిత్యంలో ఇబ్బడి ముబ్బడిగా దర్శనమిచ్చాయి. తొలి తరం కథానికా రచయితల్లో ఏ మహనీయుని పేరు స్మరించినా స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ విద్యాభివృద్ధికీ చోదక శక్తులుగా పని చేసిన వారే కనిపిస్తారు. గురజాడ, శ్రీపాద, చింతా, వేలూరి, కొనకళ్ళ.... ఇలా... సాగితే మాడపాటి హనుమంతరావుగారి మనీషత్వ మూర్తి కళ్లముందు నిలుస్తుంది.

మాడపాటి వారు 'ఆంధ్రపితామహ' బిరుదాంకితులు. తెలంగాణా ఉద్యమంలో పోరాడినవారు. ఉర్దూ పత్రికను నడిపారు. గ్రంథాలయోద్యమం, సాంస్కృతికోద్యమాలల్లో క్రియాశీలంగా పనిచేశారు. ఎన్నో సాంఘిక, చారిత్రక గ్రంథాలు, వ్యాసాలు రాశారు.

మాడపాటి వారి 'హృదయశల్యము' కథానిక ఆధునిక తెలుగు కథానికల్లో గురజాడ వారి 'దిద్దుబాటు' సరసన నిలుస్తుంది. బహిః ప్రపంచంలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తూ, కాలిడుతున్న స్త్రీల పట్ల పురుషుల ప్రవర్తన ఎలా ఉండాలో చెప్తుందీ కథ. ఆడది బయట తిరిగితే చెడిపోయిందనే భావ జాలం ఎంత సంకుచితమైందో తెలిసి దాన్ని నిరసించిన కథానిక–హృదయశల్యము–1912 జనవరి ఆంధ్రభారతిలో అచ్చయింది.

'హృదయ శల్యము' కథానిక 4 రంగములుగా సాగుతుంది. మొదటిరంగంలో 'యమున' 'ప్రతాపుడు' భార్యా భర్తల కీకాటవిలో నుండి ప్రయాణం. దొంగల దాడి. రెండవ రంగంలో యమునను సంహరింపబోయిన దండు నాయకుడి చేతిని రుద్ర దేవుడు ఖండించటం. యమునను రక్షించటం. ఆమెను ఆప్యాయంగా కౌగిలించుకోవటం. ఈ సంభవాన్నీ, సందర్భాన్నీ ప్రతాపుడు గమనించటం. తృతీయ రంగంలో భర్త హృదయశల్యము భార్య పట్ల అనుమానం. అతని ప్రవర్తనకూ, నిర్లక్ష్యానికీ యమున వేదన పొందటం నాలుగవ రంగంలో 'విడుపు'. రుద్ర దేవుడు

అనుకున్న రక్షకుడు రుద్రమ దేవి అని తేలుతుంది. ప్రతాపుడు రుద్రమదేవి మన్నింపుని వేడటం, యమున ముందు పశ్చాత్తాపపడటం. ఇదీ కథ. రుద్రమదేవి పాత్ర ప్రవేశం వలన చారిత్రక నేపథ్యం సిద్ధించింది కథానికకు. అయితే, ప్రధాన సమస్య సామాజిక మైనది. అభ్యుదయ ప్రేరకమైది. స్త్రీ పురుష స్వభావ చిత్రణతో కూడినది.

మాడపాటివారి శైలి శిష్ట వ్యవహారికంగా ధ్వనిస్తూ స్వచ్ఛత, సరళత సంతరించుకుని భాసించిందీ కథానికలో. మాడపాటి వారు తొలి కథలోనే వస్తురూపాల మేళవింపుకు కథానికా సంవిధానంలో రంగ విభజన నాటక ప్రక్రియని తలపిస్తున్నా, ఆ నాటి సాహిత్య సాంస్కృతిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా కథౌచిత్యానికి భంగం కలుగని రీతిలోనే సాగింది. కథా కథనంలో ఒక Structure ని ఎలా అనుసరించవచ్చో గ్రహించటానికి కూడా ఈ ఉన్నత సందేశాత్మక కథానికని ఈ కాలం రచయితలు చదువుకోవాలి.

# మాలతీ చందూర్ 'తనూ-నీరజ'

ఇది మూడు పాత్రల మధ్య జరిగే కథ. నీరజతో పాటు రఘు, మరో మగ పాత్ర రచయిత. ముగ్గురూ మంచి స్నేహితులు. ముగ్గురి మధ్యా అరమరికలు లేవు.

నీరజ ఒక విశిష్టమైన పాత్ర. మాటలు వినే మనిషిని చదివేయగలదు. రచయిత నీరజకన్నా పెద్దవాడు, ఆస్తిపరుడు. రఘు, నీరజ కన్నా ఒక సంవత్సరం చిన్నవాడు. అప్పుడే మెడిసిన్ పూర్తి చేశాడు. ఇద్దరూ ఆమెని ప్రేమిస్తున్నారు. ఆమెకి ఇద్దరు అంటే అభిమానం.

ఎప్పటికప్పుడు, తను ప్రేమిస్తున్నట్టు నీరజకి చెప్పాలని అనుకుంటాడు రచయిత, కానీ చెప్పలేడు. రఘు తన ఆరాధనని క్షణక్షణం చూపిస్తాడు. ఆఖరికి నీరజ రఘుని పెళ్ళి చేసుకోవాలనే నిశ్చయించుకుంటుంది.

నీరజ రచయితతో నెల నాళ్ళు గడిపినా, ఆమెతో ప్రేమించానని చెప్పలేకపోతాడు. కులం వేరు, చిన్నవాడని రఘు పెళ్ళికి పెద్దవాళ్ళు అభ్యంతరం చెప్పినా, వాళ్ళని కాదని నీరజని పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడతాడు రఘు.

నీరజ ఇష్టపడడంతో వాళ్ళిద్దరి పెళ్ళి జరిగిపోతుంది. నీరజ వద్ద తమ ఇతర ప్రేయసుల గురించి, స్నేహితుల గురించి, రచయిత దాచలేదు. ఒక విధంగా తన ఆత్మని ఆమె ముందు దాపరికం లేకుండా ఉంచాడని చెప్పవచ్చు. ఆమె తన వైపు తిరుగుతోందని భావించాడు రచయిత. కానీ నీరజ రఘు గురించి చెప్పి అతనితో పెళ్ళికిష్టపడుతున్నట్టు చెప్తుంది.

కథానిక చివర్లో మిత్రుడైన రచయితకి నీరజ రాసిన ఉత్తరం ఓ మెరుపు–

"మై డియర్ ఫ్రెండ్, బీచ్‌లో మీ ముఖ కవళిక నేను కనిపెట్టాను. ప్రియురాలి దగ్గరకు ప్రేమికుడూ, దేవుని దగ్గరకు భక్తుడూ అహంకార రహితమైన హృదయంతో వెళ్ళాలి. అప్పుడే వారి వాంఛలు ఫలిస్తాయి. రఘు చీకట్లో దారితప్పిన గొర్రెపిల్ల మాదిరి అమాయకుడు. అతనికి నేను చాలా అవసరం. మీతో నేను చెయ్యి కలిపినా, కలపకపోయినా ఒకటే అన్న విశాల భావంతో మీరు జీవితాన్ని గడపగలరనే నమ్మకం

నాకుంది. రఘుని తల్లి మాదిరి సాకుకోగలను. మా ఇద్దరినీ నిష్కల్మష హృదయంతో ఆశీర్వదించండి. మా జీవితాల్లో ఆత్మీయుడిలా మీరు ఎల్లప్పుడూ నిలిచిపోవాలనే కోర్కెతో –నీరజ."

ఆరోజు సాయంత్రం నీరజ ఇంటికి వెళ్ళిన రచయిత రెండు గదుల్లో వాళ్ళ కాపురాన్ని చూస్తాడు. రఘు కళ్ళల్లో ఆరాధన లోతుల్ని చూస్తాడు. ఆమె అనుసరించిన దారి సరైనదేనని మనస్ఫూర్తిగా అంగీకరిస్తాడు.

మనస్తత్వ చిత్రణ ఆధారంగా ఈ కథానిక రూపు దిద్దుకుంది. ఆహంకారం చాలా వాటికి అడ్డం వస్తుంది. ఆఖరుకి ప్రేమకి కూడా!

# మాగోఖలే 'బల్లకట్టు పాపయ్య'

పాపయ్య వేకువజామున తొలికోడి కూసే సమయం నుంచి రాత్రి జనం తిరుగాట్టం సద్దుమనిగే దాకా కృష్ణ కాలువలో బల్లకట్టుని నడిపిస్తూంటాడు. అందుకే అతను బల్లకట్టు పాపయ్య.

ఒక్కోసారి కోడి కూయక ముందే వచ్చి బల్లకట్టు మీద అవతలి గట్టుకి చేర్చమంటారు. ఇంకోసారి రాత్రి ఇంటికి వెళ్ళామని సగం దూరం వచ్చిన తర్వాత ఎవరో ఒకరు అడ్డంపడి గడ్డం పట్టుకుంటూ కాస్త కాలువ దాటేసెల్లన్నా అని బ్రతిమిలాడతారు.

కానీ చిల్లర పైసలు ఇవ్వడానికి వెనకాడుతుంటారు. 'ఎల్లుండి మళ్ళీ తిరిగొచ్చాక ఇస్తాలే' అంటారు.

ఎప్పుడు ఖాళీ ఉండడు. నదికి అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్ళే వాళ్ళు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. కూలి జనాన్ని గట్టిగా అడగనే అడగలేడు. 'వాళ్ళకి తోస్తే ఏమన్నా ఇచ్చి పోవాలే కాని, ఎవర్ని మటుకు నిలదీయడం, బల్లకట్టు ఎక్కనివ్వకపోవడానికి నా అబ్బసొమ్మా బల్లకట్టు?' అని అనుకుంటూంటాడు.

మధ్యాహ్నం బువ్వ తెచ్చిన కొడుకుతో 'మీ అమ్మ రాలేదేరా కొండయ?' అడుగుతాడు.

'బట్టలు గుంజుకోవాలంట' అన్నాడు కొడుకు కొండయ్య. 'నువ్వు బువ్వ తిన్నావంట్రా?' అడుగుతాడు పాపయ్య కొడుకుని.

'తిన్నానయ్య

'అయ్యొయ్ బళ్లోకి పంపిస్తానంటివే'

'ఎల్దువులే బడికి ఏడాదికి పోద్ది ఇదే ఈపాలి గట్టిగా పంతులుతో సెప్పి, బళ్లో సేర్పిస్తే సరిగా...'

ఎప్పుడు చెప్పినా మంచి రోజున చేరిపిస్తాంటాడే కానీ మరి ఆ మంచి రోజు ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియదు.

'ఓరేయ్! కొండయ్య రేపు మధ్యాహ్నం మీ అమ్మనే బువ్వ పట్టుకుని రమ్మను'

'రేత్రి అమ్మతో నువ్వే సెప్పరాదంటయ్యా'

'ఫర్వాలేదులే సెప్పమంటుంటే'

'నాకేం, అయ్యే సెప్పమన్నాడని సెప్తా' అంటూ వెళ్ళిపోయాడు కొండయ్య.

కొందరైతే పాపయ్యని పనిచేసుకోనీకుండా, చీకటి పడితే ఇంటికి వెళ్ళనీకుండా పనికిరాని కబుర్లు చెప్తూ కూర్చోపెడతారు.

ఇంతలో బల్లకట్టుకోసం ఎవరో కేకలు...!

ఆరోజు వేకువ జామునే వచ్చిన పాపయ్య మధ్యాహ్నం బువ్వ తెచ్చిన కొండయ్యకి బల్లకట్టు అప్పచెప్పి, మెట్లపల్లికి గబగబ వెళ్ళి, తన ఇంట్లోకి రంగయ్య చుట్టముట్టించుకుంటూ రావడం చూసి పెళ్ళాం బూసెమ్మ ఒళ్ళు పచ్చడి చేసి, తిరిగి బల్లకట్టు దగ్గరకు వస్తాడు.

అర్ధరాత్రి వరకు అక్కడే ఉంటాడు. ఆ నిశిరాత్రి పెళ్ళాం బూసెమ్మ కొడుకు కొండయ్యతో అక్కడికి వస్తుంది.

'ఇంటికెళ్దాంరా' ఏడుస్తుంది బూసెమ్మ.

'దగ్గరకు వచ్చావంటే సంపుతా ఎళ్ళు' అరుస్తాడు పాపయ్య.

'సంపు! సంపి ఈ కిట్టకాలవలో పడేయి నన్ను. నేను ఏ పాపం ఎరుగను, నీకేందో గుబులు తిరిగింది' ఏడుస్తూనే అంటుంది బూసెమ్మ.

అలా రాత్రి 3 గంటల వరకు జరిగింది. ఆఖరికి కొండాయ్‌తో కలిసి పాపయ్యని వెంటపెట్టుకుని ఇంటికి చేరింది. అప్పట్నుంచి కొన్ని ఏళ్ళు అయ్యా, అమ్మకు జడుస్తూ రావడం కొండయ్య చూస్తాడు.

'ఒరేయ్! కొండయ్య' అని ఒకరోజు మంచంలో కూర్చునే కొడుకుని పిలుస్తాడు, బల్లకట్టు పాపయ్య.

"రేపట్నుంచి ఇకమీదట, బల్లకట్టు పని నువ్వు సూసుకో'' నా పని అయిపోతున్నాది" అన్నాడు పాపయ్య.

'నా పెళ్ళాం బల్లకట్టు పని వద్దంటున్నది' అని చెప్పాడు కొండయ్య.

'మర్నాడు కోడితో పాటు లేచి, పెళ్ళం కట్టిపెట్టిన సద్దిమూట తీసుకొని కర్ర పొడుచుకుంటూ, భజన పాటలు పాడుకుంటూ, ఎప్పటికి మల్లే కిట్టకాలవ, బల్లకట్టు ఎక్కాడు పాపయ్య' అని కథానికని ముగిస్తారు మాగోఖలే.

ఏపనితప్పినా... సాపాటు తప్పినా పాపయ్యకి బల్లకట్టు తప్పదు. కళ్ళు చమరుస్తాయి కథానిక ముగిసే సరికి. మొట్టమొదటి మాండలిక రచయిత మాగోఖలే.

# ముద్దుకృష్ణ 'పిచ్చి నమ్మకాలు'

"ఊరు దాటిన తర్వాత లోయలో ఓ చిన్న గుడిసెలో ఉంటున్న ఓ పండు ముసలాయనను చూడగానే విశ్వం, తన మిత్రుడితో ఆ ముసలి వ్యక్తి చరిత్ర చెప్పడం ప్రారంభిస్తాడు." ఇలా 'పిచ్చి నమ్మకాలు' కథానికని ప్రారంభిస్తారు రచయిత ముద్దుకృష్ణ.

ఆ పండు ముసలాయన పేరు రామన్న. చాలాకాలం సైన్యంలో పనిచేశాడు. హవాల్దారుగా పింఛను పుచ్చుకుని ఇంటికి చేరుకున్నాడు. యుద్ధాలలో అతను చూపిన ధైర్యానికి మెచ్చి ప్రభుత్వం ఇరవై ఎకరాల పొలం ఇచ్చింది. పొలం పక్కనే ఇల్లు కట్టుకుని భార్యా, తను సుఖంగా కాపురం చేస్తుండేవారు. తన పొలం, ఇల్లు, సంసారం–ఇదే రామన్న లోకం. తనంతట తానుగా ఎవ్వర్నీ పలకరించేవాడు కాదు. అరుగుమీద కూర్చుని చుట్ట కాలుస్తూ తన లోకంలో తాను ఉండేవాడు.

సైన్యం నుంచి వచ్చినా నిటారుగా నడుస్తూ అలాగే జీవించాలని ప్రయత్నించేవాడు. ఎప్పుడైనా వెనుకటి జీవితం, ఆ పౌరుషాలు జ్ఞాపకం వస్తే తుపాకీ భుజాన వేసుకుని వేటకు వెళ్తాడు. క్రూర మృగాలు దొరికే అవకాశాలు ఆ అడవిలో తక్కువ. ఎవరైనా అడగడమే ఆలశ్యం. గతంలోని తన వేట గురించి విచిత్ర విషయాలు చెప్పేవాడు. "'బాబూ! ఆ ఆయుధాన్ని ఎత్తిన తర్వాత ఏదో ఒక జీవాన్ని దానికి గురిచేసి తీరాలి. లేకుంటే ఆయుధాన్ని దించినవాడికి ప్రమాదం" అనే వాడు.

ఒకరోజు తుపాకీ భుజాన వేసుకుని లోయ లోతుల్లోనూ, కొండమట్టాల్లోనూ తిరిగి ఏమీ కనిపించక ఇంటికి బయలుదేరి వస్తుండగా పొలం మధ్యలో ఓ గువ్వల జంట కనిపించింది. వెంటనే తుపాకి ఎత్తి కొట్టాడు. ఆడపిల్ల పడిపోయింది. మగపిట్ట ఎగిరిపోయింది.

జంట చనిపోతే రెండవది ఏ పిట్టతోనూ కలవదు. అది బెంగపెట్టుకుని కుమిలికుమిలి చనిపోతుంది. అందుకని రెండవ గువ్వని కొట్టడానికని తెగతిరిగాడు. కనిపించలేదు.

దినాలు జరిగే కొద్దీ రామన్నలో దిగులు పెరగసాగింది. 'గువ్వజంటను విడగొట్టిన గోడు నాకు తగులుతుంది'అని కంట నీరు పెట్టుకునేవాడు. అతను

అనుకుంటున్నట్టుగానే గుండె నొప్పితో భార్య హఠాత్తుగా చనిపోయింది. అప్పటి నుంచి మనసేకాదు రూపం మారిపోయింది. ఇల్లు, పొలం పేద విద్యార్థుల చదువుకు ఉపయోగించమని గ్రామ పంచాయతీకి ఇచ్చివేసి ఈ లోయకు చేరుకున్నాడు.

ఎవ్వరితోనూ మాట్లాడడు. అతని మనసులోని భావాలు ఏ విచిత్ర రీతుల్లో నడుస్తున్నాయో ఎవరికీ తెలీదు. రామన్న గతి పెంటి చనిపోయిన గువ్వలా అయింది. అతనూ దిగులు గుండెతో మృత్యువు రాకకు ఎదురుచూస్తున్నాడనిపిస్తోంది.

కథానిక ముగిస్తూ రచయిత ఇలా వ్యాఖ్యానిస్తాడు. విశ్వం పాత్రలో మనసుకున్న శక్తి అపారం. ఏ విచారమైనా మనస్సుని ఆవహించి నిరంతర వేదనగా పరిణమిస్తే, ఆ మనోవేదన దీర్ఘవ్యాధిలాగా శరీరాన్ని తినివేస్తుంది. మందులే లేని ఈ వ్యాధి ఎంత ప్రమాదకరమో తెలుసుకోవాలంటే రామన్న జీవితం తెలిస్తే చాలు. భార్య చనిపోయే నాటికి బలంగా, దృఢంగా వున్న ఈ మనిషి రెండు సంవత్సరాలలో కేవలం ఎముకల గూడయిపోయాడు!

పిచ్చినమ్మకాలెలా మనిషిని కాల్చేస్తాయో ఈ కథానికద్వారా చక్కగా చెప్పారు రచయిత ముద్దుకృష్ణ. 1935 ప్రాంతంలో రాసిన ఈ కథానిక, పూర్తిగా మాట్లాడుకునే భాషలో రాయడం విశేషం. అలాగే రచయిత క్లుప్తతనీ పాటించారు.

# మునిమాణిక్యం నరసింహారావు 'పస్టుకేస్'

**సు**స్నిత హాస్యకథానికల్ని రాయడంలో మునిమాణిక్యం నరసింహారావుగారు సిద్ధహస్తులు. 'ఫస్టుకేస్' కూడా చమత్కార కథానికే! ఆ రోజుల్లో ఎల్.ఐ.సి. ఏజంటంటే జనం పారిపోయేవారు. జనాలతో బలవంతాన జీవిత భీమా చేయిస్తుండేవారు.

ఆరోజు ఏజెంటు మీటింగ్ అయిన తర్వాత ఏజెంట్ ఈశ్వరరావులో కొత్త ఉత్సాహం ప్రవేశిస్తుంది. వెళ్ళేప్పుడు, బండిలో కనిపించిన యువకుడితో ఎటువంటి పరిస్థితుల్లో జీవితభీమా చేయించాలనుకుంటాడు.

మాటల్లో మనం వెళ్తున్న రైలు హఠాత్తుగా ఏ వంతెనమీదో కూలిపోవచ్చంటా డతనితో. భవిష్యత్తు గురించి కుటుంబం గురించి ఆలోచించమంటాడు. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదంటాడు.

ఈశ్వరరావు మాటలకు అతను ఏడుపు ముఖం పెట్టాడు. అయినా ఈశ్వరరావు పట్టు విడవకబోయేసరికి ఘొల్లుమంటాడు. చుట్టూవున్న జనం అతణ్ణి చూసి జాలిపడతారు. ఓదార్చడానికి ప్రయత్నిస్తారు. ఈశ్వరరావు ఆ యువకుడు బావ బావమరుదులనుకుంటారు.

"ఎందుకయ్యా! ఆ అబ్బాయినేడిపిస్తున్నావ్?" అంటూ ఈశ్వరరావుని చివాట్లు వేస్తారు.

ఇప్పుడు బిక్కమొఖం వేయడం ఈశ్వరరావు వంతవుతుంది.

"వీడేదో అని వుంటాడు. లేకపోతే వాడెందుకు ఏడుస్తాడు. తలా ఓ విధంఅ అనడంలో ఈశ్వరరావు భయపడిపోతాడు.

"నువ్వు లేకపోతే నీ భార్యాబిడ్డలు అన్నం లేక మాడి చచ్చి పోతారన్నాడు. అలా ఎందుకన్నానా అని బాధపడతాడు ఏజెంట్ ఈశ్వరరావు.

ఏ స్టేషన్లోనో దిగి పారిపోతే ఎలా ఉంటుందని అతను ఆలోచించక పోలేదు. మూర్ఛించి దిగితే అందరూ పట్టుకుని మందలిస్తారనుకున్నాడు.

బెజవాడ రాకముందు ఏదో స్టేషన్‌లో బండి ఆగింది. పెట్టె పెట్టె వెదుక్కుంటూ వస్తున్నవాళ్ళు ఈ పెట్టెలోకి చూసి, యువకుణ్ణి గమనించగానే ఒక్కసారిగా, "ఇదుగో ఈ పెట్టెలో ఉన్నాడన్నారు.

"నాయనా ఈ అబ్బాయి మీకేమవుతాడు" అంది ఆ పెట్టెలోనే వున్న ఓ ముసలమ్మ.

ఒకాయన "నా కొడుకు. వీడి మేనమామ ఈయన" అంటూ తన పక్కనున్నాయని చూపించాడు.

అంతటితో ఊరుకోకుండా "వీడికి నెలరోజులనుంచి వంట్లో ఏమీ బాగుండం లేదు. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడడు. ఏడుస్తుంటాడు. అదోరకమైన పిచ్చి పట్టింది. అందుకని విశాఖపట్టణం తీసుకు వెళ్తున్నాము.." అంటూ చెప్తాడు తండ్రి.

అందరూ ఈశ్వరరావు వంక నువ్వెవరవు? అన్నట్లు చూస్తారు. ఆ చూపుల్ని తట్టుకోలేక, రైలు బెజవాడ ప్లాట్‌ఫారమ్ మీద ఆగీ ఆగకముందే దిగి, ప్లాట్‌ఫారమ్ మీద జనంలో కలిసిపోతాడు ఏజంట్ ఈశ్వరరావు.

ఇలాంటి హాస్య కథానికల్ని కుదించి విషయం చెప్పినంత మాత్రాన సరిపోదు. కథానికని వరుసగా చదువుకుంటూ పోతేనే పూర్తి మజా పొందగలరు. హాస్య, చతురతని ఆనందించగలరు. హాస్యమంటే జీవితంతో సంబంధం లేకుండా చెప్పే కల్పితమూ కాదు, బూతుల అపహాస్యం కాదు. మునిమాణిక్యం వారి రచనలలోని హాస్యం నిజజీవితంలో మనం చూసేది, మనల్ని చక్కిలిగింతలు పెట్టేది.

# మొక్కపాటి నరసింహశాస్త్రి 'ఆఖరుమాట'

**చ**క్కటి, చిక్కటి హాస్యమే కాదు, సమాజానికి టానిక్కు లాంటి కథానికల్ని రాశారు మొక్కపాటి నరసింహశాస్త్రి. జీవితంలో చేసే తప్పులు, ఎలా వెంటాడుతాయో చాలా చక్కగా చెప్పారు. 'ఆఖరుమాట' కథానిక ద్వారా.

పార్థసారధి నాయుడికి తాను కలలుగన్న రోజులొస్తున్నాయని అర్థమౌతోంది. అతనికి చాలా కాలంగా రెండంటే రెండేకోరికలున్నాయి. ఒకటి తాను చాలా పెద్దవాడు కావాలని, రెండోది కొడుకుకి మంచి భవిష్యత్తుండాలని.

ఈ రెండింట్లో మొదటి కోరిక తీరే రోజు వచ్చింది. అయినా ఆత్మహత్య చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చి, ఆఖరు మాటను కొడుకుకు తెలియజేయాలనుకుంటాడు. ఆ కనుల్లో.. అతనంతవరకూ ఎవ్వరికీ చెప్పని, తను చేసిన రెండు తప్పుల గురించి కొడుకుకి ఉత్తరం రాయడం ప్రారంభిస్తాడు. ఇలాంటి తప్పులు తన కొడుకు పొరబాటున కూడా భవిష్యత్తులో చేయకూడదన్నది అతని ఆలోచన.

డబ్బున్న అహంకారంతో తన ఇంటి ఎదురుగా ఓ చెట్టుకింద బ్రతుకున్న ఓ పేదవాడికి లేనిపోని దొంగతనం అంటగట్టి, అక్కడనుంచి ఆ కుటుంబాన్ని పోలీసుల సాయంతో త్రోసివేస్తాడు పార్థసారధి. అసలే దిక్కులేని ఆ కుటుంబం యావత్తు నానా యాతన పడుతుంది. ఆ కుటుంబం పెద్ద నానా ఇబ్బందిపడి మరణిస్తాడు. ఆ అనాధ శవానికి అంత్యక్రియలు జరపడానికి పార్థసారథి దానం చేసిన రూపాయల్ని మరణించిన అతని భార్య పార్థసారధి నాయుడు ముఖం మీద కొట్టి "నీ అంత్యక్రియలకు ఉపయోగించుకో" అని కోపంతో అన్న మాటలు అతడిని వెంటాడుతూనే ఉంటాయి.

రెండోది ఓ అమాయక యువతిని వంచించి, మానభంగం చేస్తాడు పార్థసారథి. ఆ షాక్‌కి తట్టుకోలేని ఆమె మరణిస్తుంది. అది మరో పెద్ద షాక్‌నిస్తుంది పార్థసారధి నాయుడికి.

తట్టుకోలేని అతనికి నెర్వస్‌బ్రేక్ డౌన్ వస్తుంది. విశ్రాంతి తీసుకుంటున్న

అతనికి జీవితం నుంచే శాశ్వత విశ్రాంతి తీసుకోవాలనిపిస్తుంది. ఆ సమయంలో కొడుకు దగ్గర లేకపోవడంతో ఈ విషయాల్ని ఉత్తరంగా రాసిపెట్టి, ఆత్మహత్య చేసుకుంటాడు.

మనం కొన్నింటిని ఖర్మనుకని వదిలేస్తాం. కానీ కర్మలని బట్టే ఖర్మముంటుంది. పార్థసారథి నాయుడు చేసిన పాపాలు అతడి వెంటబడి ఆత్మహత్య చేసుకునేట్టు చేసాయన్నది కథానికా వస్తువు. కథానికలో కథతో బాటు ఎలా చెప్పాలన్న ముఖ్యం. మొక్కపాటివారు ఎంత గొప్పగా ఈ కథానికని చెప్పారంటే చదివినవాళ్ళలో కొందరు భుజాలు తడుముకోవడమే కాకుండా తమ పిల్లలు ఇలాంటి పాపాల్లోకి జారకూడదని ఆశిస్తారని పిల్లలకి అర్థమవుతుంది. నేటి సమాజానికి ఇలాంటి కథానికల అవసరం చాలా ఉంది.

# యల్లాప్రగడ సీతాకుమారి 'ఈ రాధేనా?'

యల్లాప్రగడ సీతాకుమారి గారు చక్కటి కథానికల నెన్నిటినో రాసారు. 'ఈ రాధేనా?' అనే ఆవిడ కథానిక 1938 జులై భారతి మాసపత్రికలో ప్రచురితమైంది. కొస మెరుపు ఈ కథానికకి ప్రాణం.

భావకుడైన రాజారావు మనస్సు పెళ్ళివైపు మళ్ళదు. చిన్నప్పట్నుంచి మేనమామ కూతురైన రాధని పెళ్ళి చేసుకొమ్మని అందరూ అంటున్నా పట్టించుకోడు. అతడికి పెళ్ళికన్నా అతడి రచనలే ముఖ్యం.

ఆ రోజు అఖిలాంధ్ర కథక సమ్మేళనానికి ఏదైనా కథానికని పంపించాలని ఆలోచిస్తున్నాడు. చిన్నదైతే బాగుంటుంది, కానీ మరీ క్లుప్తంగా ఉంటుంది. అలాగని పెద్దది రాస్తే ఎవరూ ప్రచురించరు. అలాగే వస్తువు ఏముంటే బాగుంటుందా అని ఆలోచించసాగాడు. సరిగ్గా ఆ సమయలో ఓ యువతి వణికిపోతూ అతడి ముందర నిలుచుంటుంది.

మా వాళ్ళు ఓ ముసలివాడికి నన్నిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నారు. దయచేసి నన్ను ఓ రెండు–మూడు రోజులు లగ్నం దాటిపోయేవరకు ఏదైనా సురక్షిత ప్రాంతంలోకి చేర్చమని కోరుతుంది.

బాల్యవివాహోల్ని బలవంతానైనా ఆపాలి అనుకున్న రచయిత రాజారావు. ఆమెను షాద్‌నగరం తీసుకెళ్ళి అక్కడ ఓ ఇంట్లో ఉంచుతాడు. ఆమె నేను ఒంటరిగా ఉండలేనంటే అతడూ అక్కడే ఉండిపోవలసి వస్తుంది. ఈ రెండు మూడు రోజుల్లోనే వాళ్ళిద్దరు, తెలియకుండానే దగ్గరవుతారు. ఆమెను చేసుకుంటే రాబోయే ఇబ్బందులు తగ్గుతాయి అనుకుంటాడు. ఆ విషయాన్ని ఆమెతో అంటాడు. ఆమె మీకు ఇవ్వాల్సిన కొద్ది కట్నాన్నయినా మా వాళ్ళు ఇవ్వలేరు' అంటుంది.

'కట్నం ఎవరికి కావాలి? నువ్వు నాకు నచ్చావ్! నేను నీకు తగిన వాడినా కాదో చూసుకో' అంటాడు.

రైలులో బయలుదేరి హైదరాబాద్ వచ్చేసరికి స్టేషన్‌లోనే వాళ్ళవాళ్ళందరూ కనిపించడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మేనమామ దగ్గరకొచ్చి రెండు

పూలహారాలు ఇద్దరి మెడల్లో వేసి, రాజాని కౌగిలించుకుంటాడు. తర్వాత రాధ వైపు తిరిగి 'ఇప్పటికి నీ పంతం నెగ్గించుకున్నావా తల్లీ' అంటాడు. రాజారావు విభ్రమంలో పడిపోతాడు.

'ఏమిటిది? ఈ రాధ నా మేనమామ కూతురేనా? ఈ రాధనేనా చిన్నప్పట్నుంచి ఎంత మంది చెప్పినా తను చేసుకోనని కూర్చున్నది! రాధ చేసిన పన్నాగమంతా అందరికీ తెలిసినదేనా? రాధ ఎంత మేధావి. నిజంగా ఈ రాధే తన చేతి నుంచి జారిపోతే తనంత నిర్భాగ్యుడు ఇంకోడు ఉండడు' అనుకుంటాడు.

ఇలా కొసమెరుపుని మెరిపించారు సీతాదేవిగారు. ఆఖరి వాక్యం–ఈ విషయాన్నే కథక సమ్మేళనానికి కథగా రాయాలని రాజారావు అనుకోవడంతో ముగించారు.

38 నాటికే మనం మాట్లాడుకునే భాషతోనే ఈ కథానికని నడిపిన రచయిత్రి మనం ఊహించని ముగింపుని ఇచ్చారు. అంతర్లీనంగా వరకట్నం లాంటి సాంఘిక రుగ్మతలనీ నిరసించారు. 4–5 పేజీల్లో ఈ కథానికని ముగించారు. పూర్తి కథానికా లక్షణాలతో 1938 నాటికే ఇంత చక్కటి కథానికని రాసిన యల్లాప్రగడ సీతాకుమారి గారి మిగతా కథానికల్ని చదివితే బాగుంటుంది కదూ!

# రాచమల్లు రామచంద్రారెడ్డి 'దేశంలోని దేవకన్యలు'

**'జీ**వితంలో చూసి, ఉపేక్షించే విషయాలనే రాచమల్లు రామచంద్రారెడ్డి కథానికలలో చదివి 'షాక్' తింటాం' అంటారు కొడవటిగంటి కుటుంబరావు.

'షాక్ మాట ఏదైనా పాఠకుని హృదయాల మీద గాఢమైన అనుభూతి ముద్ర వేయాలనే నేను కథానికలు రాశాను. అనుభూతి లేకుండా సాహిత్యమే లేదు. సమస్త సాహిత్యమూ హృదయ వ్యాపారమే' నన్న రామచంద్రారెడ్డిని మనం కొంతవరకు అర్థం చేసుకోగలం 'దేశంలోని దేవకన్యలు కథానికని చదివితే. చిన్నకథతో పెద్దషాక్ ట్రీట్‌మెంట్ ఈ కథానిక. రచయిత తన పాత్రతో పాఠకుణ్ణి పట్టుకువెళ్తాడు.

ఆ పల్లెని మిగతా ప్రపంచంతో కలుపుతూ ఒక బస్సే రోజులో రెండు, మూడుసార్లు వచ్చిపోతుంటుంది. వానరాకనైనా చెప్పగలరేమోగాని ఆ బస్సు పోకడని, చెప్పడం కష్టం! వర్షం వస్తే చెప్పకుండానే ఆ బస్సు శలవు పెట్టేస్తుంది. అది ఒకరోజూ కావచ్చు. పదిరోజులూ కావచ్చు. ఆ ఊళ్లో వున్న మిత్రుడు డాక్టర్ మూర్తిని చూడడానికి వచ్చి తిరిగి వెళ్ళే మార్గంలేక చిక్కడిపోతాడు రచయిత. డాక్టర్ మూర్తి ఇక్కడున్నాడని తప్ప ఇలాంటి వూళ్ళని చూడవలసిన ఖర్మే పట్టదనుకుంటాడు రచయిత మిత్రుడు. అతనికి అర్థంకాని విషయం –ఏ పట్టణంలో ప్రాక్టీస్ పెట్టుకున్నా ఇంతకు రెట్టింపు సంపాదించగలడు డా॥మూర్తి. అసలు ఈ మారుమూల గ్రామంలో ఎందుకు ఉంటున్నట్లు? –నిలదీసి మిత్రుణ్ణి అడగాలని డా॥మూర్తి కోసం ఎదురుచూస్తుంటాడు అసహనంగా రచయిత.

ఆ ఊరులో ఉంటున్నది మనుషులేనా అనిపిస్తుందతనికి. అసలది ఊరా? నరకలోకానికి రహదారి మానవనగరికతకు మచ్చ. మానవచరిత్రకి అపచారం!! మానవమర్యాదకు కళంకం... అని కూడా అనిపిస్తుంది.

ఇంతలో ఆ వర్షంలో ఓ దేవకన్యలాంటి పడుచు అక్కడికొచ్చి రచయితకి తాననుకుంటున్నవన్నీ భ్రమలేమోననే అనుమానాన్ని కలిగించింది. అక్కడ నుంచి రచయిత తన ఆలోచనలతో పాఠకుణ్ణి వెంటబెట్టుకుపోతాడు.

అందమైన ఆ పల్లెటూరి పిల్లతో అనారోగ్యం–పాలిపోయిన ముఖం, ఆనందంలేని నడక–ఆ పల్లెనే స్ఫురింపజేస్తూ బాధిస్తాయి. ఆ పిల్ల ఆసుపత్రిలోకి

పోయింది నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ. ఈ బాలికకి అనారోగ్యమేమిటో అని బాధవేసింది రచయితకి. ఆమె గురించే ఆలోచిస్తున్న అతను "ఏమోయ్! ఆ అమ్మాయివైపు అంతగా చూస్తున్నావ్?" అంటూ పలకరించిన డా॥మూర్తి మాటల్తో ఈ లోకంలోకి వస్తాడు.

"ఎవరు మూర్తీ ఆ అమ్మాయి?" మిత్రుణ్ణి అడుగుతాడు.

"ఓ పల్లెటూరి పిల్ల. తండ్రి ఓ చిన్నరైతు. పొరుగూరు. క్షయవ్యాధితో బాధపడుతోంది" బాంబ్‌ని పేల్చాడు డా॥మూర్తి.

"శానిటోరియమ్‌కు తీసుకువెళ్ళాలిగాని ఇక్కడ వైద్యం ఏమిటి?" బాధపడతాడు రచయిత.

"స్విట్జర్లాండ్ వెళ్ళమనీ చెప్పవచ్చు. కానీ వాళ్ళకంత స్తోమత వుండాలి కదా?" అంటాడు డా॥మూర్తి.

"డబ్బు నేనిస్తాను. ఆవిడని వెంటనే శానిటోరియమ్‌లో చేర్పించు మూర్తీ!" ఆవేదనగా అంటాడు రచయిత.

"ఎంతమంది క్షయరోగులకు నువ్వు సాయం అందించగలవ్? ఆ అమ్మాయిలోని అందం చూసి నీలో ఔదార్యం అంకురించింది. సౌందర్య పక్షపాతివి... ఆ అమ్మాయి నెలక్రితం వైద్యం కోసం నాదగ్గరకి వచ్చి ఉంటే ఆ పని నేనే చేసేవాణ్ణి..." డా॥మూర్తి మాటల్తో రచయిత మనస్సు సుడిగుండంలా మారింది. ఆలోచనలతో తలవేడెక్కింది. రకరకాల ఆలోచనలతో ఆ ఊళ్ళో వర్షంలో చెడతిరుగుతాడు.

'ఆయుష్షు తీరినవాళ్ళని మందులూ, ఇంజెక్షన్లూ బతికిస్తాయా సార్' ఆ పిల్ల తండ్రి అన్నాడన్నమాట. రచయితకి మెట్టవేదాంతంలా అనిపిస్తుంది. ఆ మాటే మిత్రుడితో అంటే అప్పుడు "అవున్లే ఈ మాటే గొప్పవాళ్లు మాట్లాడితే చప్పట్లు కొడతారు. పల్లెటూరి వాళ్ళు మాట్లాడితే అసహ్యించుకుంటారు" అన్న డాక్టర్ మిత్రుడి జవాబు మరింత బాధిస్తుంది.

డబ్బు లేకుండా మందులురావు. డాక్టర్లూ రారు. రోగాలు మాత్రం వస్తాయి. ఎవ్వరికీ స్వాతంత్ర్యం లేదు. అందర్నీ శాసించే హక్కు డబ్బుకుంది...! నీలాంటివాళ్ళు దేశంలో ఎప్పటినుంచో ఉన్నారు. బలిచక్రవర్తి కాలం నుంచి ఎందరు దానధర్మాలు చేస్తున్నా ఈ దారిద్ర్యం పెరుగుతూనే ఉంది. దరిద్రుల సంఖ్య పెరుగుతూనే ఉంది. "ఒక్క విషయం ఆలోచించు... నీ డబ్బు ఆ అమ్మాయి నొక్కదాన్నే బతికించగలదు.

మరి మిగతా వాళ్ళ సంగతి? దేశంలోని  అనారోగ్య పీడితులందరూ అందంగా ఉండరుగా? వాళ్ళకు బ్రతికే హక్కుంది. కాని రోగం వచ్చిన కొంతమందికే బ్రతికించడానికి, మిగిలినవాళ్ళకి మరణదండన విధించడానికి – నీ డబ్బుకి రెండధికారాలూ ఉన్నాయి. మొదటి అధికారం ఔదార్యమైతే, రెండోది రాక్షసత్వం కాదూ?” అన్న డాక్టర్ మాటలు మరింతగా కదిలిస్తాయి రచయితని.

ఆలోచించి జ్వరం తెచ్చుకుంటాడు. రెండు, మూడు రోజులు కన్ను తెరవడు. తగ్గి మామూలు స్పృహలోకి రాగానే “ఆ అమ్మాయి కెట్లా ఉంది?” అని అడుగుతాడు మిత్రుణ్ణి.

“చనిపోయింది..  నిన్న రాత్రి పెద్ద రక్తవాంతై...” అని డాక్టర్ మిత్రుడు రచయితకి జవాబివ్వడంతో కథానిక ముగుస్తుంది. పాఠకుడిలో ఆలోచనలు తీవ్రతరమవుతాయి  ముగింపుతో.

పల్లెల అనారోగ్యాన్ని ఆ అనారోగ్య పడుచు ద్వారా చెబుతూ–అక్కడి అందమైన పడుచు చనిపోవడంతో ఎవరో  కొందరిలో రేగిన దాతృత్వం ఏపాటిది అని ప్రశ్నిస్తూనే అందమైన వాటి పట్లేనా మన ఔదార్యం... అందంలేని వాటి మాటేమిటి? అనే ఆలోచనలనీ రేకెత్తిస్తుంది ఈ కథానిక.

మనదేశంలోని దేవకన్యలు పల్లెలు. వాటిలో అందంగా వున్న కొన్నింటినే మనం పట్టించుకుంటున్నాం. మరి మిగతా వాటి గతేమిటి? ఈ ప్రశ్న పాఠకుడి ముందు నిలుస్తుంది.

సరైన రీతిలో ఆలోచింపజేసేదే గొప్ప కథానిక. అందుకే ఇది గొప్ప కథానిక. చైతన్యాన్ని విస్తరింపజేసి, ఆలోచనల విస్తృతిని పెంచుతుంది.

# రాయసము వేంకట శివుడు 'మాణిక్యము'

ఈ కథానిక భారతి మాసపత్రికలో మార్చి 1924 సంచికలో వచ్చింది. తన అనుభవాల్ని తానే చెప్తున్నట్టుగా రాయసము వేంకట శివుడుగారు ఈ కథానికని రాశారు.

ఉద్యోగం వచ్చిన తర్వాత తనకు నచ్చిన పిల్లని పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశంతో, తనమిత్రుడితో కలిసి వెతుకుతూ బయలుదేరతాడు రచయిత.

ఒక కుగ్రామం చేరేసరికి ఇద్దరు అలసిపోతారు. ఊర్లో బస చూపమని అడుగుతారు.

వాళ్ళు ఒక పూరిల్లుని చూపిస్తారు. ఆ పూరింట్లోని యజమాని బయటకు వెళ్ళాడు. ఒక యువతి మాత్రం ఉంది. 'అమ్మాయి మేము మార్గస్తులము. మిక్కిలి ఆకలితో ఉన్నాము. పాపం ఇంటిలో నువ్వు తప్ప మరేవరు ఉన్నట్లు లేరు. వంట చేయమని నిన్ను బాధించడం తగదు. మాకు కొంచెం బియ్యం, పాత్రయును చూపించిన యెడల, మేమే వంట చేసుకొందుము' అని అంటారు.

కానీ, ఆమె 'ఆ శ్రమ మీకెందుకు, వంట చేస్తున్నాను. మా నాన్న ఇప్పుడే వస్తాడు. రాగానే భోజనం చేయవచ్చు' అంటుంది. బాగా అలసిపోయి ఉండటంతో మిత్రులిద్దరూ నిద్రలోకి జారుకుంటారు. 'అయ్య! మిక్కిలి పొద్దెక్కింది, కాళ్ళు కడుక్కొని భోజనానికి రండి' అనే పురుషుడి కంఠస్వరం వినబడగానే, ఇద్దరు లేస్తారు.

వాళ్ళిద్దరు రెండు మెతుకులు నోట్లో వేసుకొని తిరిగి చాప మీదకు జేరారు.

ఆ ఇంటి అతనికి ఈ మధ్య భార్య చనిపోయింది. అతనికి ఈ ఏకైక పుత్రికే ఆధారం. ఇంటాయన రామనాధం మంచివాడు. శాంతమూర్తి. మర్నాడు ఉదయం రామనాధం మాటలు వినిపించి తలుపు తెరిచాడు రచయిత. అతనికి జ్వరం. బాగా భారంగా తోచింది. 'నువ్విక్కడే ఉండు. ఇద్దరము ఉంటే భారం అవుతాం. నేను వెళ్ళిపోతాను. నువ్వు తగ్గిన తర్వాత బయలుదేరి రా' అని చెప్పి మిత్రుడు వెళ్ళిపోతాడు.

రచయిత తీవ్రమైన జ్వరంతో బాధపడతాడు. అప్పుడు గృహస్థు, అతని కుమార్తె సేవలు చేయడంతో అతడు కోలుకుంటాడు. అంతవరకు అతను అందమైన పిల్ల

కోసం వెదుకుతుంటాడు. కానీ ఆ పూరింట్లోని యువతి మంచి మనస్సుని చవి చూసిన తర్వాత శారీరక అందం కన్నా మానసిక అందం గొప్పదని అర్థమవుతుంది. అందుకని ఆమెను చేసుకోవాలనుకుంటాడు.

కానీ ఆ మట్టిలోని మాణిక్యము హఠాత్తుగా అశువులు బాస్తుంది. రచయిత గిలగిల్లాడిపోతాడు. ఇక నాకు స్త్రీ జాతితో సంబంధం తీరిపోయిందని భావిస్తాడు.

మాణిక్యం గతించి అనేక సంవత్సరాలైనా అతను ఆమె ఆలోచనలోంచి బయట పడలేక పోతాడు. మిత్రులు అతని మనస్సుని మార్చాలని ప్రయత్నిస్తారు. అయినను అతను మాణిక్యం ఆలోచనల్లోంచి బయటకి రాలేక పోతున్నాడనే, కథానికను ముగిస్తారు రచయిత.

అందం, డబ్బుకి అధిక ప్రాధాన్యతనిచ్చే ఆ రోజుల్లో అందం అంటే శారీరక అందం కాదని, మానసిక అందం అని, మామూలు ధనం కన్నా మానసిక ఐశ్వర్యమే గొప్పదని చక్కగా చెప్పారు. ఈ కథానికలో రాయసము వేంకటశివుడు.

'గురజాడ చేతుల్లో ఆధునిక కథ యవ్వనంతో పుట్టింది కాని ఆయన తరువాత తిరిగి బాల్యానికి లోనై 15–20 ఏళ్ళ పాటు తప్పటడుగులు వేసింది' అని పెద్దలు చెప్పినట్లు గురజాడ శిల్పాన్ని పట్టుకోవడానికి క్లుప్తతతో స్పష్టంగా చెప్పడంతో రాయసము వేంకట శివుడు 'మాణిక్యము'లో సాధించగలిగాడు కాని సరళ గ్రాంధిక భాషని మాత్రం విడిచిపెట్టలేక పోయాడు. ఈ విషయాలు మనకు అర్థమవుతాయి ఈ కథానిక చదివిన తరువాత.

# రుద్రాభట్ల నరసింగరావు 'కాంతం-కనకం'

**'కాం**తం కనకం'–ఈ రెండే అనర్థాలకూ చాలా కారణమవుతున్నాయి. ఈ రెండింటిని రెండు పాత్రలు చేసి అద్భుతమైన కథానికని రాసారు రుద్రాభట్ల నరసింగరావు.

చిన్నగ్రామంలో కూడా లక్షల్లో లాభాలు చేసేవ్యాపారులుంటారు. అది జీడిపప్పు వ్యాపారం! అమెరికాలో వున్నవాళ్ళకి ఇక్కడినుంచే జీడిపప్పు అందుతుంటుంది. అలాంటి ఓ ఘనమైన వ్యాపారి వెంకటరత్నం. అతను తన తెలివితేటలతో జీవితక్షీర సాగరమథనంచేసి – విషం తానుతాగి, అమృతాన్ని కొడుకులకు సిద్ధం చేసాడు. వారసుడు కనకం పేరుకు తగ్గట్టే డబ్బుకి వాదించినవాడు. డబ్బులేని వాళ్ళంటే చులకన... వాళ్ళని పీల్చి పిప్పిచేసి, సంపాదించాలనుకునే మనస్తత్వం.

చాలా పెద్దషాప్ కనకానిది. దాంట్లో చాలామంది ఆడవాళ్ళు జీడిపిక్కలు కొడుతూ జల్లెళ్లు పడుతూ, వెచ్చని రేకులమీద పప్పుని జారుస్తుంటారు.

పావలా ఇవ్వడానికి పప్పు మోసుకు పోయే బండతన్ని సతాయిస్తున్న కనకం, అక్కడ కూర్చుని మాట్లాడుతూనే గుప్పిళ్ళతో జీడిపప్పుని తింటుంటాడు. గుమాస్తాగాని, అక్కడ పనిచేసే మరెవరైనాగాని ఒక పప్పుని నోట్లో వేసుకుంటే తట్టుకోలేడు!

అక్కడ పనిచేసే కాంతమ్మ ఓ జీడిపప్పు బద్దని నోట్లో వేసుకుంటూ కనకం కంటపడుతుంది.

'నీయబ్బ సొమ్ముని దాచిపెట్టినట్లు బొక్కేస్తున్నావేమిటి!' అంటూ కసురుతాడు. కాంతమ్మ అతని మాటల్ని పట్టించుకోనట్లు నవ్వేస్తుంది.

ఇది జరిగిన కొన్నాళ్ళకి కోరికతో కాంతమ్మ వెనకపడతాడు కనకం. ఆమె ఓపిగ్గా అతడిని అదుపులోకి తేవాలని ప్రయత్నిస్తుంటుంది. కానీ క్షణక్షణానికి అతనిలో పశుత్వం పెరుగుతుంటుంది.

"తమ కటాచ్చానికి మాలాటోల్లు తగుదుమా బాబూ... తమరు సుక్కేసుకుని. ఇలా రాకండి తమరిక పర్దిష్ట. వైబోగం గుంటాది సానోళ్లని దయచూడండి బాబూ.

ఆళ్ళకాలిగోల్ళని పోలని నన్ను..." ఆ రాత్రి కనకాన్ని ఎంతగానో ప్రాధేయపడుతుంటుంది కాంతమ్మ.

మళ్ళీ ఆమే అంటుంది "ఆళ్ళ దగ్గర వొయసూ హొయలు లేక్కాదు బాబూ... తమరికి ఆళ్ళంటే అసయ్యం కలిగింది, ఆళ్ళకి నీతిలేదని..." ఈ మాటల్లో నన్నూ నీతిమాలిన దాన్ని చెయ్యకన్న ఆమె అభ్యర్ధన ఉంది.

అలా అతి బలవంతాన అతని ఉచ్చునుండి బయటపడుతుంది కాంతమ్మ.

ఇదంతా పాకలో ఉండి వింటున్న ఆమె భర్త అగ్గవుతాడు.

"ఆడు కనకమేనా?" అడుగుతాడు కోపంగా.

"నీ కాళ్ళట్టుకుంటాను మావా. ఆయనకి చెడ్డపేరు. అమ్మగోరికి తెలిస్తే కుమిలిపోతాది. ఇలా వచ్చినట్టు ఎవరితో అనమాక" భర్తని బ్రతిమాలుతుంది కనకమ్మ.

అప్పుడుదయించిన చంద్రుణ్ణి స్త్రీనోటిలోకి వచ్చిన కుసుమకోమల హృదయంతో పోల్చడంతో కథానిక ముగుస్తుంది.

కనకం కన్నా కాంతమెంత గొప్పదో ఈ కథానిక ద్వారా చక్కగా చెప్పారు రుద్రాభట్ల నరసింగరావు.

# రావిశాస్త్రి 'మోక్షం'

**ఒ**క కథానికని చిన్న చిన్న వాక్యాలతో ఎంత వేగంగా నడపాలో బహుశ రావిశాస్త్రికి తెలిసినంతగా మరి ఎవరికి తెలీదేమో! చిన్న చిన్న వాక్యాలు, చిన్న చిన్న పేరాలు... పెద్ద పెద్ద విషయాలు... బలంగా చెప్పగలిగే నేర్పు రావిశాస్త్రి సొత్తు. ఒక్కో వాక్యం మనల్ని ఎన్నో విషయాల్ని ఆలోచింపచేస్తుంది. అందుకే ఆయన చెప్పేది కొంతైనా, మన మనసుల్ని ఆలోచింపచేసేది ఎంతో!!

సమాజంలో మోసపోయేవాళ్ళు, మోసగించేవాళ్ళు, ఆ విషయాలు మనకెందుకులే–అని సరిపెట్టుకునేవాళ్ళు!, మోసగింపబడుతున్న, అణగదొక్కబడుతున్న ప్రజల ఆక్రందనలే రావిశాస్త్రి కథానికలు.

ఆయన వృత్తిరీత్యా ఎంతో మంది నేరస్తుల్ని, నేరం చేయని వాళ్ళని, నేరం చేయకుండానే నేరారోపణకి లోనైన వాళ్ళని, కోర్టు పక్షుల్ని, ర(భ)క్షక భటుల్ని.... రకరకాల వాళ్ళని ఎందర్నో చూసారు. చూసారు అనటం కన్నా చదివారు అనడం సబబు. వాళ్ళందరి జీవితాల్ని ఔపోసన పట్టిన ఆయన – వాళ్ళ జీవితాల్ని గొప్ప గొప్ప కథానికలుగా మలిచారు. వాటిలో 'మోక్షం' ఒకటి. రోజూ ఆఫీసుకొచ్చినప్పట్నుంచి, ఇంటికి వెళ్ళిపోయేవరకు రకరకాల మనుషుల్ని, నేరస్థుల్ని పరిశీలించి, శిక్ష వేయడం రావుగారు లాంటి మేజిస్ట్రేట్‌ల కర్తవ్యం.

కచేరిలో బెంచి మీద కూర్చోడం ఆలస్యం మొదలవుతుంది ఆయనకు నరకం! ఇరవై ఏళ్ళ అనుభవం ఉన్న రావుగారికి ఈ జీవితాన్నించి ఎన్నాళ్లకో 'మోక్షం' అనిపిస్తుంది. ఏడాదిలో 6000 సారా కేసులు, 3,000మంది జరిమానాలు కట్టుకున్నారు. దాదాపు 3000 మంది జైలుకు పోయారు. 50మంది కాబోలు ఇళ్ళకి సులభంగా పోగలిగారు. ఇవి ఒక సంవత్సరం లెక్కలు, ఈలెక్కన తన ఇరవై ఏళ్ళలోను ఎంతమందికి జరిమానా వేశాడు? ఎంతమందికి శిక్ష పడింది? ఒక్కసారి తలచుకుంటే ఆ రాత్రంతా రావుగారికి నిద్రపట్టదు. జ్వరం తగిలినట్లుంటుంది! కొన్నివేలమందికి తనమీద పగ!

వ్యక్తిరాగానే నీ దగ్గర సారా పట్టుకున్నారా, అని అడుగుతాడు.

మాట్లాడకపోతే మరోసారి రెట్టిస్తాడు, 'పట్టుకున్నారా'... అంటూ. అప్పుడు విధిలేక 'పట్టుకున్నారు బాబు' అంటారు. వెంటనే నేరం చేశావా అని అడుగుతాడు.

వాళ్ళు తమ బాధ గురించి చెప్పబోయినా, పట్టించుకోడు. వాళ్ళు 'చేశాను'అనాల్సిందే.

'ఫైన్ కడతావా' అంటాడు తను తిరిగి.

'కట్టలేను' అనగానే, శిక్ష వేస్తాడు. నేరారోపణతో వచ్చేవాళ్ళలో కొంతమందికి జైలులో ఉంటేనే తిండికి దొరుకుతుందనే ఆశ...!! పోలీసులకు ఇన్‌ఫార్మర్‌లుగా పనిచేసేవాళ్ళకి జైల్లోకి వెళ్తే, ఖైదీలు కుళ్ళబొడుస్తారనే భయం!!

రావుగారికి ఇవేవీ పట్టవు, తను అడగాల్సిన ప్రశ్నలు అడుగుతారు, కట్టాల్సిన జరిమానా చెప్తారు లేదా వేయాల్సిన శిక్ష వేస్తారు.

తెల్లవారి ఆఫీసుకి వచ్చినప్పటి నుంచి వెళ్లేదాకా ఇదే తంతు.

శిక్ష పడ్డవాళ్ళనుంచి బూతుల శతకాన్ని విన్న అనుభవాలూ కొల్లలు.

నరకం.... నరకం...

రావుగారికి తల తిరిగిపోతోంది..... తాటిచెట్టుకి జైలు వేయాలా? ఈతచెట్టుకి ఫైన్ వేయాలా? అర్థం కాదు. ఈత చెట్టులు అన్నిటిని నరికి పారేయండి అంటాడు... రెండురోజుల తర్వాత ఆయన్ని కారులో ఎక్కించుకొని బర్రున తీసుకెళ్లి ఓ గేటు ముందు దింపారు. చుట్టూ జనం!

కారులోంచి 'భూతాలు!! చీమలు!! నేను రాను! కండలు తినేసి నన్ను చంపేస్తాయి, పగ పట్టి తినేస్తాయి, చంపేస్తాయి!! అవిగో చీమల కొంపలు! నేను రాను" అనే కేకలు వినబడతాయి.

పది నిమిషాలు పెనుగులాట జరుగుతుంది.

జనంలోంచి 'మేజిస్ట్రేట్... మేజిస్ట్రేట్...' అనే గొడవబయలు దేరింది.

కారు లోపల అతన్ని ఇద్దరు లోపల్నించి బైటకు నెడితే, ఒకరు బైట నుంచి గట్టిగా లాగారు.

అప్పుడు దిగిన రావుగారు ఎదురుగా ఉన్న గేటు మీదున్న బోర్డుని చదివారు 'గవర్నమెంట్ పిచ్చి ఆసుపత్రి'! "ఓహోహో మర్చిపోయాను – గవర్నమెంట్‌కి పిచ్చెక్కింది పాపం!! ఎలా, ఉందో, ఏంటో చూద్దాం రండి! అలా నిలబడి చూస్తారేం జవానులూ? పదండి చూద్దాం..."అంటూ రావు పిచ్చాసుపత్రి గేటులోకి దారి తీసాడు.

"గవర్నమెంట్‌కి పిచ్చెక్కడం కాదు కాని, మనం బ్రతకాం" అని అనుకుంది. పోలీస్ ఎస్కార్ట్ అంటూ ముగిస్తారు కథానికని రచయిత.

# వట్టికొండ విశాలాక్షి 'రిక్షావాలా'

**కా**లికి చెప్పులు లేక కాళ్ళు కాలుతున్నా, వొళ్ళంతా ఎండలోనే మండిపోతున్నా- కాలే కడుపుని చల్లార్చడానికి రిక్షా తొక్కక తప్పదతనికి. అంత ఎండలో కూడా అతను బేరానికి ఎవరు పిలుస్తారా అని ఆత్రంగా ఎదురుచూడక తప్పడంలేదు. దారులు కూడా అతనికి సరిగ్గా తెలీవు. తెలీదంటే బేరం ఎక్కడ పోతుందోనని తెలుసంటాడు. ఎక్కినవారు దారి సరిగా చెప్పకపోతే ఎటెటో తీసుకువెళ్తాడు. ఎక్కినవాళ్ళకి చిరాకు వేస్తుంది. ఒకసారి ఎక్కినవాళ్ళు ఆ రిక్షాని మళ్ళీ ఎక్కరు.

ఇంటి దగ్గర పిల్లలు గుర్తుకొస్తుంటారు. ఎవరైనా "ఏయ్...రిక్షా" అంటే చాలు రెండణాలు దొరుకుతాయనే ఆశ. మిగతా విషయాల్ని వెంటనే బండి కట్టేలా చేస్తుంది. అందుకే ఎవరు తననని పిలుస్తారా? అని ఆశగా ఎదురుచూస్తుంటాడు.

ఒకరోజు ఎండలో బేరాలకోసం ఎదురుచూస్తున్న అతడిని పిలుస్తుంది. రచయిత్రి "వస్తున్నా నమ్మా!" గంట గణగణ మోగించుకుంటూ ఆమె ముందుకు వచ్చి వాలాడు. అవతలివాళ్ళు తనకి తెలీని ప్రదేశానికి తీసుకు వెళ్ళమన్నా-ఎక్కడ అని అడక్కుండా ఎక్కేయమనడం రిక్షావాలా అలవాటు! ఎంతివ్వమంటావ్ అంటే-ఎంతో మీదయ అనడం మరో అలవాటు! అలా అనకబోతే వచ్చిన బేరం తప్పిపోతుందేమోనని భయం!

ఎర్రని ఎండలో రెండు మూడు ఫర్లాంగులు బండిలాగిన తర్వాత "అబ్బా! కాళ్ళు కాల్తున్నాయమ్మా" అంటాడు.

"చెప్పులు లేవా?" అన్న రచయిత్రి ప్రశ్నకి సమాధానంగా "చెప్పుల్తో బండి తొక్కలేనమ్మా" అంటాడు.

అసలు విషయం-తిండే సరిగా లేదతనికి, చెప్పులెక్కడుంటాయ్! ఎంత ఎండైనా ఇట్టా మాడాల్సిందే!

తనడిగిన బ్రాడీపేట వైపు కాకుండా ఎటో తీసుకెళ్తున్న అతడిని "అదేమిటి ఇటు వచ్చావేం?" అంటుంది రచయిత్రి.

"కాళ్ళు అంటుకుపోతున్నాయమ్మా" అంటూ అతను ఓ చెట్టుకింద రిక్షా ఆపుతాడు.

రచయిత్రి రిక్షా దిగి, మరో బండిలో పోవాలనుకుంటుంది.

"కళ్ళు మూసుకునైనా లాక్కువెళ్తా కూర్చోండమ్మా" అంటాడతను. ఎక్కలేక ఎక్కుతుంది.

ఇంత బాధపడ్డ రచయిత్రి చేతిలో మూడు రూపాయలే ఉంటాయ్! జాలిపడ్డ తను ఆ డబ్బున్నా అతనికివ్వాలంటే ఇంకెక్కడికో ఇలాగే రిక్షాలో వెళ్ళాలి. అందుకని ఆరణాలు మాత్రమే ఇవ్వగల్గుతుంది.

అది తీసుకునే కృతజ్ఞతలు తెల్పుకుంటూ రిక్షావాలా వెళ్ళిపోతాడు.

రిక్షా తొక్కే వాళ్ళ బాధాకర జీవితాన్ని చెప్పడంతోబాటు సాయంచేయాలనుకున్న వాళ్ళ దయనీయ స్థితిని ఈ కథానిక ఎంతో దయనీయంగా చెబుతుంది. మంచి ఆలోచనా బీజాన్ని చదువరుల మెదడులో నాటుతుంది ఈ కథానిక. 1950 ప్రాంతంలో ప్రచురితమైంది ఈ కథానిక.

# వట్టికోట ఆళ్వారుస్వామి 'పతితుని హృదయం'

'ఆళ్వారుస్వామిగారు రాసిన 'జైలు లోపల' ఆలోచింపచేసే కథానికలు.

1976లో నేను 'జైలుగోడల మధ్య' అనే శీర్షికను రాష్ట్రంలో అన్ని జైళ్ళు తిరిగి, ఖైదీలతో ఆత్మీయసంబాషణని జరిపి, 52 యదార్ధగాధల్ని రాసాను కాబట్టి నాకు జైలు పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆళ్వారుస్వామిగారు 1952లోనే తను జైలులో ఉన్నప్పుడు, సాటి ఖైదీల బాధల్ని తెలుసుకుని 'జైలు లోపల' అంటూ మానవత్వాన్ని మేల్కొలిపే ఆరు కథానికల్తో 52లో ఈ గ్రంథాన్ని తీసుకొచ్చారు.

ఎవ్వరూ పుట్టుకతోనే నేరస్థులు కారు, ఈ సమాజమే కొందర్ని నేరస్థులుగా మారుస్తోంది. లోపలున్న వాళ్ళే నేరస్థులు కారు, బయట అంతకన్నా పెద్ద నేరస్థులున్నారు. దొరికితేనే దొంగ.. దొరకకపోతే దొర! ఈ నేరస్థుల్ని సంస్కరించడానికి ఎవరు ముందుకొస్తున్నారు. ఒకసారి తెలిసో, తెలీకో నేరస్థులైతే ఆ ఉచ్చులోంచి బయటకు రానివ్వదీ సంఘం, ప్రభుత్వం.

నేరస్థులు మానసిక రోగులైతే కొందర్ని తక్కువ శిక్షతో సంస్కరించి, మరికొందర్ని, ఉరెందుకు తీస్తున్నారు? హత్య చేసిన వాణ్ణి పట్టుకుని చంపేవాళ్ళు నేరస్థులుకారా?-ఇలాంటి ఎన్నో ప్రశ్నల్ని మనముందుంచుతుంది ఈ కథానిక.

జైళ్ళలో ఖైదీలతో పనులు చేయించి కొద్దిపాటి మొత్తాన్ని ముట్టచెబుతుంటారు. 'పతితుని హృదయం' కథానికలో. ఖైదీలు నేత పనిని సరిగా చేయలేకపోతుంటారు. వార్డర్సు వాళ్ళని పర్యవేక్షిస్తుంటారు. వార్డర్ తిరుపతయ్య గండయ్య గురించి మిగతా ఖైదీల్ని అడుగుతాడు.

గండయ్యని ఉరితీసే తిరుపతయ్య లాంటి వాళ్ళ ముఖంలో ఇంతన్నా విచారంలేకపోవడం ఖైదీలని బాధిస్తుంది. ఒక మనిషిని ఉరితీసి చంపుతుంటే, అక్కడ కూర్చుని చూసేవాళ్ళకి ఎలా మనసొప్పుతుంది? అని ఒకరంటే 'రేపు నీకు జవానుద్యోగమిస్తే నువ్వూ అట్లాగే చేస్తావ్!' అంటాడు మరోఖైదీ.

ఖైదీలందరూ గండయ్య ఉరిగురించి బాధపడుతుంటారు.

'నేను కాకపోతే మరోడు తయారవుతాడు ఉరితీయడానికి! ఉరితియ్యడం ఆగిపోతుం దనుకున్నావా?' అంటాడు తిరుపతయ్య.

'మేము తప్పుచేస్తే ఎందరికో శిక్ష విధించినట్లు కాక నాకు ఎందుకు శిక్ష వేయకుండా ఉరితీస్తున్నారు?' అని బాధని వ్యక్తపరుస్తారు గండయ్య.

'మీ గాంగ్‌వాళ్ళు ఎన్ని ప్రాణాలు తీయలేదు?' అంటాడు తిరుపతయ్య.

'చదువుకోనివాళ్ళం' చిన్నప్పటి నుంచి దొంగల సావాసంలో పెరిగాం. అవే బుద్ధులు, అదే బతుకు. ఇప్పటికైనా ఈ పనినుంచి మమ్మల్ని మాన్పించి, విద్యావంతులుగా బుద్ధిమంతులుగా తయారు చేయడానికెవరైనా ముందు కొస్తే మా గాంగ్ మాటేమోగాని, నా వరకు నేను సిద్ధంగా ఉన్నాను–అంటాడు గండయ్య తిరుపతయ్యతో. కానీ అతడికి కాదు ఈ ప్రశ్న–సమాజానికి.

ఒకడిని చంపడమే తప్పంటున్నారు–ఇంకొకడిని ఉరితీసి చంపడం ఎంతవరకు సబబు? గండయ్య సమాజాన్నడిగిన మరో ప్రశ్న.

జైలర్ వచ్చి 'గంజి ఎందుకు తీసుకోలేదు?' అని గండయ్యని నిలదీస్తాడు.

ఉరితో ప్రాణాలు కోల్పోతున్నానని తెలిసి ఎవరు ఏమి తినగలరు?

"ఉరన్నప్పటి నుంచి నాకెట్లాగో ఉంద"ని బాధపడతాడు గండయ్య.

ఇది అర్థంగాని అధికారులు అతనిమీద మండిపడతారు.

మానవత్వానికే ప్రశ్న ఈ కథానిక.

ఉరి గురించేకాదు, నేరాలు–నేరస్థులు, జైళ్ళు–జైలు అధికారుల గురించి ఎన్నో విషయాల్ని చెప్పి, మనల్ని ఆలోచనా సాగరంలో ముంచే మంచి కథానిక.

ఈ సంవత్సరం నవంబర్ 1 వట్టికోట ఆళ్వారు స్వామిగారి జయంతి. అక్కడి నుంచి సంవత్సరం పాటు శతజయంతోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంలోనైనా ఆయన రచనలు చదవాల్సిన అవసరం ఈ తరానికి ఉంది.

# వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'బండి కదిలింది'

రాయలసీమ కరువు గురించి వచ్చిన మంచి కథానికలలో వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'బండి కదిలింది' ఒకటి. హృదయాన్ని కదిలించే కథానిక.

'దుమ్ము రేపుకుంటూ బస్సు కదిలింది...' అంటూ ప్రారంభమవుతుంది కథానిక. 'బాలింతల్లా పాలిపోయిన మబ్బులు ఆకాశానికి వేసిన మాసికల్లా నిలబడి ఉన్నాయి' అంటారు రచయిత. ఈ వాక్యం చెప్పకనే చెబుతుంది అక్కడి వర్షాభావ పరిస్థితుల్ని.

రామప్పరెడ్డి బావమరిది కూతురు పెళ్ళికి వెళ్ళాలి. 'నువ్వు తెల్లారికే ఎల్లిపోప్పా. ఈడ పన్లేమైనా ఉంటే నేను సూసుకుంటాలే...' అంటాడు నాగప్ప.

'ఏం సేద్యాలో ఏం బతుకులో' అనిపిస్తుంది ఇద్దరికీ.

నాగన్న, రామప్పరెడ్డి ఇంట్లో వ్యక్తిలా కలిసిపోయి, వ్యవసాయ పనుల్లో రామప్పరెడ్డికి చేదోడువాదోడుగా ఉంటుంటాడు.

బాయికింద సేద్యం నీళ్ళులేక నిలిచిపోయాక నాగన్న కొడుకు రెడ్డప్ప పట్నం తరలిపోయాడు, రిక్షా తొక్కుతూ జీవితాన్ని వెళ్ళదీయాలని వెళ్ళి ఆరునెలలు కూడా తిరక్కుండా పట్నంలో ఓ లారీ కిందపడి చనిపోయాడు.

అప్పుడే కాదు అంతకుముందు తర్వాత కూడా కరువుబతుకే! కరువు తర్వాత కరువు...!

స్వాతంత్ర్యం వచ్చిందని ఆనందపడ్డారే గాని జనానికి కరువు చీకటిలా ముసురుకుంటోందని తెలీదు.

ఒకసారి జవహర్‌లాల్ నెహ్రూ కరువు ప్రాంతాల్ని చూడడానికి వచ్చారట అప్పట్లో. ఆయన వస్తున్నారని చోటా నాయకులు చేసిన ఏర్పాట్లతో ఆయనకు ఆ ప్రాంతంలో కరువున్న అభిప్రాయం రాకపోగా, అక్కడి పరిస్థితుల్ని చూసి పులకించిపోయారట! ఇంత అందమైన ప్రాంతంలో నివసిస్తున్న మీకు ఆకలి ఎలాగుర్తొస్తోందో ఆశ్చర్యంగా ఉందని కూడా అన్నారట.

స్థానిక నాయకులు- రాష్ట్ర నాయకులు, దేశనాయకులకి అసలు పరిస్థితులు తెలీకుండా ఎలా చేస్తుంటారో ఈ సంఘటన మనకి చెబుతుంది.

క్రమంగా కరువుమీద కరువు...!

గొడ్లని అమ్మేసుకోవాల్సిన పరిస్థితులు.. వంటిమీద బంగారాన్నంతా అమ్మేసుకోవాల్సిన పరిస్థితులూ... ఇలాంటి పరిస్థితుల్లో రామప్పరెడ్డి భార్యతో కలిసి బావమరిది ఇంటి పెళ్ళికి వెళ్ళాల్సిన అవసరం వచ్చింది. భార్యకి గిల్టునగలు తెప్పించాడు. పెళ్ళికి వెళ్ళిన తర్వాత వెయ్యినూట పదహార్లయినా చదివించాలి! అందుకని అప్పుడిగి, ఆ మొత్తం అందుకోవడం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఇంటికి వెళ్ళిన రామప్పరెడ్డి, అక్కడున్న గోతాంలోంచి పిడికెడు గింజల్ని తీసి నాగప్ప వైపు చూపి "వర్షం రాకపోతే ఇవేవీ పనికి రావుకదరా"అంటాడు బాధగా.

"అవి ఎండ్రిన్‌లో తడిపిన గింజలు. ఈ గింజలు కడుపులోకి పోతే చావు తప్పదు" అని కూడా అంటాడు నాగన్నతో రామప్పరెడ్డి.

"వాన్రాకపోతే ఈ విత్తనాల్ని ఏం చేయాలప్పా" అనడుగుతాడు నాగన్న.

"దిబ్బలో పోయాల్సిందే" అంటాడు బాధగా రామప్పరెడ్డి..

ఊళ్ళో అందరూ తనలాగే ఇంట్లో విత్తనాలు పెట్టుకుని వానొచ్చేలోపు ఎక్కడ ఆకలితో తినివేస్తామోనన్నభయంతో ఎండ్రిన్‌లో నానబెట్టి ఎదురు చూస్తున్నవాళ్ళే!

ఆ ఆలోచనల్తో వాళ్ళిద్దరికీ ఆకలి కూడా వేయడం లేదు.

రామప్పరెడ్డి బయటకు వెళ్ళాడు. నాగప్ప గిన్నెలో పెట్టిన అన్నాన్ని కుక్క ముట్టుకుంటుంది. దాని ఆకలీ తన ఆకలిలాంటిదే కదా అని నాగన్న దాన్ని తరమడు.

కాసిని నీళ్ళు తాగి బయటికొచ్చిన నాగన్న, అప్పుడే వచ్చిన రామప్పరెడ్డి "అన్నం తిన్నావా?" అనడిగితే తిన్నానంటాడు.

అర్ధరాత్రి నిద్రపట్టక పందిట్లోకి వచ్చిన నాగన్నకి ఎదురుగా శనగ్గింజల మూట కనిపించింది. రామప్పరెడ్డి బాధలు గుర్తుకొచ్చాయి. ఆ గింజలు తింటే చచ్చిపోతామన్న అతని మాటలు గుర్తుకొచ్చాయి.

ఆ గింజల్ని కొద్దికొద్దిగా తిన్న నాగన్న వాంతి చేసుకుంటాడు.

అతడి పరిస్థితి తెలుసుకున్న రామప్పరెడ్డి వాణ్ణి బతికించుకోవాలని పట్నం వెళ్ళడానికి 'బండి కట్టరా' అంటూ ఏబులేసుని పిలవడంతో కథానిక ముగుస్తుంది.

కరువు వల్ల మనుషులే కాదు, గొడ్డు, గోదాం – అంతా ఎంతో బాధపడుతున్నట్టు కళ్ళు చెమర్చేలా చెప్పారు రచయిత. రాయలసీమలోని కరువుని కళ్ళ ముందుంచుతూ గొప్పగా రాశారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య.

# వాకాటి పాండురంగరావు 'ప్లసిబో'

ఆరోగ్యం జీవించడానికి ముఖ్యం. కానీ మనం ఆరోగ్యాన్ని పట్టించుకోం. వైద్యం గురించి అవగాహనని పెంచుకోం. కనీసం వైద్యానికి సంబంధించిన పదాల్ని తెలుసుకోవాలనుకోం.

వైద్య విషయాలమీద తెలుగులో వచ్చిన కథానికలే తక్కువ. అందుక్కారణం తెలుగులో అలాంటి కథానికలు రాసే రచయిత(త్రు)లు తక్కువకావడమే! అలాంటి అరుదైన విషయాల చుట్టూ అందమైన కథానికలని అల్లిన వాళ్ళ జాబితాలోకి వాకాటిగార్ని చేరుస్తుంది 'ప్లసిబో' కథానిక.

ప్లసిబో అంటే ఏమిటి? దాని ప్రభావం జీవితంమీద, ఆరోగ్యం మీద ఎలా ఉంటుంది! ఈ కథానికలో చాలా గొప్పగా చెప్పారు వాకాటి. 1982లో ఈ కథానిక ప్రచురితమైంది.

అహంకారం లేని నమ్మకం ఆటల్లోనూ గెలిపిస్తుంది, అనారోగ్యాన్ని జయింపచేస్తుంది అనే నిజాన్ని కథానికా ప్రారంభంలో టెన్నిస్ ఆడే బోర్‌తోను, తర్వాత అనారోగ్యాన్నుంచి కోలుకునే మాలిని ద్వారానూ చెప్పించిన రచయిత–అదిలోపించడమే డాక్టర్ భార్య కోల్కోకపోవడానికి కారణమంటూ వివరిస్తాడు. వైద్యుడు, రోగి మధ్యయినా, భార్యాభర్తల మధ్యయినా 'నమ్మకం' ప్రధానం, ఆ నమ్మకమే జీవితాన్ని నడిపిస్తుందని కథానిక ద్వారా నొక్కి వక్కాణిస్తాడు రచయిత.

మనసెలా నడిస్తే విశ్వం అలా నడుస్తుంది అనే విషయాన్ని కథానికా ప్రారంభంలో టెన్నిస్ ఆటద్వారాను, దీక్షగా ఆ ఆటని ఆడుతున్న బోర్గ్‌ద్వారాను స్పష్టపరుస్తాడు రచయిత. అదే సమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకన్నా రవికి, అనారోగ్యం నుంచి తన రోగిని బయటపడేయాలన్న కోరిక డా॥రవిలో ఎక్కువని మనం అర్థం చేసుకునేట్టు సాగుతుంది భార్యతో డా॥రవి ఫోన్ భాషణం.

'ఆన్కైలోసింగ్ స్పాండిలైటిస్' అనే అరుదైన అనారోగ్యంతో బాధపడుతున్న మిసెస్ మాలినిని 'ప్లసిబో'తో చికిత్స చేయాలనుకుంటాడు. అదొక్కటే ఆవిడకి మందని కూడా నిశ్చయించుకుంటాడు.

"మీకు ఎంతో జీవితముంది. సాధించాల్సినవెన్నో ఉన్నాయి. అవన్నీ చేసి తీరాలన్న పట్టుదల మీలో ఉండాలి. చేసి తీరుతానన్న ధైర్యముండాలి. ఆపైన డాక్టర్‌నయిన నన్ను మీరు నమ్మాలి. అప్పుడిహ మీ అనారోగ్యం మీద రణభేరి మోగిద్దాం" అంటాడు ఖచ్చితంగా మాలినితో రవిచంద్ర.

"ఆత్మవిశ్వాసముంటే సగం యుద్ధం గెలిచినట్లే' అని కూడా అంటాడు రవి.

అచ్చంగా మందులాగే పంచదార బిళ్ళని తయారు చేస్తే, దానిని 'ప్లసిబో' అంటారు. రోగం తగ్గడానికి మందు కావాలి. మందుకావాలని పోరాడే చోట రోగిని తృప్తిపరచడానికి ఇచ్చేది 'ప్లసిబో'. సాధారణంగా కొత్త మందుల్ని పరీక్షించే దశలలో 'ప్లసిబో'ని వాడుతుంటారు–అంటూ ప్లసిబో ఎఫెక్ట్‌ని చూపించే ముందు 'ప్లసిబో' అంటే ఏమిటో కూడా మనకర్థమయ్యేలా స్పష్టంగా చెబుతారు. ప్లసిబో అంటే ఏమిటో తెలీకపోతే అసలు కథానికే అర్థంకాదు. అలాగని వివరణని కథానిక నుండి వేరుచేసి కాక అంతర్భాగంగానే చెప్పడం రచయిత అనుభవాన్ని చెప్పకనే చెబుతుంది.

తనకి తన వృత్తి ముఖ్యమని భావించిన డా॥ రవి, ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న భార్య మీనాక్షిని ఇంకా శలవు పొడిగించమంటాడు. కాని ఆమె తనకీ తన వృత్తి ప్రధానమంటుంది. అందుకే మాలినికి అనారోగ్యం తగ్గుముఖం పడుతుందిగాని మీనాక్షికి తగ్గుముఖం పట్టదు. సరిగ్గా అదే సమయంలో అలా డా॥రవి, మీనాక్షిల మధ్య నమ్మకాన్ని పూర్తిగా విచ్ఛిన్నం చేస్తుంది.

అప్పుడనుకుంటాడు డా॥రవి తన భార్యని చూడడానికి వేరే స్పెషలిస్ట్‌ని పిలవాలని, ఆమె ప్రాణానికి ఆమె నమ్మకం, ఆమె సహకారం కావాలని! కాబట్టి అతనలా నిశ్చయించుకోవడంతో కథానిక ముగుస్తుంది.

ఏ ఇద్దరి మధ్య బంధాన్నయినా నమ్మకమే దృఢపరుస్తుందన్నది నిజం.

'ప్లసిబో' నేపథ్యం మీద పూర్తి అవగాహనతో రచయిత చెప్పేదు కాబట్టే పూర్తి సాంకేతికపరంగా చెప్పినా, అవసరమైన అవగాహనకి ఏమాత్రం ఇబ్బందిలేకుండా 'వాకాటి' చెప్పగలిగారు. క్లిష్టమైన వైద్య విషయాన్ని తేలికగా అందరూ అర్థం చేసుకోగలిగేట్టు కథానికా రూపంలో చెప్పడం అద్భుతం! వైద్య సాంకేతికత, సామాజికత మధ్య చక్కటి సమన్వయంతో సాగింది 'ప్లసిబో'.

# వాసిరెడ్డి సీతాదేవి 'తమసోమ జ్యోతిర్గమయ'

**గో**పాలం ఆధునిక యువతకు నిదర్శనం. వేంకట సుబ్బావధానులు జాతకాలు రాయడంలో దిట్ట. వీళ్ళిద్దరి మధ్య సంభాషణతో ఈ కథానిక ప్రారంభమవుతుంది.

ప్రాప్తం ఉన్నదాన్ని మనిషి తప్పక పొందుతాడు. "దాన్ని భగవంతుడు కూడా ఆపలేడు" అంటాడు సిద్ధాంతి. "అంటే భగవంతుడు ఒక వ్యక్తిని బాగుచేయలేడన్నమాట.... " అంటూ గోపాలం సిద్ధాంతిని తికమక పెడతాడు. "నా జాతకానికి తిరుగులేదు" అంటాడు సిద్ధాంతి. "నాకు బ్రహ్మాండమైన జాతకం ఉందని రాశారు. నాకు చాలాగొప్ప హోదాలోనూ ఉంటానని చెప్పారట" సిద్ధాంతిని నిందిస్తాడు గోపాలం.

ఇలా వాళ్ళిద్దరి మధ్య భిన్న దారుల్లో చర్చ సాగుతుంది. గోపాలం తికమక పెట్టే మాటలకి తిక్క రేగుతుంది సిద్ధాంతికి. బలవంతాన కోపాన్ని అణుచుకుంటాడు.

"ఇవాళ నాకో విషయం అర్థమైంది. పాపం చేసిన వ్యక్తి బాధపడనక్కరలేదు. భగవంతునికి కూడా భయపడక్కర్లేదు" అంటాడు గోపాలం.

సిద్ధాంతి – "రామ రామ! నేను అలా అన్నానా?"

"ఇంతకు ముందే కదండి అన్నారు. బుద్ధి స్వతంత్రమైనది కాదని అంతకు ముందే రాసిపెట్టిన ప్రకారమే ఆ బుద్ధి నడుస్తూందనీనూ! పుణ్యం చేయించినా, పాపం చేయించినా, ఆ మహాత్ముడే కాబట్టి. మానవుడు ఎందుకు భయపడాలి" అంటాడు గోపాలం. ఇలా పొంతనలేని విధంగా సాగుతాయి వాళ్ళిద్దరి సంభాషణలు.

"ఇవాళ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పదహారు సంవత్సరాల కుర్రాడు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుని, 300 గజాల ఎత్తునుంచి, కింద ఉన్న బావిలోకి దూకుతాడట. వెళ్దామా చూడటానికి?" అడుగుతాడు సిద్ధాంతి.

"మీకు ఇలాంటి ఇంట్రెస్ట్‌లు కూడా ఉన్నాయా?" అడుగుతాడు గోపాలం.

"ఏదో సరదాకి" అని ఘొల్లున నవ్వుతాడు సిద్ధాంతి.

"అవును సహజమే ఇతరులను అపాయంలో చూడటం అంటే ఎక్కువమంది మనుషులకి సరదాగానే ఉంటుంది" చురక అంటిస్తాడు గోపాలం.

"పదండి నేను వస్తాను" అంటాడు సిద్ధాంతితో.

ఇద్దరూ కలిసి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కి బైలుదేరుతారు. ఉచితంగా వెళ్ళే సిద్ధాంతి–గోపాలం టికెట్ కొనడంతో, టికెట్‌తో ప్రవేశిస్తాడు.

సిద్ధాంతిని చూసి రెండు చేతులూ జోడిస్తాడు, పచ్చగా, బొద్దుగా ఉన్న ఒక కుర్రవాడు.

"ఇతనేనా సాహసకృత్యం చేసేది. ఇతను చచ్చిపోతే?"

గోపాలం హృదయం తపిస్తుంది.

మొదటిసారి ఈ ఫీట్ చేస్తున్నా అతడు భయపడకపోవడం బాధపెడుతుంది గోపాలాన్ని.

"ఈ విద్యను మీ తండ్రిగారి దగ్గర నేర్చారా?" అడుగుతాడు గోపాలం.

"లేదండి మా నాన్న పోయిన సంవత్సరం పూణాలో ఈ ప్రదర్శన ఇస్తూ చనిపోయాడు."

గోపాలం ఉలిక్కిపడి "మీ తాత ఎలా చనిపోయారు?" అని అడుగుతాడు.

"మా తాత కూడా ఎంతో కాలం ఈ వృత్తిమీదే ఆధారపడ్డాడు. కాని, చివరికి ఈ ఫీట్ చేస్తూనే చనిపోయాడు. మా నాన్నకి నేను ఈ వృత్తి చేసి బ్రతకడం ఇష్టంలేదు. ఆయన కోరుకున్నట్టు ఐ.ఏ.ఎస్. చేస్తాను. అంతవరకు చదవడానికి డబ్బు కావాలి కదా! అందుకే ఇవాళ ఈ ఫీట్ చేస్తున్నాను" అంటాడు నాగేష్.

అతని చేయిని చూడమంటాడు గోపాలం సిద్ధాంతిని.

"ఆహా ఎంత అదృష్టజాతకుడివోయ్. నువ్వు తప్పక కలెక్టర్‌వి అవుతావు, అప్పుడు నాకు పట్టుపంచల చాపు పెట్టాలి సుమా" ఆశీర్వదిస్తాడు సిద్ధాంతి.

"సిద్ధాంతిగారు నాగేష్ ఎంతకాలం బ్రతుకుతాడో చేయి చూసి చెప్పండి" అడుగుతాడు గోపాలం.

సిద్ధాంతి నగేష్ చేతిని పరీక్షగా చూసి-

"ఎనభై సంవత్సరాలకి ఢోకాలేదు" అంటాడు.

ఒళ్ళు గగుర్పొడిచే ఫీట్ ప్రారంభం అవుతుంది. నాగేష్ ఒక జేబులోంచి పెట్రోల్ సీసా తీశాడు. ఒంటిమీద ఒలకబోసుకున్నాడు. రెండో జేబులోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించుకున్నాడు.

ఓ అర్తనాదంతో మండుతున్న ఆకారం క్షణకాలంలో గిర్రున సుడులు తిరుగుతూ వచ్చి 'వెల్ ఆఫ్ డెత్' బావిలో కాక ఒడ్డునే పైకి చూస్తూ నిలబడ్డ వాళ్ళ మీద పడింది.

జనం..... ఆర్తనాదాలు... పరుగులు....

అమాయకుల ఆర్తనాదాలు, భవిష్యత్తు తెలుసంటున్న దొంగ సిద్ధాంతుల తీరు తెన్నుల్ని ఈ కథానికలో వాసిరెడ్డి సీతాదేవిగారు గొప్పగా విశ్లేషించారు.

# వి.ఎస్.రమాదేవి 'దానం'

**కొ**న్నికొన్నిరకాల చిన్నపిల్లల ఆటలు, పెద్దయ్యాక శాపాలెలా అవుతాయో ఈ కథానిక చెబుతుంది. ఆటలకైనా ఒక హద్దుంది. హద్దుమీరితే హద్దుమీరిన వాళ్ళు శిక్ష పొందడానికి బదులు – అవతల వాళ్లు శిక్ష పొందే అవకాశముంది! డబ్బుతో పాపాల్ని కడిగేసుకోవచ్చా లాంటి ప్రశ్నలకు సమాధానం 'దానం'.

తల్లిని అనారోగ్య చికిత్స కోసం బొబ్బిలినుంచి తను పనిచేస్తున్న నగరానికి పిలిపిస్తాడు మూర్తి. ప్రత్యేక వైద్యనిపుణులు ప్రత్యేకశ్రద్ధతో, వెంటనే చూడాలని, బాస్ జగన్నాథంతో  చెప్పిస్తాడు.

కల్నల్ శర్మగారే స్వయంగా చూస్తారని, తల్లిని రేపు ఆసుపత్రిలో చేర్చమంటారు బాస్ జగన్నాథం– మూర్తితో. ఆ మాటే అతను తల్లి రాజేశ్వరమ్మకి చెబ్తాడు.

ఆసుపత్రికి కొడుకు మూర్తితో వెళ్ళిన రాజేశ్వరమ్మకి, కల్నల్ శర్మతో మాట్లాడుతున్న జగన్నాథం కనిపిస్తాడు.  ఆయనే తన బాస్ అని చెబుతాడు మూర్తి.

రాజేశ్వరమ్మ మనసులో గతమంతా ఓ రీల్‌లా కదులుతుంది. జగన్నాథం అతని అన్నా, చెల్లెలు – అందరూ గుర్తుకొస్తారు. ఆరోజులూ గుర్తుకొస్తాయి. ఆ రాత్రంతా  కూడా ఆమెకి నిద్రపట్టదు.

జీవితంలో మళ్ళీ పొరబాటున కూడా ఎదురుపడకూడదనుకున్న జగన్నాథం, తన కుమారుడు బాస్‌గా, తనకి వైద్యంలో సహాయకారిగా... ఇక ఆలోచించలేకపోయింది రాజేశ్వరమ్మ. ఒక స్థిర నిశ్చయానికొచ్చింది.

కొడుకు, కోడలు ఎంతగా బ్రతిమాల్తున్నా పట్టించుకోకుండా మర్నాడే బయల్దేరి బొబ్బిలి వచ్చేస్తుంది.

మర్నాడు బాస్ జగన్నాథం ఓ లెటర్ డిక్టేట్ చేయడానికి మూర్తిని తన కాబిన్‌లోకి రమ్మంటాడు.

బాస్ కేబిన్‌లోకి వెళ్ళగానే 'సారీ సర్ మీరు చెప్పినా నేను శర్మగారికి మా అమ్మను చూపించలేకపోయాను. ఆవిడెందుకో హఠాత్తుగా మనసు మార్చుకుని నిన్నటికి నిన్న బొబ్బిలి వెళ్ళిపోయింది' అంటాడు మూర్తి బాధగా జగన్నాథంతో.

"మీ అమ్మగారి పేరు?" బాస్ ఎదురుగా మరో కుర్చీలో కూర్చున్న సూట్‌వాలా అడుగుతాడు.

"రాజేశ్వరమ్మ సార్..." చెబ్తాడు మూర్తి.

"మీ అమ్మ నాన్నగారి పేరు?"

"కూచిమంచి రుద్రయ్యగారు"

పెద్దమనిషితో పాటు బాస్ కూడా తుళ్ళిపడతాడు.

"లెటర్ని తర్వాత డిక్టేట్ చేస్తాను గాని ముందు మా ఇద్దరికీ రెండు కాఫీ పంపించండి' బాస్ ముఖానికి పట్టిన చెమటని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ అంటాడు.

మూర్తి బయటకు వచ్చేస్తాడు.

జగన్నాధంతో మాట్లాడుతున్న పెద్దమనిషి, ఆయన అన్నగారు సోమనాధం. ఆయన ఆలోచనలూ గతంలోకి వెళ్ళాయ్! ఆ రోజు చిలిపిగా రాజేశ్వరిని ముద్దు పెట్టుకుని తప్పు చేశాడు. ఆ తర్వాత ఆమెని తమ్ముడు జగన్నాధం పెళ్ళిచేసుకోబోతున్నాడని తెలిసీ, అతనికి తన చిలిపి చేష్టని చెప్పడం అంతకన్నా పెద్దతప్పు!! అనిపించి బాధతో ఆనాటి విషయాల్ని తమ్ముడికి చెబుతాడు.

ఆరోజు మీ మాటల్ని పట్టించుకోకుండా రాజేశ్వరిని పెళ్ళిచేసుకుని ఉంటే బాగుండేదని జగన్నాధం బాధపడతాడు.

"మూర్తి దగ్గర అడ్రస్ తీసుకో పాపపరిహారంగా ఆమెకు వెంటనే రెండువేలని పంపిద్దాం" అంటాడు సోమనాధం తమ్ముడు జగన్నాధంతో.

వాళ్ళు పంపిన రెండువేలు పదిరోజులలోపే పదిలంగా తిరిగి వస్తాయి. దాంతో పాటు రాజేశ్వరిని నుంచి ఓ కార్డు వస్తుంది. "మీ అన్నగారి సలహాపై మీరు చూపిన దయకు ధన్యవాదాలు. దానాలు పుచ్చుకునే వంశం కాదు మాది" అని దానిమీద రాసి ఉంటుంది.

ఫ్లాట్‌బాక్ టెక్నిక్‌ని రచయిత్రి చక్కగా ఉపయోగించుకున్నారు. స్త్రీ ఆత్మాభిమాన ప్రదర్శనను ఈ కథానిక 'దానం' లో చక్కగా చూపించారు వి.ఎస్.రమాదేవిగారు.

# వుప్పల లక్ష్మణరావు 'అభ్యుదయం'

**న**వలా రచయిత్రుల మీద వ్యంగ్య వ్యాఖ్యానాలతో ప్రారంభమవుతుంది వుప్పల లక్ష్మణరావుగారి కథానిక 'అభ్యుదయం'. ఓ రచయిత్రి కథ ఇది.

ఆమె మెడిసిన్ పూర్తిచేసి విశాఖలో హౌస్ సర్జన్‌గా ఉంటున్న రోజుల్లో రాఘవులనే ఫిజిక్స్ లెక్చరర్‌తో పరిచయం అవుతుంది. అతను కవికూడా! ఇద్దరికీ స్నేహం కుదిరింది. సినిమాలు, బీచ్ షికార్లు చేశారు. ఫలితం ఆమె గర్భం ధరించడంకూడా (పెళ్ళి కాకుండానే) జరిగిపోయింది. ముందే ఆమెలో అభ్యుదయ బీజాలుండడంచే సీతలా అగ్ని ప్రవేశం చేయలేదు... వనవాసం చేయలేదు. చివరికి నూతిలోకూడా పడలేదు. కడుపు తీయించుకొమ్మని, అభ్యుదయ భావాలులేని అభాగ్యురాలని తిట్టిపోసినా పట్టించుకోలేదు.

ఆమె తండ్రి కడుపు తీయించుకుంటే తన సర్వస్వం యాభైవేలు ఆమెకిస్తానంటాడు. లేదూ ఆ దౌర్భాగ్యుడితో పుస్తె కట్టించేట్టు చేసుకుంటే ఆ మొత్తాన్ని ఆ దౌర్భాగ్యుడికిస్తానంటాడు.

రాఘవులు తండ్రి తక్కువ తిన్నాడా? "నా కడుపులో వున్న బిడ్డకు రాఘవులు తండ్రి కాదు, రాఘవుల్ని పెళ్ళిచేసుకోను' అని రాసిస్తే ఆమెకు నలభైవేలిస్తానంటాడు. ఆ రోజుల్లో అవి పెద్ద మొత్తాలు.

రాఘవులుకూడా అభ్యుదయ భావాలున్న మనిషే. అందుకని ఆమెతో తండ్రికోరినట్లు రాయించి నలభైవేలు తీసుకున్నాడు, ఆమె తండ్రి దగ్గరకు వెళ్ళి మీ అమ్మాయిని చేసుకుంటానని ప్రమాణం చేసి యాభైవేలు తీసుకున్నాడు.

ఆ డబ్బులందగానే ఇద్దరూ రాత్రికి రాత్రే సింహాచలం వెళ్ళి పెళ్ళిచేసుకుని వచ్చేస్తారు. దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టిన రాఘవులు అంతటితో తృప్తిపడి ఊరుకోలేదు. ప్రొఫెసరయ్యాడు. పార్టీలిచ్చి అయిదారు విశ్వవిద్యాలయాలలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌షిప్పులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబరుషిప్పులూ సాధించాడు. ఇక ఆమె ప్రాక్టీసూ బాగా మెరుగైంది. పావలాకాసంత కుంకుమ బొట్టుపెట్టుకొని,

పేరంటాలకి వెళ్ళి పాదాలకు పసుపురాయించుకుని, గోరింటాకు పెట్టుకుని తన గైనకాలజీ ప్రాక్టీస్‌ని పెంచుకుంటోందని తోటి డాక్టర్లు ఏడ్చినా పట్టించుకోలేదు.

కొడుకు కెమిస్ట్రీ పిహెచ్.డిలోకి వచ్చాడు. కవిత్వంకూడా రాస్తున్నాడు. అభ్యుదయ గేయకవి. వాడికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేసారు. కోడలు ఐ.పి.ఎస్. ఆఫీసర్ కూతురు. ఎమ్.కామ్. చదువుతూంది. పెళ్ళికాకముందు వాళ్ళిద్దరికీ పరిచయంలేకపోయినా, పెళ్ళయిన తర్వాత ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారు. కూతురు అలివేలు బియ్యే చదువుతోంది. అందరివీ అభ్యుదయ భావాలే! వాళ్ళ ఆరాధ్యదైవం అభ్యుదయం అంటూ కథానిక ముగిస్తారు రచయిత. ఇది ఒక చమత్కార కథ.

# విశ్వనాథ సత్యనారాయణ 'మాక్లీ దుర్గంలో కుక్క'

**క**థకి, కతానికకి చాలా తేడా ఉంది. కథ కేవలం వస్తువు. ఆ వస్తువును మలిచే తీరుని బట్టి ప్రక్రియ ఉంటుంది. అందుకే ప్రతీ సాహిత్య ప్రక్రియకి కొన్ని లక్షణాలుంటాయి. మధురాంతకం రాజారాం అన్నట్లు 'కథానికకు లక్షణాలివి– అని గురజాడ చెప్పకపోయినా లక్షణాలు తెలిసేటట్లు దిద్దుబాటును రాశారు–అన్నారు. ఆయన చేతుల్లో భాషాపరంగా, శిల్పపరంగా కూడా పరిపూర్ణతని పొంది–ఆధునిక కథ సిద్ధమైంది. ఆధునిక కథకు డి.ఎ.నరసింహంగారు 'కథక' అన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి 'కథానకము' అన్నారు. శ్రీపాదలాంటివారు 'చిన్నకథ' అన్నారు. ఇంకొందరు 'హ్రస్వకథ' అన్నారు. ఒకే ప్రక్రియను ఇన్ని పేర్లతో ఎందుకు? 'కథానిక' అందామన్నారు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు 1938లో. అప్పట్లో భారతిలో ఈ ఆధునిక కథ లక్షణాలివి అని చర్చించుకుంటూ–దాని పేరు గురించి చర్చలు జరిగి ఒక ఒక నిశ్చయానికొచ్చారు. ఈ శీర్షికలో ఇవాళ మనం మాట్లాడుకోబోయే 'మాక్లీ దుర్గంలో కుక్క' అనే కథానిక గురించి. ఈ కథానికని రాసింది కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. ప్రాచీన సాహిత్యం పట్లే ఆయనకు మక్కువని కొంతమంది అభిప్రాయం. కానీ ఉరి, మాక్లీ దుర్గంలో కుక్కలాంటి గొప్ప ఆధునిక కథలని ఆయన రాశారు.

వస్తుపరంగానే కాదు, శిల్పపరంగా కూడా ఇది చాలా గొప్ప కథానిక. మరో లక్షణం అయినటువంటి –మాట్లాడుకునే భాషలో రచనలు చేయటం అద్భుతం.

కథానిక ప్రధాన లక్షణం క్లుప్తత, స్పష్టత–అలాగే ఆలోచింపజేసే ముగింపు. ఈ మూడు లక్షణాలూ కూడా 'మాక్లీ దుర్గంలో కుక్క'లో స్పష్టంగా కనిపిస్తాయి. కథానిక ఒకటే విషయం మీద వెళుతుంది. ఈ విషయం జంతువుకన్నా కూడా హీనమైన బతుకు బతుకుతున్న మనిషి గురించి. కథానిక చదవటం ముగించిన తరువాత మనస్సు రకరకాల ఆలోచనలకి లోనుకాక తప్పదు!

గుంతకల్ నుంచి బెంగళూర్ పోయే దారిలో – మాక్లీ దుర్గం– అనే రైల్ స్టేషన్ ఉంది. ఆ రైల్ స్టేషన్ మాష్టారు, ఒక కుక్క, స్టేషన్ బయట అంగడి పెట్టుకున్న వ్యక్తి, ఓ పెద్దమనిషి–ఈ కథానికలో ప్రధాన పాత్రధారులు. పాత్రల ద్వారా,

సంఘటనల ద్వారానే కథను నడిపించారు రచయిత. ఎక్కడా మధ్యలో తను జొరబడలేదు.

మాక్లీ దుర్గం రైల్వేస్టేషన్ చాలా చిన్నది. స్టేషన్‌లో ఉన్న చిన్న అంగడిని కేవలం రైళ్ళు వచ్చిపోయే సమయంలోనే తెరుస్తారు. ఆ అంగడి తెరవగానే అక్కడ ప్రత్యక్షమవుతూ ఉంటుంది ఓ ఊరకుక్క! ఎవరైనా కొనేవాళ్ళుగాని, అంగడి అతను గాని–ఏదైనా చిన్న ముక్కనైనా తనకు వేయకపోతారా అని దాని ఆశ. ఓరోజు–పదిరోజుల నిల్వ ఉన్న పకోడి చద్దివాసన వేస్తే దాన్ని పారేశాడు షాపతను. దాన్ని తన నోటితో పట్టుకొని ముందు పళ్ళతో నొక్కి తినటం ప్రారంభించి, దగ్గు రావడంతో ఆగి, ఆ తరువాత కక్కేస్తుంది. కుక్క వెంటనే వెళ్ళి దాని వైద్యం అది చేసుకుంటుంది. ఎలాగంటే –సెలయేటిలో నీళ్ళుతాగుతుంది. ముందు కాళ్ళు చాచి గడ్డిమీద పడుకొని లేత గరికపోచల్ని కొరుకుతుంది. ఇలా తిన్నదాన్ని అరిగించుకోవడానికి ప్రయత్నిస్తుంది. అంటే మనిషికి జంతువు అంటే ఎంత చిన్న చూపో ఈ సంఘటన చెబుతుంది. అంతేకాదు, వాళ్ళు ఏమిచేసినా అది అక్కడే తిరుగాడుతుంది విశ్వాసంతో అన్నదీ–మనకర్థం అవుతుంది.

ఒకరోజు ఒక పెద్దమనిషి ఒక ఆడ సీమకుక్కని తనతోపాటు తెస్తాడు. ఊరకుక్క దాన్ని చూస్తుంది. ఊరకుక్క, సీమకుక్కల మధ్య ప్రేమాయణం ప్రారంభమై, రెండూ కలవటం కూడా జరిగిపోతుంది. వెంటనే అక్కడికి చేరిన పెద్దమనిషి ఊరకుక్కని కాలువిరిగేట్టు కొడతాడు. అది కుయ్యోమంటూ వెళ్ళిపోతుంది. యజమాని సీమకుక్కని మందలిస్తాడు. ఆ సందర్భంలో అతనికి, స్టేషన్ మాస్టర్‌కి మధ్య జరిగిన సంభాషణల్లో వర్ణవ్యవస్థ ఉండాలి అనే విషయాన్ని స్టేషన్ మాస్టర్ నొక్కిచెప్తాడు. ఆ రోజులు పోయాయని పెద్దమనిషి అంటాడు. వర్ణవ్యవస్థ తొలగించకూడదని పెద్దాయన, ఉండాలని స్టేషన్‌మాస్టర్ వాదించుకుంటారు. కాని రెండు కుక్కలు వర్ణభేదాన్ని మర్చిపోయి కలుసుకున్నాయి. అంతవరకూ వర్ణభేదం అక్కర్లేదన్న పెద్దమనిషి–ఊరకుక్క, సీమకుక్క కలుసుకోవడంతో కలవరపడతాడు. తన కుక్కకి స్నానంచేయించి, చక్కగా తుడిచి రైల్‌లో పట్టుకెళ్ళిపోతాడు. తన కుక్కని ఊరకుక్క ముద్దుపెట్టుకుంటే కంపించిపోయిన ఒళ్ళు, తన కుక్కని తిరిగి ఒళ్ళోకి లాక్కుని దాని నోట్లో నోరుపెట్టి ముద్దుపెట్టేట్టు చేస్తుంది. ఈ ఊరకుక్క ఒకరోజు రాత్రి ఆ గ్రామం మీద దాడిచేసిన 'వేగోళం'తో హోరాహోరీపోరాడి దాన్ని చంపేస్తుంది. అంతవరకూ అక్కడ మర్యాదలేని కుక్కకు ఉన్నట్లుండి మర్యాద పెరుగుతుంది. స్టేషన్ మాస్టార్ దగ్గరకు తీసి దానికి కొద్దిగా అన్నంవేసి, దానికి రోజూ అన్నంవేయమని తన వాళ్ళకు ఫర్మానా ఇస్తాడు.

పిసినిగొట్టు అంగడివాడు ఎంతో ప్రేమగా నటిస్తూ బాగా నిలవున్న, ఎవ్వరూ కొనని మిఠాయిని కుక్కముందు పడేస్తుంటాడు. ఇదంతా కుక్కపట్ల వాళ్ళు చూపిస్తున్న అభిమానం అనుకునేరు?

ఆ రాత్రి తెల్లవాళ్ళు కుక్క ఏడుస్తూనే ఉంది. ఇంట్లో పడుకున్న స్టేషన్‌మాస్టర్, పోర్టర్లు వేగోలాలు వచ్చాయి అనుకున్నారు. కుక్కకేదో వాతం పుట్టింది. కనపడ్డ ఆకల్లా కొరికింది. ఒంగ్రుమట్టిలో దొర్లింది. సెలయేటి నీళ్ళు తాగింది. మెలికలు తిరుగుతూ రెండు రోజులు బాధపడింది. వారం రోజుల కల్లా అది చిక్కి శల్యమైంది. ఇంతకుముందు తిరిగిన ప్రదేశాల్లో తిరగక ఒకచోటే కూలబడి పోతుంది. ఆ కుక్క చావదు, బతకదు. ఒకరోజు అంతకుముందు స్టేషన్ కొచ్చిన పెద్దమనిషి వస్తాడు. ఆ సమయంలో కుక్క ఏడ్చుకుంటూ అతని దగ్గరకొస్తుంది. స్టేషన్ మాస్టార్'మీ కుక్కతో కలిసిన కుక్క' అంటాడు. ఆ పెద్దమనిసి కోపంతో గట్టిగా కుక్కను తన్నుతాడు. ఆ నాటి రాత్రే కుక్క రైలుకిందపడి మరణిస్తుంది.

తరువాత నాలుగు నెలలకి ఆ పెద్దమనిషి తన కుక్క రెండు పిల్లల్ని పెట్టిందని, దాంట్లో ఒకటి చచ్చిపోతే రెండోదాన్ని తెచ్చి మీకు ఇస్తున్నాను–అంటాడు. ఆ కుక్క తండ్రికి, ఈ కుక్క ప్రతిబింబమైంది. ఎన్ని ఆడకుక్కలొచ్చినా వాటివంక చూడదు. తనని ఎవరు ముట్టుకోవాలని చూసినా గుర్రుమంటుంది. ఆ రోజు ఆ పెద్దమనిషి వస్తే చీదరించుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయింది. మిఠాయి దుకాణంవాడు ఏం వేసినా ముట్టుకోదు సరదికదా, వాడి పిక్క కండరాల్ని పట్టి లాగుతుంది. కొన్నాళ్ళకి ఆ జనసమర్థం నుంచి వెళ్ళిపోయి కుక్క అడవుల్లో ఉంటూ, అప్పుడప్పుడూ స్టేషన్ ప్రాంతానికి వచ్చినా, అందర్ని కోపంగా చూస్తూ ఉంటుంది.

విశ్వనాథ సత్యనారాయణ కుక్క ద్వారా మానవత్వానికి సంబంధించిన ఎన్నో విషయాల్ని చెప్పారు. ఈ జనం మధ్య బతకడం కన్నా కొండమీదకు వెళ్ళి వేగోలాలు, నక్కలు లాంటి వాటి మధ్య జీవించడం మంచిదని కుక్క చెప్తుంది. మనిషి ఎంత స్వార్థపరుడో, అతడు ఏదైనా మంచి పనిచేసినట్లు కనిపించినా దాని వెనుక ఎంత నీచత్వం ఉంటుందో చెబుతూ, మనిషి మృగం కన్నా కూడా భయంకరుడనే విషయాన్నీ తెలియజేస్తుంది మాక్లీ దుర్గంలో కుక్క.

# వేలూరి శివరామశాస్త్రి 'డిప్రెషన్‌చెంబు'

వేలూరి శివరామశాస్త్రిగారు ప్రాచీన, ఆధునిక సాహిత్యాల మధ్య ఒక వారధిలాంటివారు. పదహారవ ఏటనే శతావధానం చేసిన ఘనుడు. ఆయన రాసిన కావ్యాలు అగ్నికాహుతైపోతే "ఓ అగ్నిదేవుడా! నీ ఆకలి తీరడానికి నా రచనలే దొరికాయా!" అని విలపించినా అంతటితో ఊరుకోకుండా, నేటి సమాజానికి ఆధునిక సాహిత్యావశ్యకత ఎక్కువగా ఉందని భావించి ఎన్నో గొప్పకథానికల్ని రాశారు. వాటిలో 'డిప్రెషన్ చెంబు, ఒకటే చీర' లాంటి కథానికల్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చదవాలి. చర్చించుకోవాలి.

మరో విషయం ఈయన గురించి చెప్పుకోవాలి సంస్కృతాంధ్ర భాషలతో బాటు వంగ, గుజరాతీ, ఆంగ్ల, ఫ్రెంచి భాషలూ వచ్చు. ఆయా భాషల సాహిత్యాన్ని సరాసరి తెలుగుభాషలోకి అనువదించారు వేలూరి శివరామశాస్త్రి. శరత్ సాహిత్యాన్ని, గాంధీ ఆత్మకథని తెలుగుపాఠకులకు ప్రథమంగా, అందించిన వారాయనే!

ఇక తప్పక చదవాల్సిన 'డిప్రెషన్ చెంబు' గురించి మాట్లాడుకుందాం.

ఇది స్వాతంత్ర్యానికి ముందు రాసిన కథానిక.

రామారావు లిటరేచర్ ఆనర్స్ ఫస్ట్‌గా పాసయ్యాడు. గర్వంగా తలెత్తుకు తిరుగుతూ, ఇంటిమీద 'రామారాయ్ ద్వివేది, బి.ఎ.(ఆనర్స్)' అనే బోర్డ్‌నీ పెట్టుకున్నాడు. కానీ నాణేల టంకశాలలయిన ఈ సమాజంలో అతను చెల్లని నాణెమే అయ్యాడు. అన్ని ఉద్యోగాల ఇంటర్వ్యూలకతను పట్టు విడవని విక్రమార్కుడిలా వెళ్తూనే ఉన్నాడుగాని, ఏ ఉద్యోగమూ అతణ్ణి వరించడం లేదు.

'మగవాడికి ఏమీ అక్కరలేదు. అదది ఉంటే చాల'ని తులసి భావించినట్లు ఉద్యోగమే కాదు ఆమే అతడిని వరించకపోయినా పెద్దలపుణ్యమాని భార్యని చేసుకున్నాడు. భరించువాడు భర్తనే నానుడిని కాదు పొమ్మన్నాడు. నరసాలకే భార్యన్నట్లు తల్లి, చెల్లెళ్ళని – వాళ్ళ ఆకళ్ళని పట్టించుకోకుండా తన 'ఆకలి' తీరడమొక్కటే చాలన్నట్లు ప్రవర్తించసాగాడు.

అతను ఆడింది ఆట, పాడింది పాటకి తల్లీ సహకరించక తప్పడం లేదు. పిల్లలకేమి పెట్టినా,పెట్టకపోయిన కొత్తదంపతులకు అన్ని ఆధరవులతో భోజనం పెట్టేది. మెట్లపైన గది వాళ్ల ఒంటరితనానికిచ్చేసింది. పిల్లల్ని పైకెళ్ళనిచ్చేది కాదు.

ఈ పరిస్థితుల్ని భరించలేని తులసి "ఇంటర్వ్యూకి వెళ్ళాలి. నీ పుస్తెలివ్వు. తాకట్టు పెట్టి ఆ డబ్బుతో వెళ్తా"నన్న భర్తకి ఎదురు తిరుగుతుంది.

ఆమె మీద కోపమంతా ఆతని మేనమామ ద్వివేదుల రామారావు అని రాసిన ఉత్తరం  మీద తీర్చుకుంటాడు. అతనికి బాగుండలేదని రాసినా తను వెళ్ళకుండా తల్లి, చెల్లెళ్లని పంపితే, తను భార్య తులసితో ఒంటరిగా గడపవచ్చని ఆశిస్తాడు. తులసి "పిల్లల్ని వదిలి మీరు ఒక్కరే వెళ్లిరండ"ంటుంది అత్తగారితో

అత్తగారు ఊరెళ్ళడంతో ఇంటి పరిస్థితి పూర్తిగా అర్థమవుతుంది తులసికి. పిల్లలకు సరైన తిండి, గుడ్డలు కూడా లేవనే విషయమర్థమవుతుంది. భర్తమీద కోపం పెరుగుతుంది. విధిలేక అంతకుముందు అరవై రూపాయలిస్తానంటే కాదు పొమ్మన్న అంబుజమ్మ దగ్గరకే ఉద్యోగం కోసం వెళ్తాడు రామారావు ద్వివేది.

"మీరాలశ్యం చేశారు. ఆ పోస్ట్‌కి రెండువందల అప్లికేషన్లున్నాయి. నూటయాభై మంది నలభైరూపాయలకే పనిచేస్తామంటున్నారు" అంటుంది అంబుజమ్మ.

"తర్వాత చెబ్తాను" అని వెనుదిరిగిన రామారావుకి "భవతీ భిక్షాందేహీ" అని వినిపిస్తుంది బయటనుంచి. అది విన్నగొంతు! వీధిగుమ్మంలోకి వస్తారు.

'మిసెస్ రామారావు ద్వివేది బి.ఎ.(ఆనర్స్)' అని రాసి వున్న రాగిచెంబుతో రామారావు భార్య, వెనుక రామారావు చెల్లెళ్ళు, తమ్ముళ్లు కనిపిస్తారు. వాళ్ళందరూ మరోసారి 'భిక్షాందేహి' అనడంతో కథానిక ముగుస్తుంది.

నాటి యువతరం మీద పెద్ద చురక ఈ కథానిక. అంతేకాదు ఆంగ్ల విద్యాబోధన,  అడుక్కుతినడానికే దారి తీస్తుందన్న నిరసన స్పష్టంగా కనిపిస్తుంది స్వాతంత్ర్యానికి ముందు రాసిన ఈ కథానికలో. కథానికకు క్లుప్తత, స్పష్టత కన్న విషయాన్ని చెప్పడంతో బాటు, ఈ కథానిక ఎంతగా ఆలోచింపచేస్తోందో చదవకపోయినా, విన్న మీకు తెలవడం లేదూ!

# వై.సి.పి.రెడ్డి 'దొంగ బఱ్ఱె గొడ్లు'

**రా**మయ్య ఓ సన్నకారు రైతు. పొలంలో కష్టపడి తానే జీవితం గడపడం అంతంతమాత్రం! దొంగ బఱ్ఱెగొడ్లు పొలంలో పడి పైర్లని పాడుచేస్తున్నాయి. వీటివల్ల పేద రైతులకు వచ్చింది కష్టం. భూములమ్ముకుని పట్నం చేరుకుందామంటే–ఉన్న ఊరు వదిలిపెట్టి వెళ్ళడానికి మనసొప్పదు! బాధపడుతుంటాడు.

రామయ్యకు పదెకరాల పొలం, కూతురు, కొడుకున్నారు. భార్య సీతమ్మ. వానలు రాకపోతే పెద్దరెడ్లకి సన్నకారు రైతుల్ని పరోక్షంగా దోచుకోవడానికి వీలవుతుంది. పెద్ద వడ్డీలకు సన్నకారు రైతులకి అప్పులిస్తారు. అలా పోయిన కరువుల్లో రామయ్య రెండు దఫాలుగా మూడెకరాల భూమిని పోగొట్టుకుంటాడు.

ఎదిగిన కూతురు పెళ్ళిచేయాలని భార్య సీతమ్మ ఇంట్లో పోరు పెడుతుంటుంది.

రామయ్య పెద్ద రైతు రంగారెడ్డి దగ్గరకు వెళ్ళి నీళ్ళు నములుతూ డబ్బు విషయం ఎత్తుతాడు–అప్పు కావాలని! ఒక యకరా తాకట్టు పెట్టించుకుని రెండు రూపాయల వడ్డీకి రెండు వేలిస్తాడు.

ఓ యకరం కట్నంగా ఇవ్వక తప్పదనుకుంటాడు. వీరారెడ్డి మిగతా మొత్తం అప్పుగా ఇవ్వడానికి అతికష్టం మీద ఒప్పుకున్నాడు. కాకపోతే అక్కడ నాలుగెకరాలు తాకట్టు పెట్టాలన్నాడు. విధిలేక ఒప్పుకున్నాడు రామయ్య. మరో వెయ్యి కావలసి వచ్చి, మిగిలిన భూమిని గంగిరెడ్డి దగ్గర తాకట్టు పెట్టి తెచ్చుకున్నాడు.

కూతురు పెళ్ళి చేసేశాడు. ఏయేటికాయేడు పంటలు సరిగ్గా వేయలేకపోతున్నాడు. బాకీ తీర్చలేకపోతున్నాడు. భూమి పోతుందేమోననే భయం పెరగసాగింది. వడ్డీ పెరిగిపోసాగింది. ముందు మూడున్నర యకరాల వెలిపొలం అమ్మి, కొన్ని అప్పుల్ని తీర్చాడు. వెయ్యి రూపాయల అప్పు మిగిలింది. వ్యవసాయం దాదాపుగా కుంటుపడింది.

పిల్లవాణ్ణి చదివించడం ఎలా? దిగులుపట్టుకుంది. తను పొలమంతా పోగొట్టుకుని కొడుకుని ఓ అయ్య దగ్గరకి పనికి పంపాల్సిన దుర్గతి పడుతోందని బాధపడసాగాడు.

'రామయ్య ఇంతకు ముందు దొంగ బర్రె గొడ్లని గురించి ఆలోచించేవాడు. ఇప్పుడు అప్పులిచ్చిన వాళ్ళ గురించి ఆలోచిస్తున్నాడు. అవి కావలి ఉండి తోలితే పోతాయి. మరి, అప్పులోళ్లో! అని రామయ్య విసుక్కుంటూ గొణుక్కుంటూన్నాడ'నడంతో కథానికని ముగిస్తాడు. రచయిత

రాయలసీమ నీటి కరువుతో సన్నకారు రైతుల బాధల్నేకాదు, సన్నకారు రైతులు అవకాశవాదులైన పెద్ద రైతులతో ఎలా పీడింపబడుతున్నారోకూడా హృదయవిదారంగా చెప్పారు. ఈ కథానిక చదివితే నేలని నమ్ముకున్నవాళ్ళు ఎలాంటి నేలబారు జీవితాల్ని గుడుపుతున్నారో అక్కడ నుంచి పొట్టచేతబట్టుకుని ఎటో అటు ఎందుకు పారిపోవాలనుకుంటున్నారో అర్థమవుతుంది. డబ్బున్న వాళ్ళు పేదరైతుల్ని ఎలా పీక్కుతింటున్నారో కూడా తెలుస్తుంది.

# శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అరికాళ్ళకింద మంటలు'

**ఆ** రోజుల్లో సమాజం మూఢనమ్మకాలతోను, రుగ్మతలతోనూ పీడింపబడుతుండేది. కందుకూరి వీరేశలింగంగారు లాంటి సంఘసంస్కర్తలు, సమాజ సంస్కరణకోసం నడుం బిగించారు. అటువంటి సమయంలో అక్షరంతో సమాజ సంస్కరణ చేయవచ్చని రచనలతో సంస్కరణలకు చేయూత నందించవచ్చని పుంఖానుపుంఖాలుగా వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

ఆయన రాసిన 75 చిన్నకథలు వివిధ సామాజిక రుగ్మతల మీద సంధించిన బాణాలు పెద్దవాళ్లనవసరంగా పిల్లల జీవితాల్లోకి జొరబడి, వాళ్ళ జీవితాల్నెలా ఛిన్నాభిన్నం చేస్తున్నారో చెప్పారు! వ్యవసాయంలాంటి వృత్తివిద్యల్ని వదిలిపెట్టి ఉద్యోగం పేరుతో తలతాకట్టుపెట్టి బానిసలవడంపట్ల నిరసనని వ్యక్తపరిచారు. గొప్పలకు పోవడాన్ని గేలిచేశారు. రజస్వలానంతర వివాహాలు అప్పటిలో తప్పు, అలాగే కులాంతరమేకాదు, శాఖాంతర వివాహాలూ అప్పట్లో తప్పు. ఇలాంటి వాటన్నింటినీ తమ చిన్న కథలలో ఖండించారు. బాల్య వివాహాలెంత ఇబ్బందికరమో చెప్పారు. విధవా వివాహాల్ని ప్రోత్సహించారు. ఎంతో ముందుచూపుతో–స్త్రీలు సాముగరిడీలులాంటివి నేర్వకపోతే బ్రతకలేరన్నారు. సమకాలీనులు మెచ్చరనే ఆర్యోక్తిని కాదంటూ కందుకూరి సంస్కరణకి తన కలంతో సహకారాన్నందించడమే కాకుండా–ఆయన రఘుపతి వేంకటరత్నంగారలు లాంటి సంస్కర్తలు పాత్రలుగానూ చిన్నకథలు రాశారు. ఉదాహరణకి 'అరికాళ్ళకింద మంటలు' చిన్న కథనే చూద్దాం.

ఆ రోజుల్లో బాల్యవివాహాలు బాగా జరుగుతుండేవి. దాంతో చాలామంది యవ్వనంలోనే భర్తల్ని పోగొట్టుకుని, పుట్టింటికి చేరుతుండేవారు. వాళ్ళతో ఇంటిపనులేగాక గంధం తీయడం, తమ వంటికి రాయడం లాంటి నీచపు పనులూ చేయించుకునేవారు. పుట్టింటి పెద్దలు, తల్లిదండ్రులు కూడా తలచెడి ఇంటికి చేరిన కూతుర్ని చాలా తక్కువగా చూసేవారు.

అలా పుట్టింట్లో అందరికీ ఊడిగం చేస్తూ, వాళ్ళ నిర్లక్ష్యానికి లోనవుతున్న యువతి రుక్కమ్మ. గొడ్ల సావిడిలోని గొడ్ల బతుకుకన్నా నీచమైన బ్రతుకు తనదనుకుంటుంటుందామె.

ఇంత చాకిరీ చేస్తున్నా తండ్రి, తోడబుట్టిన వాళ్ళు ఆమె విధవ కాబట్టి జుట్టుని తీయించాలనుకుంటారు.

అటువంటి సమయంలో విధిలేక ఓ అర్ధరాత్రి ఇంట్లోంచి బయటికొస్తుంది రుక్కమ్మ.

పంతులుగారి తోటకు తీసుకువెళ్ళమని వీధిలో ఎదురైన ఓ జట్కాబండతనిని అడుగుతుంది. అతను బండెక్కమంటాడు.

ఆమె "నా దగ్గర డబ్బులు లేవు" అంటుంది. "పంతులుగారి తోటకు నేను పైసలు తీసుకో"నంటాడు జట్కా అతను.

ఆమె జట్కా ఎక్కుతుంది.

గుర్రం పరుగు ప్రారంభిస్తుంది.

అప్పుడు జట్కా అతను చెప్పే కథతో అతనికి పంతులుగారంటే అంత అభిమానం ఎందుకో మనకర్థమవుతుంది.

జట్కా అతని కుమార్తె తలచెడి పుట్టింటికి చేరితే, పంతులుగారి దయతో ఆమెకు మళ్ళీ పెళ్ళి చేయడంతో ఆమె జీవితం చిగురిస్తుంది. తన కూతురులాంటి రుక్కమ్మ జీవితం అలా తిరిగి చిగురించాలనే అతను కోరుకోవడంతో కథ ముగుస్తుంది.

అప్పటి పరిస్థితుల్ని మన కళ్ళముందుంచుతూ, పరిష్కారాన్ని చూపే ఈ చిన్నికథ గొప్ప కథ కాకుండా ఎలా ఉంటుంది?

'అరికాళ్ళకింద మంటలు' శీర్షికకూడా ఎంతో గొప్పగా ఉంది. భర్త చనిపోయి పుట్టింటికి చేరే యువతులకు పుట్టింటివారే అరికాళ్ళకింద మంటలు పెడుతుంటారు. ఆ పరిస్థితులకి తట్టుకోలేక స్త్రీలు పుట్టింటినీ విడిచిపెట్టాల్సిన పరిస్థితులు వస్తుంటాయి. అటువంటివాళ్ళకు వీరేశలింగంగారు లాంటి వాళ్ళ అండ కావల్సిందే! ఎంతో చక్కగా చెప్పారు.

శ్రీపాద చిన్న కథలు సంభాషణలతో పరుగెడుతుంటాయి. కొన్ని కథలు కేవలం సంభాషణలతో నడుస్తాయి. ఈ కథానికా అలాంటిదే. ఇదీ ఆయన ప్రత్యేకత!

# శ్రీశ్రీ 'ఆనంద మందిరము'

**1926** డిసెంబర్ 'లలిత' పత్రికలో శ్రీశ్రీగారి ఈ కథానిక ప్రచురితమైంది. 'గురజాడది నా అడుగుజాడ' అన్న శ్రీశ్రీ ఆయన రాసినట్లుగా కొన్ని చిన్నకథల్నీ రాశారు. వస్తువు ఆనాటి సమాజానికి కావలసినదైనా, భాష గ్రాంథికం. గురజాడ ధోరణిలో ఆ తర్వాత కొందరు చిన్న కథల్ని రాసినా భాష పూర్తిగా మారలేదు.. అందుకేనేమో పాలగుమ్మి పద్మరాజుగారు 'ఆధునిక కథ... కథానిక గురజాడవారి చేతుల్లో యవ్వనంతో పుట్టింది. ఆ తర్వాత పదిహేను ఇరవయ్యేళ్లపాటు బాల్యానికి లోనై తప్పటడుగులు వేసింది' అన్నారు.

'ఆనందమందిరము' కథానిక సులభ గ్రాంధికభాషతో సాగిన రచన.

మన్మథరావు బాగా ధనాన్ని సంపాదించాడు. అతనికి కుమారుడు పుట్టాడు. ఆ ఆనందంతో విందులు చేశాడు. పరిమితిలేకుండా దానాలూ చేశాడు. పూనా నగరంలో అతని ఇల్లు ఒక ఆనందమందిరములా ఉండేది.

ఆ వూళ్ళో 'ఆనందమందిరము' అనే మరో పెద్ద మందిరం ఉండేది. రాత్రింబగళ్ళు ఆ మందిరంలో తాగుడు కొనసాగుతుందేది. అక్కడలాంటి భవనముందని తెలీని కొందరు యువకులతో బాటు మన్మథరావూ ఆరోజు అక్కడికి వచ్చాడు.

"దేవాలయానికి వచ్చి దేవునారాధింపక పోవడం తప్ప"న్న మిత్రుల మాటలకి లొగిపోతాడు మన్మథరావు. త్రాగుతాడు! తాగి అవకతవక మాటలాడుతున్న అతణ్ణి మిత్రులింటికి చేరుస్తారు.

అప్పటినుంచి మిత్రుల ప్రోత్సాహంతో ఇంటిదగ్గరకన్నా ఈ నిలయములోనే మన్మధరావు ఎక్కువ సమయం గడపడం ప్రారంభించాడు. ధనం ఎక్కువగా మద్యానికే ఖర్చువడం మొదలు పెట్టింది... క్రమంగా ధనంతోబాటు అతని ఆరోగ్యం క్షీణించసాగింది. వైద్యులు తాగడం మానాలన్నారు. కానీ అతనా పనిని చేయలేకపోయాడు. శరీరం రోగగ్రస్తమైంది. మంచం పట్టాడు. అయినా మద్యం

కోసం కలవరించసాగాడు. ఉద్యోగం పోయింది.

భార్య మాలతి "మీరు రోజూ ఎన్నో సీసాలు ఖాళీ చేస్తున్నారు. నాకు రోజుకొక ఆల్చిప్పడు తాగే అవకాశమివ్వమని కోరుతుంది. డబ్బంతటినీ భార్య కప్పగించి, నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోమన్నాడతను. క్రమంగా ధనమంతా తరిగి పోయింది. నౌకర్లు ఆ ఇంటిని వదిలి వెళ్ళిపోయారు.

ఎప్పుడూ మద్యం మత్తులో కొట్టుకునే మన్మథరావుకి మిత్రుడు జస్వంతుడు మరణించిందీ తెలీలేదు. జస్వంతరావు కుటుంబం కోసం ధనాన్ని స్వీకరిస్తూ కొందరు తన దగ్గరకు వచ్చిన తర్వాతగాని మన్మథరావుకి జస్వంతరావు మరణించాడన్న వార్త తెలిసిరాలేదు. వాళ్ళడిగిన రెండువందల రూపాయలు కూడా ఇవ్వలేని దుస్థితి అతడిది. ఈ దుస్థితికి తన మందు అలవాటేనని గుర్తించని అతను తను వ్యర్థుడిననుకుంటాడు.

కనువిప్పయిన మన్మథరావుతో భార్య "మనము దరిద్రులము కాము. మన ఆస్తి మనతోనే ఉంది. మీ అలవాటుని మాన్పడానికి నేనీ నాటకము ఆడాను... నేను మీకన్నా ఎక్కువ తాగుతున్నట్లు నాటకమాడుతూ డబ్బునంతటిని పక్కకి మళ్ళించాను. అదంతా మనతోనే ఉంది" అంటుంది.

మన్మథరావు మద్యపానాన్ని మానివేశాడు. ఈ వార్త నగరమంతా వ్యాపించింది. మన్మథరావు మిత్రుడు జస్వంతరావు జ్ఞాపకార్థం ఆసుపత్రిని కట్టించడానికి శంఖుస్థాపన చేయడంతో కథానిక ముగుస్తుంది. చివరలో కూడా మన్మథరావు మొదలులా ధనవంతుడిలా ఆనందంగా ఉంటాడు.

మంచివాడు దురలవాట్ల పాలవడం, భార్యవల్ల సంస్కరింపబడి మళ్ళా మంచివాడు కావడం – చక్కటి శిల్పంతో చెప్పారు శ్రీశ్రీ. మొదలు చివరలు ప్రత్యేకంగా ఒకటిగా కలిసి కనిపిస్తాయి. ఏ బిందువు దగ్గర శ్రీశ్రీ కథని ప్రారంభించారో ఆ బిందువు దగ్గరకే కథానికని తీసుకొచ్చి ముగించారు.

# శ్రీరాగి 'కేసు'

**ఏ** తప్పూలేకపోయినా అవతలి వ్యక్తి దురాశవల్ల ఇళ్ళస్థలాన్ని పోగొట్టుకోవడమే కాకుండా కాలాన్ని, డబ్బుని ఖర్చుపెట్టుకుంటూ కోర్టు చుట్టూ నిర్విరామంగా ఎలా తిరగాల్సొస్తుందో చెప్పిన ఓ సుబ్బారావు కథానిక 'కేసు'. శ్రీరాగి సంధించిన వ్యంగ్యాస్త్రం.

వచ్చే నెల పదికి మీ కేసు వాయిదా పడిందంటూ నెల్లూరు నుంచి మేనల్లుడు శంకరం, మామ సుబ్బారావుకి రాసిన ఉత్తరంతో కథానిక ప్రారంభమవుతుంది.

ఆ స్థలాన్ని వదిలేసుకుంటానన్న సుబ్బారావుని శ్రీమతి సన్నగా చివాట్లు వేస్తుంది–ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని పోగొట్టుకుంటానన్న ప్రబుద్ధుణ్ణి మిమ్మల్నొక్కర్నే చూస్తున్నానంటూ...

'తొమ్మిది గంటల ప్రయాణాన్ని తరచూ చేయలేకపోతున్నా'నన్న భర్త మాటల్ని "అందుకని లక్షరూపాయల్ని పోగొట్టుకుంటామా?" అంటూ నిలదీస్తుంది ఆ భార్యామణి.

సుబ్బారావు నెల్లూరులో ఉద్యోగం వెలగబెడుతున్న రోజుల్లో ప్రభుత్వం ఎన్.జి.ఒ. అని దయతలచి ఓ చిన్న స్థలాన్ని ఉచితంగా ఇస్తుంది. ఆ పట్టా అందుకున్న అచిరకాలంలోనే అతనికి ఆ ఊరు నుంచి వేరే ఊరు ఉద్యోగరీత్యా బదిలీ అవుతుంది. దూరంకావడంతో ఆ స్థలాన్ని అతితరచుగా వెళ్ళి చూసుకురావడం వీలుపడదు సుబ్బారావుకి.

అదే అదనుగా తీసుకుని ఓ స్థానికుడు ఆ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకోవడమే కాకుండా  ఇల్లు కట్టేస్తాడు కూడా! తనకాపట్టాని ఇచ్చారంటూ తప్పుడు పత్రాన్నీ సృష్టించాడు.

సుబ్బారావు నెల్లూరులో పనిచేసేటప్పుడు మేనల్లుడు శంకరానికి సాయం చేసాడు. అతని మేనమామ ఇంటిస్థలం పరహస్తగతం కాకుండా కాపాడలేకపోయినా, లాయరై ఊళ్ళోనే ప్రాక్టీస్ చేస్తున్న తన తమ్ముడు రాజారావు సాయం మేనమామకు ఉచితంగా అందేలా చూసాడు.

పదవ తారీఖుకి నెల్లూరు వెళ్తాడు సుబ్బారావు.

ఏమి మాట్లాడాలో ఎలా మాట్లాడాలో సుబ్బారావు సిద్ధమై కోర్టుకు వెళ్తాడు.

కోర్టు గుమాస్తా వరుసాగా కేసుల్ని పిలుస్తుంటాడు.

ఎప్పటికో సుబ్బారావుకి పిలుపు వచ్చింది.

ప్రతివాది తరఫు సీనియర్ లాయర్‌కి వేరే కోర్ట్‌లో పని ఉండి జూనియర్ లాయర్ని పంపాడు.

"యువరానర్! క్రాస్ ఎగ్జామినేషన్ మా సీనియర్ లాయర్ చేస్తారు. దయచేసి వాయిదా ఇవ్వండి" అని పర్మిషన్ అడిగాడు జూనియర్.

కేసు వాయిదా పడింది.

మళ్ళీ ఆరోజుకి నెల్లూరు వెళ్ళాడు సుబ్బారావు.

తను కాగితాలు ఇంకా చూడలేదంటూ వాయిదా అడిగాడు ప్రతివాది సీనియర్ లాయర్.

మందలించి వాయిదా వేస్తారు న్యాయాధిపతి.

ఇంటికి వచ్చి ఆరోజుకి మళ్ళీ వెళ్తాడు సుబ్బారావు.

అక్కడ కోర్టు దగ్గరపోలీస్ కాన్‌స్టేబుల్ పరిచయమవుతాడు. సరిగ్గా అతని కేసు, సుబ్బారావు కేసుకి విరుద్ధం.

ఓ ఉద్యోగి తనకిచ్చిన ఇళ్ళస్థలాన్ని పోలీస్‌కమ్మాడు. లేదా పోలీస్ ఇల్లు కట్టుకున్న తర్వాత తన స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్నాడంటూ కోర్టుకు వెళ్ళాడు. అంతకుముందు పోలీస్ ఎన్నిసార్లు రిజిస్టర్ చేయమని అడిగినా నేనిక్కడే ఉంటాగదా! నీకేమీ ఇబ్బంది కలగదని హామీ ఇచ్చాడటకూడా! ఇళ్ళస్థలం విలువ బాగా పెరిగిపోయేసరికి తనిచ్చిన మాటని నీటిమూటని చేసాడు. పోలీస్ దగ్గర నుంచి తన స్థలాన్ని తనకిప్పించమని కోర్టుకెక్కాడు ఆ పుణ్యమూర్తి.

యాక్సిడెంటై నానా ఇబ్బందులు పడుతున్న ఆ పోలీస్‌కి కోర్టుచుట్టూ తిరిగే బాధ తప్పలేదు.

ప్రతివాది సీనియర్ లాయర్ కోర్టుకి ఆలస్యంగా రావడంతో కేసు మర్నాటికి వాయిదా పడింది.

మర్నాడు ప్రతివాది లాయర్ హాజరుకాలేదు.

మళ్ళీ తీర్పు వాయిదా పడింది.

ఆ వాయిదారోజు వచ్చిన సుబ్బారావుని స్థలగుర్తింపుకోసం సర్వేయరు ఫీజు కోర్టుకు కట్టమన్నారు... తాలూకాఫీసు నుంచి రికార్డులు తెప్పించాలన్నారు.

ఇరుపక్షాల సాక్ష్యులూ తాము నిజమే చెబుతున్నామంటూ ప్రమాణాలు చేసి చెప్పారు.

ఎవరిది నిజం? ఎవరిది అబద్ధం?

–న్యాయమూర్తి తేల్చాలి.

సుబ్బారావు, ఆ పోలీసతనూ కూడా న్యాయంకోసం ఇంకా కోర్టుచుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

న్యాయమూర్తులు మారుతూనే ఉన్నారు.

కొత్తగా వచ్చిన న్యాయమూర్తులు ఇరుప్రక్కల న్యాయవాదులు. 'మీ కేసుని తేల్చేస్తాం' అంటూనే ఉన్నారు పార్టీలకు డబ్బు నీళ్ళలా ఖర్చవుతూనే ఉంది అంటూ–

'గెలిచినవాడు ఇంటిదగ్గర ఏడిస్తే ఓడిపోయినవాడు కోర్టులోనే ఏడ్చాట్ట' అనే సామెత ఊరికేపోతుందా అంటూ ముగిస్తారు కథానికని రచయిత శ్రీరాగి.

ముగింపు మన మస్తిష్కంలో ఎన్నో ఆలోచనల్ని రేపుతుంది... ఆలోచనల్ని రేపేదే మంచి కథానిక కాబట్టి ఆలోచనలు రేపే కథానికని రాసిన రచయిత కృతకృత్యుడైనట్లే!

# శ్రీసుభాగారి ‘ఒక కోరిక- ఒకే తీర్పు’

**అ**రవిందాశ్రమంలో రోజూలాగే రమణి– శ్రీఅరవిందుల, మాతా– సమాధుల ముందు తలవాల్చి మైమరిచింది. అదృశ్యహస్తం కోసం ఆత్మ ఎదురుచూసే అమృతఘడియలవి. పూర్తి చేసుకుని, సమయాదానం చేస్తున్న రమణి బుక్స్ సేల్ కౌంటర్ దగ్గరకు వెళ్ళింది.

అంతవరకూ తన పని చేసుకుంటున్న రాజగోపాలం లేచి “నేను వెళ్తున్నాను రమణీ! సాయంత్రం బీచ్‌కి వస్తావు కదూ!”అని వెళ్ళిపోయారు. అందర్నీ పోగొట్టుకుని ఆత్మానందం కోసం అక్కడకి చేరిన రమణికి, ఎంతో మంచి సాధకుడు రాజగోపాలం అలా అభ్యర్థించడం బాధ వేస్తుంది.

ఆరోజు బీచ్‌లో “పదేళ్ళనుంచి నిష్టగా వున్న నన్ను ఇప్పుడు నా శరీరం శాసిస్తోంది. నాలోకి కోరిక చీమలా, ప్రవేశించి మృగంగా మారింది” అంటాడు.

“ఇది మీ ఆత్మబలానికి భగవంతుడు పెట్టిన పరీక్షని ఎందుకనుకోకూడదు?” అంటుంది రమణి.

“నిన్ను నా కోసం జీవించమంటున్నాను. పాతిక సంవత్సరాలు లేని నువ్వు నిరాశ, నిస్పృహతో ఈ దారి తొక్కేవేమో ఆలోచించు” అంటాడు రాజగోపాలం.

ఇద్దరి మధ్యా కొంత సంభాషణ సాగుతుంది. రమణి ఆలోచనలు రాజగోపాలంకి రుచించవు.

“నాకు నా మాటలకి జవాబుకన్నా నువ్వు కావాలి రమణీ” అంటాడు రాజగోపాలం పట్టుదలగా.

“ఏదైనా సమస్య వస్తే కంగారు పడకూడదు. మెడిటేషన్‌లోకి వెళ్ళాలి” అంటుంది జవాబుగా రమణి.

అక్కడనుంచి సలహా కోసం రమణి సీతారామ్‌గారి దగ్గరకు వెళ్ళింది. తన సమస్య చెప్పింది. రమణికి మదర్ రాసిన ‘ది ఉమన్’ అనే పుస్తకాన్ని ఆయన చదమవన్నారు.

అలాగే రాజగోపాలం తన దగ్గరకు వచ్చినప్పుడు సీతారామ్‌గారు "మన ఆశ్రమంలో సాధకులు... ముఖ్యంగా ఆడపిల్లలు, అందునా వయసులో ఉన్నవాళ్ళు పాటించవలసిన నిగ్రహం గురించి త్వరగా ఓ వ్యాసం రాసివ్వ"మంటారు.

దాంతో రాజగోపాలం ఆలోచనలలో మార్పు వస్తుంది.

ఇంతలో అతనంతకుముందు అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పాలని రమణి అతపి దగకగనరే వస్తుంది.

"సారీ రమణీ! కొంతకాలం పాటు నా కోరికను, నా ప్రశ్నను నేను వాయిదా వేసుకుంటున్నాను. ఎందుకంటే, నా ప్రశ్న అదో చిక్కు ప్రశ్నగా మారి ఇప్పుడదే నాకు యక్షప్రశ్నయి కూర్చుంది. అందుకే నువ్వు కూడా నీ జవాబుని నీ దగ్గరే ఉంచుకో. నీ హృదయానికే దాన్ని పరిమితం చేయ్... మనం, మళ్ళీ కలవడమంటూ జరిగితే అప్పుడాలోచిద్దాం. ఎందుకంటే, నీ జవాబు, అది ఎటువంటిదయినా విని తట్టుకునే స్థయిర్యం కూడగట్టుకున్న తర్వాత తిరిగి నిన్ను ప్రశ్నిస్తాను. సరేనా?" అంటూ, రాజగోపాలం అనడంతో కథానిక ముగుస్తుంది.

'శారీరక వాంఛను పూర్తిగా మర్చిపోలేనప్పుడు అంతఃకరణ స్వచ్ఛంగా ప్రకాశించలేదు.. దాని మూలంగా ఆధ్యాత్మిక మార్గం కూడా నిర్మలత్వాన్ని పోగొట్టుకుంటుంది. దానిలో మనిషి ఉన్నతికి వెళ్ళే మార్గానికి కూడా అవరోధం ఏర్పడుతుంది' అనే సత్యాన్ని ఈ కథానిక ద్వారా శ్రీసుభా చెప్పారు.

మన కథానికా సాహిత్యంలో అన్ని విషయాల్ని విడమరచి చెప్పే కథానికలున్నాయి. ఆధ్యాత్మిక ధోరణిలో ఆలోచింపజేసే కథానికలకూ తక్కువ లేదని శ్రీసుభాగారి 'ఒక కోరిక – ఒకే తీర్పు' చెబుతుంది.

# శారద 'స్వాతంత్ర్య స్వరూపం'

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజల స్థితిగతులు మారలేదు. ఇంకా దిగజారాయి అని చెప్పే శారద (ఎస్.నటరాజన్) కథానిక 'స్వాతంత్ర్య స్వరూపం'.

ప్రజలు స్వాతంత్ర్యం వచ్చిన దానికి గుర్తుగా ఒక శిల్పాన్ని ప్రతిష్టించాలని ఒక శిల్పిని పిలిపిస్తారు. చెక్కడం ప్రారంభిస్తాడతను. "స్వాతంత్ర్య విగ్రహం ప్రజలకు నూతనంగా వచ్చిన స్వతంత్ర ప్రభుత్వం యెడ నమ్రత, విధేయత నేర్పే చిహ్నంగానూ, అల్లరి...ఆగం చేయకూడదని బోధించే గురువు లాగానూ, తపస్వి లాగానూ లేక సన్యాసి లాగానూ ఉండాలి" అని శిల్పికి ఆజ్ఞాపించారు.

శిల్పి "చిత్తం" అని విగ్రహాన్ని చెక్కడం ప్రారంభించాడు.

దేశంలో డబ్బున్నవాళ్ళు "స్వతంత్ర విగ్రహం ప్రభుత్వం పట్ల భక్తిని, నమ్రతని నేర్పేట్టు ఉండవలసిందే కాని, అది సన్యాసిలాయెకాక ప్రజలకి ప్రభుత్వం యెడల భయము, భక్తిని, శ్రద్ధా గౌరవాల్ని నేర్పే విగ్రహంగా ఉండాలి" అన్నారు. ఐతే శిల్పి యెడతెరిపి లేకుండా శ్రమించి స్వతంత్ర విగ్రహాన్ని తయారు చేశాడు.

ఓ మంచి రోజు స్వాతంత్ర్య విగ్రహాన్ని రాజధాని నగరంలో ప్రతిష్టించడానికి తీసుకొచ్చారు. అదివరకే తయారైన శిలావేదిక పైన విగ్రహాన్ని ఉంచారు. ప్రభుత్వ అధ్యక్షుడు స్వాతంత్ర్యాన్ని గురించి ఒక మహోపన్యాసాన్ని చేసిన తర్వాత స్వాతంత్ర్య విగ్రహానికి ఉన్న ముఖుమల్ గుడ్డని తొలగించాడు.

ఆశ్చర్యం!!

స్వాతంత్ర్య విగ్రహం ఆధునిక ఆయుధాలతో సాక్షాత్కరించింది– ఒక భయంకర దెయ్యం రూపంలో! ఇదీ కథానిక.

అతి చిన్నది, కేవలం రెండు పేజీలే!! క్లుప్తత, స్పష్టత కథానికకి ముఖ్యం అనే విషయాన్ని రచయిత బాగా ఆకళింపు చేసుకున్నారు. ఒక బుల్లెట్‌లా, 'స్వాతంత్ర్య స్వరూపం' మన ముందుకు దూసుకొచ్చింది. మన గుండెల్ని చీల్చుకుంటూ మెదడును చేరి స్వాతంత్ర్యానంతర దేశ పరిస్థితిని ఆవిష్కరించింది.

1948 జూలై నెలలో విశాలాంధ్రలో ప్రచురితమైనది ఈ కథానిక. రచయిత శారద– ఎస్.నటరాజన్ పెద్దగా చదువుకున్న వ్యక్తికాదు, ఓ హోటల్ కార్మికుడు. కాని జీవితాన్ని, మనుషుల్ని, వాళ్ళ భిన్న ప్రపత్తుల్ని బాగా ఆకళింపు చేసుకున్న సాహితీవేత్త. తమిళుడైనా తెనాలిలో స్థిరపడి తెలుగు సాహిత్యంలో విశేష కృషి జరిపారు. 'స్వాతంత్ర్య స్వరూపం' ఆయన రచనా వాడికి, వేడికి ఓ మచ్చుతునక. సున్నితంగా చెప్తున్నట్టే చెప్తూ, తెలుసుకోవలసిన విషయాల్ని ఎన్నిటినో తమ సాహిత్యం ద్వారా శారద మన ముందుంచారు.

ఆయన జీవించింది తక్కువ కాలం కానీ, ఆయన మన మనస్సుల్లో ముద్రించింది గొప్ప ముద్ర. ఎన్ని సంవత్సరాలైనా మనల్ని వీడని ముద్ర. తెలుగు పాఠకులందరూ ఇలాంటి మహనీయుడు సృష్టించిన కథానికా సాహిత్యాన్ని చదివి తీరాల్సిందే.

# సత్యం శంకరమంచి 'వరద'

సత్యం శంకరమంచి మంచి రేడియో ప్రయోక్తే కాదు, మంచి రచయిత కూడా అని మనకి చెప్పాయి 'అమరావతికథలు'. ఆ అమరావతి కథలలోని ఓ కథ 'వరద'. చిన్న కథానికలో ఎంతో పెద్ద నగ్నసత్యాన్ని చెప్పారు రచయిత. క్లుప్తత, స్పష్టతతోబాటు ముగింపు ఎంతగానో ఆలోచింపచేస్తుంది. ఏకాశం!

ఒకనాటి శాతవాహనుల రాజధాని ధాన్యకటకం దిబ్బగా మారిపోయింది– అంటూ కోల్పోయిన నాటి శోభ, ఇప్పుడదే ప్రాంతంలో ఉన్న దయనీయ పరిస్థితుల్ని పోలుస్తూ 'వరద'ని ప్రారంభిస్తారు. ఒకనాడు గుర్రాలు తిరిగే రాజవీధిలో ఈరోజు కుక్కలు తిరుగుతున్నాయి. ఒకరోజు రత్నాల రాసులూ, ముత్యాలూ బళ్ళకెత్తుకు నడిపిస్తే ఇవాళ పొట్టుబస్తాలు లాగుడు బళ్ళమీద లాగలేక లాక్కుపోతున్నారు. ఎవరింటి ముందువారు తప్ప ఇప్పుడు వీధుల్ని ఎవరు శుభ్రం చేస్తున్నారు?.. ఒకనాడు శ్రవణపర్వంగా వేదగానం వినిపిస్తే, ఇవాళ పేకాట జోరుగా సాగుతోంది.

ఒకరోజు కృష్ణకి నీళ్ళకోసం వెళ్తున్న యువతి కాళ్ళ పట్టా జారిపోతే, తిరిగి వచ్చేటప్పటికి అదక్కడే ఉంది. ఇప్పుడైతే...?

కృష్ణవేణమ్మ మాత్రం గతాన్ని కడుపులో దాచుకుని, ఏమీ తెలీనట్లు ప్రవహిస్తోంది.

ఒకరోజు తెల్లవారకముందే కృష్ణవేణి పొంగి, ఊళ్ళోకి వరదనీరు ఉవ్వెత్తున వచ్చింది. గుడిసెలు కొట్టుకుపోయాయి. పశువులు గల్లంతయ్యాయి. కృష్ణమ్మ ప్రళయరూపంలో కొందరు ప్రాణాలూ పోగొట్టుకున్నారు.

కృష్ణమ్మని శాంతించమని కొందరు ఇల్లాళ్ళు పూజలు చేశారు. ఊరు సగం మునిగిపోయింది.

"ముందు అందరికీ తిండితిప్పలు చూడాలి" అందరిదీ అదే ఆలోచన

కొందరు కుర్రాళ్ళు గడ్డపారలతో గాడిపొయ్యి తవ్వారు. కోటలో వంట సామాగ్రి తెచ్చారు. ఎసట్లో బియ్యం పోశారు. కొందరు కూరలు తయారీలో మునిగిపోయారు.

పన్నెండు గంటల కల్లా అన్నం తయారైంది.

బారులుగా విస్తళ్ళు వేశారు. అన్ని కులాలవాళ్ళూ వరుసాగా భోజనానికి కూర్చున్నారు.

శాస్త్రిగారికి నెయ్యి వడ్డించబోయిన మాలసంగడు భయపడతాడు. శాస్త్రిగారు "ఫరవాలేదు లేరా నీకు ఆకలేస్తుంది, నాకూ ఆకలేస్తుంది. ఇంకొకరు వేస్తే నెయ్యి, నువ్వు వేస్తే నేయి కాకపోదుగా. వడ్డించు... " అంటాడు.

వరదొచ్చి మనుషుల మనసుల్ని కడిగేసిందన్నమాట! కానీ పరిస్థితులు మళ్ళీ మామూలయ్యే సరికి మనుషుల్లో మలినం పెనవేసుకుంటుంది. ఎన్ని వరదలొచ్చినా మనిషి మనసుని కడగలేకపోతున్నాయి అంటూ కథానికని ముగిస్తారు రచయిత.

ఎత్తుగడ నుంచి ఒక పద్ధతి ప్రకారం సాగుతుంది కథనం. భాష భావానికి తగ్గంత పటిష్టంగా ఉంది. కొత్తగా కథానికలు రాయడం ప్రారంభించినవాళ్ళు, కథాభిమానులందరూ తప్పక చదవాల్సిన కథానిక 'వరద'.

# సరళాదేవి 'ఎదురుచూసిన ముహూర్తం'

ఇది సగటు స్త్రీ కథానిక. ఆడవాళ్ళు తమలోకి తాము చూసుకునే కథానిక. మగవాళ్లని ఆలోచించాల్సిన విధంగా ఆలోచింపచేసే కథానిక.

ఐదేళ్ళ దుర్గ పువ్వుల గౌనుని కొనివ్వమని అమ్మని అడుగుతుంది. ఆమె పట్టించుకోదు, నాన్నని అడిగితే కొనిస్తానని అనకపోగా కొడతాడు.

'పిల్ల ఏదో అడిగితే కొనివ్వకపోగా పేకాట్లో డబ్బు పోగొట్టుకున్న చిరాకుని దాని మీద చూపిస్తావేం?' అంటూ  తండ్రిని తల్లి నిలదీస్తుంది. 'నా చీరని చించి గౌను కుడతాలేవే' అంటూ కూతుర్ని ఓదారుస్తుంది. దుర్గ వినిపించుకోకపోతే రెండు తగిలిస్తుంది.  అప్పట్నుంచి ఏదైనా కావాలనిపించినప్పుడు అమ్మని అడగాలనిపించినా నోరు  విప్పలేకపోయేది.

అక్కయ్య పెళ్ళిలోనూ ఆమెకు కొత్త బట్టలు దొరకకపోవడంతో ఆ నోరు మరింతగా మూతపడుతుంది. పెరుగుతున్న దుర్గ ఇంట్లో ఎవరి ముందు తన కోరికల్ని చెప్పుకోలేని స్థితి.

'దుర్గా! నీ కోసం ఈ చీర తీసుకొచ్చానమ్మా' అనే వాళ్లు ఎవరూ ఉండరు. ఆమె స్నేహితురాళ్ళు కొందరు 'ఈ చీర మా అన్నయ్య బెంగుళూరు నుంచి తెచ్చాడు...మా అక్క ఢిల్లీ నుంచి తెచ్చింది..' అంటుంటే విస్తుపోయి వింటుంటుంది. ఎప్పుడైనా 'దుర్గా! ఇది నీ కోసం తెచ్చాను' అని ఎవరైనా అంటే ఎంత బాగుండునని కలలు కంటూంది.

స్కూల్ ఫైనల్ పాస్ అయ్యింది. టీచర్‌ట్రైనింగ్ పూర్తి అయ్యింది. ఉద్యోగంలో చేరింది. నెల జీతం అందుకుని అంతా తల్లి చేతుల్లో పోసినా సంసారం గడవడం కష్టమవుతుండేది. నెలనెలా జీతం వస్తోంది. కొద్దిపాటిగా పెరుగుతోంది కూడా. ఇంట్లో అందరికీ గుడ్డలు తెస్తోంది. కానీ ఎవరూ 'మరి నీకో?' అని అడగను కూడా అడగరు. 'పెట్టక్కర్లేదు, కనీసం అడగను కూడా అడగరే?' అని బాధపడుతుంటుంది.

పెళ్ళి చేసుకున్న తర్వాత భర్తకీ తను ఇస్తుంది కాని అతను 'మరి నీకో?' అని అడగను కూడా అడగడు. అబ్బాయి అయినా తనకి తెస్తాడని ఉవ్విళ్ళూరుతుంది.

అక్కడా నిరాశే ఎదురవడంతో దుర్గమ్మగా మారిన దుర్గ హతాశురాలవుతుంది.

ఆఖరికి కొడుకు పక్క, కూతురు పక్కా కూడా ఆశగా చూసి కళ్ళు మూసింది దుర్గమ్మ.

'శవం మీద గుడ్డ కప్పాలి' అన్నారు ఎవరో.

'మా అమ్మ కోసం నేను తీసుకొస్తాను' అంటూ బయలుదేరుతాడు కొడుకు. అంతటితో ముగుస్తుంది కథానిక.

సగటు స్త్రీ ఆవేదనని ఎంతో గొప్పగా ఈ కథానికలో మలిచారు సరళాదేవిగారు. బ్రతికున్నప్పుడు ఉన్న కోరికల్ని, పోయిన తర్వాత తీర్చి లాభం ఏమిటి? ఇది దుర్గమ్మ కథానికే కాదు– చాలామంది దిగువ మధ్యతరగతి కుటుంబాల్లోని స్త్రీల కథ కూడా!

# సామవేదం జానకిరామశర్మ 'నటుడు'

**కి**శోరుడు నటుడు. ఛాయని ప్రేమిస్తాడు. ఆమే అతడిని ప్రేమిస్తుంది. 'నువ్వే నా సర్వస్వమ'ని ఇద్దరూ ఒకరితో మరొకరంటారు.

'ప్రపంచము పాపభూయిష్టము. దుఃఖోపేత' అనే మాటల్ని కొట్టి పారవేస్తూ 'ఏ చింతయు లేదు ఆనందమే ప్రపంచ'మంటాడు కిశోరుడు.

"ప్రపంచమొక రంగభూమి. మనందరం నటులం. మన పాత్ర పూర్తికాగానే తెరమరుగవుతాం" అంటుంది అతనితో ఛాయ.

ఆరోజు ఛాయ ఉదాసీనతతో తను పంజరంలో ఉంచి పెంచుతున్న రకరకాల పక్షులను పంజరం లోంచి విడిచిపెట్టి విముక్తిని ప్రసాదిస్తుంది. కిశోరుడు ఇంటికి రాగానే ఆ విషయాన్ని గుర్తించి 'పంజరంలోని పక్షులేవి?' అని అడుగుతాడు.

'ప్రేమ బిందువులతో దాహాన్ని నివారించుకోవాలని నేనే వాటిని వదిలాను" అంటుంది ఛాయ.

ఆరోజు వాళ్ళ సంభాషణ అంతటితో ముగుస్తుంది. మర్నాడతను మళ్ళీ ఆమెకోసం వచ్చేసరికి ఆమె ఉండదు. ఎక్కడికో వెళ్ళిపోతుంది. శూన్యగృహాన్ని చూసి వికటుడైన అతనూ నిరాశతో ఎక్కడికో వెళ్ళిపోతాడు.

తోచక ఆరోజు అతడొక నాటకాన్ని చూస్తుంటే 'ప్రపంచమొక రంగభూమి. మనందరం నటులం. మనపాత్ర పూర్తికాగానే తెరమరుగవుతాం' అన్న ఆమె మాటలు గుర్తుకొస్తాయి.

ఆ తర్వాత అతనికి ఓ నాటక సమాజంలో చోటు దొరుకుతుంది. నటనని వృత్తిగా స్వీకరించి అచిరకాలంలోనే నటుడుగా మంచిపేరు తెచ్చుకుంటాడు.

ఆరోజు 'వసంతసేన' నాటకమాడుతున్నారు. అతను చారుదత్తుడు వేషం వేస్తాడు. ముందువరుసలో కొత్త ప్రియుడితో కూర్చున్న ఛాయని చూడగానే ఉలిక్కిపడి, నాటకాన్ని మరింతగా రక్తి కట్టిస్తుంటాడతను.

"ఈ చారుదత్తుడు తనని ఎంతో ప్రేమిస్తున్న వేశ్యని హతమార్చాడు. మరణశిక్ష విధించారు. ఈ దండనంతో అందరికీ బుద్ధి వస్తుంది. ప్రపంచంలో వేశ్యలు పురుషుల్ని

మోసగిస్తారని అందరూ అనుకుంటారు. కాని ప్రణయమూర్తయిన వసంతసేనను ఈ యువకుడు చంపివేశాడు! నిజంగా పురుషులే నిర్దయులు" అంటుంది ఛాయ తన కొత్తనేస్తంతో.

ఈ మాటలు వింటాడు చారుదత్తుని పాత్రలో ఉన్న కిశోరుడు.

శకారుడు వచ్చి చారుదత్తుడి మెడకు ఉరి తాడును తగిలించబోతాడు.

చారుదత్త పాత్రధారుడు కిశోరుడు 'వసంతసేన లేని జీవితం కన్నా మరణం మేలు' అనుకుంటూ చారుదత్తుడిని విడవండి...' శర్విలకుడు ప్రవేశిస్తాడు.

నాటకానికి భిన్నంగా చారుదత్తుడు తనని తాను ఉరేసుకుంటాడు.

"కాశీవాసుడైన కిశోరుడు నాటకంలో తనని తాను ఉరేసుకుని ప్రాణాన్ని కోల్పోయాడు జనమనుకునే మాటలలో ఛాయ ఉలిక్కిపడుతుంది.

గతమంతా గుర్తుకొస్తుంది. ఆమె కంటివెంట రెండు అశ్రుబిందువులు రాల్తాయి- అంటూ రచయిత కథానికని ముగిస్తాడు.

ఇలా అద్భుత రసాన్ని మనముందు కురిపిస్తుంది 'నటుడు' కథానిక. 1933 జనవరి గృహలక్ష్మి మాసపత్రికలో ఈ కథానిక ప్రచురితమైంది. ప్రేమ కథే ప్రత్యేక శిల్పంతో ఆకట్టుకుంటుంది.

# సౌరీస్ 'స్మృతి'

**చ**లం కుమార్తె మాత్రమే కాదు ఆయన శైలిని కూడా అందిపుచ్చుకున్న రచయిత్రి సౌరీస్. 'ఓ పువ్వు పూసింది' లాంటిదే ఈ 'స్మృతి' కథానిక.

ఆరోగ్యం దెబ్బతిని ఆసుపత్రిలో చేరిన ఆమెతో నర్స్ అంటుంది, 'కొంచెంసేపు తోటలో తిరుగు. కులాసాగా ఉంటుంది' అని.

రంగురంగుల పూలతో గడిపి ఎన్నాళ్ళైంది –ఎన్నాళ్ళు ఏమిటి, ఎన్నేళ్ళు!

ఇంతవరకు ఒక్కటే ధ్వనులు – గణగణ, కారు చప్పుళ్ళు! నడక ఎంత బాగుంటుంది. కాని కారులో తప్ప వెళ్ళే వాళ్ళం కాదు. ఇప్పుడు ఈ పూల మధ్య నడుస్తుంటే ఎన్నో స్మృతులు. ఈ పూలతో బాటు అతను తనకెంతో ఇష్టం! గతంలోకి వెళ్ళింది ఆమె మనసు.

ఈ పూల కోసమే అతనితో పరిచయం అయ్యింది. పచ్చని గడ్డిలో చెట్టుని ఆనుకొని, సగం మూతబడ్డ కళ్ళలోంచి చూస్తూ 'కూర్చో' అంటాడు.

'పట్టు పరికిణి నలిగిపోతుంది, అమ్మ తంతుంది' అంటుంది తను. 'వెళ్తే పూలీను'. 'అమ్మ తిడుతుంది'.

'సరే ఇస్తా రా'

గుత్తుల గుత్తుల పూలు నా జడలో తురుముతాడు. మళ్ళీరా అంటాడు. 'పూలిస్తే వస్తాను' అంటుంది తను.

'నన్ను పెళ్ళి చేసుకుంటావా? నీకు కావల్సినన్ని పూలు ఇస్తాను' అన్నాడు అతను.

'రోజూ నాకు పూలు కోసిపెడితే, నిన్నే చేసుకుంటా' అంటుంది తను.

అతని కళ్ళల్లో సంతోషం మెరుస్తుంది.

డిల్లీ నుంచి గొప్ప సంబంధం వస్తుంది.... అంతకన్నా గొప్పగా పెళ్ళి అవుతుంది. 'నువ్వు రాలేదని నీ కోసం తెచ్చాను పూలు', అంటుంది తన జడలో తురమబోతూ మల్లెపూలతో కుట్టిన జడలో ఈ పూలకి చోటు ఉండదు.

'నన్ను చేసుకుంటానన్నావ్ కదూ'– అతని దిగులు.

'మరీ నగలు, రవ్వలు ఇవ్వగలవా' అడిగింది తను.

'నా పూల కన్నా ఇవి ఎక్కువా?'

'ఈ పూలు ఎవరికి కావాలి? ఎక్కడంటే అక్కడే కావల్సినన్ని దొరుకుతాయి'

'నీకు అవసరం లేకపోయినా నేను ఇవ్వగలిగినవి ఇవే.'

పెళ్ళైనా ఆ పూల కోసం నిలవలేక వెళ్ళాను.

'సూర్యం నాకు పూలు కోసేవా'

'నా పూల రాణీ! వచ్చావా నా పూల కోసం'

'ఛీ అదేంటి కన్నీళ్ళు? నువ్వు పెళ్ళి చేసుకో నన్ను మర్చిపోతావ్'

ఈ పూల పరిమళం గుర్తుకొచ్చినప్పుడల్లా ఇంటిమీద బెంగ అనుకున్నారు అత్తారు. ఇంటికి రాగానే  తోటకి పరిగెత్తింది తను.

'సూర్యం, సూర్యం'

'ఎవరు'

'సూర్యం లేడా? నువ్వు ఎవరు?'

'అతని చెల్లెల్ని. మా అన్నయ్య చచ్చిపోయాడు'

'ఏమిటి? ఎప్పుడు? ఎందుకు?'

'చాలా నెలలు అయ్యింది. జబ్బు చేసింది. ఆరోజు నాతో అన్నాడు– చెల్లీ నేను లేనప్పుడు ఫలానా వారి అమ్మాయి ఎప్పుడొచ్చినా పూలకోసం, కోసివ్వమ'ని ఆమె బిగ్గరగా ఏడ్చింది. జాలిగా రాలాయి పూలు తలమీద.

'పూలు కోసీనా'

'వద్దు! అతడు లేనిదే నాకెందుకు పూలు'

మళ్ళీ ఆమె వెళ్లలేదు ఆ తోటకి.

మళ్ళీ ఇన్నాళ్ళకి  తోట... పూలు....

'సూర్యం! సూర్యం! ఏమైనావు? నా పిలుపు వినిపిస్తోందా? పూలు కోసి దగ్గరకు రా' కళ్ళు తిరిగి చెట్టుకింద కూర్చుండి పోయింది ఆమె. పైనుంచి పడుతున్న పూలని పైనుంచి సూర్యం కురిపిస్తున్న పూలవర్షం అనుకుంటోంది.

ఇంతలో 'ఏమిటి మంచులో కూర్చున్నారా? మీ వయస్సుకి ఇది మంచిది కాదు. లోపలికి రండి' అంది నర్స్.

'నన్నీ చీకటి గదుల్లో పడుకోపెట్టకండి.  నన్నీ చెట్టు కింద కూర్చోనీయండి' అంటోంది ఆమె.

'అదేంటి రత్నం లోపలికి రా! మన అమ్మాయి, అల్లుడు, పిల్లలు వచ్చారు' అన్నాడు భర్త.

'ఇప్పుడు నేను పూల రాణిని కాదు. భార్యని, తల్లిని, అత్తగారిని, అమ్మమ్మని– ఇంతే జీవితం' అనుకుంటూ స్మృతిలోంచి ఆవిడ బయట పడటంతో కథానిక ముగుస్తుంది.

గొప్ప భావుకతతో చెప్పిన కథానిక. కవితా ధోరణితో సాగిన  కథానిక... ❀

# స్వామి చిత్రానంద 'బహు బహు బహుమతి ప్రదానము'

స్వామి చిత్రానందగారి పేరు కె.వి.రావు. ఈయన మద్రాసులో చలనచిత్ర రంగంలో దర్శక విభాగంలో పనిచేసేవారు. చలనచిత్ర రంగంలో జరిగే రకరకాల విచిత్ర విషయాల్ని చక్కటి చమత్కారంతో ఎన్నో కథానికలుగా రాసారు. మంచి వ్యంగ్య రచయిత.

'బహు బహు బహుమతి ప్రదానము' కథానికలో కూడా అవార్డులిచ్చే సభల్లో ఎలాంటి భాష వాడతారో చాలా వ్యంగ్యంగా చెప్పారు.

మామూలుగా బహుమతి ప్రదాన సభ అంటారు. కానీ ఇక్కడ విషయాన్ని వత్తి చూపించడానికి నిర్వాహకులు 'ప్రధానసభ' అన్నారు. అలాగే ఆల్ ఇండియా 'మని మినీ ఫెడరేషన్' అంటాడు. అలాగే చాలా బహుమతులు ఉన్నాయి కాబట్టి 'బహు బహు బహుమతి ప్రధానం' అన్నారు. ఇలా భాషని ఖూని చేస్తూ మాట్లాడే వాళ్ళ మీద వ్యంగ్య విసురులని విసురుతారు ఈ కథానికలో రచయిత.

ఒత్తులు పలికిన నటికి బహుమానం, అత్యధికంగా దుస్తులు వాడిన నటికి బహుమానం, అలాగే ఎక్కువ టేకులు తినే నటికి బహుమానం, అత్యంత పొడవు పేరుగల చిత్రాన్నిఅందించిన వారికి బహుమానం, అత్యధిక అన్యభాషా చిత్రాల ఆధారంగా నిర్మించిన తెలుగు చిత్రానికి బహుమానం... ఇలా చలనచిత్ర రంగానికి సంబంధించిన బహు బహుమతులిచ్చే ఈ సభని రచయిత చెప్పడంలో ఉద్దేశం చిత్రరంగంలోని కొన్ని విషయాల మీద వ్యంగ్య విసర్లు విసరడమే.

ముఖస్తుతి పత్రిక, మీ తిండిమీదే, నన్ను చూడు నా అందం చూడు లాంటి నవ్వు వచ్చే పదాలు ఈ కథానికలో ఎన్నో ఎన్నెన్నో.

ఆఖరులో ఓ పాత నటుడికి సన్మానం చేస్తారు. అతను ఎంత పాతవాడంటే ఎవరికీ అతను నటుడిగా గుర్తులేదు. వేసిన ఆ చిన్న చితకా పాత్రల గురించీ ఎవరికీ తెలీదు. అయినా నిర్వాహకులు అతనికి సన్మానాన్ని పెట్టారు. అతను నాటకాల్లోని పద్యాల్ని ఎత్తుకొని ప్రేక్షకుల్ని పట్టించుకోకుండా పాడుకోసాగాడు. ప్రేక్షకులంతా

పారిపోయిన విషయాన్నీ గమనించడు. అప్పుడు ఆయన డ్రైవర్ వచ్చి అతన్ని ఆ భ్రమలోంచి లాగి, ఇంటికి తీసుకెళ్ళడంతో కథానిక ముగుస్తుంది.

ఎన్నో వాస్తవాల్ని వ్యంగ్య ధోరణిలో మనం పొట్ట పట్టుకుని నవ్వుతూ చదువుకునేటట్టు రాశారు స్వామి చిత్రానంద. నిజంగానే ఈ స్వామి చిత్రాలలోని విశేషాల్ని ఆనందంగా చెప్పారు. ఒక్కో రంగాన్ని గురించి తెలుసుకోవడానికి ఇలాంటి కథానికలు ఎంతో అవసరం. వాళ్ళని విమర్శించినట్లు కాకుండా, వ్యంగ్యధోరణితో విసురుగా చెప్పడంతో ఎవరు మీద రాసారో వాళ్ళూ ఆనందపడతారు. చదువుకున్న వాళ్ళు నవ్వుకుంటూనే అసలు విషయాన్ని గ్రహింపగలుగుతారు.

# సి.ఎస్.నీలకంఠయ్యర్ 'భోగపుమేళములు'

**క**థానికల మీద పరిశోధన  చేస్తున్నవాళ్ళ వల్ల కథానికా ప్రక్రియకి మేలు జరుగుతోంది. డా॥తవ్వా వెంకటయ్య రాయలసీమ తొలి తెలుగు కథానికల మీద చక్కటి పరిశోధనచేసారు. ఆయన పరిశోధనలవల్ల రాయలసీమలోని కొన్ని పాత కథానికలు వెలుగుని చూస్తున్నాయి. కాకపోతే ఈ పరిశోధకులకు ఒక మనవి. 'కథ'కి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. కథని మలిచే తీరునిబట్టే ప్రక్రియ, నాటిక, నాటకం, నవలలలాగే కథానిక కూడా ఒక పరిపూర్ణ ప్రక్రియ. కథ వస్తువు మాత్రమే! సినిమా చూసి కథ చెబుతాం. నాటకం చూసి కథ చెబుతాం. కథానిక చదివీ కథ చెబ్తాం.

రాయలసీమ తొలితరం కథానికలలో సి.ఎస్.నీలకంఠయ్యర్ 'భోగపుమేళములు' కథానికా ఉంది. ఆ రోజుల్లో 'భోగపుమేళము' ఒక సామాజిక రుగ్మత. దాని దుష్పరిణామమెలా ఉంటుందో ఈ కథానికలో రచయిత చక్కగా చెప్పారు.

ఈ కథానిక క్లుప్తత ప్రధానంగా ఏకాంశంతో సాగుతుంది. 'భోగపుమేళము'ల వల్ల కలిగే నష్టాన్ని రచయిత చాలా సూటిగా చెప్పారు.

"భోగపు మేళములు ఏర్పాటు చేయని పెళ్ళీ పెళ్ళేనా?" అంటూ బావగారు సోమసుందరుడు ఖండితంగా రాయడంతో ఖంగారుపడిపోతాడు సత్యసాధనుడు. భోగపుమేళాలు వద్దని, వాటివల్ల నష్టాలున్నాయని కాబోయే బావగారికి స్వయంగా చెప్పడానికి బయల్దేరతాడు.

ఆయనను చూడగానే విషయం తెలుసుకుని "అయ్యో! ఇంత చిన్న విషయం మాట్లాడడానికి స్వయంగా వచ్చారా?" అంటాడు సోమసుందరుడు. అంటూనే ఇలాంటి చిన్నచిన్న ఆనందాలు పెళ్ళిలో తప్పవంటాడు. సత్యసాధనుడు భోగపుమేళాలు వద్దని ఎంత వేడుకున్నా ఉండాల్సిందే అంటాడు సోమసుందరుడు.

సోమసుందరుడు పెళ్ళికొడుకు తండ్రి కావడంతో ఆయన మాటే నెగ్గుతుంది. కథ నడుస్తుండగా బావ, బావమరదుల సంభాషణ రాగానే నాటికలలోలా ఒకరి సంభాషణ తర్వాత మరొకరి సంభాషణని రాస్తారు రచయిత. అలా ముగింపుని

త్వరగా తేల్చేయడం కూడ మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది. పెళ్ళి ఆరురోజులూ వేశ్యల సంగీతాదుల కార్యక్రమాలు హృద్యంగా సాగుతాయి.

సోమసుందరుడు కుమారుని అదుపులో ఉంచలేకపోతాడు. వేశ్యాలోలుడు కావడానికి కొడుకుకి ఆ భోగపుమేళమే కారణమవుతుంది. జగన్నాథము వేశ్యాలోలుడై భార్యనే మరచిపోతాడు. ఆస్తిని హారతికర్పూరంలా ఆవిరి చేశాడు.

నీతికథలాగా చెప్పకుండా రచయిత ఓ సామాజిక రుగ్మతను ఎత్తి చూపడంలో కృతకృత్యులయ్యారు.

# హితశ్రీ 'గులాబీ పువ్వు-సిగరెట్'

ఆనందరావు టాక్సీలో హైద్రాబాద్ నుంచి నెల్లూరు వెళ్తుంటాడు. మధ్యలో ఒక చోట టైర్ పంక్చర్ అవుతుంది. డ్రైవర్ టైర్ మార్చుతుంటే డాక్టర్ ఆనందరావు అక్కడున్న కుగ్రామంలోకి బయలుదేరతాడు. ఆకలి దహించిపారేస్తుంది. ఎక్కడా హోటళ్లు కనిపించడంలేదు.

రాఘవయ్య తననుతాను పరిచయం చేసుకుని, ఆనందరావుని తనతో ఇంటికి తీసుకువెళ్తాడు. దారిలో ఒక్క అందమైన ముఖమూ కూడా కనిపించని ఆనందరావుకి రాఘవయ్యగారి ఇంట్లో తలుపు వెనక నుంచి ఒక అందమైన గొంతువినిపిస్తుంది. ఆ గొంతు తాలూకు అందమైన అమ్మాయి కనిపిస్తుంది.

హఠాత్తుగా రాఘవయ్య గుండె నొప్పితో కిందపడిపోతాడు. అతని కూతురు కంగారుగా అతని దగ్గరికొస్తుంది. ఆనందరావులోని డాక్టర్ చటుక్కున మేల్కొంటాడు. రాఘవయ్యకి చికిత్స చేసి కాపాడుతాడు. ఒక డాక్టర్ ఫ్రెండ్ అడిగితే అతను హైద్రాబాద్ నుంచి తీసుకువస్తున్న ఇంజెక్షన్ రాఘవయ్యకి తోడ్పడుతుంది.

రాఘవయ్య అందమైన కూతురు వసంత సంతోషపడిపోతుంది. డాక్టర్‌గారు అలా రావడం తమ అదృష్టంగా భావిస్తుంది. సేదతీర్చుకుంటూ ఆనందరావు సిగరెట్ వెలిగిస్తాడు. వసంతకు దగ్గు వస్తుంది. సిగరెట్‌ను పారేస్తాడు ఆనందరావు.

మెట్రిక్‌తో చదువైపోయిందన్న ఆమెతో "నీకు పొద్దెలా గడుస్తుంది?" అని అడుగుతాడు ఆనందరావు.

"తోచకపోతే బొమ్మలేసుకుంటాను" అంటుంది వసంత. అతని కోరికమీద అంతకుముందామె వేసిన బొమ్మలు చూపిస్తుంది.

ఒక చిత్రంలో ఒక గులాబీ పువ్వు, ఒక మొగ్గ, దానిచుట్టూ సాలెగూడు.. అందులో చిక్కుకుని కొన్ని కీటకాలు, కొన్ని రెమ్మలూ కనిపిస్తాయి.

"ఈ సాలెగూడెందుకండి?" అడుగుతాడు ఆనందరావు.

"గులాబి మొగ్గ తొడిగింది. మొగ్గను చూసి చీడపురుగులు చుట్టూ చేరాయి. ఆ చీడపురుగుల్ని ఏరిపారెయ్యడానికి సాలెపురుగు ఎంతో కళాత్మకంగా

గూడుకట్టుకుంది. మొగ్గ చక్కగా వికసించింది. ఈ పరిణామాన్ని చూపిస్తూ ఈ బొమ్మవేశాను" అంటుందామె.

"ఈ చిత్రాన్ని నాకు ప్రజెంట్ చేయండి"అంటూ దానిని తీసుకుంటాడు ఆనందరావు. ఆ తర్వాత అక్కడే భోజనంచేసి బయలుదేరతాడు.

ఆనందరావు మనసుని తెలియని ఏదో ఆనందం ఆవరించింది. తక్షణమే తానంటించిన సిగరెట్ పొగతో నోరంతా చేదెక్కినట్లు అనిపించింది. వెంటనే తాగుతున్న సిగరెట్‌ని బయటికి, సిగరెట్ పాకెట్‌ని డ్రైవర్ ఒడిలోకి విసిరేస్తాడు.

చంద్రుడు ఉల్లాసంగా వెంటపరుగెత్తుతున్నట్టు అనిపిస్తుంది వెళ్తున్న కార్లోంచి చూస్తుంటుంటే. సిగరెట్ మాత్రం అతనిపట్ల కోపంతో రోడ్డుమీద పడి మండిపోతున్నట్లుంది అని ముగిస్తాడు రచయిత 'గులాబీ పువ్వు–సిగరెట్' కథానికలో.

గులాబి పువ్వులాంటి స్త్రీ ఆనందరావులాంటి వ్యక్తిని సిగరెట్ అలవాటునుంచి దూరం చేస్తుంది. గులాబిమొగ్గని ఆమె చిత్రంలో చెదపురుగుల బారి నుంచి కాపాడినట్టు ఆమె ప్రజెంట్ చేసిన గులాబి పువ్వు చిత్రాన్ని అందుకున్న ఆనందరావు చెడు అలవాటుని మాన్పిస్తుంది. ఒక చక్కటి అబ్బాయి అమ్మాయి అనుభూతి ఆవిష్కరణతో రెండుమూడు మంచి విషయాల్ని ఒకేసారి మనకు తెలియజేస్తారు ఈ కథానిక ద్వారా హితశ్రీ. సున్నితమైన మనస్తత్వాల్నీ చక్కని అనుభూతుల్నీ చిత్రించడంలో హితశ్రీకి సాటి హితశ్రీయే.

మనస్సును తట్టికుదిపే కథానికలెన్నింటినో రాసిన ఆయన కలం నుంచి జాలువారిన మరో ఆణిముత్యం 'గులాబీపువ్వు–సిగరెట్'.

*With best compliments from*

**V. SURYAPRAKASA RAO**

Head of the Department, Cardiology

Senior Interventional Cardiologist

Appolo Hospitals

Hyderguda, Hyderabad

**Cell: 98480 51215**

*With best compliments from*

**Dr. P.L.N.KAPARDI**

Director, Cathlab

Senior Interventional Cardiologist

Appolo Hospitals

Hyderguda, Hyderabad

**Cell: 98480 47521**

# తప్పక చదవాల్సిన వంద కథానికలు

## గురజాడ వందో వర్ధంతి నివాళి

డా॥ వేదగిరి రాంబాబు

